సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 110

గురువారం 11-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



ఉద్యోగినులకు నెలసరి సెలవు? - 15లో



గుండెపోటుకు తేనెతో చెక్! - 15లో



Cheil-20866/24

SAMSUNG

Galaxy Z Fold6

Galaxy AI is here



Pre-order Galaxy AI at ₹ 79999**

Retail price of Galaxy Z Fold6 (256 GB)	₹ 164999#
Exchange value of old device	₹ 70000~
Upgrade bonus	₹ 15000^
Effective price	₹ 79999**

Ultimate innovation. Ultimate peace of mind.

Two screen/parts replacements worth ₹ 14999*

+



Get ₹ 18000 off^^ on new Galaxy Watch Ultra

Samsung Care+ | Samsung Upgrade | HDFC BANK | BAJAJ FINSERV | Samsung Finance+™

Offer valid till July 23, 2024

samsung.com


Please dispose of e-waste and plastic waste responsibly. Customers can WhatsApp on 18005726664 for information on e-waste/plastic waste.

Image simulated for illustrative purpose only. Actual UX/UI may differ. Color subject to availability. Samsung login is required for certain AI features. Samsung does not make any promises, assurances or guarantees as to the accuracy, completeness or reliability of the output provided by AI features. Samsung promotes responsible use of AI features. Offer may be revised or withdrawn. **Offer price shown above is upon pre-order of 1 unit of Galaxy Z Fold6 8GB|256GB, shown inclusive of exchange value of old device and upgrade bonus. Final price at sole discretion of dealer. #Retail price shown for 1 unit of Galaxy Z Fold6 8GB|256GB. Price is inclusive of taxes. ~Approximate value on exchange of 1 unit of Galaxy Z Fold5 8GB|256GB. Exchange value varies basis model and condition of old device. Exchange at discretion of retailer. ^Upgrade bonus provided by brand at its sole discretion, upon exchange of select smartphones. Upgrade bonus may vary basis the device exchanged. Exchange at the discretion of dealer and exchange value varies basis model and condition of old device. *Samsung Care+ T&C apply. 1 unit of Samsung Care+ Accidental Damage & Liquid Damage Plan worth ₹ 14999 available at ₹ 999, only when purchased with Galaxy Z Fold6, subject to pre-order. Customers eligible for 2 claims under Accidental Damage & Liquid Damage Plan within one year of plan activation date, as per the applicable terms of Samsung Care+. Reach out to dealer for more details. ^^Discount amount of ₹ 18000 applicable only when purchasing 1 unit of Galaxy Watch Ultra together with 1 unit of any variant of Galaxy Z Fold6 or Galaxy Z Flip6. All third party logos/brands are trademarks /registered trademarks of the respective brand/company.

Scan and experience Galaxy AI

Or WhatsApp "Hi" to 9870 494949 to buy at Samsung Exclusive Store

Cheil-20866/24


'అభివృద్ధి ఎంత ముఖ్యమో...
సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 110

గురువారం 11-7-2024



మళ్లీ మనదే గెలుపు

రాణించిన గిల్, సుందర్. జింబాబ్వేతో మూడో టి20లో భారత్ గెలుపు - 16లో



మార్కెట్లో లాభాల స్వీకరణ

క్యూ1 ఆర్థిక ఫలితాల ముందు అప్రమత్తత. 80,000 దిగువకు సెన్సెక్స్ - 17లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



యుద్ధాలకు సమయం కాదిది

ప్రపంచం ఇప్పటికే అనేకానేక సమస్యలతో సతమతమవుతున్న నేపథ్యంలో ఇది యుద్ధాలకు సమయం కాదని ప్రధాని మోదీ చెప్పారు.

- వివరాలు 6లో



భారత్-చైనా సరిహద్దులో...

భారత్-చైనా సరిహద్దులో అక్రమంగా తరలిస్తున్న 108 కిలోల బంగారాన్ని ఐటీబీపీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు.

- వివరాలు 6లో



ఉత్తరప్రదేశ్‌లో ఘోరం

యూపీలోని ఉన్నావ్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. 19 మంది గాయపడ్డారు.

- వివరాలు 6లో



కేజ్రీవాల్‌కు ప్రత్యక్ష ప్రమేయం

ఢిల్లీ మద్యం స్కాంలో రూ.100 కోట్ల ముడుపుల ఉదంతంలో కేజ్రీవాల్ ప్రత్యక్ష పాత్ర పోషించారని ఈడీ చార్జ్‌షీట్‌లో పేర్కొంది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

15 నాటికి శ్రీశైలానికి కృష్ణమ్మ



కృష్ణా ప్రధాన పాయలో వరద ఉధృతి పెరిగింది. ఆల్మట్టి డ్యామ్‌లోకి బుధవారం సాయంత్రం 6 గంటలకు నీటి నిల్వ 81.44 టీఎంసీలకు చేరుకుంది. ఈ నెల 15 లేదా 16 నాటికి శ్రీశైలం జలాశయానికి వరద చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు.

- వివరాలు 5లో

రాష్ట్ర ఖజానాకు 'కిక్కు'



గత ఏడాదితో పోలిస్తే రాష్ట్ర ప్రభుత్వ రాబడులు మెరుగయ్యాయని ఆర్థిక గణాంకాలు చెబుతున్నాయి. జీఎస్టీ, రిజిస్ట్రేషన్ల ఆదాయం, అమ్మకపు పన్ను, ఎక్సైజ్ ఆదాయం.. ఇలా ప్రతి పన్ను ఆదాయంలోనూ గత ఏడాది తొలి రెండు నెలలతో పోలిస్తే వృద్ధి కనిపించింది.

- వివరాలు 14లో

అనసూయ ఇక అనుకతీర్ సూర్య



ఇండియన్ సివిల్ సర్వీసుల చరిత్రలో కీలక పరిణామం చోటు చేసుకుంది. సీనియర్ ఐఆర్ఎస్ అధికారిణి తన పేరుతో పాటు జెండర్‌ను మార్చుకునేందుకు కేంద్ర ఆర్థిక శాఖ అనుమతిచ్చింది.

- వివరాలు 8లో

మన అంతరిక్ష కేంద్రంపై... ఇస్రో కీలక నిర్ణయం



ఇస్రో అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన భారతీయ అంతరిక్ష స్టేషన్‌కు సంబంధించి కీలక ముందడుగు పడింది. దీన్ని భూ స్థిర కక్ష్యలో ఐఎస్ఎస్‌తో దాదాపు సమానంగా 51.5 డిగ్రీల ఆర్బిటల్ ఇంక్లినేషన్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

- వివరాలు 6లో

NECC National Egg Co-ordination Committee | Venky's Chicken

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate ₹ 70	Ex Farm Live Bird 105 kg	Dressed with Skin 184 kg
	Retail Live Bird 127 kg	Skin Less 210 kg

Issued in the interest of consumers



మీరలా ఉంటే అస్సలు పని చేయలేర్సార్! వెళ్లండీ!

ధరణికి 'యాచారం' దారి

భూ సమస్యలకు పరిష్కారం చూపుతున్న భూన్యాయ శిబిరాలు

హైదరాబాద్ శివార్లలోని యాచారం మండలంలో లీఫ్స్ సంస్థ అధ్యయనం

- 10 గ్రామాల్లో విస్తృత స్థాయిలో భూన్యాయ శిబిరాలు
- రెండు దశల్లో ప్రక్రియ.. 2,200 భూ సంబంధిత సమస్యల గుర్తింపు
- ఎక్కువ సమస్యలు అసైన్డ్ భూములకు సంబంధించినవే..
- ఆ తర్వాత సర్వే నంబర్ మిస్సింగ్‌లు, సేత్వార్ పొరపాట్లు
- ఈ లెక్కన రాష్ట్రవ్యాప్తంగా 22 లక్షల వరకు భూసమస్యలు ఉంటాయని అంచనా
- క్షేత్రస్థాయిలో ప్రత్యేక డ్రైవ్‌లు చేపడితే పరిష్కారాలు సులువే..
- రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో యాచారం పైలట్ ప్రాజెక్టు
- త్వరలోనే రెవెన్యూ మంత్రికి నివేదిక ఇవ్వనున్న 'లీఫ్స్' సంస్థ



మేకల కల్యాణ్ చక్రవర్తి

రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మంథన్ గౌరెల్లి గ్రామానికి చెందిన రమావత్ జగ్నాకు మూడెకరాల 26 గుంటల భూమి ఉంది. భూరికార్డుల ప్రక్షాళన తర్వాత వచ్చిన కొత్త పాస్‌బుక్‌లో రెండెకరాల 29 గుంటల విస్తీర్ణమే నమోదైంది. అంటే నికరంగా 37 గుంటలు తగ్గింది.

కరెంటోతు జకాలి అనే మహిళకు ఎకరం 23 గుంటల భూమి ఉంటే.. కొత్త పాస్‌బుక్‌లో 20 గుంటలే నమోదైంది.

ఇదే గ్రామానికి చెందిన నేనావత్ రాముకు చెందిన రెండెకరాల 3 గుంటల పొలాన్ని వివాదాస్పద భూమి అంటూ పార్ట్-బీలో పెట్టారు. కొత్త పాస్‌బుక్ ఇవ్వలేదు.

ఇక గనమోని మల్లయ్యకు ఉన్న రెండెకరాల 14 గుంటల పట్టా భూమికి ఎమ్మార్వో ప్రొసీడింగ్స్ నంబర్ కూడా ఇచ్చారు. కానీ కొత్త పాస్‌బుక్ రాలేదు.

..'లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ (లీఫ్స్)' స్వచ్ఛంద సంస్థ మంథన్ గౌరెల్లి గ్రామంలో నిర్వహించిన భూన్యాయ శిబిరానికి వచ్చిన రైతుల్లో ఓ నలుగురి సమస్యలివి.

వారు తమ భూములకు సంబంధించిన ఆధారాలతో సహా వచ్చి మరీ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ నలుగురనే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది రైతులు ధరణి పోర్టల్‌తో తిప్పలు పడుతున్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపడుతున్నా.. ఎప్పుడూ లక్షన్నర నుంచి 2 లక్షల వరకు దరఖాస్తులు ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో కనిపిస్తున్నాయి. ప్రత్యేకంగా డ్రైవ్‌లు చేపట్టినా, అధికార వికేంద్రీకరణ జరిగినా ఈ దరఖాస్తులకు సంతృప్తస్థాయిలో పరిష్కారం లభించే అవకాశం కనిపించట్లేదు. ఈ నేపథ్యంలోనే 'లీఫ్స్' అనే స్వచ్ఛంద సంస్థ యాచారం మండలంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన భూన్యాయ శిబిరాలు.. ధరణి సమస్యల గుర్తింపు, పరిష్కారానికి మార్గం చూపిస్తున్నాయి.

సమస్యలెలా తెలుసుకున్నారంటే..?

ఆయా గ్రామాల్లో భూన్యాయ శిబిరం ఏర్పాటుకు ముందే ప్రజలకు చాటింపు వేయించారు. శిబిరానికి వచ్చి భూసంబంధిత సమస్యలపై దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. శిబిరం జరిగిన రోజున 'భూమి సమస్యల వివరాలు' పేరిట ప్రత్యేక ఫార్మాట్‌లో రూపొందించిన

మిగతా 2వ పేజీలో ▶

ఫిరాయింపులపై బీఆర్ఎస్ జాతీయస్థాయి పోరు

ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోసం సుప్రీంకోర్టుకు వెళ్లే యోచన



- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఎదుట బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పరేడ్
- ఢిల్లీ పర్యటనపై కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్ భేటీ
- కాంగ్రెస్ ద్వంద్వ విధానాలు ఎండగట్టాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: పార్టీ బీ-ఫామ్‌పై గెలిచిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న బీఆర్ఎస్ జాతీయస్థాయిలో ఈ అంశాన్ని లేవనెత్తాలని భావిస్తోంది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించే యోచనలో ఉంది. మరోవైపు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్లనుంది. ఐదు రోజుల ఢిల్లీ పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు చేరుకున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు బుధవారం ఎర్రవల్లి వ్యవసాయక్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ కవిత బెయిల్ ప్రయత్నాల్లో పురోగతితోపాటు, పార్టీ ఎమ్మెల్యేల ఫిరాయింపులపై న్యాయపోరాటానికి సంబంధించిన అంశాలను ఇద్దరు నేతలు కేసీఆర్‌తో చర్చించినట్టు సమాచారం.

ఆ ఏడుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని..

ఇప్పటివరకు ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరగా, వారిపై అనర్హత వేటు వేయాలని అసెంబ్లీ స్పీకర్‌కు బీఆర్ఎస్ నేతలు విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసినా అనర్హత వేటు వేయకపోవడాన్ని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోంది. ఈ అంశంపై

మిగతా 3వ పేజీలో ▶

సాగుభూమికే రైతుభరోసా ఇవ్వాలి

పదెకరాల వరకు పథకం వర్తింపజేయాలి



- వాణిజ్య భూములు, భూస్వాములు, ప్రభుత్వ ఉద్యోగులకు వద్దు... కౌలు రైతులకు రైతుభరోసా లేదా సబ్సిడీ, గుర్తింపు కార్డులు ఇవ్వాలి
- యంత్రలక్ష్మిని పునరుద్ధరించాలి.. పోడు చేసేవారికి రైతు భరోసా ఇవ్వాలి... మంత్రివర్గ ఉపసంఘం తొలి సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతుల అభిప్రాయం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రైతుభరోసా విధివిధానాల రూపకల్పనపై క్షేత్రస్థాయిలో అభిప్రాయాలు తెలుసుకునేందుకు మంత్రివర్గ ఉపసంఘం కదిలింది. బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో రైతులు, కౌలురైతులు, రైతుసంఘాల నేతలు, వైద్యులు, న్యాయవాదులు, జర్నలిస్టులు 70 మందికి పైగా తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. అంతేకాక లేఖ ద్వారా కూడా అభిప్రాయాలు తెలపొచ్చని మంత్రులు ప్రకటించడంతో పలువురు రైతులు లేఖలు అందించారు. సమావేశంలో మెజారిటీగా వెల్లడైన అంశాలిలా ఉన్నాయి.

- ➤ సాగుచేసే వారికే రైతుభరోసా పథకం అమలు చేయాలి. నిజమైన రైతులు ఎవరనేది వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో గుర్తించి జాబితా రూపొందించాలి. సాగు చేయని భూములకు గతంలో రైతుబంధు ఇచ్చారు. ఈ విధానానికి స్వస్తి పలికితే అర్హులైన, సాగు చేసుకునే రైతులకే రైతు భరోసా అందుతుంది.
- ➤ రైతుబంధు పరిమితి మిగతా 3వ పేజీలో ▶


వ్యవసాయాన్ని ఆదుకునేలా రైతుభరోసా

అందుకోసమే కేబినెట్ సబ్ కమిటీ: డిప్యూటీ సీఎం భట్టి 3లో

జడ్జిల పేర్లు బహిర్గతం చేయొద్దు

వారి కుటుంబ సభ్యుల పేర్లు, అడ్రస్‌లు, ఫోన్ నంబర్లు కూడా..

- ఫోన్ ట్యాపింగ్ కేసులో మీడియా సంయమనం పాటించాలి
- హైకోర్టు సూచన.. తదుపరి విచారణ ఈ నెల 23కు వాయిదా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో జడ్జిలు, వారి కుటుంబ సభ్యుల పేర్లు బహిర్గతం చేయవద్దని, ఇలాంటి వార్తలు రాసేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని హైకోర్టు.. మీడియాకు సూచించింది. ఇలాంటి సున్నితమైన వార్తలు ప్రసారం, ప్రచురితం చేసేటప్పుడు సంయమనం పాటిస్తారని భావిస్తున్నామని వ్యాఖ్యానించింది. ఇకపై జడ్జిలు, వారి కుటుంబ సభ్యుల పేర్లతో పాటు ఫొటోలు, అడ్రస్‌లు, ఫోన్ నంబర్లు బహిర్గతం చేయరని విశ్వసిస్తున్నామని పేర్కొంది. గత ప్రభుత్వ హయాంలో హైకోర్టు న్యాయమూర్తి ఫోన్‌ట్యాప్ అయిందని.. జడ్జిల ఫోన్లను ట్యాప్ చేసినట్టు ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ నాయిని భుజంగరావు తన నేరాంగీకార వాంగ్మూలంలో పేర్కొన్నారని మీడియాలో వచ్చిన కథనాలపై హైకోర్టు సుమోటోగా విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు కూడా జారీ చేయగా.. గత విచారణ సందర్భంగా అడిషనల్ అడ్వొకేట్ జనరల్ పూర్తి కౌంటర్ అఫిడవిట్‌ను సమర్పించారు. ఈ పిల్‌పై

మిగతా 5వ పేజీలో ▶

డీజీపీగా జితేందర్

హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా రవి గుప్తా

- అదనపు డీజీగా (శాంతిభద్రతలు) మహేశ్ ఎం.భగవత్
- రాచకొండ సీపీగా జి.సుధీర్‌బాబు పునరాగమనం
- రాష్ట్ర వ్యాప్తంగా 17 మంది ఐపీఎస్ అధికారుల బదిలీలు
- విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా సీవీ ఆనంద్‌కు అదనపు బాధ్యతలు



సీఎం రేవంత్‌తో నూతన డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇన్‌చార్జ్ డీజీపీగా హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి డాక్టర్ జితేందర్ నియమితులయ్యారు. గత ఏడాది డిసెంబర్ 4 నుంచి డీజీపీగా వ్యవహరిస్తున్న రవి గుప్తాను హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా బదిలీ చేశారు. వీరితో సహా మొత్తం 17 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జితేందర్‌ను డీజీపీ కార్యాలయంలో కో-ఆర్డినేషన్ విభాగం డీజీపీగా నియమించిన ప్రభుత్వం ఇన్‌చార్జ్ డీజీపీగా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగించింది. ఈయన బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. రోడ్డు భద్రత విభాగం అదనపు డీజీగా (ఏడీజీ) వ్యవహరిస్తున్న

మిగతా 2వ పేజీలో ▶





బుధవారం ఉస్మానియా యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న వారిని చితకబాదుతూ లాక్కెళ్తున్న పోలీసులు

ఓయూలో ఉద్రిక్తం

- కోదండరాం ఇంటి ముట్టడిని అడ్డుకున్న పోలీసులు
- హాస్టల్‌లోకి చొరబడి టీఎస్‌పీ నేతల అరెస్ట్
- డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలని అభ్యర్థుల ఆందోళన
- జర్నలిస్టులపై పోలీసుల దాడి.. పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా

3లో

బీజేపీ పోరుబాట

కాంగ్రెస్ 6 గ్యారంటీలు, 421 హామీలపై ఆందోళనలతో ప్రజల్లోకి వెళ్లేలా కార్యక్రమాల ఖరారు



- సర్కారు వాగ్దానాల అమలుపై పట్టుబట్టేలా నిరసనలు
- ఇప్పటికే రైతులు, మహిళలు, నిరుద్యోగ సమస్యలపై వివిధ రూపాల్లో నిర్వహణ
- ఏడు నెలల పాలనలో ప్రభుత్వ శాఖల్లోని అవినీతి, అక్రమాలపై పోరాటాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కమలదళం పోరుబాట పట్టనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడునెలలు దాటడంతో హామీల అమలుపై పట్టుబట్టేలా ఉద్యమకార్యాచరణకు సిద్ధమవుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు, 421 హామీలపై ప్రత్యక్ష ఆందోళనలతో వివిధవర్గాల సమస్యలపై ప్రజల్లోకి వెళ్లేలా ఆందోళన కార్యక్రమాలను చేపట్టనుంది. ఇందుకోసం పార్టీపరంగా ఉన్న యువజన, మహిళా, కిసాన్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మోర్చాల ద్వారా ఆందోళనలను ఇప్పటికే ప్రారంభించింది. రైతాంగానికి ఇచ్చిన హామీల అమల్లో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ల ఎదుట 'రైతు సత్యాగ్రహం' నిర్వహించింది.

రైతులకిచ్చిన హామీల అమలుకు ప్రభుత్వపరంగా చర్యలు చేపట్టకపోతే... ఎన్నికలకు ముందు కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ ప్రకటించిన వరంగల్‌లోనే పెద్దఎత్తున నిరసనలు నిర్వహించాలని నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ రైతాంగానికి ఇచ్చిన ప్రధాన హామీలైన రుణమాఫీ రూ.2 లక్షలు, రైతు భరోసా కింద రైతుకూలీల అకౌంట్లలో రూ.12వేలు, కౌలు రైతులకు రూ.15వేలు, ఫసల్ బీమా అమలు, రైతులకు క్వింటాల్ వరికి రూ.500 బోనస్ వంటివాటి అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయనుంది.

మహిళలు, నిరుద్యోగుల సమస్యలపై..

ఎన్నికలకు ముందు మహిళా లోకానికి ఇచ్చిన హామీల అమలును డిమాండ్ చేస్తూ

మిగతా 3వ పేజీలో ▶

ముస్లిం మహిళలూ భరణానికి అర్హులే

- సుప్రీంకోర్టు కీలక తీర్పు
- సీఆర్‌పీసీ సెక్షన్ 125 అందరికీ వర్తిస్తుంది
- భరణం దాతృత్వం కాదు.. మహిళల హక్కు
- ముస్లిం మహిళా యాక్ట్-1986పై సెక్యులర్ చట్టానిదే పైచేయి
- విడాకులు పొందిన తెలంగాణ ముస్లిం మహిళకు ఊరట
- రూ.10 వేలు భరణం ఇవ్వాల్సిందేనని మాజీ భర్తకు ఆదేశం

6లో

పటాన్‌చెరు రూట్‌లో డబుల్‌డెక్కర్ ఫ్లైఓవర్

- గంగారం వద్ద 1.2 కి.మీ. వరకు...
- జాతీయ రహదారుల సంస్థకు ప్రతిపాదించిన 'మెట్రో'
- మెట్రో రెండోదశ ప్రాజెక్టుపై జాతీయ రహదారుల సంస్థ, హెచ్ఏఎంఎల్ రెండురోజుల సంయుక్త పరిశీలన

8లో



గరిష్ట పరిహారం దక్కేలా చూడాలి

భూసేకరణలో రైతుల పట్ల మానవీయకోణంతో వ్యవహరించాలి



బుధవారం ఉన్నతాధికారుల సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి, సీఎస్ శాంతికుమారి

- రైతులతో కలెక్టర్లు నేరుగా మాట్లాడి ఒప్పించండి
- రీజినల్ రింగురోడ్డు భూసేకరణలో వేగం పెంచండి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

సాక్షి, హైదరాబాద్: జాతీయ రహదారులకు భూములిచ్చిన రైతుల విషయంలో మానవీయకోణంలో వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. నిబంధనల ప్రకారం వచ్చే గరిష్ట పరిహారం రైతులకు దక్కేలా చూడాలన్నారు. తెలంగాణలో రహదారుల నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్‌హెచ్ఏఐ(నేషనల్‌హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) అధికారులు మంగళవారం ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిసి విన్నవించిన విషయం తెలిసిందే. ఆయా అంశాలను కొలిక్కి తెచ్చేందుకు, సంబంధిత జిల్లాల కలెక్టర్లు, విభాగాల ఉన్నతాధికారులతో బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. భూసేకరణ ఎందుకు ఆలస్యమవుతోందని అధికారులను సీఎం ప్రశ్నించారు. భూములకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలు తక్కువ ఉండటం, మార్కెట్ ధరలు ఎక్కువగా ఉండటంతో భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకురావడం లేదని కలెక్టర్లు ఆయన దృష్టికి తెచ్చారు. తరతరాలుగా సాగుచేసుకుంటున్న భూములను శాశ్వతంగా కోల్పోతున్నప్పుడు రైతుల్లో ఆవేదన ఉంటుందని, దానిని అధికారులు గుర్తించాలన్నారు. రైతులను పిలిచి మాట్లాడి వారిని ఒప్పించాలని సూచించారు. రీజినల్‌రింగురోడ్డు దక్షిణభాగం, ఉత్తరభాగం వేర్వేరుగా చూడొద్దని, ఆ రెండింటికి కలిపి ఒకే ఎన్‌హెచ్ నంబర్ కేటాయించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరగా, ఆయన సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్టు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, ఎన్‌హెచ్ఏఐ మధ్య త్రైపాక్షిక ఒప్పందం (ట్రైపార్టియేట్ అగ్రిమెంట్) కుదుర్చుకోవాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. వెంటనే దానిని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం భూసేకరణలో ఉన్న ఆటంకాలపై ఆయన ప్రశ్నించారు. అలైన్‌మెంట్ విషయంలో పొరపడి కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారని, దీంతో హైకోర్టు స్టే ఇచ్చిందని యాదాద్రి భువనగిరి కలెక్టర్ హన్మంత్ కె.జెండగే తెలిపారు. స్టే తొలగింపునకు వచ్చే శుక్రవారం నాటికి కౌంటర్ దాఖలు చేయాలని సూచించారు. అలాగే ఆర్మూర్–జగిత్యాల–మంచిర్యాల, విజయవాడ–నాగ్‌పూర్ కారిడార్‌లకు సంబంధించి అటవీశాఖ భూములకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూములు కేటాయించాలని నిజామాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లకు సూచించారు. హైదరాబాద్–మన్నెగూడ రహదారి పనులు త్వరగా ప్రారంభించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

రెండునెలల్లో హైదరాబాద్–విజయవాడ విస్తరణ పనులు

హైదరాబాద్–విజయవాడ జాతీయరహదారిని ఆరు లేన్లుగా విస్తరించే పనులను వెంటనే చేపట్టాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు మెంబర్ అనిల్‌చౌదరిని కోరారు. రెండునెలల్లో పనులు ప్రారంభిస్తామని ఆయన బదులిచ్చారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ఓఎస్డీలు శేషాద్రి, మాణిక్ రాజ్, చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసిం, మౌలిక వసతుల సలహాదారు శ్రీనివాసరాజు, ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ అధికారి రజాక్, పీసీసీఎఫ్ డోబ్రియల్, ఆర్అండ్‌బీ స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందన, జాయింట్ సెక్రటరీ హరీష్, మెదక్, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, నిజామాబాద్ కలెక్టర్లు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలి: భట్టి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: నాగపూర్–అమరావతి జాతీయ రహదారి నిర్మాణంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. జాతీయ రహదారుల భూసేకరణ పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సచివాలయం నుంచి సమీక్షించగా, ఖమ్మం కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పాల్గొన్నారు. జాతీయ రహదారుల వెంట వ్యవసాయ వాహనాలు, రైతులు వినియోగించుకునేలా గ్రావెల్ రోడ్లు నిర్మించాలనే ప్రతిపాదన సమీక్షలో చర్చకు వచ్చింది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు మెంబర్ అనిల్‌చౌదరి తెలిపారు. గ్రావెల్ రహదారి నిర్మించడం వల్ల రైతులకు ఉపయోగపడడంతో పాటు భవిష్యత్‌లో రహదారి విస్తరణకు ఇబ్బందులు ఉండవని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత భట్టి మాట్లాడుతూ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ నాగపూర్–అమరావతి రహదారిలో భాగంగా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో భూములు కోల్పోతున్న వారికి పరిహారం అందించాలని, ధంసలాపురం వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఇవ్వాలని కోరారు. తల్లాడ–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు సాగుతున్నందున, ప్రస్తుతం ఖమ్మం నుంచి అశ్వారావుపేట వరకు ఉన్న జాతీయ రహదారిని రాష్ట్ర రహదారిగా మార్చుకోవాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు సూచిస్తున్నారని, దానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించవద్దని, జాతీయ రహదారిగానే దానిని కొనసాగించాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

హస్తినలో 'బంగారు బోనం'

ఘనంగా లాల్ దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలు

బంగారు బోనమెత్తిన తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో లాల్ దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలు రెండు రోజుల పాటు ఘనంగా జరిగాయి. లాల్ దర్వాజ మహంకాళి అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్ వేదికగా జరిగిన ఈ వేడుకల్లో బుధవారం రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. అంతకుముందు లాల్‌దర్వాజ అమ్మవారి బోనాల కమిటీ సభ్యులు గవర్నర్‌కు స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ బంగారు బోనాన్ని ఎత్తుకుని సింహవాహిని అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. పూజల తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేవుడు ఒక్కడేనని.. భిన్న రూపాల్లో మనం దేవుడిని కొలుస్తామని అన్నారు. ఇదే సెక్యులరిజానికి నిజమైన నిర్వచనమని పేర్కొన్నారు. బోనాల ఉత్సవాల్లో ఈ సంస్కృతి స్పష్టంగా కనిపిస్తుందని గవర్నర్ రాధాకృష్ణన్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సింహవాహిని శ్రీమహంకాళి దేవాలయ కమిటీ అధ్యక్షుడు సి.రాజేంద్రయాదవ్, ఇతర ముఖ్యులు గవర్నర్‌కు జ్ఞాపికను అందించారు. రెండు రోజుల పాటు ఢిల్లీలో జరిగిన బోనాల ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు కర్తవ్యపథ్ నుంచి తెలంగాణభవన్ వరకు నిర్వహించిన అమ్మవారి ఘట ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, ఒగ్గు డోలు, డప్పు దరువులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



ఢిల్లీలో లాల్ దర్వాజ మహంకాళి అమ్మవారికి బోనమెత్తిన రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్

వైద్య కాలేజీల్లో 607 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి

త్వరలో మెడికల్ సర్వీసెస్ బోర్డు ద్వారా ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ వైద్య విద్యా సంస్థల్లో ఉద్యోగ ఖాళీల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోపు కీలక కేడర్‌లలో ఖాళీలను భర్తీ చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖను ఆదేశించింది. ఈ మేరకు 36(8 కొత్త మెడికల్ కాలేజీలతో కలిపి) ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని 607 ఖాళీల భర్తీకి అనుమతి ఇచ్చింది. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. మొత్తం 34 డిపార్ట్‌మెంట్లలో ఈ ఖాళీలు ఉన్నాయి. అత్యధికంగా గైనకాలజీ విభాగంలో 90 పోస్టులు ఉండగా, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీలో కలిపి 85 పోస్టులకుపైగా ఉన్నాయి. మిగిలిన డిపార్ట్‌మెంట్లలో పరిమిత సంఖ్యలో పోస్టులున్నాయి. అకాడమిక్ క్వాలిఫికేషన్‌లో వచ్చిన మార్కులు, కాంట్రాక్ట్ సరీ్వస్ వెయిటేజీ ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఒకట్రెండు రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

435 ఎంబీబీఎస్ డాక్టర్ పోస్టులకు 2,400 దరఖాస్తులు

ప్రభుత్వ దవాఖాన్లలోని 435 ఎంబీబీఎస్ (సివిల్ అసిస్టెంట్ సర్జన్) డాక్టర్ పోస్టుల భర్తీకి ఇటీవల మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది.



ఈ నెల 11వ తేదీ సాయంత్రానికి అప్లికేషన్ల గడువు ముగియనుంది. బుధవారం నాటికి సుమారు 2400 మంది డాక్టర్లు ఈ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇంకో వెయ్యి దరఖాస్తులు వరకూ వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది ఒక్కో పోస్టుకు ఐదుగురు డాక్టర్లు దరఖాస్తు చేయగా, ఈసారి ఒక్కో పోస్టుకు 7 నుంచి 8 అప్లికేషన్లు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రైవేటు ప్రాక్టీస్‌పై బ్యాన్ పెట్టినప్పటికీ, ప్రభుత్వ సర్వీసులోకి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తుండడం గమనార్హం.

ప్రజాపాలన కాదు... దగాపాలన

బీఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, రవి కుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నడుస్తోంది.. ప్రజాపాలన కాదని.. అది అన్ని వర్గాల దగా పాలనని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు పల్లె రవికుమార్, రామచంద్ర నాయక్, తుంగ బాలుతో కలిసి బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లు, వర్సిటీ క్యాంపస్ హాస్టళ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ సాధారణ విషయంగా మారిందని, చట్నీల్లో ఎలుకలు, అన్నంలో బల్లులు వస్తున్నాయని ధ్వజమెత్తారు. వర్సిటీల్లో 2014కు ముందు నాటి పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. రేవంత్ పాలనలో సామాజిక న్యాయం కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, బీసీ మంత్రులకు అధికారులకు అవమానం జరుగుతోందని తెలిపారు. యాదాద్రి గుడిలో భట్టికి, బల్కంపేట ఎల్లమ్మ గుడిలో పొన్నం ప్రభాకర్‌కు అవమానం జరిగిందని చెప్పారు. దళిత ఎస్ఐ శ్రీరాములు శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ బీసీ ఎమ్మెల్యే స్వయంగా రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయంపై సోషల్ మీడియాలో నిరసన స్వరం వినిపించారని గుర్తు చేశారు. కొన్ని గంటల్లోనే ఆ ఎమ్మెల్యేపై ఒత్తిడి తెచ్చి సోషల్ మీడియాలో పెట్టిన వ్యాఖ్యలు తీసేయించారన్నారు. రేవంత్ కడప వెళ్లి షర్మిల కోసం ఊరూరు తిరుగుతా ఉన్నారని, సమైక్యవాదుల కోసం ఆయన తాపత్రయ పడుతున్నారని విమర్శించారు.

అనూహ్యంగా తెరపైకి జితేందర్

సీనియారిటీలో నాలుగో స్థానం

- రాజీవ్‌రతన్ మృతితో మూడో ప్లేస్‌లోకి
- కీలక కేసుల నేపథ్యంలో సీవీ ఆనంద్‌కు బ్రేక్
- శివధర్‌రెడ్డి పేరు వినిపించినా ఆయన అదనపు డీజీనే కావడంతో..



డీజీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న జితేందర్

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన నాటి నుంచి రాష్ట్ర డీజీపీ మార్పుపై కసరత్తులు జరుగుతున్నాయి. తెరపైకి కొందరు సీనియర్ అధికారుల పేర్లు వచ్చినా అవకాశం మాత్రం అనూహ్యంగా డాక్టర్ జితేందర్‌కు దక్కింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చివరిలో డీజీపీగా కొనసాగిన సీనియర్ ఐపీఎస్ అధికారి అంజనీకుమార్ గతేడాది డిసెంబర్ 4న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న క్రమంలోనే నాటి పీసీసీ చీఫ్ ఎ.రేవంత్‌రెడ్డిని ఇంటికి వెళ్లి కలిసి అభినందించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఈ చర్యను తీవ్రంగా పరిగణించిన ఎన్నికల సంఘం అంజనీకుమార్‌ను సస్పెండ్ చేసింది. ఆయన స్థానంలో రవి గుప్తాను నియమిస్తూ మరసటి రోజు ఉత్తర్వులు జారీ చేసింది.

ఏసీబీలో కీలకంగా మారిన ఆనంద్...

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ఈ ఏడాది జనవరి నుంచి దఫదఫాలుగా పోలీసు బదిలీలు జరిగినా రవి గుప్తాను మాత్రం కొనసాగించారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో కొత్త అధికారిని డీజీపీగా నియమించడానికి కసరత్తులు ప్రారంభం అయ్యాయి. రాష్ట్రానికి సంబంధించి డీజీపీ హోదాలో ఉన్న అధికారుల సీనియారిటీ జాబితాలో తొలి పేరు 1990 బ్యాచ్‌కు చెందిన రవి గుప్తాదే. ఈ తర్వాతి స్థానంలో 1991 బ్యాచ్‌కు చెందిన రాజీవ్‌రతన్ ఉండగా... ఇటీవల ఆయన కన్నుమూయడంతో అదే బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్ ఆ స్థానంలోకి వచ్చారు. ఈ పరిణామంతో 1992 బ్యాచ్‌కు చెందిన జితేందర్ సీనియారిటీ జాబితాలో నాలుగో స్థానం నుంచి మూడో స్థానానికి వచ్చారు. రవి గుప్తా తర్వాత సీనియర్ అయిన సీవీ ఆనంద్ ప్రస్తుతం ఏసీబీ డీజీగా ఉన్నారు. ఏసీబీ దర్యాప్తు చేస్తున్న గొర్రెల స్కామ్ సహా అనేక కేసులు కీలక దశలో ఉన్నాయి. ఈ విభాగానికి డైరెక్టర్‌గా పని చేసిన ఏఆర్ శ్రీనివాస్ సైతం గత నెల ఆఖరున పదవీ విరమణ చేశారు. దీంతో ఏసీబీలో ఆనంద్ కీలకం కావడంతో అన్ని అర్హతలు ఉన్నప్పటికీ.. ఆయనకు ఈసారి డీజీపీగా అవకాశం దక్కలేదు. ఇక అనుభవం, సమర్థతతో పాటు వివాదరహితుడు, మృదుస్వభావి కావడంతోనే జితేందర్‌ను డీజీపీ పోస్టు వరించింది.

పదోన్నతులు పూర్తి కాకపోవడంతోనే...

ప్రస్తుతం నిఘా విభాగాధిపతిగా ఉన్న 1994 బ్యాచ్‌కు చెందిన బి.శివధర్‌రెడ్డి పేరు కూడా డీజీపీ రేసులో వినిపించిది. అయితే ఆయన ప్రస్తుతం అదనపు డీజీ హోదాలో ఉన్నారు. డీజీపీ హోదాలో ఉన్న రాజీవ్‌రతన్ కన్ను మూయడం, సందీప్ శాండిల్య పదవీ విరమణ చేయడం రెండు ఖాళీలు ఏర్పడ్డాయి. అదనపు డీజీల సీనియారిటీ జాబితాలో ముందున్న కొత్తకోట శ్రీనివాసరెడ్డితో (హైదరాబాద్ పోలీసు కమిషనర్) పాటు శివధర్‌రెడ్డికీ డీజీలుగా పదోన్నతి రావాల్సి ఉంది. అయితే ఆ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో లైన్ క్లియర్ కాలేదు.

పూర్తి స్థాయి డీజీపీని నియమించాలంటే...

రాజకీయ కారణాల నేపథ్యంలో కొన్నేళ్లుగా రాష్ట్ర పోలీసు విభాగానికి ఇన్‌చార్జ్ లేదా ఫుల్ అడిషనల్ చార్జ్ (ఎఫ్ఏసీ) డీజీపీలే నేతృత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం పూర్తి స్థాయి డీజీపీగా నియమించాలంటే సీనియారిటీ ఆధారంగా ఐదుగురు ఐపీఎస్ అధికారుల జాబితాను కేంద్రానికి పంపాల్సి ఉంటుంది. సీనియారిటీ, గతంలో పని చేసిన స్థానాలు, అనుభవం, సెంట్రల్ డెప్యుటేషన్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకునే కేంద్రం వీటిలో మూడు పేర్లను వెనక్కు పంపుతుంది. ఆ ముగ్గురి నుంచి ఒకరిని రాష్ట్ర ప్రభుత్వం డీజీపీగా నియమించుకోవాల్సి ఉంటుంది. శ్రీనివాసరెడ్డి, శివధర్‌రెడ్డి పదోన్నతుల తర్వాత కేంద్రానికి సీనియారిటీ జాబితా పంపితే అందులో వీరితో పాటు రవి గుప్త, సీవీ ఆనంద్, జితేందర్‌ల పేర్లు ఉంటాయి. వీటిలో ఏ మూడు పేర్లు వెనక్కు వస్తాయి? వారిలో ఎవరిని డీజీపీగా నియమిస్తారు? లేదా గతంలో మాదిరిగా జితేందర్ పదవీ విరమణ చేసే వరకు, ఆ తర్వాత కూడా ఎఫ్ఏసీ డీజీపీతోనే నడిపిస్తారా? అనేవి మిలియన్ డాలర్ల ప్రశ్నలు.

డీజీపీగా జితేందర్

▶ మొదటి పేజీ తరువాయి

మహేష్ ఎం.భగవత్‌ను శాంతిభద్రతల విభాగం అదనపు డీజీగా బదిలీ చేసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సాంకేతిక కారణాల వల్ల ఈ ఏడాది ఫిబ్రవరిలో బదిలీ అయిన రాచకొండ పోలీసు కమిషనర్ జి.సుధీర్‌బాబును తిరిగి అదే స్థానంలో నియమించింది. సైబరాబాద్ పోలీసు కమిషనర్‌గా పని చేసి, గత ఏడాది డిసెంబర్ నుంచి హోంగార్డ్స్ విభాగం అదనపు డీజీగా ఉన్న ఎం.స్టీఫెన్ రవీంద్రకు ఏడీజీ ఆపరేషన్స్‌గా పోస్టింగ్ ఇచ్చింది. మిగిలిన ఐపీఎస్ అధికారుల బదిలీలు ఇలా...

అధికారి	ప్రస్తుతం	బదిలీ అయిన స్థానం
స్వాతి లక్రా	ఏడీజీ బెటాలియన్స్	ఏడీజీ హోంగార్డ్స్
విజయ్‌కుమార్	ఏడీజీ ఆపరేషన్స్	ఏడీజీ పర్సనల్
సంజయ్ కుమార్ జైన్	ఏడీజీ లా అండ్ ఆర్డర్	ఏడీజీ బెటాలియన్స్
డాక్టర్ తరుణ్ జోషి	రాచకొండ సీపీ	డైరెక్టర్ ఏసీబీ
ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి	ఐజీ పర్సనల్	ఐజీ మల్టీ జోన్–1
కె.రమేష్ నాయుడు	వెయిటింగ్	ఐజీ రోడ్ సేఫ్టీ, రైల్వేస్
వి.సత్యనారాయణ	ఐజీ సీఏఆర్ హెడ్–క్వార్టర్స్	ఐజీ మల్టీ జోన్–2
రక్షిత కె.మూర్తి	ఎస్పీ వనపర్తి	డీసీపీ సీఏఆర్ హెడ్–క్వార్టర్స్
డి.ఉదయ్‌కుమార్ రెడ్డి	డీసీపీ సౌత్ వెస్ట్ జోన్	ఎస్పీ మెదక్
ఆర్.గిరిధర్	డీసీపీ ఈస్ట్ జోన్	ఎస్పీ వనపర్తి
బి.బాలస్వామి	వెయిటింగ్	డీసీపీ ఈస్ట్ జోన్
జి.చంద్ర మోహన్	డీసీపీ రాచకొండ టాస్క్‌ఫోర్స్	డీసీపీ సౌత్ వెస్ట్ జోన్

క్యాష్‌లెస్ చలాన్ సిస్టమ్ రూపకర్త ఈ డీజీపీనే..

తెలంగాణ ఇన్‌చార్జ్ డీజీపీగా నియమితులైన డాక్టర్ జితేందర్ పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లో 1965 సెప్టెంబర్‌లో జన్మించారు. జేఎన్‌టీయూ హైదరాబాద్ నుంచి స్కూల్ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 1992లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ఉమ్మడి ఏపీలో గుంటూరు, మహబూబ్‌నగర్ జిల్లాల ఎస్పీగా.. వైజాగ్, వరంగల్ రేంజ్ డీఐజీగా పని చేశారు. హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ సీపీగా విధులు నిర్వర్తిస్తూ ఆటోమెటిక్ సిగ్నల్స్, ఇంటలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సిటిజన్ సెంట్రిక్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, క్యాష్‌లెస్ చలాన్ సిస్టమ్(దేశంలోనే తొలిసారి)ను తీసుకురావడంతో కృషి చేశారు. లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీగా పని చేస్తున్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా లా అండ్ అర్డర్ సరిగా అమలయ్యేలా చూస్తూ, రాష్ట్రంలోని, కేంద్రంలోని సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ బాధ్యతలు నిర్వర్తించారు. ఏడాదిన్నర కాలంగా హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. పోలీస్, ఫైర్ సర్వీస్, జైళ్లు, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, సైనిక్ వెల్ఫేర్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ తదితర విభాగాలకు సంబంధించిన పాలసీ, అడ్మినిస్ట్రేషన్‌ను సమర్థవంతంగా నిర్వర్తించారు. ప్రస్తుతం రాష్ట్ర డీజీపీ(హెచ్ఓపీఎఫ్)గా పదోన్నతి పొందారు. కాగా, గ్యాలంట్రీ, మెరిటోరియస్ సర్వీస్, విశిష్ట సేవకు ప్రెసిడెంట్స్ మెడల్స్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి అంతర్గత భద్రత పతకం పొందారు. కాగా, 2025 సెప్టెంబర్ వరకు ఆయన సర్వీసు కొనసాగనుంది.

విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా సీవీ ఆనంద్

అవినీతి నిరోధక విభాగం డైరెక్టర్ జనరల్‌గా ఉన్న సీవీ ఆనంద్‌కు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌గా కూడా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. రాజీవ్ రతన్ హఠాన్మరణంతో ఆ పోస్టు ఖాళీగా కాగా హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న జితేందర్‌కు అప్పట్లో ఆ బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు ఈ బదిలీల్లో జితేందర్ డీజీపీగా నియమితులు కావడంతో.. ఆ స్థానంలో సీవీ ఆనంద్‌కు అదనపు బాధ్యలు అప్పగించారు.

డ్రగ్స్, సైబర్‌క్రైమ్‌పై ప్రత్యేక దృష్టి: డీజీపీ జితేందర్

రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసుగా బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించిన జితేందర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డ్రగ్స్ నిర్మూలనకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, ఆ దిశగా నార్కోటిక్స్ బ్యూరో బలోపేతం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. డ్రగ్స్‌తోపాటు సైబర్ నేరాలను అరికట్టాల్సిన దానిపై ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు. అలాగే ఇతర అన్ని నేరాల నివారణకు తెలంగాణ పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని వెల్లడించారు. అంతకు ముందు ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ధరణికి 'యాచారం' దారి!

▶ మొదటి పేజీ తరువాయి



రంగారెడ్డి జిల్లా మంథన్‌గౌరెల్లిలో భూన్యాయ శిబిరం నిర్వహిస్తున్న ఎం. కోదండరెడ్డి, భూచట్టాల నిపుణుడు ఎం. సునీల్‌కుమార్.

దరఖాస్తుల ద్వారా వివరాలు తీసుకున్నారు. భూయజమాని వ్యక్తిగత వివరాలు, భూమి ఖాతా నంబర్, పాసు పుస్తకం ఉందా లేదా? సర్వే నంబర్, సబ్ డివిజన్ నంబర్, విస్తీర్ణం, భూమి స్వభావం, భూమి సంక్రమించిన విధానం, ఏ విధమైన భూసమస్య ఉందనే వివరాలు అందులో ఉన్నాయి. ప్రతి సమస్యకు ఒక కోడ్ ఇచ్చి ఆ కోడ్ ప్రకారం దరఖాస్తులను పూర్తి చేయించి.. సంబంధిత డాక్యుమెంట్ల జిరాక్స్‌లు తీసుకుని ఫైల్ చేశారు. రెండో దశలో.. ఆ దరఖాస్తులను పరిశీలించి, ఏ సమస్యలు ఎన్ని వచ్చాయి? పరిష్కారానికి అవసరమైన ఇతర డాక్యుమెంట్లు ఏవి అనే స్పష్టతకు వచ్చారు. ఈ వివరాలను రైతులకు చెప్పి అవసరమైన అన్ని డాక్యుమెంట్లు తీసుకున్నారు. ఈ ఏడాది జనవరి 14న యాచారం మండలంలోని మంథన్ గౌరెల్లి గ్రామంలో ప్రారంభమైన భూన్యాయ శిబిరాలు.. ఈ నెల 8న అదే గ్రామంలో ముగిశాయి. మొత్తం 10 గ్రామాల్లో కలిపి 2,200 దరఖాస్తులు వచ్చాయి.

ఎక్కువగా ఏ సమస్యలు వచ్చాయంటే!

భూన్యాయ శిబిరాల్లో వచ్చిన దరఖాస్తులను బట్టి చూస్తే.. యాచారం మండలంలోని 10 గ్రామాల్లో ఎక్కువగా అసైన్డ్ భూముల సమస్యలు ఉన్నాయి. అసైన్డ్ భూములు మ్యుటేషన్ కావడం లేదని, కొత్త పాస్‌పుస్తకాలు రాలేదని, వచ్చిన పుస్తకాల్లో విస్తీర్ణం తగ్గిందని దరఖాస్తులు వచ్చాయి. తర్వాత అత్యధికంగా నిషేధిత జాబితాలో పట్టా భూములను చేర్చిన సమస్య కనిపించింది. ఇక సర్వే నంబర్లు మిస్సింగ్, సేత్వార్ సరిపోలకపోవడం వంటివాటితోపాటు పార్ట్–బీ కింద (కొత్త పాస్‌పుస్తకాలు రాని పట్టా భూములు) సమస్యల దరఖాస్తులు వచ్చాయి. నిజానికి రాష్ట్రవ్యాప్తంగా పార్ట్–బీలో చేర్చిన 18 లక్షల ఎకరాల భూముల్లో.. సుమారు 5 లక్షల ఎకరాలను ఎందుకు చేర్చారో కూడా తెలియదని రెవెన్యూ నిపుణులు చెప్తున్నారు. ఆధార్ నంబర్ ఇవ్వలేదని 4 లక్షల ఎకరాలను ఈ జాబితాలో చేర్చగా.. మొత్తంగా ఆధార్ సంబంధిత అంశాల ప్రాతిపదికన 6 లక్షల ఎకరాల విషయంలో ఇబ్బందులు వచ్చాయి.

తర్వాతి దశలో ఏం చేస్తారు?

'లీఫ్స్' సంస్థ ఆధ్వర్యంలో రెండు దశల్లో దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన పూర్తయిన నేపథ్యంలో.. మిగతా పని అంతా రెవెన్యూ అధికారులు చేయాల్సి ఉంటుంది. అధికారులు గ్రామాల వారీగా భూరికార్డులను (సేత్వార్, పహాణీ, 1–బీ, ఇతర రికార్డులు) పరిశీలించి ఎక్కడ పొరపాటు జరిగిందనే విషయాన్ని ప్రస్తావిస్తూ రిపోర్టు తయారు చేయాలి. తహసీల్దార్ స్థాయిలో జరిగే ఈ మూడో దశ పూర్తయ్యాక.. చివరిగా నాలుగో దశలో సమస్యకు పరిష్కారం చూపాల్సి ఉంటుందని లీఫ్స్ ప్రతినిధి ఎం.సునీల్‌కుమార్ వెల్లడించారు. ఈ పద్ధతిని రాష్ట్రమంతటా అమలు చేయడం ద్వారా భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

రెవెన్యూ మంత్రికి నివేదిక!

ఈ యాచారం పైలట్ ప్రాజెక్టు అధ్యయనం రాష్ట్ర పరిశీలనలో ఉందని సమాచారం. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా యాచారం మండలంలో జరిగిన భూన్యాయ శిబిరాల వివరాలను తెలుసుకున్నారని తెలిసింది. లీఫ్స్ సంస్థ ఈ అధ్యయనానికి సంబంధించిన నివేదికను త్వరలోనే రెవెన్యూ మంత్రికి అందజేయనున్నట్టు సమాచారం.

ప్రభుత్వం ఏం చేయాలి?

వాస్తవానికి, రాష్ట్రంలోని వ్యవసాయ భూసమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ధరణి పోర్టల్‌కు గత నాలుగేళ్లలో వచ్చిన దరఖాస్తుల సంఖ్య 16 లక్షలు. అందులో 8లక్షలకు పైగా దరఖాస్తులను రెవెన్యూ వర్గాలు తిరస్కరించి ఉంటాయని అంచనా. ఇప్పుడు యాచారం మండలంలోని 10 గ్రామాల్లో వచ్చిన దరఖాస్తులను బట్టి రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో సగటున 200 భూసమస్యలు ఉన్నాయని.. 11 వేల రెవెన్యూ గ్రామాల్లో కలిపి 22 లక్షల సమస్యలు ఉంటాయని అంచనా వేశారు. ఇప్పుడీ సమస్యలన్నింటినీ ధరణి పోర్టల్ ద్వారా పరిష్కరించడం ఎలా సాధ్యమనే ప్రశ్న తలెత్తుతోంది. పరిష్కరించడమంటే దరఖాస్తులను తిరస్కరించడం కాదని.. కచ్చితమైన రికార్డు, వివరణలతో తగిన పరిష్కారం చూపాలని రెవెన్యూ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ సదస్సులను నిర్వహించినప్పుడు భూసమస్యలపై 21 లక్షల దరఖాస్తులు వచ్చాయని.. అందులో 8లక్షలు పరిష్కారం అయ్యాయని చెప్పన్నారు. రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో గ్రామాలకు వెళ్లినప్పుడే భూసమస్యల పరిష్కారానికి మార్గం ఏర్పడుతుందని.. ఇందుకు యాచారం మండలంలో చేపట్టిన అధ్యయనం దోహదపడుతుందని అంటున్నారు.

యాచారం మండలంలోని 10 గ్రామాల్లో భూ సమస్యల లెక్క ఇదీ..

గ్రామం	సమస్యల సంఖ్య
యాచారం	291
మంథన్ గౌరెల్లి	236
మొండి గౌరెల్లి	120
కుర్మిద్ద	378
తాటిపర్తి	254
మేడిపల్లి	204
తక్కెలపల్లి	96
చింతపట్ల	255
గున్‌గల్	247
నంది వనపర్తి	119
మొత్తం	2,200

గత 20 ఏళ్లుగా ప్రభుత్వాలు చేసిందేమిటి?

భూసమస్యల పరిష్కారం కోసం 20 ఏళ్లుగా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. 2006లో ఉమ్మడి రాష్ట్రంలోని వ్యవసాయ భూముల పాస్‌బుక్‌లకు యూనిక్ కోడ్ ఇచ్చారు. అందుకు ఏడాది వరకు సమయం పట్టింది. 2007–2011 మధ్య మండలానికి మూడు గ్రామాల చొప్పున దత్తత తీసుకుని... పారాలీగల్ కార్యకర్తల ద్వారా ప్రతి గ్రామంలో 15 రోజుల పాటు భూసమస్యల గుర్తింపు, పరిష్కారం ప్రక్రియ చేపట్టారు. 2009–10లో కేవలం ఎస్సీ, ఎస్టీలకు ఉన్న భూముల పరిశీలన జరిగింది. అప్పుడే 5 లక్షల వరకు భూసమస్యలు ఉన్నట్టు గుర్తించారు. 2011–12 మధ్య రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆ సదస్సుల్లో మొత్తం 21 లక్షల దరఖాస్తులురాగా.. 8 లక్షల సమస్యలను పరిష్కరించారు. ఇక తెలంగాణ ఏర్పాటయ్యాక 2017 డిసెంబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా భూరికార్డుల ప్రక్షాళన జరిగింది. రైతులకు తెలంగాణ ప్రభుత్వం పేరుతో కొత్త పాస్‌బుక్‌లు ఇచ్చారు. అనంతరం ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం ఆ పోర్టల్ ద్వారానే భూసమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం జరుగుతోంది. కాంగ్రెస్ సర్కారు వచ్చాక స్పెషల్ డ్రైవ్ చేపట్టి లక్షకుపైగా దరఖాస్తులను పరిష్కరించింది.

క్లుప్తంగా...

కనీస వేతనాల సలహా బోర్డు చైర్మన్‌గా జనక్‌ప్రసాద్ బాధ్యతలు


జనక్ ప్రసాద్‌ను అభినందిస్తున్న శ్రీధర్‌బాబు, మకన్‌సింగ్ రాజ్ ఠాకూర్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని కార్మిక భవన్‌లో శ్రీధర్‌బాబు సమక్షంలో కనీస వేతనాల సలహా బోర్డు చైర్మన్‌గా కార్మిక సంఘం నాయకుడు జనక్ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల కష్టనష్టాలు తెలిసిన వ్యక్తి జనక్ ప్రసాద్‌కు ఈ పదవి రావడం సంతోషకరమన్నారు. ఆయన ప్రభుత్వానికి, కార్మికులకు వారధిగా ఉంటూ ప్రభుత్వానికి మంచి పేరుతో, కార్మికులకు మేలు చేసే విధంగా పని చేయాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ అధినాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నూతనంగా చైర్మన్ పదవులు స్వీకరిస్తున్న అందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

నాడు వీరంతా ఎటుపోయారు

- నిరుద్యోగులను రెచ్చగొడ్తున్న బీఆర్‌ఎస్ నేతలపై ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ మోచేతి నీళ్లు తాగే కొందరు నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, గత పదేళ్లలో రాష్ట్రంలోని నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నప్పుడు ఈ నాయకులంతా ఎటు వెళ్లారని అసెంబ్లీలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ ప్రశ్నించారు. కల్వకుంట్ల కుటుంబం దండుపాళ్యం ముఠా తరహాలో రాష్ట్రాన్ని దోచుకుందని, అప్పుడు ఒక్క మాట కూడా మాట్లాడని వారంతా ఇప్పుడు ప్రగల్భాలు పలుకుతున్నారని వ్యాఖ్యానించారు. సీఎల్పీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...గాదరికి శోర్, గువ్వల బాలరాజు, బాల్క సుమన్‌లకు బుద్ధి, జ్ఞానం ఉంటే నిరుద్యోగుల గురించి అప్పుడెందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఉద్యోగాల పేపర్లు లీకయ్యి విద్యార్థులు రోడ్డున పడ్డప్పుడు, ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వనప్పుడు, టీఎస్‌పీఎస్సీని నిర్వీర్యం చేసినప్పుడు, సునీల్‌నాయక్ ఆత్మహత్య చేసుకున్నప్పుడు, ప్రవల్లిక చనిపోయినప్పుడు వీళ్లంతా విద్యార్థుల పక్షాన ఎందుకు నిలబడలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వీరికి మరోమారు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని రాంచంద్రునాయక్ వ్యాఖ్యానించారు.

బీజేపీ పోరుబాట!

▶ మొదటి పేజీ తరువాయి

మంగళవారం మహిళా మోర్చా నేతృత్వంలో ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించింది. ఏడు నెలలు గడిచినా మహిళలకు ప్రతి నెలా రూ. 2 వేల సాయం అమలు కాకపోవడం, కొత్త రేషన్ కార్డులు పంపిణీ లేకపోవడం, ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందకపోవడంతో పాటు మహిళలకు రూ. 500కే వంట గ్యాస్, 18 ఏళ్లు నిండిన అమ్మాయిలకు ఉచితంగా స్కూటీలు ఇస్తామన్న కాంగ్రెస్ వాగ్దానాలు ఏమయ్యాయని ఈ ధర్నా ద్వారా ప్రభుత్వాన్ని నిలదీసింది. ఇక నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పున భృతి చెల్లింపు డిమాండ్‌తో పాటు ఉద్యోగాల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ల జారీ కాకపోవడం వంటి సమస్యలపై యువమోర్చా ఉద్యమబాట ఉధృతం చేయనుంది.

అవినీతి, అక్రమాలపై ఆధారాల సేకరణ...

రాష్ట్రంలో సివిల్ సప్లయిస్, ఇతర శాఖల్లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలను బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వెలికి తీసిన నేపథ్యంలో...ఈ శాఖలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నందున ఆయా అంశాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని కేంద్రం దృష్టికే తీసుకెళ్లాలని పార్టీనాయకులు భావిస్తున్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని వివిధ శాఖలకు కేంద్రం నుంచి నిధులు, గ్రాంట్లు వస్తున్నందున, వాటిపై కేంద్రం విచారణ కోరేలా, ఆయా శాఖల్లో చోటుచేసుకున్న అక్రమాలకు సంబంధించి పూర్తిస్థాయిలోఆధారాలు సేకరించి అందజేయాలని నిర్ణయించినట్లు పార్టీ ముఖ్య నేతలు వెల్లడించారు.

స్థానిక ఎన్నికల నాటికి పట్టు సాధించాలని..

రాష్ట్రంలో ఈ ఏడాది చివర్లోగా తొలుత గ్రామీణ (గ్రామపంచాయతీ, జిల్లా/మండల పరిషత్), వచ్చే ఏడాది ప్రథమార్థంలో పట్టణ (మున్సిపల్, కార్పొరేషన్) స్థానికసంస్థల ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో పార్టీ ప్రాతినిధ్యాన్ని గణనీయంగా పెంచుకుని క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలాన్ని పెంచుకోవాలని పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రామాల్లో పోలింగ్‌బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు యావత్ పార్టీ యంత్రాంగం నిరసనలు, ఆందోళనల్లో పాల్గొనేలా కార్యాచరణను రూపొందిస్తోంది.

వ్యవసాయాన్ని ఆదుకునేలా రైతుభరోసా

త్వరలోనే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతాం

- అదే సమయంలో రైతు భరోసాపై విధివిధానాల ప్రకటన
- అందుకోసమే కేబినెట్ సబ్‌కమిటీ.. ఉమ్మడి జిల్లాల్లో భేటీలు
- ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన మంత్రులు పొంగులేటి, తుమ్మల

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రజల జీవనభృతికి దోహదపడుతున్న రైతులకు పెట్టుబడి సాయంగా రైతుభరోసా ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చాం. ఆ హామీని అమలు చేసేందుకు ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజాప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉంది. వ్యవసాయరంగాన్ని ఆదుకునేలా రైతుభరోసా ఉంటుంది' అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. రైతు భరోసా పథకం విధివిధానాల రూపకల్పనపై ఖమ్మం కలెక్టరేట్‌లో బుధవారం ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. రైతులు, రైతుసంఘాలు, కౌలురైతులు, డాక్టర్లు, న్యాయవాదులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, జర్నలిస్టుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సమావేశానికి ఉపసంఘం సభ్యులు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. రైతుభరోసా పథకంపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం తొలిసారి ఖమ్మం జిల్లా నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించింది.

సమయానుకూలంగా నిధులు

గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రైతుబంధు నిధులను సమయానుకూలంగా విడుదల చేశామని భట్టి విక్రమార్క చెప్పారు. కేంద్రం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చే నిధుల ఆధారంగా త్వరలోనే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతామన్నారు. ఉమ్మడిజిల్లాల్లో పర్యటించి రైతులు, ప్రముఖుల నుంచి అభిప్రాయాలు సేకరించాలని నిర్ణయించినట్టు తెలిపారు.

రైతులను ఆదుకోవాలన్నదే లక్ష్యం

నిజమైన రైతుకు భరోసా కల్పించాలని, రైతులను ఆదుకోవాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతు రుణమాఫీ కూడా అమలు కాబోతోందన్నారు. రైతులకు పంట నష్ట పరిహారం అందేలా గుంట భూమి ఉన్నవారికి కూడా ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందని, త్వరలో దీనిపై నిర్ణయం వెలువడుతుందని తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో ఆర్థికశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, తెల్లం వెంకట్రావు, రాందాస్‌నాయక్, జారె ఆదినారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో చర్చ..

వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే రైతుభరోసాపై తుది నిర్ణయం వస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. గతంలో ఏ స్కీమ్ అమలు చేసినా నాటి ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని సేకరించలేదని, నాలుగు గోడల మధ్యే చర్చించి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. సంపదను పంచే క్రమంలో రైతులు, పేదలు, దళిత, గిరిజనులకు ప్రతిపైసాకు లెక్క చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆ దిశగానే తమ ప్రభుత్వం పయనిస్తుందన్నారు.

సాగుభూమికే రైతుభరోసా ఇవ్వాలి

▶ మొదటి పేజీ తరువాయి

లేకుండా ఎంత భూమి ఉన్నా ఇచ్చారు. అలా కాకుండా పదెకరాల వరకే రైతుభరోసా ఇవ్వాలి. అన్ని జిల్లాల్లో రైతుల నుంచి వచ్చే మెజారిటీ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

- సీజన్ ప్రారంభంలోనే రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తారు. అప్పుడు చేతిలో చిల్లిగవ్వ లేక రైతులు ఇబ్బంది పడతారు. ఈ సమయంలో రైతుభరోసా అందిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.
- బంజరు భూములు, బీడు భూములు, రియల్ ఎస్టేట్ భూములకు కూడా రైతుబంధు ఇచ్చారు. భూస్వాములు, ప్రభుత్వ ఉద్యోగులకు కూడా అందింది. రైతుభరోసాలో ఈ భూములు, ఈ కేటగిరీకి చెందిన వారిని తొలగించాలి.
- కౌలు రైతులకు ఉపయోగపడేలా రైతుభరోసా ఉండాలి. రైతుబంధు అందక, పంటనష్టం జరిగినా పరిహారం లేక.. ఇన్‌పుట్ సబ్సిడీ రాక కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరికి ఎంతో కొంతైనా రైతుభరోసా ఇవ్వాలి. లేదా సబ్సిడీపై విత్తనాలు అందించాలి. యంత్ర లక్ష్మి పథకాన్ని పునరుద్ధరించి రైతులు, కౌలు రైతులకూ వ్యవసాయ పరికరాలు ఇవ్వాలి.
- వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో కౌలు రైతులను అధికారికంగా గుర్తించారు. 2011లో ఈ ప్రక్రియ ఆగిపోయింది. మళ్లీ కౌలు రైతుల గుర్తింపు కార్యక్రమాన్ని పునరుద్ధరించి అర్హులైన వారికి ప్రభుత్వం చేయూతనివ్వాలి. గ్రామసభలు నిర్వహించి మళ్లీ కౌలు రైతులను గుర్తించాలి.
- ఒకటి, రెండు ఎకరాలున్న చాలామంది రైతుల భూములు ధరణిలో నమోదు కాలేదు. కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న వీరికి పాత పాస్ పుస్తకాలు ఉన్నా.. ధరణిలో ఎక్కకపోవడంతో కొత్తవి రాలేదు. ఈ రైతులు రైతుభరోసా పథకాన్ని కోల్పోకుండా భూములను ధరణిలో చేర్చేందుకు రైతు సదస్సులు నిర్వహించాలి.


ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరైన రైతులు, సంఘాల ప్రతినిధులు

- ఒకే భూమికి సంబంధించి ఇద్దరు, ముగ్గురు రైతుబంధు తీసుకున్నారు. వ్యవసాయ భూమిని వాణిజ్య భూమిగా మారినప్పుడు ఇలా జరిగింది. వీటిని నియంత్రిస్తే అర్హులైన ఎక్కువమంది రైతులకు రైతుభరోసా అందుతుంది.
- విత్తన సబ్సిడీ, డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ, పంటల బీమా పథకం అమలు చేయాలి. గతంలో జీరో పర్సెంట్ వడ్డీకి రుణాలు ఇచ్చారు. ఇప్పుడు ఇవ్వడం లేదు. పంటల బీమాను త్వరితగతిన అమలు చేయాలి.
- ఏజెన్సీ ప్రాంతాల్లో పోడు పట్టాలు పొందిన, పోడు పట్టాలు పొందకుండా ఏళ్లుగా సాగు చేసుకుంటున్న రైతులకు కూడా రైతుభరోసా వర్తింపజేయాలి.

నిరంకుశ పద్ధతులు వీడి నిరుద్యోగుల డిమాండ్లు పరిష్కరించండి

బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల డిమాండ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం తన నిరంకుశ విధానాలను పక్కన పెట్టి నిరుద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. తెలంగాణలో నిరుద్యోగులు పదేళ్లుగా కళ్లలో వత్తులేసుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఉద్యోగాల భర్తీ విధానంలో బీఆర్‌ఎస్ తప్పుడు విధానాలతో నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని ఒక ప్రకటనలో ఆవేదన చెందారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వీరి బతుకులు మారుతాయని అనుకుంటే అది జరగడం లేదన్నారు. 'మీరు ఎన్నికల ముందు ఏం చెప్పారు? ఇప్పుడు ఏం చేస్తున్నారు? ఏడు నెలల్లోనే మీ నిజస్వరూపం తేటతెల్లం అయింది. నిరుద్యోగుల మీద పాశవిక దాడి కాంగ్రెస్ నైజానికి నిదర్శనం. నిరుద్యోగులు దొంగలా? సంఘ విద్రోహశక్తులా? మాదకద్రవ్యాలు అమ్మేవారా? ఎందుకు వారిని అలా విచక్షణారహితంగా కొడుతున్నారు. ఇందుకేనా మిమ్మల్ని ఎన్నుకుంది?' అని ఈటల ప్రశ్నించారు. నిరుద్యోగులు, జర్నలిస్టులపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిరుద్యోగుల డిమాండ్ల పట్ల బీజేపీ పక్షాన, వ్యక్తిగత హోదాలోనూ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని ఈటల పేర్కొన్నారు.

దివ్యాంగులకు కాంగ్రెస్‌తోనే మేలు

- మంత్రులు ఉత్తమ్, సీతక్క
- వికలాంగుల సహకార సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ముత్తినేని

సాక్షి, హైదరాబాద్: దివ్యాంగులకు మేలు చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని రాష్ట్ర మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దివ్యాంగుల కోసం ఉన్నత విద్యలో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించామని, అదేవిధంగా వయోపరిమితిని కూడా ఐదేళ్లు సడలించామని అన్నారు. తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్‌గా ముత్తినేని వీరయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క హాజరయ్యారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని, కానీ గత పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్.. ఆ శాఖ ఉనికినే ప్రశ్నార్థకంలో పడేశారని విమర్శించారు. అనంతరం ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో దివ్యాంగులు ఆత్మగౌరవంతో జీవించే విధంగా కృషి చేస్తానన్నారు. తనపై విశ్వాసంతో చైర్మన్ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


ముత్తినేనిని అభినందిస్తున్న మంత్రి ఉత్తమ్

బాధ్యతలు స్వీకరించిన చైర్మన్లు..

రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బండ్రు శోభారాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా ఎస్టీ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బెల్లయ్య నాయక్, తెలంగాణ గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా కొట్నాక్ తిరుపతి వారి కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు.

ఫిరాయింపులపై బీఆర్‌ఎస్ జాతీయస్థాయి పోరు

▶ మొదటి పేజీ తరువాయి

సుప్రీంకోర్టును ఆశ్రయించడం ద్వారా పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోసం ప్రయత్నించాలని నిర్ణయించింది. గతంలో సుప్రీంకోర్టులో వివిధ పార్టీల తరఫున ఎమ్మెల్యేల అనర్హత వేటు కోసం వాదించిన న్యాయవాదులతో ఢిల్లీలో సంప్రదింపులు జరిగినట్టు తెలిసింది.

రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ అడగాలని..

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటువేసేలా చట్టం తెస్తామని ప్రకటించిన రాహుల్‌గాంధీ మరోవైపు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్నారని బీఆర్‌ఎస్ విమర్శలు చేస్తోంది. తమ పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకుంటూ కాంగ్రెస్ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతోందని విమర్శిస్తున్న బీఆర్‌ఎస్ ఈ అంశాన్ని రాష్ట్రపతి ముర్ము దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ అడగాలని బుధవారం కేసీఆర్‌తో జరిగిన భేటీలో నిర్ణయించినట్టు తెలిసింది.

'ఓయూ'లో ఉద్రిక్తం

కోదండరాం ఇంటి ముట్టడిని అడ్డుకున్న పోలీసులు

- హాస్టల్‌లోకి చొరబడి టీఎస్‌పీ నేతల అరెస్ట్
- డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలని అభ్యర్థుల ఆందోళన
- జర్నలిస్టులపై పోలీసుల దాడి.. పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ(హైదరాబాద్): రాష్ట్రంలోని పది యూనివర్సిటీలకు వీసీలను నియమించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) చేపట్టిన చలో ప్రొఫెసర్ కోదండరాం ఇంటి ముట్టడి కార్యక్రమంతో బుధవారం ఓయూలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆందోళన కార్యక్రమానికి పిలుపునిచ్చిన టీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్‌కుమార్ యాదవ్‌తో మరో ఇద్దరు విద్యార్థి నేతలను ఉదయం 7.30 నిమిషాలకు హాస్టల్ అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్ తరలించి సాయంత్రం 6 గంటలకు విడిచి పెట్టారు. అనంతరం అశోక్‌కుమార్ మాట్లాడుతూ వర్సిటీలకు తక్షణం వీసీలను నియమించేలా టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం సీఎం రేవంత్‌రెడ్డిపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. అధికారం చేపట్టి ఏడు నెలలు గడుస్తున్నా, ఇంత వరకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. సీఎం రేవంత్ విద్యరంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నా, కోదండరాం మౌనం వహించడం దారుణమని చెప్పారు. ఈ నెల 20వ తేదీలోగా వీసీలను నియమించకుంటే 10 విశ్వవిద్యాలయాల బంద్ చేపడుతామని హెచ్చరించారు. శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్న విద్యార్థులను ఓయూ అధికారుల అనుమతి లేకుండా హాస్టళ్లలోకి చొరబడి అరెస్ట్ చేయడం దారుణమన్నారు.

మూడో రోజుకు చేరిన డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన

డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట మూడో రోజు అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. ధర్నాకు అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు డీఎస్సీ అభ్యర్థుల నడుమ వాగ్వాదం చోటు చేసుంది. అభ్యర్థులు ఆందోళనను విరమించకపోవడంతో పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో పలువురు విద్యార్థులపై పోలీసులు చేయి చేసుకున్నారు. డీఎస్సీ అభ్యర్థులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్న బీఆర్‌ఎస్ విద్యార్థి నేతలపై పోలీసులు పిడిగుద్దుల వర్షం కురిపించారు. పలువురు అభ్యర్థులను అదుపులోకి తీసుకున్నారు. ఆందోళనలో పాల్గొన్న 13 మంది విద్యార్థులను అరెస్ట్ చేసినట్టు సీఐ రాజేందర్ తెలిపారు.


ఆందోళనలో పాల్గొన్న విద్యార్థి నేతను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మీడియా వర్గాలపై దాడి

డీఎస్సీ అభ్యర్థుల ఆందోళనను కవర్ చేస్తున్న ఓ చానల్ రిపోర్టర్ శ్రీ చరణ్, కెమెరామెన్ సాగర్ పై పోలీసులు దాడి చేసి అరెస్ట్ చేశారు. గాయపడిన రిపోర్టర్ శ్రీ చరణ్‌ను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనను నిరసిస్తూ రాత్రి ఓయూ పోలీస్‌స్టేషన్ ఎదుట జర్నలిస్టులు ధర్నా చేపట్టారు. జరిగిన సంఘటనపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని ఓయూ ఏసీపీ జగన్ హామీ ఇవ్వడంతో జర్నలిస్టులు ధర్నా విరమించారు. జర్నలిస్టులపై దాడిని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ, ఎస్ఎఫ్ఐ నేత రవినాయక్, పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు ఎస్.నాగేశ్వర్‌రావు ఇతర విద్యార్థి సంఘాల నాయకులు ఖండించారు.


బుధవారం సచివాలయంలో పద్మశ్రీ పురస్కార గ్రహీతలకు చెక్కులను అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి జూపల్లి, మామిడి హరికృష్ణ తదితరులు

పద్మశ్రీ పురస్కార గ్రహీతలకు రూ.25లక్షలు

చెక్కులు అందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: పద్మశ్రీ పురస్కార గ్రహీతలు ఒక్కొక్కరికి రూ.25లక్షల చొప్పున చెక్కులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బుధవారం సచివాలయంలో అందజేశారు. చెక్కులను అందుకున్న వారిలో గడ్డం సమ్మయ్య, దాసరి కొండప్ప, వేలు ఆనందచారి, కూరెళ్ల విఠలాచార్య, కేతావత్ సోమ్‌లాల్ ఉన్నారు. చెక్కులను అందుకున్న సందర్భంగా పద్మశ్రీ పురస్కార గ్రహీతలు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అమ్మమాట.. అంగన్‌వాడీ బాట..

వారం పాటు ప్రత్యేక డ్రైవ్... మంత్రి సీతక్క వెల్లడి



సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచేందుకు 'అమ్మ మాట–అంగన్‌వాడీ బాట' నినాదంతో వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. సచివాలయంలో బుధవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులతో అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా భద్రత, దత్తత, చైల్డ్ కేర్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ తరగతులను బోధించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తున్న సరుకులు, సేవల నాణ్యతను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. కొన్ని కేంద్రాలకు నాసిరకం కోడిగుడ్లు, పాల ప్యాకెట్లు సరఫరా అయిన నేపథ్యంలో.. వాటి కట్టడి కోసం జిల్లాస్థాయి క్షేత్రస్థాయి అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. నాసిరకం సరుకులు సరఫరా అయితే అంగన్‌వాడీ టీచర్లు తిరస్కరించాలని సూచించారు. సరుకుల నాణ్యతను పరిశీలించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు కేంద్రాలను సందర్శించి తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు. అంగన్‌వాడీలోని చిన్నారులకు త్వరలో యూనిఫాంలు అందజేస్తామని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాంలు ఇస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సాధిస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పెయింటింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. మహిళలు చిన్నారులపై దాడులు, అఘాయిత్యాలు జరిగితే తక్షణమే స్పందించేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. యునిసెఫ్ సౌజన్యంతో రూపొందించిన న్యూట్రీషియన్ చాంపియన్ పుస్తకాన్ని, న్యూట్రీషియన్ కిట్లను మంత్రి సీతక్క ఈ సందర్భంగా ఆవిష్కరించారు.



సమీక్షలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ కాంతి వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

మండలి రద్దు అనేది అసంబద్ధం

- కృష్ణా జలాల్లో తెలంగాణకు అధిక వాటా ఇవ్వాలి
- ఏపీ నుంచి ఏడు మండలాలు కాదు.. ఐదు గ్రామాలు వచ్చే అవకాశముంది
- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: శాసన మండలి రద్దు అనేది అసంబద్ధమైనదని, అలాంటి పరిస్థితి లేదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉన్నప్పటికీ కేంద్రం చేయలేదని, 2026లో చేసే అవకాశం ఉందని తెలిపారు. తద్వారా తెలంగాణలో 34 సీట్లు పెరిగి 153 ఆంధ్రప్రదేశ్‌లో 50 సీట్లు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...కృష్ణా జలాల్లో తెలంగాణకు అధిక వాటా ఇవ్వాలని, ఇందుకు ఆంధ్రప్రదేశ్‌తోపాటు కేంద్ర ప్రభుత్వం సహకరించాలన్నారు. నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి కొంత భాగం, ఖమ్మం ప్రాంతాలకు కృష్ణా జలాలే ఆధారమని, ఎత్తిపోతల పథకాలే శరణ్యమన్నారు. రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ త్వరితగతిన పూర్తి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. వచ్చే రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీతో పాటు పెండింగ్ పనులు పూర్తిచేస్తే జిల్లాలో సాగునీటి సమస్యలు తీరుతాయని వెల్లడించారు. తెలుగు రాష్ట్రాలు సీఎంలు భేటీ అవ్వడం శుభ పరిణామమని, పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకం కలిగిందన్నారు. ఏపీకి వెళ్లిన ఏడు మండలాలు తెలంగాణకు రాకపోవచ్చని, భద్రాచలం ప్రాంతంలో ఐదు గ్రామాలు తెలంగాణకు రావచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

గతంలో నిర్ణయాల మేరకు నడుచుకుంటాం..

పార్టీ మారిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై అనర్హత వేటు విషయంలో గతంలో తీసుకున్న నిర్ణయాల మేరకు నడుచుకుంటామన్నారు. రైతు భరోసా పది ఎకరాల వరకు, అదీ సేద్యం చేసే భూములకు మాత్రమే ఇస్తే చాలని అభిప్రాయపడ్డారు. భూసేకరణలో భూములు కోల్పోయినా పట్టా ఉన్న వారికి, కొండలు గుట్టలతో వ్యవసాయం చేయని భూములకు, రోడ్లలో భూములు కోల్పోయినా ఇంకా పట్టాలు ఉన్న వారికి రైతు భరోసా ఇవ్వొద్దని సూచించారు.

ఓయూలో జర్నలిస్టుల అక్రమ అరెస్టులా?

ఉస్మానియాలో ఉద్యమం నాటి దృశ్యాలు అంటూ కేటీఆర్ ట్వీట్



సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్'వేదికగా ట్వీట్ చేశారు. జర్నలిస్టులు వార్తల కవరేజీకి వెళ్లడం నేరమా? డీఎస్సీ సమస్యపై నిరుద్యోగుల నిరసన చూపిస్తే పాపమా అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో జర్నలిస్టులకు రక్షణ లేదా? ప్రజాపాలన అంటే జర్నలిస్టులపై జబర్దస్తీ చేయడమా ? ఉస్మానియా యూనివర్సిటీలో ఎందుకింత నిర్బంధం?' అని నిలదీశారు. గాయపడిన జర్నలిస్టు శ్రీచరణ్‌ను కేటీఆర్ ఫోన్‌లో పరామర్శించారు.

సీఎం క్షమాపణ చెప్పాలి: బీజేపీ డిమాండ్

డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలని ఉస్మానియా యూనివర్సిటీ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు అక్కడకు వెళ్లిన జర్నలిస్టులపై కూడా పోలీసులు చేయి చేసుకోవడాన్ని బీజేపీ ఖండించింది. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని వర్సిటీలు పోలీసుల లాఠీదెబ్బలతో రక్త మోడినట్టే.. మళ్లీ పోలీసుల దమనకాండ కనిపిస్తోందని బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమ ఓ ప్రకటనలో మండిపడ్డారు.

- ఓయూలో జర్నలిస్టుల అరెస్టును ఖండిస్తూ టీయూడబ్ల్యూజే, టీడబ్ల్యూజేఎఫ్, సచివాలయ జర్నలిస్టులు, జర్నలిస్టుల సంఘాలు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశాయి. పోలీసులపై ప్రభుత్వం వెంటనే చర్య తీసుకోవాలని డిమాండ్ చేశాయి.
- మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు జర్నలిస్టులపై జరిగిన దాడిని ఖండించారు.
- డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తుంటే పోలీసుల ద్వారా అణచివేయాలని చూడడం అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ విమర్శించారు. పార్టీ నాయకులు రాకేష్‌కుమార్, పల్లా ప్రవీణ్, కడారిస్వామి, పడాల సతీష్‌తో కలిసి బుధవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.
- బీఆర్‌ఎస్వీ నేతలపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేసి, వారిని సర్వీస్ నుంచి తొలగించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

బాధాకరమైన జ్ఞాపకాలను మోసుకు తిరుగుతున్నారా? వాటిని రక్షా కవచంలాగా ధరిస్తున్నారా? వాటిని వదిలేసి సాగిపొమ్మని జీవితం చెబుతున్నప్పుడు... అలా ఎందుకు చేయడం లేదు?
– బ్రహ్మకుమారీలు

సాక్షి
గురువారం, 11 జూలై 2024

సత్వర చర్యలే రక్ష!

మంచుకొండల సీమ మళ్ళీ నెత్తురోడుతోంది. జమ్మూ– కశ్మీర్‌లోని కథువా జిల్లా మాచేడీలో భారత సైనిక గస్తీ బృందంపై సాయుధ తీవ్రవాదుల దాడి సహా 48 గంటల్లో నాలుగు ఘటనలు జరగడమే అందుకు తాజా సాక్ష్యం. కథువా ఘటనలో ఒక జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్‌తో సహా అయిదుగురు సైనిక సిబ్బంది, ఆ వెంటనే మరో ఘటనలో మరో ఇద్దరు అసువులు బాయడం పెరుగుతున్న ప్రమాదాన్ని సూచిస్తోంది. సాధారణ తీవ్రవాదులు కాక సుశిక్షితులైన సాయుధ మూక కథువా దుశ్చర్యకు పాల్పడడం సమస్య కొత్త లోతుల్ని చెబుతోంది. ఈ ఏడాది ఇంతవరకు జమ్మూలో ఇలాంటి ప్రధాన ఘటనలే అరడజనుకు పైగా సంభవించాయి. చిన్నాచితకా వాటి సంగతి సరేసరి. ఒక్క జూన్‌లోనే నాలుగు తీవ్రవాద దాడుల్లో, రెండు రోజుల్లో 9 మంది మరణించారు. ప్రభుత్వ వ్యూహాల వైఫల్యం, పాలకులు కశ్మీర్‌పై దృష్టి పెట్టి జమ్మూను తేలికగా తీసుకోవడం... ఏదైతేనేం తీవ్రవాదులు తమ కార్యాచరణను కశ్మీర్ లోయ నుంచి జమ్మూకు బదలాయించారు. అలా తీవ్రవాదానికి ఇప్పుడు రాజౌరీ – పూంఛ్ ప్రాంతం కొత్త కేంద్రమైంది. సుప్రీమ్ కోర్ట్ ఆదేశం మేరకు సెప్టెంబర్ 30లోగా రాష్ట్రంలో ఎన్నికలు జరపాల్సి ఉన్నందున తీవ్రవాదానికి ముకుతాడు వేయడం తక్షణావసరం.

పాతికేళ్ళ క్రితం తీవ్రవాదానికి అడ్డా అయినా, అనంతరం ప్రభుత్వ చర్యలు, స్థానికుల సహకారంతో గత రెండు దశాబ్దాలుగా ప్రశాంతంగా ఉన్న జమ్మూ ఇప్పుడు మళ్ళీ అగ్నిగుండం కావడం విషాదం. గమనిస్తే, ముష్కర దాడులతో జమ్మూలో బలైన సామాన్యులు, భద్రతా సిబ్బంది సంఖ్య గత ఏడాది జనవరి నుంచి ఇప్పటికి రెట్టింపయింది. తీవ్రవాద కేంద్రం మారిందడానికి ఇది స్పష్టమైన సూచిక. 2023 డిసెంబర్‌లో రాజౌరీ ఘటనలో నలుగురు సైనికులను కోల్పోయాం. తరవాత కుల్గామ్ ఎన్‌కౌంటర్‌లో మరో ఇద్దరు. ఇలా కొద్ది నెలల్లోనే సాహస జవాన్లను పలువురిని పోగొట్టుకోవడం విచారకరం. ప్రతి ప్రాణం విలువైనదే. అందులోనూ వీర సైనికుల ప్రాణత్యాగం వెల కట్టలేనిది. గత నెలలో వరుస ఘటనలతో తీవ్రవాదులు తెగబడ్డారు. జూన్ 9న పర్యాటకుల బస్సుపై దాడిలో 9మంది మరణించిన ఘటన, అది మరువక ముందే జూన్ 26న దోడాలో ఘటన... ఇవన్నీ అస్థిరతను సృష్టించాలని చూస్తున్న అదృశ్య శక్తుల విజృంభణకు సంకేతాలు. కశ్మీర్‌లో లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నో ఏళ్ళ తర్వాత జనం ఉత్సాహంగా పాల్గొనడంతో, అసెంబ్లీ ఎన్నికలకు పాలకులు సన్నద్ధమవుతున్నారు. దానికి అడ్డం కొట్టడానికే తాజా ఉగ్ర దుశ్చర్యలని విశ్లేషణ.

ఢిల్లీలో మోదీ సర్కార్ మూడోసారి కొలువు తీరినరోజే తీవ్రవాదులు పేట్రేగడం యాదృచ్ఛికం కాదు. ఈ మొత్తం వ్యవహారంలో దాయాది పాకిస్తాన్ పాత్రను విస్మరించలేం. భద్రత, విదేశాంగ విధానంలో తీవ్రవాదాన్ని క్రియాశీలంగా, అదే సమయంలో దొంగచాటు సాధనంగా చేసుకోవడం ఆ దేశం ఆది నుంచీ చేస్తున్నదే. ఆర్థికంగా కష్టాల్లో పడి, అంతర్జాతీయంగా ప్రతిష్ఠ తగ్గినా సరిహద్దులో అది తన కుటిల బుద్ధిని వదులుకోవట్లేదు. స్థానికులను ముందుంచి, తాను వెనుక నుంచి కథ నడిపే వ్యూహాన్ని జమ్మూలో అనుసరిస్తోంది. నిజానికి, జమ్మూ – కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన 370వ అధికరణాన్ని రద్దు చేశాక కేంద్రం ఉక్కుపాదంతో వ్యవహరించింది. రద్దు అనంతరం సైతం అంతా సవ్యంగా ఉందని చెప్పడం, చూపడంలో మోదీ సర్కార్ బిజీగా ఉంది. దానికి తగ్గట్టే 2017 – 2022 మధ్య చొరబాటుదారుల సంఖ్య 53 నుంచి 14కి తగ్గిందనీ, దుశ్చర్యలు 228 నుంచి 125కి దిగివచ్చాయనీ హోమ్ శాఖ లెక్క. కానీ, పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. క్షేత్రస్థాయి పరిస్థితులు సజావుగా లేవనీ, వాటిని పాలకులు పట్టించుకోవట్లేదనీ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నది అందుకే. ఆ మాటకొస్తే, పెద్ద నోట్ల రద్దు మొదలు 370వ అధికరణం ఎత్తివేత దాకా తమ ప్రతి చర్యా తీవ్రవాదాన్ని తుదముట్టించేదే అని పాలకులు చెప్పినా అది వాస్తవరూపం దాల్చలేదు.

పైగా, వర్షాకాలం కావడంతో సరిహద్దు వెంట పాక్ ప్రేరేపిత తీవ్రవాదుల చొరబాట్లు సులభమవుతాయి. ప్రస్తుతం ఏటా భారీగా సాగే సంక్లిష్టమైన అమరనాథ్ యాత్రాకాలం కూడా! హిమలింగాన్ని దర్శించడానికి యాత్రికుల రద్దీ ఉండే ఈ సమయంలో మాటు వేసి కాటు వేయాలనీ, అంతర్జాతీయంగా అందరి దృష్టిని ఆకర్షించాలనీ ముష్కరులు ఎత్తుగడ వేస్తారు. ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలి. మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. లేదంటే, తదుపరి పరిణామాలకు చింతించి ప్రయోజనం ఉండదు. వచ్చేవారం బడ్జెట్ సమావేశాలు సైతం ప్రారంభమవుతున్నందున ప్రభుత్వం జాగు చేయరాదు. చేపడుతున్న చర్యలపై స్వచ్ఛందంగా సవివరమైన ప్రకటన చేయాలి.

పాక్‌తో నియంత్రణ రేఖ వెంట కాల్పుల విరమణ కొనసాగుతున్నా, చైనాతో గల్వాన్ లోయ ఘర్షణల తర్వాత మన బలగాలు ఆ సరిహద్దులో వాస్తవాధీన రేఖ వెంట మోహరించాల్సి వచ్చింది. ఫలితంగా కశ్మీర్‌తో పోలిస్తే సైనిక బలగాలు తక్కువగా ఉన్న జమ్మూ తీవ్రవాదులకు వాటంగా మారింది. కశ్మీర్ లోయలో కాస్తంత ఊపిరి పీల్చుకొనే లోగా ఇక్కడకు విస్తరించిన ఈ ముప్పును ఆదిలోనే అడ్డుకోవాలి. దేశ భద్రతపై రాజకీయాల కన్నా రాజీ లేని ధోరణి ముఖ్యమని అధికార, ప్రతిపక్షాలన్నీ బాధ్యతతో ప్రవర్తించాలి. పాలకులు గత పదేళ్ళ తమ హయాంలో అంతా సుభిక్షంగా, సుదృఢంగా మారిపోయిందనే ప్రగల్భాలు మాని, కార్యాచరణకు దిగాలి. భద్రతాదళాల పెంపు ఒక్కటే సమస్యకు పరిష్కారం కాదని అర్థం చేసుకోవాలి. సమస్యను సమగ్రంగా దర్శించి, తీవ్రవాదం వైపు స్థానికులు ఆకర్షితులు కాకుండా ఉండేందుకు శుష్క వాగ్దానాలకు మించిన భరోసా కల్పించాలి. అప్పుడే ఈ భూతాన్ని అడ్డుకోగలుగుతాం. భారత్‌తో వాణిజ్యం, శాంతి కోరుతున్నట్టు చెబుతున్న పాక్ సైతం తీవ్రవాదానికి అండదండలు మానాలి. లేదంటే గుణపాఠం తప్పదు.

రాజ్యాంగ రక్షణే అత్యవసరం

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

పదవిని కాపాడుకోవడం కోసం ప్రతిపక్ష నాయకులను ఇందిరాగాంధీ అరెస్టు చేశారు. మీడియా మీద ఆంక్షలు విధించారు. అందుకే ఎమర్జెన్సీ ఎత్తివేయగానే దేశంలో ఒక పౌరహక్కుల ఉద్యమం ముందుకొచ్చింది. అన్ని రాజకీయ పార్టీలు దేశంలో పౌరహక్కులను కాపాడవలసిన అవసరముందని మాట్లాడాయి. ఆ ఒక్క దశలోనే బీజేపీ నాయకులు కూడా పౌరహక్కుల ఉద్యమాన్ని బలపర్చారు. కానీ ఎమర్జెన్సీ కంటే రాజ్యాంగపు తిరగరాత మరింత ప్రమాదకరమైనది. 2024 ఎన్నికలు దేశ ప్రజాస్వామ్యాన్ని ఒక పెద్ద ప్రమాదం నుంచి కాపాడాయి. అయితే ఈ రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం అప్పుడే పూర్తిగా తొలగిపోలేదు. దేశం మొత్తంగా ఇప్పుడున్న రాజ్యాంగాన్ని రక్షించుకునే చైతన్యం పెరగాలి.



18వ లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'అబ్ కీ బార్ 400 పార్' అని, ఈ ఎన్నికల్లో ఎన్డీఏ 400 సీట్లు గెలవాలని నినాదమిచ్చారు. దాని తరువాత ఆయన మోదీ గ్యారెంటీ నినాదమిచ్చారు. ప్రపంచ ఎన్నికల చరిత్రలో పార్టీని పక్కకు పెట్టి వ్యక్తి గ్యారెంటీ మ్యానిఫెస్టో రాయించారు. ఇది మామూలు విషయం కాదు. ఆ వెనువెంటనే ఆరెస్సెస్, బీజేపీ లీడర్లు కొంతమంది 400 సీట్లు రాగానే దేశ రాజ్యాంగాన్ని తిరగ రాస్తామని ప్రకటనలు ఇవ్వడం మొదలు పెట్టారు. అలా తిరగరాత సిద్ధాంతం ఉన్న ఆరెస్సెస్ నాయకులెవరు ఇటువంటి ప్రకటనలను ఖండించలేదు. ఆనాటికి గానీ, ఇప్పుడు గానీ ఎన్డీఏలో ఉన్న పార్టీలవారికి... అనుకున్న 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని తిరగరాసే ప్రక్రియను ఎదుర్కొనే శక్తి లేదు. వారికి అధికారం తప్ప బలమైన సిద్ధాంతం కూడా లేదు. వాళ్ళ పార్టీ అధికారం తప్ప దేశం ఎటుపోయినా ఫర్వాలేదు.

ఈ స్థితిలో ఇండియా కూటమి ఎన్నికల్లో రాజ్యాంగ పరిరక్షణను ప్రధాన అంశాన్ని చేసింది. ఎన్నికల తర్వాత పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ రాజ్యాంగం కాపీని, అంబేడ్కర్ బొమ్మనీ బహిరంగ సభల్లో చూపిస్తూ తిరిగారు. ఎన్నికల పోరాటమంతా రాజ్యాంగం చుట్టూ తిరిగే స్థితి మొదటిసారి వచ్చింది. ప్రపంచ పత్రికలు కూడా ఒక దేశం రాజ్యాంగ రక్షణ అంశం ఇంత పెద్దఎత్తున ఏ దేశ ఎన్నికల్లో కూడా చర్చనీయాంశం కాలేదని రాశాయి. టీవీలు, సోషల్ మీడియా మాట్లాడాయి.

ఐతే ఎన్నికల సమయంలో ఒక మోదీ తప్ప ఆరెస్సెస్ ప్రధాన నాయకుడైన మోహన్ భాగవత్ సహా రాజ్యాంగాన్ని తిరగరాసే ఆలోచన లేదని చెప్పలేదు. మోదీ మాత్రం మేమే ఈ రాజ్యాంగ రక్షకులమని కొన్ని సభల్లో మాట్లాడారు. కానీ ఆరెస్సెస్, బీజేపీ నాయకులంతా సైలెంట్‌గా ఉన్నారు. దానికి ప్రధాన కారణమేమిటంటే, ఈ రాజ్యాంగం పరిధిలో పార్లమెంట్, ఇతర సంస్థలపై సంపూర్ణ పట్టు సాధించి తరువాత ఈ రాజ్యాంగాన్ని మార్చాలనేది వారి ఆలోచన. ఈ ఆలోచన ఇప్పటిది కాదు. ఇప్పుడున్న రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుండే దాన్ని వీళ్ళు వ్యతిరేకిస్తున్నారు. దీనికి మనుధర్మ శాస్త్ర లక్షణాలు ఏ మాత్రం లేవనేది వారి ప్రధాన వాదన. వాళ్ళ అవగాహనలో భారతీయ చట్ట సంస్కృతి అంటే మనుధర్మ శాస్త్ర చట్ట సంస్కృతి. దాంట్లో ప్రధానమైన వర్ణ–కుల వ్యవస్థనీ, స్త్రీ అసమాన జీవితాన్నీ కాపాడటం. సమాజ అసమానతలు భారతీయ సంస్కృతిలో భాగం అని వారి భావన.

అదృష్టవశాత్తు బీజేపీకి 240 సీట్లు మాత్రమే రావడం, దానికి రాజ్యాంగ రక్షణ డిబేట్ దోహదపడటం జరిగింది. అయితే రాజ్యాంగ పర చర్చ ప్రజల జీవనంలోకి చొచ్చుకుని పోకుండా ఉండటానికి ఆరెస్సెస్, బీజేపీ ఒక ఎత్తుగడ వేశాయి. అది 1975లో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ సమస్యను ముందుకు తేవడం! ఎమర్జెన్సీలో చాలా అట్రాసిటీలు, అరాచకాలు జరిగిన మాట నిజమే కానీ అది మొత్తం రాజ్యాంగాన్ని మార్చేటటువంటి ప్రమాద ఘట్టం కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాకు తెలిసి ఎంతో మంది యువకులు ఎమర్జెన్సీలో ఎదురు కాల్పుల పేరిట చంపబడ్డారు. ఐతే రాజ్యాంగానికి వచ్చేవరకు ఆ కాలంలో చేసిన రెండు సవరణలు: ప్రియాంబుల్‌లో 'సోషలిజం' అనే పదం చేర్చడం; రెండవది ఫండమెంటల్ రైట్స్‌కు కొంత అఘాతం కలిగించే ఫండమెంటల్ డ్యూటీస్‌ని రాజ్యాంగంలో చేర్చడం. ఆరెస్సెస్, బీజేపీ సోషలిజం అనే పదాన్ని రాజ్యాంగంలో చేర్చడాన్ని వ్యతిరేకించాయి. కానీ ఫండమెంటల్ డ్యూటీస్‌ని రాజ్యాంగంలో చేర్చడాన్ని బలపర్చాయి.

బంగ్లాదేశ్‌ను పాకిస్తాన్ నుంచి విడగొట్టి, పాకిస్తాన్‌ను యుద్ధంలో ఓడించినందుకు ఇందిరాగాంధీని దుర్గాదేవిగా వర్ణించిన వారిలో ఆరెస్సెస్, బీజేపీ వారు ఉన్నారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో గరీబీ హటావో, బ్యాంకుల జాతీయాకరణ, రాజ భరణాల రద్దు వంటి ఆమె నిర్ణయాలను వ్యతిరేకించారు. ఈ మూడు సిద్ధాంతకర మార్పులు సోషలిస్టు సిద్ధాంత ప్రభావంతో ఇందిరాగాంధీ చేస్తున్నారని వాజ్‌పేయి, ఎల్‌కె అద్వానీ వంటి నాయకులు చాలా తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే గరీబీ హటావో, బ్యాంకుల జాతీయాకరణ, రాజ భరణాల రద్దు... శ్రమ జీవులకు, ఉత్పత్తి కులాలకు మేలు చేశాయి.

ఈ క్రమంలో ఆమె భూ సంస్కరణల చట్టం చెయ్యడానికి శ్రీకారం చుట్టారు. 1972లో దేశ చరిత్రలో మొట్టమొదటిసారి ఒక బలమైన భూ సంస్కరణల చట్టం వచ్చింది. ఐదుగురు సభ్యులున్న కుటుంబానికి 27 ఎకరాల తరి, 57 ఎకరాల ఖుష్కి భూమి కంటే ఎక్కువ ఉండటానికి వీలు లేదని చట్టం తెచ్చింది ఆమెనే. ఆ చట్టాన్ని ఎమర్జెన్సీలో భూస్వాములపై ఒత్తిడి తెచ్చి కొంత అమలు చేశారు. నేను 1980లో ఈ చట్టం అమలుపై ఎంఫిల్ థీసిస్ కోసం చాలా గ్రామాల్లో ల్యాండ్ రిఫామ్ ఎలా జరిగిందో పరిశీలించాను. భూస్వాములు భూములను బినామీ పేర్లమీద మార్చి చాలావరకు కాపాడుకున్నప్పటికీ ఎమర్జెన్సీలో కొంత భూమి పంచబడింది. ఆ కాలంలో తన పదవి కాపాడుకోవడం కోసం ప్రతిపక్ష నాయకులను ఇందిర అరెస్టు చేశారు. మీడియా మీద ఆంక్షలు విధించారు. నిజమే. అందుకే ఎమర్జెన్సీ ఎత్తివేయగానే దేశంలో ఒక పౌరహక్కుల ఉద్యమం ముందుకొచ్చింది. అన్ని రాజకీయ పార్టీలు దేశంలో పౌరహక్కులను కాపాడవలసిన అవసరముందని మాట్లాడాయి. ఆ ఒక్క దశలోనే బీజేపీ నాయకులు కూడా పౌరహక్కుల ఉద్యమాన్ని బలపర్చారు. తర్వాత వాళ్లు పౌరహక్కుల రక్షణ జోలికి పోలేదు.

కనుక ఎమర్జెన్సీ అనేది రెండువైపుల పదునున్న కత్తిలా పని చేసింది. కానీ ఆరెస్సెస్, బీజేపీ ఈ రాజ్యాంగాన్ని మార్చి కొత్త రాజ్యాంగాన్ని నిర్మించాలనుకున్న ఆలోచనలో శూద్రుల, దళితుల, ఆదివాసుల పక్షపాత ఆలోచనలు ఉండే అవకాశం ఏమాత్రం లేదు. వాళ్లు అనుకున్నట్టు నిజంగానే 400 సీట్లు వచ్చి ఉంటే వాళ్లు కొత్త కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీని స్థాపిస్తే దాంట్లో ఎటువంటి మేధావి వర్గం ఉండేవారు? ఆ రాజ్యాంగ పరిషత్ కుల అసమానతలను, అంటరానితనాన్ని, బీదరికాన్ని తొలగించే గట్టి ప్రతిపాదనలు చేసే అవకాశం ఉండేదా! నిజానికి బ్యాంకుల జాతీయాకరణ, రాజభరణాల రద్దుపై చర్చ జరుగుతున్నప్పుడు ఆరెస్సెస్, బీజేపీ నాయకుల వాదనలు; రాజరిక వ్యవస్థ పట్ల జమీందారీ హక్కుల పట్ల వాళ్లు ఎంత అనుకూలంగా ఉన్నారో తిరిగి చూస్తే అర్థమవుతుంది. ఇప్పుడు రాజ్యాంగంలోని ప్రియాంబుల్‌లో ఉన్న 'సోషలిజం' అనే పదాన్ని వాళ్లు తొలగించాలనుకునేది భారతీయ కష్ట జీవుల పక్షాన ఉండటానికా? పెట్టుబడిదారుల పక్షాన ఉండటానికా?

2024 ఎన్నికలు దేశ ప్రజాస్వామ్యాన్ని ఒక పెద్ద ప్రమాదం నుంచి కాపాడాయి. ఐతే ఈ రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం అప్పుడే పూర్తిగా తొలగిపోలేదు. చంద్రబాబు, నితీష్‌కుమార్ వంటి సిద్ధాంత రహిత ప్రాంతీయ నాయకులు కూడా ఈ భవిష్యత్ ప్రమాదం నుండి దేశాన్ని కాపాడలేరు. దేశం మొత్తంగా ఇప్పుడున్న రాజ్యాంగాన్ని రక్షించుకునే చైతన్యం పెరగాలి. ఓటు రాజ్యాంగ రక్షణ ఆయుధాలలో కీలకమైంది. ఐతే దాన్ని ప్రజలు, ముఖ్యంగా యువకులు నిరంతరం ఇప్పుడున్న రాజ్యాంగంతో ముడేసి చూడాలి. ఈ ఎన్నికల్లో రాజ్యాంగం పట్ల కలిగిన కొత్త చైతన్యాన్ని తగ్గించేందుకు ఆరెస్సెస్, బీజేపీలు ఎమర్జెన్సీ అంశాన్ని ముందు పెట్టి చర్చను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశాయి.

జూన్ 25న వి.పి. సింగ్ జయంతి సభ ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో జరిగింది. మాట్లాడటానికి నేను ముఖ్య అతిథిగా వెళ్ళాను. అందులోనే చాలా పెద్ద హాలులో రైట్‌వింగ్ ఆలోచనాపరులు ఎమర్జెన్సీలో జె.పి. మూమెంట్‌పై మీటింగ్ పెట్టారు. ఎందుకో తెలుసా? రాజ్యాంగ మార్పు కంటే ఎమర్జెన్సీ ప్రమాదకరమని చెప్పడానికి!

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

జంక్‌కు చెక్



చక్కెర, ఉప్పు, కొవ్వు ఎంతున్నాయో పెద్ద, బోల్డ్ అక్షరాల్లో కంపెనీలు రాసేలా ఒత్తిడి తెచ్చే చక్కటి నియమాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆమోదించింది. ఈ మార్పు వల్ల భారతీయ వినియోగదారులకు జంక్ ఫుడ్ ఏదో తెలిసిపోయి మార్కెటింగ్ గిమ్మిక్కులకు మోసపోకుండా ఉంటారు.

– రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

సున్నితమైన వ్యవహారం



బద్రీనాథ్ హైవేలో విధ్వంసకరంగా కొండచరియలు జారిపడ్డాయి. హిమాలయాలు సున్నితమైన పర్యావరణ ప్రాంతం. మన ధార్మిక ప్రదేశాలను కాపాడుకోవాలంటే– జనావాసాలు, తవ్వకాలు, పర్యవేక్షణ లేని 'అభివృద్ధి'... అన్నింటి పట్లా చిత్తశుద్ధితో వ్యవహరించాలి.

– అద్వైత కళ, స్క్రీన్ రైటర్

దయోపదేశం



భూటానీస్ చాంద్రమాన క్యాలెండర్‌లో ఇవ్వాళ (జూలై 10) ఆరో నెల నాలుగో రోజును గౌతమ బుద్ధుడి జ్ఞానోదయం అనంతరం తొలి ఉపదేశం ఇచ్చిన రోజుగా పాటిస్తాం. తన పట్ల, సాటి జీవులన్నింటి పట్లా ప్రేమ, దయ, కరుణ పాటించాలని ఈ రోజు మనకు గుర్తుచేయునుగాక!

– షెరింగ్ తోబ్గే, భూటాన్ ప్రధాని

ప్రకృతి వైద్యం



మామిడిపళ్ల సీజన్, లిచీ పళ్ల సీజన్, తర్వాత నేరేడుపళ్ల సీజన్... ఒంట్లో చక్కెర పెరగకుండా ఎలా ఆపాలో ప్రకృతికి బాగా తెలుసు.

– ఐశ్వర్యా ముద్గిల్, న్యాయవాది

సాక్షాత్తూ గురువు



ప్రాగ్‌లోని కాఫ్కా మ్యూజియం కఫెలో మేము ఇద్దరు బ్రెజిలియన్ మహిళల్ని కలిశాం. అందులో ఒకామె బ్రెజిల్ స్కూల్లో సోషియాలజీ బోధిస్తున్నారు. అమెరికా, ఇండియా గురించి మాట్లాడుకున్నాం. 'అమర్త్య సేన్ అని పేరున్న ఒక ఆర్థికవేత్త గురించి మీకు తెలుసా?' అని అడిగారు. నాకు తెలియడమే కాదు, ఆయన నా పీహెచ్‌డీ అడ్వైజర్ అని చెప్పగానే ఆమె ఎంత సంబరపడ్డారో!

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

ఇన్ బాక్స్

జనాభా లెక్కలు కీలకం

ప్రపంచ జనాభా నానాటికీ పెరిగిపోతోంది. ఈ సందర్భంగా జనగణన ఆవశ్యకత, ఒక దేశ అభివృద్ధిలో మానవ వనరుల లభ్యత ప్రయోజనాలు, కుల గణన వంటి అంశాల ప్రాముఖ్యాన్ని తెలుసుకోవడం అవసరం. ఒక దేశ జనాభాను గణించడం వల్ల జనాభా ఆర్థిక కార్యకలాపాలు, అక్షరాస్యత, విద్య, గృహ సౌకర్యాలు, పట్టణీకరణ, సంతాన ఉత్పత్తి, మరణాలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, భాష, మతం, వలసలు, వైకల్యాల గురించిన అత్యంత విశ్వసనీయమైన సమాచారం అందుబాటులోకి వస్తుంది. తద్వారా దేశ పరిస్థితిని అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది. అయితే 16వ జనాభా లెక్కలను భారత ప్రభుత్వం వాయిదా వేస్తూ రావడం వల్ల కొన్ని రంగాలు కొంత నిర్లక్ష్యానికి గురి అయ్యే ప్రమాదం ఏర్పడింది.

ఈ మధ్యకాలంలో దేశంలో కులగణన జరగాలనే డిమాండ్ ఊపందుకుంది. ఇప్పటికే బిహార్ రాష్ట్రంలో కులాల లెక్కలను తేల్చి తదనుగుణంగా విధాన నిర్ణయాలు తీసుకుంటున్నారు. మన తెలుగు రాష్ట్రాలలో కూడా కుల గణన చేయడానికి ప్రభుత్వాలు ఒప్పుకోవడం విశేషం. దేశంలో ఉన్నటువంటి వివిధ కులాల స్థితిగతులను తెలుసుకొని దేశ సంపదలోనూ, విద్య, ఉద్యోగ అవకాశాల్లోనూ వారి వారి జనాభా నిష్పత్తులను బట్టి వాటాలను నిర్ణయించడానికి కులాలవారీ జనాభా లెక్కల సమాచారం ఉపయోగపడుతుంది. జనాభా పెరుగుదలను దేశ అభివృద్ధికి చేటు కలిగించే అంశంగానే చూడాల్సిన అవసరం లేదు. పెరిగే జనాభాను బట్టి యువశక్తి దేశ ఉత్పాదక రంగానికి తగినంతగా అందుబాటులోకి వస్తుంది. జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలలో యువకుల సంఖ్య తగ్గి వృద్ధుల సంఖ్య పెరిగి పోవడం వల్ల ఇబ్బందులు ఎదురవ్వడం చూడవచ్చు. దీనికి కారణం అక్కడ జనాభా పెరుగుదల రేటు పడిపోవడమే. ప్రపంచంలో ఉన్న యువ జనాభాలో భారతదేశం ఐదో వంతును కలిగి ఉంది. ఈ జనాభా వల్ల భారతదేశం ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మారాలనే ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని సాధించడం సుసాధ్యమవుతుందని ఆర్థిక వేత్తలు అంటున్నారు. అయితే పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అనేది గుర్తించాలి.

డా॥ ఎ. శంకర్, హైదరాబాద్
(నేడు ప్రపంచ జనాభా దినోత్సవం)

సంకెళ్ల సంస్కృతి మళ్లీ మొదలా?

విశ్లేషణ



డా॥ మంగారి రాజేందర్

మన దేశంలో నిందితులకు బేడీలు వేయడం అతి మామూలు విషయం. ఈ విధంగా బేడీలు వేయడం చట్టబద్ధమేనా అని చాలామంది అనుకుంటూ ఉంటారు. బేడీలు వేయడానికి చట్టబద్ధత లేదా? నిందితులు తప్పించుకుంటే ఎలా అన్న ప్రశ్నలు సహజంగానే తలెత్తుతాయి. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లోని సెక్షన్ 49 ప్రకారం అరెస్ట్ అయిన వ్యక్తి తప్పించుకోకుండా కావలసిన నిర్బంధాన్ని పోలీసులు ఉపయోగించవచ్చు. అంతేకాని నిందితులకి సాధారణంగా బేడీలు వేయకూడదు. ఈ విషయాన్ని చాలా కేసులలో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

అరెస్ట్ చేసినప్పుడు సంకెళ్ళు వేయాలని చట్టంలో ఎక్కడా చెప్పలేదు. అరెస్ట్ అంటే ఒక వ్యక్తి స్వేచ్ఛను నిలుపుదల చేయడం. అది కోర్టు ఉత్తర్వుల వల్ల కావచ్చు లేక అతని మీద ఆరోపించబడిన నేరానికి జవాబు చెప్పటం కోసం కావచ్చు. అరెస్ట్ ఉద్దేశ్యం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి అతనిపై ఉన్న క్రిమినల్ ఆరోపణలకు అతను కోర్టులో జవాబు చెప్పటానికి, రెండవది అతను ఏదైనా నేరం చేయకుండా నిరోధించటానికి. అరెస్ట్ చేసే క్రమంలో అవసరమైన బలప్రయోగాన్ని పోలీసులు ఉపయోగించవచ్చు. అయితే ఆ వ్యక్తి అరెస్ట్‌ని నిరోధించినప్పుడు మాత్రమే బలప్రయోగం చేయాల్సి ఉంటుంది. జీవిత ఖైదు కానీ మరణ శిక్ష కానీ విధించే నేరం చేసిన వ్యక్తులను అవసరమైతే చంపటానికి కూడా అవకాశం ఉంది. అంతే కానీ సంకెళ్ళు వేయాలని చట్టంలో ఎక్కడా చెప్పలేదు.



సంకెళ్ళు వేయడాన్ని చట్టం ఆమోదించదు. సంకెళ్ళు వేయడం లాంటి చర్యలు అమానుషమనీ, ముద్దాయి గౌరవానికి భంగం కలిగించడమనీ చాలా కేసుల్లో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21 లకు సంకెళ్ళు వేయడం అనేది విరుద్ధం. సంకెళ్ళు, బంధనాలు శిక్షపడిన ఖైదీలకు కానీ విచారణలో ఉన్న ఖైదీలకు కానీ వేయడానికి వీలులేదు.

కోర్టు ముందు హాజరు పరిచిన ముద్దాయిలకు సంకెళ్ళు వేయాలంటే మెజిస్ట్రేట్ అనుమతి అవసరం. ఆ వ్యక్తి పారిపోడానికి ప్రయత్నం చేస్తాడని ఆధారాలు ఉన్నపుడు, పోలీసుల కస్టడీ నుంచి పారిపోతాడని కచ్చితంగా భావించినప్పుడు, అరుదైన కేసుల్లో, హింసాత్మకమైన ప్రవృత్తి ఉన్నప్పుడు, వాళ్ళు అపాయకరమైన వ్యక్తులు అయినప్పుడు మేజిస్ట్రేట్ ఈ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అలా నిర్ణయానికి రావడానికి మేజిస్ట్రేట్ కారణాలు కూడా రాయాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు చాలా కేసుల్లో స్పష్టం చేసింది. అందులో ప్రముఖమైన కేసు ప్రేమ్ శంకర్ శుక్లా వర్సెస్ ఢిల్లీ అడ్మినిస్ట్రేషన్ (ఏఐఆర్ 1980 సుప్రీం కోర్టు 1535). ఒకవేళ పోలీసులు సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను ఉల్లంఘించి సంకెళ్ళు వేసినట్టైతే వారు కోర్టు ధిక్కార నేరం కింద శిక్షింపబడతారని సుప్రీంకోర్టు సిటిజెన్స్ డెమొక్రసీ వర్సెస్ స్టేట్ ఆఫ్ అస్సాం 1996 సుప్రీంకోర్టు కేసెస్ (క్రిమినల్) 612 లో స్పష్టం చేసింది. సంకెళ్ళు వేయకుండా ముద్దాయి తప్పించుకోకుండా ఉండడానికి సుప్రీంకోర్టు ప్రేమ్ శంకర్ శుక్లా కేసులో కొన్ని ప్రత్యామ్నాయాలను సూచించింది. అవి ఎస్కార్ట్‌లో ఉన్న పోలీసుల సంఖ్య పెంచాలి. వాళ్ళకి ఆయుధాలు ఇవ్వాలి. వారికి సరైన శిక్షణ కూడా ఇవ్వాలి.

అయితే కొత్తగా వచ్చిన 'భారతీయ నాగరిక సురక్ష సంహిత' సంకెళ్ళు వేయడం విషయంలో అనుమతి ఇచ్చింది. ఈ కొత్త చట్టం లోని సెక్షన్ 43లో అరెస్ట్ ఎలా చేయాలో చెప్పారు. అదే విధంగా సబ్ సెక్షన్ 3లో అరెస్ట్ చేసినప్పుడు సంకెళ్ళు వేయడం గురించి కూడా చెప్పారు. నేర స్వభావాన్ని నేర తీవ్రతను బట్టి అరెస్ట్ చేసిన వ్యక్తులకు సంకెళ్ళు వేయవచ్చు. అలవాటుపడిన నేరస్థులకు, మళ్ళీ మళ్ళీ నేరం చేసిన వ్యక్తులకు, కస్టడీ నుంచి తప్పించుకున్న వ్యక్తులకు, వ్యవస్థీకృత నేరం చేసిన వ్యక్తులకు, తీవ్రవాద చర్యలు పాల్పడిన వ్యక్తులకు, మాదక ద్రవ్యాల నేరాలు చేసిన వ్యక్తులకు, ఆయుధాలు, మందుగుండు సామాను అక్రమంగా కలిగిన వ్యక్తులకు; హత్య, రేప్, యాసిడ్ దాడి, నకిలీ నాణాలు, నోట్లు కలిగి ఉన్న వ్యక్తులకు, మనుషుల అక్రమ రవాణా చేసే వ్యక్తులకు, పిల్లలపై సెక్స్ నేరాలు చేసిన వ్యక్తులకు, రాజ్యంగ వ్యతిరేకంగా వ్యవహరించిన వ్యక్తులకు పోలీసులు సంకెళ్ళు వేయవచ్చని ఈ నిబంధన చెప్తుంది. రాజ్యానికి వ్యతిరేకంగా చేసిన నేరాలు ఏమిటి అనే విషయంలో స్పష్టత లేదు. అందుకని అందరికీ సంకెళ్ళు వేసే అవకాశం ఉంది.

మళ్ళీ నేరం చేసిన వ్యక్తులకు సంకెళ్ళు వేయవచ్చు. దీన్ని చట్టంలో నిర్వచించలేదు. అందుకని ఇది కూడా దుర్వినియోగం అయ్యే అవకాశం ఉంది. ఉదాహరణకు భార్యా భర్తల మధ్య తగువు ఏర్పడి కట్నం కోసం వేధిస్తున్నారన్న దరఖాస్తుతో బాటు మరెన్నో కేసులను పెట్టిన సందర్భాలను మనం చూస్తున్నాం. ఆ కేసులు నిజమైనవా అబద్ధమైనవా అన్న విషయం అప్పుడు తెలియదు. ఈ కేసులు భర్త మీదే కాకుండా కుటుంబ సభ్యులందరి మీదా పెడుతున్నారు. అలాంటప్పుడు వారందరికీ సంకెళ్ళు వేసే పరిస్థితి చట్టం కల్పిస్తుంది. అప్పుడు వాళ్ళు ఎంతటి అసౌకర్యానికి గురవుతారో, ఎంతటి అవమానానికి గురవుతారో ఊహించవచ్చు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇట్లా ఎన్నో కేసులను ఉదాహరించవచ్చు.

చట్టం అనుమతి ఇవ్వనప్పుడే సంకెళ్ల సంస్కృతి మన దేశంలో ఉంది. సంకెళ్ళు వేయడమే కాదు నేరారోపణలకు గురి అయిన వ్యక్తులను ఊరేగించడం మనం చూస్తున్నాం. ప్రజలు ఆవిధంగా కోరుకుంటున్నారు కాబట్టి మేము ఊరేగిస్తున్నామని పోలీసులు అంటారు. చట్టం అనుమతి ఇవ్వనప్పుడు ఆ విధంగా ఊరేగించటం ఎంతవరకు సమంజసం? ఇప్పుడు కొన్ని సందర్భాలలో సంకెళ్ళు వేయడాన్ని చట్టం అనుమతి ఇస్తుంది. ఇలాంటప్పుడు సంకెళ్ళు వేసి దుర్వినియోగం చేసే పరిస్థితి ఎక్కువ అవుతుంది. సంకెళ్ళు వేయడం రాజ్యాంగ విరుద్ధం, మానవ హక్కుల ఉల్లంఘన అని సుప్రీం కోర్టు చాలా కేసుల్లో చెప్పింది. ఆ తీర్పులన్నింటినీ ప్రక్కన పెట్టి కొత్త చట్టంలో సంకెళ్ళు వేసే వెసులుబాటును పార్లమెంటు కల్పించింది. ఈ వెసులుబాటు మరెంత దుర్వినియోగం అవుతుందో వేచి చూడాలి.

వ్యాసకర్త తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడెమీ డైరెక్టర్ । 9440483001

చిత్తశుద్ధే ముఖ్యం

ఆత్మే జీవాత్మ. ఇదే శాశ్వతమైనది, మిగిలినవన్నీ అశాశ్వతములే. అశాశ్వతమైన ఏ ఒక్కదానిలో కూడా నిజమైన ఆనందం (సచ్చిదానందం) ఉండదు. ఐనప్పటికీ, మానవుడు అశాశ్వతమైన వస్తువుల నుండి ఆనందాన్ని అన్వేషిస్తూ ఉంటాడు. ఆవిధంగా చేయడం వల్ల మనిషి అజ్ఞానంతో జీవిస్తూ, తనను తానే మోసగించుకొంటున్నాడు.

నీ అంతరాత్మకు నీవు లోబడి ఉన్నప్పుడే నిజమైన ఆనందాన్ని అనుభవించగలవు. కానీ ఈ విషయం మనం అనుకొన్నంత సులభం కాదు. సచ్చిదానంద స్థితికి చేరాలంటే, మానవుడు తీవ్ర ప్రయత్నం చేయాలి. ఎంతవరకు చిత్తం (మనస్సు) కల్మషంతో నిండి ఉంటుందో, అంతవరకు మానవుడు ఆత్మను అనుసరించలేడు. కాబట్టి అన్వేషకుడు (భక్తుడు) ముందుగా చిత్తశుద్ధిని పొందాలి.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

నీవు సద్గురువు సంపర్కంలోకి రాగానే ఆత్మవికాసానికై భిన్నమైన పద్ధతులు అనగా 'సేవ', 'హోమము', 'తీర్థయాత్ర', 'ధ్యానము', 'అర్చన', 'నామసంకీర్తన' వంటి వానిని ఆచరించమని ఉపదేశం లభిస్తుంది. నీవు ఎల్లప్పుడు అంకితభావంతో చిత్తశుద్ధితో సాధన చేస్తే నీపై గురువు దయావృష్టి కురుస్తుంది. మున్ముందుగా కావలసింది ఇదే. నీ గూర్చి నీవే నడవాలి కాని నీ గూర్చి గురువు నడువడు. కానీ అతను నీకు సరియైన మార్గాన్ని చూపిస్తాడు.

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం; ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; తిథి: శు.పంచమి ఉ.8.21 వరకు, తదుపరి షష్ఠి; నక్షత్రం: పుబ్బ ప.12.19 వరకు, తదుపరి ఉత్తర; వర్జ్యం: రా.8.18 నుండి 10.04 వరకు; దుర్ముహూర్తం: ఉ.9.55 నుండి 10.47 వరకు; తదుపరి ప.3.07 నుండి 3.59 వరకు; అమృత ఘడియలు: లేవు; రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు; యమగండం ఉ.6.00 నుండి 7.30 వరకు; సూర్యోదయం: 5.36; సూర్యాస్తమయం: 6.35; స్కందపంచమి.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

సౌత్‌ను ప్రైవేటుకు అప్పగించొద్దు: టీజీపీజేఏసీ



ముషారఫ్ ఫారూఖీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న టీజీపీజేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: అంతర్గత నష్టాల పేరుతో హైదరాబాద్ సౌత్ సర్కిల్‌ను అదానీ కంపెనీకి అప్పగించాలనే యోచన నుంచి వెంటనే విరమించుకోవాలని తెలంగాణ పవర్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీపీజేఏసీ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ కమిటీ ప్రతినిధి బృందం బుధవారం సీఎండీ ముషారఫ్ ఫారూఖీని కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. ప్రభుత్వ విద్యుత్ సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం ద్వారా ఉద్యోగులతో పాటు వినియోగదారులు పెద్ద ఎత్తున నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎండీని కలిసిన వారిలో జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ సాయి బాబా, కన్వీనర్ రత్నాకర్‌రావు, కో–కన్వీనర్ బీసీరెడ్డి ఉన్నారు.

యువకుల వేధింపులతో యువతి ఆత్మహత్య



కల్యాణి

వేములపల్లి (మాడ్గులపల్లి): ఇద్దరు యువకుల వేధింపులకు గురిచేయడంతో మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. నల్ల గొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని చింతలగూడెం గ్రామంలో మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. చింతలగూడెంకి చెందిన కొత్త కల్యాణి(18) పాలిటెక్నిక్ పూర్తి చేసి ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటుంది. అదే గ్రామానికి చెందిన ఆరూరి శివ, కొమ్మనబోయిన మధు ఇద్దరు యువకు లు కల్యాణి ఫొటోను వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో స్టేటస్‌గా పెట్టుకుంటామని కొన్నిరోజులు గా వేధిస్తున్నారు. వీరి వేధింపులు భరించ లేక కల్యాణి ఈ నెల 6న పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు కల్యాణిని నల్లగొండలోని ఓ ప్రైవే ట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. కల్యాణి తల్లి రజిత ఫిర్యాదు మేరకు ఆ యువకులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఇద్దరు కౌలురైతుల ఆత్మహత్య



లింగయ్య



కనకయ్య

కాటారం (జయశంకర్ భూపాలపల్లి)/ దుబ్బాకరూరల్ (సిద్దిపేట): అప్పులబాధతో రాష్ట్రంలో ఇద్దరు కౌలు రైతులు బుధవారం బలవన్మరణానికి పాల్పడ్డారు. జయశంకర్ జిల్లాలో పురుగుమందు తాగి ఒకరు, సిద్దిపేట జిల్లాలో ఉరి వేసుకుని మరొకరు ఆత్మహత్య చేసుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటా రం మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన క్లోం లింగయ్య(35) గత మూడేళ్లుగా 2.20 ఎకరాల భూమి కౌలుకు తీసుకొని పత్తి సాగు చేస్తున్నాడు. రెండేళ్లుగా వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడి సరిగా రాక రూ.4 లక్షల మేర అప్పు మిగిలింది. ఈ అప్పు తీర్చే మార్గం తెలియక తీవ్ర మనోవేదనకు గురైన లింగయ్య మంగళవారం మధ్యాహ్నం పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 ద్వారా స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే లింగయ్య మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లికి ఛెత్రి కనకయ్య (42) సుమారు రూ.10 లక్షల వరకు అప్పులు చేసి నూతనంగా ఇల్లు నిర్మించుకున్నాడు. వ్యవసాయంపై ఆధారపడిన కనకయ్యకు అప్పులు తీర్చేందుకు సమయానికి డబ్బులు అందలేదు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై బుధవారం తెల్లవారుజామున తన పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

54 లక్షల ఎకరాల్లో సాగు

సాక్షి, హైదరాబాద్: వానాకాలం పంటల సాగు జోరందుకుంది. బుధవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 54.61 లక్షల ఎకరాల్లో పలు పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. ఈ సీజన్‌లో అత్యధికంగా పత్తి 36.88 లక్షల ఎకరాల్లో సాగు కాగా.. వరి 4.14 లక్షల ఎకరాల్లో, సోయాబీన్ 3.20 లక్షల ఎకరాల్లో, కంది 2.95 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 2.57 లక్షల ఎకరాల్లో సాగైంది.

జడ్జిల పేర్లు బహిర్గతం చేయొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం బుధవారం మధ్యాహ్నం మరోసారి విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్, కేంద్రం తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ హాజరయ్యారు. కౌంటర్ వేయడానికి గడువు కావాలని కేంద్ర న్యాయ వాది కోరారు. దీంతో ధర్మాసనం.. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది.

● వాగులు దాటి వైద్యం


● వైద్య సిబ్బంది సాహసం

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పెనుగోలు గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించేందుకు వైద్యసిబ్బంది పెద్ద సాహసమే చేశారు. వైద్యాధికారి మధుకర్ ఆధ్వర్యంలో బుధవారం సిబ్బంది గుట్టలపైనున్న పెనుగోలు గ్రామానికి అడవి మధ్యలోని నల్లవాగు, పాలవాగుతోపాట మరోవాగును దాటుకుంటూ వెళ్లారు. మనిషి లోతు వరకు నీటి ప్రవాహం ఉన్న వాగులను జాగ్రత్తగా దాటి గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చిన వెంకటేశ్వర్లు, శేఖర్, రజనీకాంత్, లఖాన్ పాల్గొన్నారు.



15 నాటికి శ్రీశైలానికి కృష్ణమ్మ

- పశ్చిమ కనుమల్లో వర్షాలతో కృష్ణా ప్రధాన పాయలో పెరిగిన వరద
- మరో రెండు రోజుల్లో ఆల్మట్టి గేట్లు ఎత్తివేత ఖాయం
- తుంగభద్రకి సైతం పెరిగిన వరద ప్రవాహం
- ఎగువన వర్షాలతో కృష్ణా పరీవాహకంలో ఆశాజనక పరిస్థితులు
- సాగర్ నుంచి 5 టీఎంసీలను కోరిన ఏపీ ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: ఎగువన భారీగా వర్షాలు కురుస్తుండడంతో కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాల్లో ఆశాజనక పరిస్థితులు నెలకొంటున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటకల్లోని పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా ప్రధాన పాయలో వరద ఉధృతి పెరిగింది. ఆల్మట్టి డ్యామ్‌లోకి బుధవారం సాయంత్రం 6 గంటలకు 84,645 క్యూసెక్కులు చేరడంతో నీటి నిల్వ 81.44 టీఎంసీలకు చేరుకుంది. డ్యామ్ గరిష్ట నిల్వ సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా, ఆపరేషన్ ప్రొటోకాల్ ప్రకారం వరద ముప్పును నివారించేందుకు నిల్వలు గరిష్ట స్థాయికి చేరకముందే గేట్లను ఎత్తి వరదను దిగువన విడుదల చేస్తారు. గతేడాది జూలై 27న నిల్వ 93.28 టీఎంసీలకు చేరిన వెంటనే ఆల్మట్టి డ్యామ్ గేట్లను పైకి ఎత్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో నిల్వలు 105 టీఎంసీలకు చేరే లోపే గేట్లను ఎత్తే అవకాశముంది. వర్షాలు, వరదలు కొనసాగితే మరో రెండు రోజుల్లోగా ఆల్మట్టి డ్యామ్ గేట్లను ఎత్తి నీళ్లను దిగువన విడుదల చేసే అవకాశముంది. ఆల్మట్టికి దిగువన ఉన్న నారాయణపూర్ డ్యామ్ గరిష్ట నిల్వ సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 25.06 టీఎంసీల నిల్వలున్నాయి. ఆల్మట్టి డ్యామ్ గేట్లను ఎత్తిన ఒకటి రెండు రోజుల్లోనే నారాయణపూర్ డ్యామ్ గేట్లను ఎత్తి నీళ్లను విడుదల చేయనున్నారు. దీంతో తెలంగాణ భూభాగంలోని జూరాల జలాశయానికి వరద చేరుకోనుండగా, వెంటనే గేట్లను ఎత్తి దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి నీళ్లను విడుదల చేయనున్నారు. జూరాల జలాశయం గరిష్ట నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.72 టీఎంసీల నిల్వలున్నాయి. ఈ నెల 15 లేదా 16వ తేదీలోగా శ్రీశైలం జలాశయానికి వరదనీరు చేరుకోవచ్చని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

తుంగభద్రకు పెరిగిన వరద ప్రవాహం

కృష్ణా ప్రధాన ఉప నది తుంగభద్ర బేసిన్‌లోనూ వర్షాలు కురుస్తుడడంతో తుంగభద్రలో వరద ప్రవాహం మరింత పెరిగింది. తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం బుధవారం ఉదయం 35వేల క్యూసెక్కులకు పెరిగి సాయంత్రానికి 27,544 క్యూసెక్కులకు తగ్గింది. జలాశయం గరిష్ట నిల్వ సామర్థ్యం 100.86టీఎంసీలు కాగా, ప్రస్తుతం 25.17 టీఎంసీల నిల్వలున్నాయి. వర్షాలు విస్తారంగా కురిస్తే మరో వారం రోజుల్లో తుంగభద్ర గేట్లను ఎత్తే అవకాశముంది. అప్పుడు తుంగభద్ర జలాలు కూడా సుంకేశుల బ్యారేజ్ మీదుగా శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుతాయి.

సాగర్ నుంచి 5 టీఎంసీల విడుదలకు అనుమతించండి: ఏపీ విజ్ఞప్తి

తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ నుంచి కుడి ప్రధాన కాల్వ ద్వారా 5 టీఎంసీల నీళ్లను విడుదల చేసేందుకు అనుమతించాలని ఏపీ ప్రభుత్వం కృష్ణా నదియాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కి విజ్ఞప్తి చేసింది. ఈ నెల 15 నుంచి రోజుకు 5500 క్యూసెక్కుల చొప్పున 11 రోజుల పాటు నీళ్లను కుడి ప్రధాన కాల్వ రెగ్యులేటర్ ద్వారా విడుదల చేసుకుంటామని, పర్యవేక్షణ కోసం కృష్ణా బోర్డు సిబ్బందిని పంపించాలని కోరింది. నీటి విడుదలకు అనుమతివ్వాలని సీఆర్‌పీఎఫ్ బలగాలను సైతం కోరాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి ఈ నెల 8న కృష్ణా బోర్డు చైర్మన్‌కు లేఖ రాశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల తాగునీటి అవసరాలను తీర్చే వేసవి నిల్వ ట్యాంకుల్లో నీటిమట్టం పడిపోయిందని, అందుకే నీటి విడుదల చేసుకుంటామని తెలిపారు.

బుధవారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా బేసిన్‌లో ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వ, ప్రవాహాలు ఇలా..

ప్రాజెక్టు పేరు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో
ఆల్మట్టి	1705	129.72	1694.58	81.44	84,645	430
నారాయణపూర్	1615	37.64	1604.98	25.06	201	96
జూరాల	1045	9.66	1041.79	7.72	0	220
తుంగభద్ర	1633	105.79	1602.65	25.17	27,544	369
శ్రీశైలం	885	215.81	813.91	36.66	2256	1652
నాగార్జునసాగర్	590	312.05	503.31	120.58	0	910
పులిచింతల	175	45.77	98.42	0.65	154	50

57 ఎకరాలు.. రూ.22.80 కోట్లు

- నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, ఆయన కుటుంబసభ్యుల భూమి విక్రయించే యత్నం
- ముగ్గురు రియల్టర్ల అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ అనిల్‌కుమార్

జోగిపేట(అందోల్): ఓ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన 57 ఎకరాల వ్యవసాయ భూమిని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి విక్రయించేందుకు యత్నించిన ముగ్గురు రియల్టర్లను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ అనిల్‌కుమార్ చెప్పిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా అందోలు శివారులో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, సైబరాబాద్ మాజీ పోలీస్ కమిషనర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుటుంబానికి చెందిన అంజమ్మ, నర్సింహారెడ్డి, గోపాల్‌రెడ్డిలకు 57 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నారాయణఖేడ్ పరిధిలోని ర్యాకల్ గ్రామానికి చెందిన సంజీవరెడ్డి, దెగుల్వాడీ గ్రామానికి చెందిన సుధాకర్, ముకుందానాయక్ తండాకు చెందిన రవీందర్‌లు రియల్టర్లు. వీరు ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులకు చెందిన వ్యవసాయభూమిని ఎకరాకు రూ.39 లక్షల చొప్పున కొనుగోలు చేసినట్టు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. ఇదే భూమిని హైదరాబాద్‌కు చెందిన యాదగిరిరెడ్డికి ఎకరాకు రూ.40 లక్షలు చొప్పున రూ.22.80 కోట్లకు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అడ్వాన్స్ కింద మే 3వ తేదీన యాదగిరిరెడ్డి తన స్నేహితుడు వాసుదేవరెడ్డి ఖాతా ద్వారా రూ.11లక్షలు సంజీవరెడ్డికి చెల్లించారు. నెలరోజుల తర్వాత భూమిని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సంజీవరెడ్డికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో యాదగిరిరెడ్డికి అనుమానం వచ్చింది. దీంతో అందోలు గ్రామంలోని ప్రభాకర్‌రెడ్డి వద్దకు వెళ్లి ఆరా తీయగా.. తాము ఈ భూమిని ఎవరికి విక్రయించలేదని చెప్పడంతో యాదగిరిరెడ్డి కంగుతిన్నాడు. తన దగ్గర ఉన్న డాక్యుమెంట్ కాపీలను చూపించగా, అవి నకిలీవని తేలాయి. దీంతో సంగారెడ్డి ఎస్పీ రూపేష్‌కు ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు జోగిపేట సీఐ నేతృత్వంలోని పోలీసుల బృందం విచారణ చేపట్టింది. నిందితులు సంజీవరెడ్డి, సుధాకర్, రవీందర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. ఈ కేసులో నిందితులను పట్టుకునేందుకు చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ శివ, హోంగార్డు సురేశ్‌లను సీఐ అభినందించారు. వీరికి రివార్డు కోసం ఎస్పీకి సిఫార్సు చేయనున్నట్టు తెలిపారు.

నేడు పంప్‌హౌజ్‌ల నిర్మాణ సంస్థ ప్రతినిధుల విచారణ

- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నుంచి పిలుపు
- 40 మంది ఏఈలు, ఏఈఈలను విచారించిన కమిషన్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి (మేడిగడ్డ), సిరిపురం (అన్నారం), గోలివాడ (సుందిళ్ల) పంప్ హౌజ్‌ల పనులను నిర్వహించిన నిర్మాణ సంస్థకి సంబంధించిన ముఖ్యులను గురువారం జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ విచారించనుంది. విచారణ కోసం మధ్యాహ్నం 2.30 గంటలకు బీఆర్‌కేఆర్ భవన్‌లోని కమిషన్ కార్యాలయానికి రావాలని వారికి కమిషన్ లేఖ రాసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంలో టెక్నికల్ లోపాలు, అవకతవకతలపై విచారణకు జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పంప్‌హౌజ్‌ల నిర్మాణంపై విచారణ నిర్వహించే పరిధి కమిషన్‌కు లేకున్నప్పటికీ.. వాటి నిర్మిత ప్రాంతం ఎంపిక, నిర్వహణతో బరాజ్‌లపై పడిన ప్రభావాలను గుర్తించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ క్రమంలోనే పంప్‌హౌజ్‌లను నిర్మించిన నిర్మాణ సంస్థకి సంబంధించిన ఉన్నతాధికారిని ఇటీవల తన కార్యాలయానికి పిలిపించి విచారించింది. తాజా అదే సంస్థకు చెందిన ముఖ్యులను సైతం విచారించాలని నిర్ణయం తీసుకుంది.

బరాజ్‌లు, పంప్‌హౌజ్‌ల ఏఈల విచారణ..

కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌లు, పంప్‌హౌజ్‌ల నిర్మాణంలో పాలుపంచుకున్న 40 మంది వరకు ఏఈలు, ఏఈఈలను జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ బుధవారం విచారించింది. ఒక్కో బరాజ్‌లో పనిచేసిన వారిని ఒక్కో గ్రూపు చొప్పున మొత్తం బరాజ్‌ల ఇంజనీర్లను మూడు గ్రూపులుగా విభజించి ప్రశ్నించింది. ఇదే తరహాలో మూడు పంప్‌హౌజ్‌ల ఇంజనీర్లను 3 గ్రూపులుగా విభజించి ప్రశ్నించింది. 10 రోజుల్లో అఫిడవిట్ల రూపంలో కమిషన్‌కు తమ వాదనలను సమర్పించాలని ఆదేశించింది.

ముగ్గురు పిల్లలతో సహా చనిపోవాలని..

- ఓ తండ్రి ఆత్మహత్యాయత్నం
- కారును వేగంగా చెరువులోకి తీసుకెళ్లిన వైనం
- భయంతో హడలెత్తిపోయిన చిన్నారులు
- స్థానికుల అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం
- ఆర్థిక ఇబ్బందులే కారణమని వెల్లడించిన పోలీసులు



చెరువులో మునిగిన కారుపై కూర్చుని సహాయం కోసం ఎదురుచూస్తున్న చిన్నారులు



అశోక్ పిల్లలు

అబ్దుల్లాపూర్‌మెట్: మార్నింగ్ వాక్ చేసేందుకు ముగ్గురు పిల్లలతో కలిసి బయటకు వచ్చిన ఓ తండ్రి.. తన పిల్లలతో సహా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకులకు చెందిన అశోక్ వ్యాపార నిమిత్తం నగరానికి వలస వచ్చి మీర్‌పేట పరిధిలోని అల్మాస్‌గూడ శ్రీహోమ్స్ కాలనీలో నివాసముంటున్నాడు. బిజినెస్‌లో నష్టం రావడం, ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో ఆత్మహత్యే శరణ్యమని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఉదయం 6గంటలకు తన పిల్లలు 14 ఏళ్ల అవిఘ్నశ్రీ , 13 ఏళ్ల శ్రీధర్, తొమ్మిదేళ్ల వయసున్న సహస్రను తీసుకుని కారులో బయటకు వెళ్లాడు. నేరుగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడలోని బైరాన్‌ఖాన్ చెరువు వద్దకు చేరుకున్నాడు. ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లేందుకు అనువుగా ఉండే చెరువు కట్టపై నుంచి కారును వేగంగా చెరువులోకి దింపాడు. సమీపంలోని తాటి చెట్లపై ఉన్న గీత కార్మికులు, రోడ్డు పక్కనే ఉన్న స్థానికులు చూస్తుండగానే కారు నీళ్లలో మునుగుతుండగా.. భయంతో వణికిపోయిన బాలుడు శ్రీధర్.. తనవైపు కిందకు దించి ఉన్న కారు అద్దం నుంచి బయటకు వచ్చి, వాహనం పైకి ఎక్కాడు. మిగిలిన ఇద్దరు పిల్లలు సైతం అతన్ని అనుసరించారు. ఆ తర్వాత అశోక్ సైతం బయటకు వచ్చాడు. కారు పూర్తిగా నీటిలో మునుగుతున్న సమయంలో.. వేగంగా స్పందించిన స్థానికులు తాడు, ట్యూబ్ సాయంతో చెరువులోకి వెళ్లి.. ముగ్గురు పిల్లలతో పాటు అశోక్‌ను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న అశోక్‌కు ఆర్థిక సమస్యలకు తోడు పాటు భార్యతో సైతం గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. తాను చనిపోతే తన పిల్లలు అనాథలవుతారనే ఉద్దేశంతోనే అశోక్ ఇలా వ్యవహరించి ఉంటాడని ఘటనా స్థలంలో ఉన్నవారు తెలిపారు.

మీర్‌పేట్ పీఎస్‌లో ఫిర్యాదు

కాగా, మార్నింగ్ వాక్ కోసం పిల్లలను తీసుకెళ్లిన అశోక్ చాలా సమయం గడిచినప్పటికీ తిరిగి రాకపోవడంతో అతని తమ్ముడు సంజీవ మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ఇనాంగూడ చెరువు వద్ద ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు అక్కడకు చేరుకునే లోపే స్థానికులు వారిని బయటకు తీశారు. అనంతరం మీర్‌పేట్ పీఎస్‌కు తరలించి.. అశోక్ భార్యతో పాటు అతని సోదరుడికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

అన్నారంలో ముమ్మరంగా రెండో దశ పరీక్షలు

- 15 రోజుల్లో పరీక్షలు పూర్తి
- ఆ తర్వాత ప్రభుత్వానికి నివేదిక



అన్నారం బరాజ్ వద్ద పరీక్షలు చేస్తున్న పుణే నిపుణుల బృందం

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం (సరస్వతి) బరాజ్‌లో పుణే సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్)కు చెందిన ముగ్గురు నిపుణుల బృందం బుధవారం జియోఫిజికల్ రెండో దశ పరీక్షలను ఇంజనీరింగ్ అధికారులతో కలసి ముమ్మరం చేసింది. గత ఏడాది నవంబర్‌లో బరాజ్‌లో సీపేజీ లీకేజీలు ఏర్పడిన నేపథ్యంలో పలుమార్లు ఎన్డీఎస్ఏ, సీడబ్ల్యూసీ బృందాలు ఇక్కడ పర్యటించాయి. వారు చేసిన సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అన్నారం బరాజ్‌లో సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం నిపుణులు ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో మొదటి దశ పరీక్షలను గత శనివారం వరకు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో రెండో దశ జియోఫిజికల్ పరీక్షలను ఆదివారం నుంచి పుణేకు చెందిన డాక్టర్ మందిర, సంతోష్‌కుమార్ రంగా, రమేశ్ బాస్కేలు నిర్వహిస్తున్నారు. బరాజ్‌లో సీపేజీ లీకేజీలు ఏర్పడిన 26 నుంచి 45వ పియర్స్ వెంట్‌ల వద్ద ఒక్కో వెంట్ మధ్యలో ఒక బోర్‌వెల్ డ్రిల్ వేశారు. వెంట్ చివరన డ్రిల్‌లో రంధ్రాలు వేసి జియో రాడార్ యంత్రం సాయంతో ఒక కేబుల్ వైర్ పంపించి 'పార్లర్ సెస్మిక్ వేవ్ మెథడ్'ద్వారా భూగర్భంలో 25 మీటర్ల లోతున పరిస్థితి ఎలా ఉంది? భూమి కుంగిందా? బొరియలు ఏర్పడ్డాయా లేదా అనేది స్కానింగ్ తీస్తున్నారు. బరాజ్‌లో మొత్తం భూగర్భంలో పియర్ కిందిభాగంలో ఇసుక, మట్టి కుంగకుండా 5 వేలకుపైగా సీకెంట్ పైల్స్ అమర్చారు. ఇవి ఏమైనా చెల్లాచెదురయ్యాయా? లీకేజీలు ఎలా ఏర్పడ్డాయి.. అనే స్థితిగతులను జియో రాడార్ యంత్రం నుంచి వచ్చే చిత్రాల ద్వారా గుర్తించనున్నట్టు ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. సీకెంట్ పైల్స్ గోడలు నిలువు, అడ్డంగా ఏమైన పగుళ్లు వచ్చాయా అన్నది తెలుసుకుంటున్నారు. బరాజ్‌లో మొత్తం అప్, డౌన్ స్ట్రీమ్‌లలో 42 పరీక్షలు చేయాల్సి ఉంది. ఇందులో ఇప్పటికే అప్ స్ట్రీమ్‌లో 21కి 19, డౌన్ స్ట్రీమ్‌లో 21కి 9 పరీక్షలను పూర్తి చేశారు. 30 బోర్‌వెల్ డ్రిల్లింగ్ హోల్స్ వేశారు. మరో 15 రోజుల్లో పరీక్షలు పూర్తవుతాయని, తర్వాత నివేదికలు ప్రభుత్వానికి అందిస్తామని ఇంజనీరింగ్ వర్గాలు తెలుపుతున్నాయి. వారి వెంట ఈఈ యాదగిరి, డీఈఈ రవిచంద్ర తదితరులు ఉన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
నం.01/2024-25 **టెండరు ప్రకటన** తేది: 12-06-2024
పని పేరు: వికారాబాద్ జిల్లా, పరిగి (మం), లక్నాపూర్ (గ్రా), లక్నాపూర్ ప్రాజెక్ట్ వద్ద వెయిర్ పై వాక్‌వే బ్రిడ్జి పటిష్టపరచుట పని కొరకు O&M ఎస్టిమేట్- 3వ పిలుపు. **మొత్తం: రూ.25.65 లక్షలు.** టెండరు ప్రారంభ తేది: 11-07-2024. టెండరు ముగింపు తేది: 18-07-2024. టెండరు తెరచు తేది: 18-07-2024. టెండరు కాలవ్యవధి: 6 నెలలు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, చేవెళ్ల
DIPR Ro No.1683-PP/CL/Advt/1/2024-25, Dt: 10.07.2024

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ
(తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన - 03/2024-25
CEO/రూరల్ జోన్ యొక్క స్పెసిఫికేషన్ నంబర్లు 43/24-25 (ఎస్ కొరకు కేటాయించబడినవి), 18/23-24, 23/23-24 & 47/24-25 యొక్క టెండర పోటీంపు దిగువ వివరంగా తీసినది. వివరాలు: CEO/రూరల్ జోన్ యొక్క స్పెసిఫికేషన్ నంబర్లు 43/24-25 (ఎస్ కొరకు కేటాయించబడినవి), 18/23-24, 23/23-24 & 47/24-25 యొక్క టెండర పోటీంపు. 1. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభం: 11.07.2024న 14.00 గం. నుండి. 2. ఆన్‌లైన్ బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేది & సమయం: 20.07.2024న 14.00 గం. వరకు. 3. బిడ్ దాఖలు చివరి తేది & సమయం: 20.07.2024న 14.30 గం. వరకు. 4. DDs/BGs తో పాటు హార్డ్ కాపీల కొరకు చివరి తేది & సమయం: 22.07.2024న 14.00 గం. వరకు. 5. సాంకేతిక బిడ్ తెరుచు తేది & సమయం: 22.07.2024న 15.00 గం.కు. 6. ధర బిడ్ తెరుచు తేది & సమయం: 27.07.2024న 15.00 గం.కు. తదుపరి వివరాలకు www.tender.telangana.gov.in & www.tgsouthernpower.org దర్శించగలరు మరియు O/o. CEO/రూరల్ జోన్/గగన్ విహార్, నాంపల్లి, హైదరాబాద్‌ను సంప్రదించండి. ఫోన్ నం.: 040-23301311.
సం/- చీఫ్ ఇంజనీర్, ఆపరేషన్, రూరల్ జోన్, TGSPDCL గగన్ విహార్, నాంపల్లి, హైదరాబాద్
DIPR RO No.1671-PP/CL/Advt/1/2024-25, Dt: 10.07.2024

టి.జి.యస్.ఆర్.టి.సి. – టెండరు ప్రకటన
No.K5/122(4)/2024-BBW తేది: 08-07-2024
కాంట్రాక్టు పద్ధతిన డీలక్స్/ ఎక్స్‌ప్రెస్/ పల్లెవెలుగు & మెట్రో డీలక్స్/ మెట్రో ఎక్స్‌ప్రెస్/ సిటీ ఆర్డినరీ జే.ఐ బస్సు బాడీ టాటా/ అశోక్ లేల్యాండ్/ ఐషర్ చాసిస్‌పై మరియు డీలక్స్ బాడీ రాజధాని రిలీఫ్ చాసిస్ పై తయారు చేయుటకు ఆసక్తి కలిగిన ఫ్యాబ్రికేటర్స్ నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించడమైనది. టెండరు ఫారంలను తేది: 11-07-2024 నుండి 19-07-2024 వరకు సి. మేనేజర్ (BBW & Stores) కార్యాలయము, బి.బి.డబ్ల్యు, మియాపూర్, హైదరాబాద్-49 నందు ఉ.10.30 నుండి సా.04.00 గంటల వరకు రూ.1770/- చెల్లించి పొందవచ్చును. పూరించిన టెండరుఫారాలను చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కార్యాలయం, టి.జి.యస్.ఆర్.టి.సి, కార్పొరేట్ ఆఫీసు, బస్ భవన్, ముషీరాబాద్, హైదరాబాద్ నందు ఉంచబడిన టెండరు బాక్సులో తేది: 20-07-2024 మ.02.00 గం.ల లోగా దాఖలు చేయవలెను. వివరాల కొరకు మా వెబ్‌సైట్ http://tgsrtc.telangana.gov.in (Tenders) ను చూడగలరు. ఎటువంటి కారణము తెలుపకనే ఏదైనా లేదా అన్ని టెండర్లు తిరస్కరించు / రద్దు చేయు హక్కు టి.జి.యస్.ఆర్.టి.సి.కి కలదు.
సం/- సీనియర్ మేనేజర్ (BBW & Stores)
DIPR RO No.1685-PP/CL/Advt/1/2024-25, Dt:10.07.2024

తెలంగాణ రాష్ట్ర దక్షిణ మండల విద్యుత్ సంస్థ
బహిరంగ టెండరు ప్రకటన (పత్రికా ప్రకటన)
దిగువ పనుల కొరకు అర్హత గల కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుచున్నవి. **Sp.No.01/2024-25 (జనరల్ కేటగిరీ) :** మెహిదీపట్నం డివిజన్‌లోని రేతిబౌలి సెక్షన్‌లో క్యాస్కేడింగ్ విధానంలో ప్రస్తుతం గల 3 నంబర్ల DTR పెంపుదల. **Sp.No.02/2024-25 (జనరల్ కేటగిరీ) :** గోల్కొండ సబ్ డివిజన్‌లో CMD ఆఫ్ 125KVA కొరకు సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్, ASI, హైదరాబాద్ సర్కిల్‌కు HT సరఫరా విస్తరణ. **Sp.No.03/2024-25 (జనరల్ కేటగిరీ) :** CBD/మెహిదీపట్నంలో 33/11KV ఆసిఫ్‌నగర్ సబ్ స్టేషన్ నుండి ప్రారంభమయ్యే 11KV మెహిదీపట్నం OH ఫీడర్ యొక్క బైఫరికేషన్. (సంక్షిప్త టెండరు-7 రోజులు). **బహిరంగ టెండరు ప్రారంభ తేది : 10.07.2024న 15.30 గం.లు. టెండరు స్వీకరణకు చివరి తేది : 19.07.2024న 15.00 గం.కు. గమనిక :** దీనికి సంబంధించి ఏదైనా తదుపరి సమాచారాన్ని **డివిజనల్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) కార్యాలయం ఆపరేషన్/మెహిదీపట్నం డివిజన్/సెంట్రల్ సర్కిల్/TGSPDCL** హైదరాబాద్ నుండి పొందవచ్చును.
సం/- డివిజనల్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్), ఆపరేషన్/మెహిదీపట్నం డివిజన్, TGSPDCL, హైదరాబాద్
DIPR RO No.1670-PP/CL/Advt/1/2024-25, Dt: 10.07.2024

SECUNDERABAD CANTONMENT BOARD
Sardar Patel Road, Court Compound, Secunderabad-500 003
PUBLIC NOTICE
This is for the information of the general public that the following transferees have applied for transfer of property as mentioned against their names. Their requests have been processed and the names of the transferees are to be recorded in the tax register as maintained by this office, as per Section 81 of the Cantonments Act., 2006.

Sr. No.	Name of the existing owner as per the tax records. Shri/Smt.	Name of the Transferee. Shri/Smt.	Locality	Sale Deed Doc.No. & Date
1	SHRI K J MOHAN	1 SHRI M S D SRINIVASA RAO S/o LATE M BHARMA RAO 2 SMT M MANGA DEVI W/o M.S.D SRINIVASA RAO	PNO 2023F ON 31 & 56 A G ARCADE SRI BALAJI CHS KARKHANA	SALE DEED NO 325/2007 DT 19/02/2007 (LINK DOCUMENTS)
2	SMT B N S VALLI REDDY	1 SHRI AMAR B ANUMALLA S/o BUCHANNA ANKUL ANUMALLA 2 SMT BENU SHRI ANUMALLA W/o AMAR ANUMALLA	PNO 111/GF CHINNA THOKATTA FLATS (1-12-216) BOWENPALLY	SALE DEED NO 1571/2019 DT 09/08/2019 (LINK DOCUMENTS)
3	SHRI PARVEEN PATEL	SMT BHARTI BHUTORIA W/o RAJESH BHUTORIA	PNO T & BFNO G-1/GF SAI COLONY BAPUJI NAGAR	SALE DEED NO 490/2024 DT 15/03/2024 (LINK DOCUMENTS)
4	SHRI T VENKATESHWARLU	SHRI TADISHETTY SANTHOSH KUMAR S/o LATE TADISHETTY NARSIMHA RAO	OPEN PLOT IN SY NO 63 ANAND NAGAR BOWENPALLY	RECTIFICATION DEED 438/2024 DT 12/03/2024 SALE DEED NO 3303/2022 DT 21/12/2022 (LINK DOCUMENTS)
5	SHRI TANAPUREDDI VEERASWAMY	MISS SALADI SHRAVANI D/o SALADI VENKATA RAMANA	PNO 81 & 81/1/1/SF RAVI KRUPA APARTMENTS, RAVI COLONY WEST MARREDPALLY	SALE DEED NO 1078/2024 DT 20/06/2024 (LINK DOCUMENTS)
6	MISS V PAVANI	SHRI ECHAMPATI VIDYA SAGAR S/o E VENUGOPALA CHARY	PNO 136/FF PICKET CASTLES PICKET	SALE DEED NO 861/2019 DT 26/04/2019 (LINK DOCUMENTS)
7	SHRI GAJULA GANESH	1.SMT BOMMADEVU JOGILAKSHMI W/o BOMMADEVU VEERASWAMY 2.SHRI BOMMADEVU VEERASWAMY S/o BOMMADEVU BHARA RAO	PNO BE-205/SF SWARAJYA ARCADE S C R PRESS EMP CHS BAPUJI NAGAR BOWENPALLY	SALE DEED NO 1109/2023 DT 16/04/2023 (LINK DOCUMENTS)
8	1.SHRI Dr KILARU JAGAN MOHAN RAO 2.SMT K KALYANI	1.SHRI MUKKAMALA BHUSHANA PRASAD S/o MUKKAMALA TANDAVA KRISHNA RAO 2.SHRI MUKKAMALA SAI KUSHAL S/o MUKKAMALA BHUSHANA PRASAD	PNO 96/PNO 3FF KRISHNA NIVAS GUNNADI VENKATA REDDY COLONY BOLARUM	SALE DEED NO 332/2024 DT 19/02/2024 (LINK DOCUMENTS)
9	SHRI M P BABU	1.SHRI G SANDEEP INNANI S/o GOVARDHAN LAL INNANI 2.SHRI RAM PRAKASH INNANI S/o SRIGOPAL INNANI 3.SHRI DEEPAK INNANI S/o SRIGOPAL INNANI 4. SHRI G SRIKANTH INNANI S/o M GOVARDHAN LAL INNANI	PNO 32/GNFF SAMRAT COLONY MURTHY C H S MARREDPALLY	SALE DEED NO 380/2024 DT 28/02/2024 DEATH CERTIFICATE OF M P BABU LEGAL HEIR SHIP CERTIFICATE FROM ADDL & CIVIL JUDGE CITY CIVIL COURT 3XX DT 16/07/2023 RELEASE DEED 1789/2023 DT 14/08/2023 (LINK DOCUMENTS)
10	SHRI S MUTHUCHETTY	SHRI BHANDARI SREENIVAS RAO S/o LATE B RAMA RAO	PNO 41 SYNO 185/2 S C RLY OE CHS PICKET	SALE DEED NO 393/2015 DT 20/02/2015 (LINK DOCUMENTS)
11	1.SMT LALITHA NANDA KUMAR 2.SHRI P NANDA KUMAR ACHAN	1.SMT TIRUNAGARI SUDHARANI W/o TIRUNAGARI SUDARSHAN	PNO 103/GF (PNO 3) J E R COMPLEX VANITHA BOWENPALLY	SALE DEED NO 561/2024 DT 27/03/2024 (LINK DOCUMENTS)
12	SHRI HITESH R DAVADA	1.SHRI RAKESH PANDE S/o LATE JAGDISH PRASAD PANDE 2. SMT DZBA NDIA W/o RAKESH PANDE	PNO 205/SF (1-20-275/1) SHREEJI MEHTA PARK RASOOLPURA	SALE DEED NO 2308/2015 DT 08/09/2015 RECTIFICATION DEED NO 2702/2015 DT 26/09/2015 (LINK DOCUMENTS)
13	1.SMT MADHU AGARWAL 2.SHRI MANISH AGARWAL	1.SHRI VIMAL CHAND JAIN S/o LATE BIKAN CHAND JAIN 2.SMT MADHU SISODIA W/o VIMAL CHAND JAIN	PNO 52/GF VAHANI NAGAR SINDHI ROAD	SALE DEED NO 2837/2023 DT 17/11/2023 (LINK DOCUMENTS)
14	SMT VIMALA CHANDER SEKHAR	SHRI CHANDER SEKHAR VENKATARAMANY S/o PICHU AIYER VENKATARAMANY	PNO 15/GNFF/SF ISHAQ COLONY KAKAGUDA	CANCELLATION OF SETTLEMENT DEED 33/2022 DT 27/01/2022 VIDE DOCUMENT NO 1016/2024 DT 18/06/2024
15	1.SHRI Y KODANDA RAMU 2.SHRI Y SHYAM SUNDER	1.SHRI NEMTURI PRANAY KUMAR S/o NEMTURI PREM KUMAR 2.SMT NEMTURI SUJATHA W/o NEMTURI PREM KUMAR	PNO 102/FF PNO 4 REKHA RESIDENCY SAMRAT COLONY MURTHY C H S WEST MARREDPALLY	SALE DEED NO 498/2022 DT 14/03/2022 (LINK DOCUMENTS)
16	SHRI V M SUDHAKAR	SHRI LIU KU CHUN S/o LIU SZE YUAN	PNO 34/GFFF VIJAY NAGAR COLONY PICKET	SALE DEED NO 475/2024 SALE DEED NO 476/2024 SALE DEED NO 477/2024 DT 14/03/2024 FAMILY SETTELEMENT DEED 176/2022 DT 28/01/2022 SALE DEED NO 913/2022 DT 28/03/2022 (LINK DOCUMENTS)
17	SHRI M A DAS	SHRI JAMES SOLOMON S/o LATE M A DAS	PNO GF&GF/FF NANURAM COLONY TRIMULGHERRY	SETTLEMENT DEED 254/2017 DT 27/02/2017 (LINK DOCUMENTS)
18	SHRI DASGULA VIJAYPAL REDDY	SMT MADIKANTI SUBHASHINI W/o MADIKANTI ADI REDDY	PNO 20/FF VANITHA CHS BOLARUM	SALE DEED NO 3003/2021 DT 02/11/2021 (LINK DOCUMENTS)
19	SMT P BALASARASWATHI	Dr SHAKEEL USMAN THARIYA S/o MOHAMMED USMAN THARIYA	PNO 8 & 8A/FNO 202/FF NIRAJ APARTMENTS SBH COOP HS WEST MARREDPALLY	SALE DEED NO 590/2023 DT 01/03/2023 (LINK DOCUMENTS)
20	SHRI P HARI	SMT THIRIVEEDHI LAKSHMI CHARITA W/o T V S SUBRAMANYAM	PNO 56/GF/FF VIJAY NAGAR COLONY PICKET	SALE DEED NO 1334/2023 DT 19/07/2023 (LINK DOCUMENTS)
21	SHRI SAAM ASTAD CHINOY	1.SHRI YERRA UMAKANTH 2.SMT YERRA MADHURI 3.SMT ANILA YADLAPATI 4.SHRI KRISHNA TEJA YADLAPATI 5.GORANTLA RAMESH 6.GORANTLA SAPNA	HNO 206/PGF/FF TARBUND BUNGLOWS	SALE DEED NO 2231/2019 DT 22/11/2019 SALE DEED NO 2233/2019 DT 22/11/2019 (LINK DOCUMENTS)
22	MISS ZOEISHA CHINOY	7.KAKANI LEELA ABHISHEK 8.UMMAREDDY VENKATA LEELA SRAVANTHI 9.UMMAREDDY VENKATA SIVA TEJA 10.UMMAREDDY VENKATA SHIRAN TEJA	HNO 206/GF/FF/SF TARBUND BUNGLOWS	SALE DEED NO 2231/2019 DT 22/11/2019 SALE DEED NO 2232/2019 DT 22/11/2019 (LINK DOCUMENTS)

Any person having any objection to the above transfer/mutation in the name of the transferee in tax records of this office are required to inform this office in writing within (21) twenty one days of publication of this notice. If no objection is received within the stipulated time, this office will take necessary decision to enter the name of transferee in the tax register of this office.
No. SCB/Tax branch/1256, Office of the Cantonment Board,
Court House Compound, S.P. Road, Secunderabad - 500 003. Date : 10-07-2024
Sd/-
Chief Executive Officer
Secunderabad Cantonment Board.

ప్రకృతి ప్రకోపం



ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో బుధవారం బద్రీనాథ్ నేషనల్ హైవే మీదుగా విరిగిపడుతున్న భారీ కొండచరియ. దాంతో ఆ మార్గంలో రాకపోకలన్నీ పూర్తిగా స్తంభించాయి.

మన అంతరిక్ష కేంద్రంపై...

ఇస్రో కీలక నిర్ణయం

51.5 డిగ్రీల ఆర్బిటల్ ఇంక్లినేషన్‌లో ఏర్పాటు ● వ్యూహాత్మకంగా సానుకూలం: సైంటిస్టులు

ఇస్రో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన భారతీయ అంతరిక్ష స్టేషన్ (బీఏఎస్)కు సంబంధించి కీలక ముందడుగు పడింది. దీన్ని భూ స్థిర కక్ష్యలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)తో దాదాపు సమానంగా 51.5 డిగ్రీల ఆర్బిటల్ ఇంక్లినేషన్ (కక్ష్య తాలూకు వంపు కోణం)లో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. వ్యోమ నౌకల ప్రయోగం తదితరాల్లో ఆర్బిటల్ ఇంక్లినేషన్ (ఓఐ)ది చాలా కీలక పాత్ర. 51.5 డిగ్రీల ఓఐ వల్ల అంతరిక్షం నుంచి భూమిని సమగ్రంగా పర్యవేక్షించేందుకు అవకాశముంటుంది. ఈ కోణంలో అంతరిక్ష కేంద్రం భూమిపై దాదాపు 90 శాతానికి పైగా జనావాసాలనూ కవర్ చేస్తూ పరిభ్రమిస్తుంది. తద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని అంతరిక్ష పరిశోధన కేంద్రాలతోనూ అనుసంధానం సులభతరం అవుతుంది. అందుకే ఇస్రో ఈ నిర్ణయం తీసుకున్నట్టు భావిస్తున్నారు.



ఐఎస్ఎస్ కక్ష్యే ఎందుకు?

ఐఎస్ఎస్ భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులో స్థిర కక్ష్యకు 51.6 డిగ్రీల వంపు కోణంలో పరిభ్రమిస్తుంది. బీఏఎస్ కోసం ఇస్రో దాదాపు అదే కోణాన్ని ఎంచుకోవడం దూరదృష్టితో కూడిన నిర్ణయమని చెబుతున్నారు. ఈ కోణంలో భూమిని అత్యంత విస్తృతంగా కవర్ చేయడం సులువవుతుంది. అంతేగాక ఐఎస్ఎస్ 2030 నాటికి పూర్తిగా తెరమరుగు కానుంది. తద్వారా అంతర్జాతీయ అంతరిక్ష ప్రయోగాలు, పరిశోధనలకు సంబంధించి ఏర్పడే శూన్యాన్ని బీఏఎస్ భర్తీ చేస్తుందని భావిస్తున్నారు. దీనికి తోడు వ్యోమనౌకలు అంతరిక్ష కేంద్రానికి సులువుగా అనుసంధానమయేందుకు ఈ కోణం వీలు కల్పిస్తుందని సైంటిస్టులు చెబుతున్నారు. ''తద్వారా ఇంధన వాడకం తగ్గడమే గాక పనితీరుకు సంబంధించిన అనేకానేక సంక్లిష్టతలు తప్పుతాయి. దీనికి తోడు ఐఎస్ఎస్‌తో కమ్యూనికేషన్, ట్రాకింగ్ కోసం ఇప్పటికే అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలన్నింటినీ ఇస్రో యథాతథంగా వాడుకోగలుగుతుంది. కనుక మనకు వ్యయ ప్రయాసలు కూడా బాగా తగ్గిపోతాయి'' అని ఇస్రో మాజీ ఇంజనీర్ మనీశ్ పురోహిత్ వివరించారు. అయితే బీఏఎస్ ఏర్పాటులో కీలకమైన 51.6 డిగ్రీల ఆర్బిటల్ ఇంక్లినేషన్‌ను సాధించడం సవాలే కానుందని ఆయన అభిప్రాయపడ్డారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

బీఏఎస్ కొన్ని విశేషాలు...

- భారతీయ అంతరిక్ష స్టేషన్ అంతరిక్షంలో మన సొంత పరిశోధన కేంద్రం
- ఐఎస్ఎస్ మాదిరిగానే ఇది కూడా భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పాటు కానుంది
- బీఏఎస్ ప్రస్తుతం డిజైన్ దశలో ఉంది
- దీన్ని 2035కల్లా పూర్తిస్థాయిలో నిర్మించాలన్నది లక్ష్యం
- బీఏఎస్ నమూనాను 2029 కల్లా ప్రయోగాత్మకంగా పరీక్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడించారు



వియన్నాలో మోదీతో కలిసి సెల్ఫీ దిగుతున్న ఆస్ట్రియా చాన్స్‌లర్ కార్ల్ నెహమర్

యుద్ధాలకు సమయం కాదిది

- ఆస్ట్రియా పర్యటనలో మోదీ పునరుద్ఘాటన
- ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు భారత్ పాత్రే కీలకం
- ఆస్ట్రియా చాన్స్‌లర్ కార్ల్ నెహమర్ వ్యాఖ్యలు

వియన్నా: ప్రపంచం ఇప్పటికే అనేకానేక సమస్యలతో సతమతమవుతున్న నేపథ్యంలో ఇది యుద్ధాలకు సమయం కాదని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. రెండు రోజుల ఆస్ట్రియా పర్యటనలో భాగంగా ఆ దేశ చాన్స్‌లర్ కార్ల్ నెహమర్‌తో బుధవారం ఆయన భేటీ అయ్యారు. పశ్చిమాసియా సంక్షోభంతో పాటు ఉక్రెయిన్ యుద్ధం తదితరాలపై నేతలిద్దరూ లోతుగా చర్చలు జరిపారు. ద్వైపాక్షిక బంధాన్ని బలోపేతం చేసుకోవాలని, అందుకోసం మౌలిక సదుపాయాలు, సంప్రదాయేతర ఇంధన వనరులు, ఇన్నొవేషన్లు, నీటి–వ్యర్థాల నిర్వహణ వంటి అన్ని రంగాల్లోనూ అవకాశాలనూ మరింతగా అందిపుచ్చుకోవాలని నిర్ణయించారు. ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండిస్తూ నేతలు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. శాంతియుత వాతావరణంలో చర్చలే యుద్ధాలకు ఏకైక పరిష్కారమని పేర్కొన్నారు. అందుకు అన్ని విధాలా సహకరించేందుకు ఇరు దేశాలూ సిద్ధమని ప్రకటించారు. ఐరాసతో పాటు పలు అంతర్జాతీయ సంస్థల్లో సమకాలీన అవసరాలకు తగ్గట్టుగా సంస్కరణలు అవసరమని నేతలు అభిప్రాయపడ్డారు. వాతావరణ మార్పులు మొదలుకుని ఉగ్రవాదం దాకా అన్ని అంశాలపైనా చర్చించినట్టు వివరించారు. అంతర్జాతీయ సౌర కూటమి, విపత్తుల నిర్వహణ మౌలిక సదుపాయాల కూటమి, జీవ ఇంధన కూటమి తదితరాల్లో భాగస్వామి కావాలని ఆస్ట్రియాను మోదీ ఈ సందర్భంగా ఆహ్వానించారు. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు భారత్ పాత్ర కీలకమని నెహమర్ అభిప్రాయపడ్డారు.

గార్డాఫ్ ఆనర్ భారత ప్రధాని ఆస్ట్రియాలో పర్యటించడం 41 ఏళ్ల అనంతరం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో బుధవారం మోదీకి వియన్నాలో గార్డాఫ్ ఆనర్ లభించింది. స్థానిక కళాకారులు వందేమాతరం ఆలపించారు. మోదీని నెహమర్ ఆలింగనం చేసుకున్నారు. ఆయనతో సెల్ఫీ తీసుకుంటూ సందడి చేశారు. ఆ ఫొటోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'మోదీ జీ! వియన్నాకు స్వాగతం' అని పేర్కొన్నారు. అంతకుముందు నేతలిద్దరూ పలు అంశాలపై చాలాసేపు మనసు విప్పి మాట్లాడుకున్నారు.

సీఈవోలతో భేటీ భారత్‌లో ఇన్‌ఫ్రా, ఇంధన, టెక్నాలజీ తదితర రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆస్ట్రియా కంపెనీలను మోదీ ఆహ్వానించారు. స్థానిక హాఫ్‌బర్గ్ ప్యాలెస్‌లో ఆస్ట్రియా, ఇండియా సీఈఓల రౌండ్‌టేబుల్ భేటీలో మోదీ, నెహమర్ పాల్గొన్నారు. ఇరు దేశాల నడుమ 2023లో 293 కోట్ల డాలర్ల మేర వర్తకం జరిగింది.

అధ్యక్షునితో భేటీ ఆస్ట్రియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వాండెర్ బెలన్‌తో మోదీ భేటీ అయ్యారు. పలు అంశాల్లో ద్వైపాక్షిక సహకారంపై లోతుగా చర్చించుకున్నట్టు చెప్పారు. ఈ మేరకు మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తమ భేటీ అద్భుతంగా జరిగిందన్నారు.

కేజ్రీవాల్‌కు ప్రత్యక్ష ప్రమేయం

ఢిల్లీ మద్యం కేసులో ఈడీ వాదన ● చార్జ్‌షీట్‌లో కేజ్రీవాల్ పేరును 37వ నిందితుడిగా చేర్చిన ఈడీ

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం కుంభకోణం కేసులో రూ.100 కోట్ల ముడుపుల ఉదంతంలో ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రత్యక్ష పాత్ర పోషించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 209 పేజీల తన ఏడో అనుబంధ చార్జ్‌షీట్‌లో పేర్కొంది. దర్యాప్తు సంస్థను తప్పుదోవ పట్టించేందుకు కేజ్రీవాల్ ప్రయత్నించారని పేర్కొంటూ ఆయన పేరును చార్జ్‌షీట్‌లో 37వ నిందితుడిగా చేర్చింది. ఆమ్ ఆద్మీ పార్టీ పేరును 38వ నిందితుడిగా నమోదుచేసింది. మే 17న సమర్పించిన చార్జ్‌షీట్‌ను ఢిల్లీలోని ప్రత్యేక మనీలాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కోర్టు మంగళవారం పరిశీలనకు స్వీకరించింది. కాగా, చార్జ్‌షీట్‌లో ఈడీ ప్రస్తావించిన అంశాలు, చేసిన ఆరోపణలు బుధవారం బహిర్గతమయ్యాయి. '' రాజకీయ నేతలు, లిక్కర్ వ్యాపారుల 'సౌత్ గ్రూప్'కు లబ్ధి చేకూర్చేందుకు అనువుగా ఎక్సయిజ్‌పాలసీని రూపొందించి అమలుచేశారు. ఇలా వచ్చిన లాభాల్లో రూ.100 కోట్లను సౌత్‌గ్రూప్ నుంచి ఆప్ నేతలు అక్రమమార్గాల్లో తీసుకున్నారు. కేజ్రీవాల్, ఇతర ఆప్ నేతల వద్ద పనిచేసిన విజయ్‌నాయర్ ఈ పనిలో కీలకంగా వ్యవహరించారు. తమకు రూ.100 కోట్ల ముడుపులు రావాలంటే పాలసీ ఎలా ఉండాలి, వచ్చిన ఈ రూ.100 కోట్లను ఏఏ మార్గాల్లో తీసుకోవాలి, ఎలా ఖర్చుచేయాలి అనేదంతా కేజ్రీవాల్ మార్గదర్శకత్వంలోనే జరిగింది. ముడుపులను కేజ్రీవాల్ నగదు బదిలీలు/హవాలా చెల్లింపుల ద్వారా తన చెంతకొచ్చేలా చేసుకున్నారు. ఛారియట్ ప్రొడక్షన్స్ ఉద్యోగి ఛన్‌ప్రీత్‌సింగ్ ద్వారా ఈ 'కిక్‌బ్యాక్' ముడుపులు గోవాకు చేరుకున్నాయి. ఇందుకోసం గోవాలో ఆప్ తరఫున ప్రచారంచేసే ఫ్రీలాన్సర్‌గా ఆయనను పనిలో కుదిర్చారు. ఈయనకు ఆప్ రూ.1 లక్ష చెల్లించింది. కేసు దర్యాప్తును కేజ్రీవాల్ ఎలా తప్పుదోవ పట్టించాడనే వివరాలు మనీశ్ సిసోడియా మాజీ కార్యదర్శి సి. అర్వింద్‌తో కేజ్రీవాల్ చేసిన ఛాటింగ్ చరిత్ర చూస్తే అర్థమవుతుంది. హవాలా వ్యాపారులతో లావాదేవీ వ్యవహారాలను కేజ్రీవాల్ అప్పుడు వినోద్ చౌహాన్ చూసుకున్నాడు. గోవా ఎన్నికలకు రూ.25 కోట్లు పంపడంలో కీలకంగా వ్యవహరించిన చౌహాన్‌ను ఇప్పటికే అరెస్ట్‌చేశాం. ఢిల్లీ జల్ బోర్డ్‌లో నియామకాలు, కేజ్రీవాల్ భేటీలను చౌహాన్ చూసుకునేవాడు. సౌత్ గ్రూప్‌కు చెందిన అభిషేక్ బోయినపల్లి..అశోక్ కౌశిక్‌కు ఇచ్చిన రెండు బ్యాగుల నిండా డబ్బు చివరకు చౌహాన్‌కు చేరింది. రూ.100 కోట్లలో రూ.45 కోట్లను 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం ఆప్ ఖర్చుచేసింది. ఈ ఖర్చులను ఆప్ కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదించలేదు'' అని ఈడీ తన చార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఈ చార్జ్‌షీట్‌ను పరిశీలనకు స్వీకరించిన ఢిల్లీ కోర్టు కేజ్రీవాల్‌ను 12వ తేదీన తమ ముందు హాజరుపరచాలని సూచించింది.

నాయర్‌తో సంబంధం లేదు: కేజ్రీవాల్

'' ఆప్ నేత దుర్గేశ్ పాఠక్ గోవా ఇన్‌చార్జ్‌గా ఉంటూ పార్టీకి నిధులు సమకూర్చే బాధ్యతలు చూసుకునేవారు. విజయ్ నాయర్‌తో నాకెలాంటి సంబంధం లేదు. అతను ఢిల్లీ మంత్రులు అతిషి మార్లేనా సింగ్, సౌరభ్ భరద్వాజ్‌ల వద్ద పనిచేసేవారు' అని కేజ్రీవాల్ ఇచ్చిన వాంగ్మూలాన్ని ఈడీ తన చార్జ్‌షీట్‌లో పొందుపరిచింది.

బుధవారం కొనసాగిన వాదనలు

జూన్ 20న ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్‌పై స్టే విధిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేయాలంటూ కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌పై బుధవారం ఢిల్లీ హైకోర్టులో వాదనలు జరిగాయి. ఉద్దేశపూర్వకంగా కేజ్రీవాల్‌ను ఈడీ ఈ కేసులో ఇరికించిందని కేజ్రీవాల్ తరఫు లాయర్ అభిషేక్ సింఘ్వీ వాదించారు. అయితే పిటిషన్‌పై కేజ్రీవాల్ ఇచ్చిన స్పందన కాపీ మంగళవారం రాత్రే అందుకున్నామని, దానిని పరిశీలించేందుకు తమకు సమయం కావాలని ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు కోర్టును కోరారు. దీంతో 15వ తేదీకి కేసును కోర్టు వాయిదావేసింది.

భారత్–చైనా సరిహద్దులో ఏకంగా 108 కిలోల బంగారం స్వాధీనం

లేహ్: భారత్–చైనా సరిహద్దులో అక్రమంగా తరలిస్తున్న 108 కిలోల బంగారాన్ని ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీసు(ఐటీబీపీ) సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఒక్కోటి ఒక కిలో బరువు ఉన్న 108 బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. ఐటీబీపీ చరిత్రలో ఈ స్థాయిలో భారీగా అక్రమ బంగారం స్వాధీనం చేసుకోవడం ఇదే మొదటిసారి అని వెల్లడించారు. తదుపరి విచారణ కోసం బంగారం, ఇతర వస్తువులను కస్టమ్స్ విభాగానికి అప్పగిస్తామని పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం తూర్పు లద్దాఖ్‌లోని చాంగ్‌థాంగ్ సబ్–సెక్టార్‌లో భారత్–చైనా సరిహద్దు అయిన వాస్తవాధీన రేఖకు ఒక కిలోమీటర్ దూరంలో ఐటీబీపీ 21వ బెటాలియన్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు స్మగ్లర్లు తారసపడ్డారు. ఐటీబీపీ సిబ్బందిని చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. సిబ్బంది కొంతదూరం వెంటాడి వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా, బంగారం అక్రమ రవాణా వ్యవహారం బయటపడింది. తనిఖీల్లో 108 కిలోల బంగారం లభించింది. స్మగ్లర్లను లద్దాఖ్ వాసులుగా గుర్తించారు. నిందితులను అధికారులు విచారిస్తున్నారు.

ముస్లిం మహిళలూ భరణానికి అర్హులే

- సుప్రీంకోర్టు కీలక తీర్పు
- సీఆర్‌పీసీ సెక్షన్ 125 అందరికీ వర్తిస్తుంది
- భరణం దాతృత్వం కాదు.. మహిళల హక్కు
- ముస్లిం మహిళా యాక్ట్–1986పై సెక్యులర్ చట్టానిదే పైచేయి
- విడాకులు పొందిన తెలంగాణ ముస్లిం మహిళకు ఊరట
- రూ.10 వేలు భరణం ఇవ్వాల్సిందేనని మాజీ భర్తకు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: ముస్లిం మహిళల భరణానికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మతం ఏదైనప్పటికీ విడాకులు పొందిన భారతీయ మహిళలందరూ భరణానికి అర్హులేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సీఆర్‌పీసీ సెక్షన్ 125 ప్రకారం విడాకులు పొందిన ముస్లిం మహిళలు భరణానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. సీఆర్‌పీసీ 125లో మతవివక్షకు తావులేనిదని, ఇది అందరికీ వర్తిస్తుందని తెలిపింది. ముస్లిం మహిళా (విడాకుల హక్కుల పరిరక్షణ) యాక్ట్– 1986పై సెక్యులర్ చట్టానిదే పైచేయి అవుతుందని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మసీహ్‌ల ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది. భరణం ఇవ్వడం దాతృత్వం కాదని, వివాహిత మహిళలందరి హక్కని నొక్కి చెప్పింది. సీఆర్‌పీసీ సెక్షన్ 125 అనేది కేవలం విడాకులు పొందిన భారతీయ మహిళలకే కాదని మహిళలందరికీ వర్తిస్తుందని తెలిపింది. 'ముస్లిం చట్టం కింద పెళ్లాడి విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలకు సీఆర్‌పీసీ–125 సెక్షన్‌తో పాటు, ముస్లిం మహిళా యాక్ట్–1986 వర్తిస్తుంది' అని ధర్మాసనం తేల్చింది.



''భార్యకు స్వతంత్ర ఆదాయ వనరు లేనప్పుడు వ్యక్తిగత అవసరాలకు ఆర్థిక వనరులు అందుబాటులో ఉంచడం ద్వారా ఆమెకు ఆర్థిక సాధికారత కల్పించాలనే వాస్తవాన్ని భారతీయ వివాహితుడు తప్పనిసరిగా తెలుసుకోవాలి. భారతీయ మహిళలకు ఆర్థిక, నివాస భద్రత రెండూ ముఖ్యమే. వారి వ్యక్తిగత ఖర్చుల నిమిత్తం ఉమ్మడి బ్యాంకు ఖాతా లేదా ఏటీఎం కార్డు అందుబాటులో ఉంచాలి''

– జస్టిస్ బీవీ నాగరత్న

స్త్రీల త్యాగాలను గుర్తించాలి

తన భార్యకు భరణం చెల్లించాల్సిన అవసరం లేదని తెలంగాణకు చెందిన అబ్దుల్ సమద్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గృహనిర్మాతలుగా పేరుగాంచిన ప్పటికీ వారికి ఇంకా గౌరవం, సాధికారత కల్పించాల్సి ఉందని అభిప్రాయపడింది. ట్రయల్ కోర్టు ఆదేశాలు సవరిస్తూ నెలకు రూ.10 వేల భరణం భార్యకు చెల్లించాలంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు సవాల్ చేస్తూ సమద్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ నాగరత్న, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌ల ధర్మాసనం విచారించి ఫిబ్రవరి 19న రిజర్వు చేసిన తీర్పును బుధవారం వెలువరించింది. వేర్వేరు తీర్పుల్లోనూ ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ విడాకులు పొందిన ముస్లిం మహిళలూ భరణానికి అర్హులేనని స్పష్టం చేసింది. విడాకులు పొందిన ముస్లిం మహిళల మెయింటెనెన్స్‌తో పాటు మెహర్, డవర్, ఆస్తి తిరిగి ఇవ్వడాన్ని ముస్లిం మహిళల (విడాకుల హక్కుల పరిరక్షణ) చట్టం, 1986 సెక్షన్ 3 ప్రస్తావిస్తుందని, అందువల్ల సీఆర్‌పీసీ 125 సెక్షన్ అవసరం రాదంటూ పిటిషనర్ తరఫు న్యాయవాది చేసిన వాదనలను తోసిపుచ్చింది. ముస్లిం మహిళల చట్టంతో పాటు సీఆర్‌పీసీ సెక్షన్ 125కు కూడా ముస్లిం మహిళలు అర్హత కలిగి ఉండాలంటూ పలు సూచనలతో అమికస్ క్యూరీ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకొంటున్నట్లు పేర్కొంది. ముస్లిం మహిళల చట్టం– 1986లోని నిబంధనలు సెక్యులర్ చట్టాన్ని అతిక్రమించలేవని తెలిపింది. గృహిణి అయిన భార్య మానసికంగా, ఇతరత్రా తమపై ఆధారపడుతుందని కొంతమంది భర్తలు గుర్తించరని, కుటుంబం కోసం వారి పాత్ర, త్యాగ్యాలు పురుషులు గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందని తీర్పులో పేర్కొంది. మహిళల ఆర్థిక భద్రత, గృహ భద్రతను పరిరక్షించాల్సిన అవసరం ఉందని, అప్పుడే స్త్రీలు నిజమైన సాధికారికతను సాధించగలరని జస్టిస్ నాగరత్న అభిప్రాయపడ్డారు. భారతీయ కుటుంబ వ్యవస్థకు సిసలైన బలం, వెన్నుముక మహిళేనని పేర్కొన్నారు. సీఆర్‌పీసీ సెక్షన్ 125 కింద క్లెయిమ్ దాఖలు చేసుకోవడానికి ముస్లిం మహిళలకు అర్హత నిషేధమని పార్లమెంటు చేసిన చట్టంలోని నిబంధనలు సూచిస్తున్నాయన్న పిటిషనర్ వాదనను ఖండించింది. అటువంటి ఉద్దేశమే పార్లమెంటుకు ఉంటే కచ్చితమైన నిర్దిష్టమైన భాషలో స్పష్టం చేయాలని అభిప్రాయపడింది. అబ్దుల్ సమద్ తన భార్యకు రూ.10 వేలు మధ్యంతర భృతి కింద ఇవ్వాలనే తెలంగాణ హైకోర్టు తీర్పును సమర్థిస్తున్నట్లు పేర్కొంది.

కశ్మీర్ ఉగ్రవాదుల చేతికి అమెరికా తుపాకులు

న్యూఢిల్లీ: అఫ్గానిస్తాన్ నుంచి 2021లో నిష్క్రమించిన సందర్భంగా అమెరికా సేనలు అక్కడే వదిలేసిన అత్యాధునిక తుపాకులు పాకిస్తాన్ మీదుగా జమ్మూకశ్మీర్ ఉగ్రవాదుల చేతికందాయని నిపుణులు చెబుతున్నారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడి ఘటనల్లో వీటిని విరివిరిగా వాడటంపై విశ్లేషకులు ఆందోళన వ్యక్తంచేశారు. వీటిల్లో ముఖ్యంగా ఎం4 కార్బైన్ అసాల్ట్ రైఫిల్ ప్రధానమైంది. అత్యంత తేలిగ్గా ఉంటూ, మేగజీన్‌ను సులువుగా మారుస్తూ సునాయాసంగా షూట్‌చేసే వెలుసుబాటు ఈ రైఫిల్‌లో ఉంది. దాదాపు 600 మీటర్ల దూరంలోని లక్ష్యాలనూ గురిచూసి కొట్టొచ్చు. నిమిషానికి 700–970 బుల్లెట్ల వర్షం కురిపించే సత్తా ఈ రైఫిల్ సొంతం. ఇంతటి వినాశకర రైఫిళ్లు కశ్మీర్ ముష్కరమూకల చేతికి రావడంతో దూరం నుంచే మెరుపు దాడులు చేస్తూ సునాయాసంగా తప్పించుకుంటున్నారని రక్షణ రంగ నిపుణుడు లెఫ్టినెంట్ జనరల్ సంజయ్ కులకర్ణి అసహనం వ్యక్తంచేశారు. 2017 నవంబర్‌లో జైషే మొహమ్మద్ చీఫ్ మసూద్ అజర్ బంధువు రషీద్‌ను సైన్యం మట్టుబెట్టినపుడు అక్కడ తొలిసారిగా ఎం4 రైఫిల్‌ను సైన్యం స్వాధీనంచేసుకుంది. 2018లో, 2022లో ఇలా పలు సందర్భాల్లో ఉగ్రవాదుల ఎన్‌కౌంటర్ ఘటనాస్థలిలో ఈ రైఫిళ్లను భారత ఆర్మీ గుర్తించింది. జూలై 8వ తేదీన కథువాలో ఐదుగురు జవాన్లను పొట్టనబెట్టుకున్న ఉగ్రదాడిలోనూ ఇవే రైఫిళ్లను వాడారని తెలుస్తోంది.

యూపీలో ఘోరం

పాల ట్యాంకర్‌ను ఢీకొట్టిన బస్సు ● 18 మంది మృతి

ఉన్నావ్(యూపీ): తెల్లవారుజామున 5 గంటలు. డబుల్ డెక్కర్ స్లీపర్ బస్సు బిహార్ నుంచి ఢిల్లీకి వెళ్తోంది. ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్నారు. ఒక్కసారిగా పెద్ద శబ్దం. కళ్లు తెరిచి ఏం జరిగిందో తెలుసుకునేలోపే కొందరు ప్రాణాలు గాల్లో కలిశాయి. కుప్పలుగా మృతదేహాలు. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ సమీపంలో బుధవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదస్థలిలో కనిపించిన భీతావహ దృశ్యమిది. ఆగ్రా– లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై పాల ట్యాంకర్‌ను 60 మంది ప్రయాణికులతో ఢిల్లీకి వెళ్తున్న బస్సు వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. 19 మంది గాయపడ్డారు. బెహ్తా ముజావర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జోజికోట్ గ్రామ సమీపంలో తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50,000 చొప్పున ప్రధాని కార్యాలయం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది.

ఆరుగురి కుటుంబసభ్యుల్ని కోల్పోయా..

' 8మంది కుటుంబసభ్యులం ప్రయాణిస్తున్నాం. ఆరుగురు కుటుంబసభ్యులను కోల్పోయా. ప్రమాదస్థలికి ముందుగా వచ్చిన వాళ్లు మమ్మల్ని రక్షించాల్సిందిపోయి వీడియోలు తీసుకున్నారు'' అని బస్సు ప్రయాణికుడు దిల్షాద్ బోరుమన్నాడు. ఘటన సమయంలో రెండు వాహనాలు అతి వేగంతో వెళ్తున్నాయని, ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించిన బస్సు.. ముందున్న ట్యాంకర్‌ను ఢీకొట్టిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఉన్నావ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్పందించారు. ''మరణించిన వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా''అని 'ఎక్స్'లో పోస్టు చేశారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులను సీఎం యోగి ఆదేశించారు. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ చీఫ్ ఖర్గే సంతాపం తెలిపారు.

ఎయిర్–డిఫెన్స్ వ్యవస్థలు అందజేస్తాం

యుద్ధంలో రష్యాకు ఓటమి తథ్యం ● అమెరికా అధ్యక్షుడు జో బైడెన్

వాషింగ్టన్: ఉక్రెయిన్–రష్యా యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ యుద్ధంలో రష్యాకు పరాభవం తప్పదని తేల్చిచెప్పారు. ఉక్రెయిన్‌కు అండగా నిలుస్తామని, గగనతలంలో శత్రువును మట్టికరిపించే ఎయిర్–డిఫెన్స్ వ్యవస్థలు అందజేస్తామని ప్రకటించారు. తాజాగా 'నాటో' 75వ సదస్సులో బైడెన్ ప్రసంగించారు. అమెరికాతోపాటు జర్మనీ, నెదర్లాండ్స్, రొమేనియా, ఇటలీ దేశాలు ఉక్రెయిన్‌కు అదనంగా ఐదు వ్యూహాత్మక ఎయిర్–డిఫెన్స్ వ్యవస్థలను అందజేయబోతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో పదుల సంఖ్యలో టాక్టికల్ ఎయిర్–డిఫెన్స్ వ్యవస్థలను ఉక్రెయిన్‌కు ఇవ్వబోతున్నామని వెల్లడించారు. తాము అందజేసే క్రిటికల్ ఎయిర్–డిఫెన్స్ ఇంటర్‌సెప్టర్లతో రష్యాపై యుద్ధంలో ఉక్రెయిన్ పైచేయి సాధిస్తుందని స్పష్టం చేశారు. రష్యా క్షిపణుల దాడులు, వైమానిక దాడుల నుంచి ఉక్రెయిన్ నగరాలతోపాటు ఉక్రెయిన్ సైన్యాన్ని కాపాడే ఇంటర్‌సెప్టర్లను వందల సంఖ్యలో అందిస్తామని పేర్కొన్నారు. యుద్ధంలో 3.50 లక్షల మందికి పైగా రష్యా సైనికులు మరణించడమో, గాయపడడమో జరిగిందని చెప్పారు. ఉక్రెయిన్ స్వేచ్ఛాయుతమైన, స్వతంత్రదేశంగా కొనసాగుతుందని ఉద్ఘాటించారు.

ఎన్నికల దాకా ఎదురు చూడాలా?: జెలెన్‌స్కీ

ఈ ఏడాది నవంబర్‌లో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల కంటే ముందే రష్యా అధినేత పుతిన్‌కు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. నాటో సదస్సులో ఆయన మాట్లాడారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల దాకా ప్రపంచం ఎదురు చూడొద్దని చెప్పారు.

ఉక్రెయిన్‌కు ఎఫ్–16 ఫైటర్ జెట్లు ఇస్తాం: నార్వే

ఉక్రెయిన్‌కు ఆరు ఎఫ్16 ఫైటర్ జెట్లు అందజేస్తామని నాటో సభ్యదేశమైన నార్వే ప్రధాని జోనాస్ ప్రకటించారు. అయితే, ఎప్పటి నుంచి ఈ యుద్ధ విమానాలు ఉక్రెయిన్‌కు అందజేస్తారన్నది ఆయన వెల్లడించలేదు.

ఆగని దారుణ దాడులు

గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 20 మంది దుర్మరణం

డెయిర్ అల్ బాలాహ్: గాజా భూతలంపై ఇజ్రాయెల్ గగనతల దాడులు ఆగట్లేవు. వరసగా రెండో రోజైన బుధవారం తెల్లవారుజామున సైతం సెంట్రల్ గాజాలోని డెయిర్ అల్ బాలాహ్ పట్టణంపై ఇజ్రాయెల్ భీకర దాడులకు తెగబడింది. ఇజ్రాయెల్ స్వయంగా ప్రకటించిన 'సేఫ్ జోన్'లో తలదాచుకుంటున్న వారిపైనా దాడులు చేసింది. దీంతో ఈ దాడుల్లో ఆరుగురు చిన్నారులు, ముగ్గురు మహిళలుసహా 20 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. నుసేరాత్ శరణార్థి శిబిరంపై దాడిలో ఐదుగురు చిన్నారులుసహా 12 మంది చనిపోయారని అల్–అల్వా స్మారక ఆస్పత్రి ప్రకటించింది. డెయిర్ అల్ బాలాహ్ పట్టణంలోని మరో ఇంటిపై జరిగిన దాడిలో ఒక చిన్నారి, ముగ్గురు మహిళలు, నలుగురు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఈ రెండు ఇళ్లు ఇప్పటికే ఇజ్రాయెల్ ప్రకటించిన 'మానవతా రక్షిత ప్రాంతం'లో ఉండటం గమనార్హం. దోహాలో అమెరికా, ఈజిప్ట్, ఖతార్ దేశాల మధ్యవర్తులు హమాస్–ఇజ్రాయెల్ యుద్ధం ముగింపు కోసం సంధి ప్రయత్నాలు చేస్తున్నవేళ ఈ దాడులు జరగడం గమనార్హం. గాజా సిటీని ఖాళీచేయాలంటూ బుధవారం ఇజ్రాయెల్ ఆకాశం నుంచి కరపత్రాలను వెదజల్లింది. హమాస్ మిలిటెంట్లు మళ్లీ గాజాసిటీలో ఎక్కువవడంతో వారి నిర్మూలనే లక్ష్యంగా సాధారణ ప్రజలు నగరాన్ని ఖాళీచేసి దక్షిణంవైపు తరలిపోవాలని ఆ కరపత్రాల్లో ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించింది.

3, 6 పుస్తకాల్లోనే మార్పులు: ఎన్‌సీఈఆర్‌టీ

సాక్షి, న్యూఢిల్లీ: మూడు, ఆరు తరగతులు మినహా పాఠ్య పుస్తకాల్లో ఎలాంటి మార్పు లేదని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) స్పష్టం చేసింది. ఆరు, తొమ్మిది, 11వ తరగతి పాఠ్యపుస్తకాలు, పాఠ్యాంశాల మార్పుపై వస్తున్న వదంతులను ఖండించింది. అన్ని గ్రేడ్‌లకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను ఈ నెలలోపు అందజేస్తామని తెలిపింది.



ఐఎస్ఎస్ నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా మాట్లాడుతున్న సునీత, విల్మోర్

స్టార్ లైనర్‌లోనే సురక్షితంగా తిరిగొస్తాం

ధీమా వెలిబుచ్చిన నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్

కేప్‌కనవెరాల్: బోయింగ్ అంతరిక్ష నౌక 'స్టార్ లైనర్'లో పలు సమస్యలు తలెత్తినప్పటికీ.. తాము అందులోనే భూమికి సురక్షితంగా తిరిగి వస్తామనే విశ్వాసం ఉందని అంతర్జాతీయ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)లో ఉన్న వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు బుధవారం తెలిపారు. స్టార్ లైనర్ తొలి మానవసహిత రోదసీ యాత్రలో జూన్ 5న సునీత, విల్మోర్‌లు అంతరిక్షంలోకి వెళ్లారు. హీలియం వాయువు లీక్ కావడం, థ్రస్టర్ల వైఫల్యం కారణంగా అంతర్జాతీయ స్పేస్ స్టేషన్‌తో అతికష్టం మీద అనుసంధానం కాగలిగారు. ఎనిమిది రోజుల అనంతరం భూమికి తిరిగి రావాల్సిన వీరిద్దరూ రాకెట్‌లో సమస్యల వల్ల ఐఎస్ఎస్‌లోనే చిక్కుబడిపోయారు. ఐఎస్ఎస్ నుంచి బుధవారం వీరిద్దరూ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. థ్రస్టర్‌ను పరీక్షించడం పూర్తయ్యాక తిరుగు ప్రయాణమవుతామన్నారు. రోదసీలో ఎక్కువ సమయం ఉండాల్సి రావడం పట్ల తమకేమీ ఫిర్యాదులు లేవని, ఐఎస్ఎస్‌లోని ఇతర వ్యోమగాములకు సహాయపడటాన్ని ఆస్వాదిస్తున్నామని తెలిపారు. 'స్టార్ లైనర్ మమ్మల్ని భూమికి చేర్చుతుందని నా మనసు చెబుతోంది. సమస్యేమీ లేదు' అని సునీతా విలియమ్స్ విలేకరులతో అన్నారు.

సిటీ టు చైనా, రష్యా!

హైదరాబాద్ కేంద్రంగా అంతర్జాతీయ ఐఫోన్ల చోరీ ముఠాలు..

- నగరంలో చోరీ చేస్తున్న సాధారణ నేరగాళ్లు
- వాటిని తక్కువ ధరకు కొంటున్న కొందరు వ్యాపారులు
- రిటర్న్ మాల్ ముసుగులో విదేశాలకు స్మగ్లింగ్
- రష్యాకు చెందిన హ్యాకర్ల సాయంతో బాధితులకు ఎర
- యాపిల్ ఐడీ, పాస్‌వర్డ్‌లు సేకరించి ఫోన్ల అన్‌లాక్
- చైనా, రష్యాల్లో ఆన్‌లైన్‌లో ఉంచి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్న గ్యాంగ్

బాధితుల్లో చాలా మంది ఐటీ రంగానికి చెందిన ఉద్యోగులే..



సాక్షి, హైదరాబాద్

→ మీ ఐఫోన్ చోరీ అయింది.. వరుసగా చేతులు మారింది.. కొన్ని రోజుల్లోనే దేశం దాటింది.. మీ ఫోన్ దొరికిందంటూ మీదే మరో నంబర్‌కు మెసేజ్ వచ్చింది.. అందులోని లింక్ ఓపెన్ చేసి ఆ ఫోన్ తాలూకు ఐడీ, పాస్‌వర్డ్ ఎంటర్ చేస్తే.. ఫోన్ లొకేషన్ తెలుస్తుందని నోట్ కనిపించింది. హమ్మయ్య ఫోన్ దొరికినట్టేనని ఐడీ, పాస్‌వర్డ్ ఎంటర్ చేస్తే.. అంతా రివర్సైంది. ఆ ఐఫోన్‌ను దర్జాగా మరెవరో వాడేస్తుంటే.. మీరు బిక్కముఖం వేసుకుని ఉండిపోవాల్సి వచ్చింది.

...ఇదేదో కథ కాదు.. హైదరాబాద్ కేంద్రంగా ఐఫోన్లను చోరీ చేస్తున్న అంతర్జాతీయ ముఠా వ్యవహారమిది. ఎంతో భద్రమైన ఐఫోన్లను, వాటి ఓనర్లను సింపుల్‌గా ఏమార్చేసి ఫోన్లను కొల్లగొట్టేస్తున్నారు.

→ ఐఫోన్లు ఉన్నవారిని టార్గెట్ చేసి, వాటిని తస్కరించి విదేశాలకు తరలించేస్తున్న అంతర్జాతీయ ముఠాలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయి. వ్యవస్థీకృతంగా సాగుతున్న ఈ దందాలో చోరీ చేసేవారి నుంచి వ్యాపారులు, హ్యాకర్ల దాకా చాలా మంది హస్తం ఉంటోంది. అందులోనూ ఐటీ ఉద్యోగులకు చెందిన ఐఫోన్లను ఎక్కువగా టార్గెట్ చేస్తున్నారని.. రష్యా, చైనాల్లో ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలు జరుగుతున్న ఐఫోన్లలో చాలా వరకు చోరీ అయినవే ఉంటున్నాయని పోలీసు వర్గాలు చెప్తున్నారు.

సెకండ్ హ్యాండ్ వ్యాపారుల ద్వారా..


→ అంతర్జాతీయ ముఠాలు హైదరాబాద్‌తో పాటు దేశంలోని పెద్ద నగరాల్లో దళారులను ఏర్పాటు చేసుకుంటున్నాయి. వారు స్థానిక వ్యాపారులతో సిండికేట్ అయి చోరీ ఐఫోన్లను చీప్ రేటుకు కొంటున్నారు. ఫోన్లను తస్కరించిన చోరులు వాటిని వెంటనే స్విచ్చాఫ్ చేసి.. స్థానిక సెకండ్ హ్యాండ్ వ్యాపారులకు అమ్ముతున్నారు. వారి నుంచి దళారులకు చేరుతున్నాయి.

తప్పుడు ఎస్సెమ్మెస్..

ఐఫోన్లు కోల్పోయినవారిలో చాలా మంది ఐక్లౌడ్‌లోకి లాగిన్ అయి తమ ఫోన్ పోయినట్టు.. 'లాస్ట్ మోడ్'లో పెట్టి, 'బ్రాడ్‌కాస్ట్ మెసేజ్' టైప్ చేస్తున్నారు. అంటే ఆ ఫోన్ ఎవరికి దొరికినా, దాన్ని ఆన్ చేయగానే స్క్రీన్‌పై 'ఈ ఫోన్ నేను పోగొట్టుకున్నాను' అన్న సందేశంతోపాటు బాధితుడి ఫోన్ నంబర్ డిస్‌ప్లే అవుతుంది. దీన్ని ముఠా సభ్యుల్లోని హ్యాకర్లు ఆసరాగా తీసుకుంటున్నారు. బాధితుల నంబర్లకు ఐక్లౌడ్‌ను పోలినట్టుగా ఒక్క అక్షరం మార్చి నకిలీ బల్క్ మెసేజీలు పంపుతున్నారు. 'మీరు పోగొట్టుకున్న ఐఫోన్‌ను గుర్తించాం, ఈ లింక్ క్లిక్ చేయండి' అని పేర్కొంటున్నారు. బాధితులు అది ఐక్లౌడ్ నుంచి వచ్చిన మెసేజీ అని భావించి, లింక్ క్లిక్ చేస్తున్నారు. ఆ లింకు నేరుగా హ్యాకర్లు సృష్టించిన నకిలీ ఐక్లౌడ్ ప్రాక్సీ సైట్‌కు చేరుతోంది.

లొకేషన్ తెలుస్తుందంటూ ఐడీ, పాస్‌వర్డ్ అడిగి..

→ ప్రాక్సీ సైట్‌లో ఫోన్ లొకేషన్ తెలుసుకోవాలంటే.. మీ యాపిల్ ఐడీ, పాస్‌వర్డ్ ఎంటర్ చేయమని అడుగుతుంది. బాధితులు అది నిజమని నమ్మి వివరాలు ఎంటర్ చేస్తుండటంతో.. వివరాలు ముఠాకు చేరిపోతున్నాయి. ఆ ఐడీ, పాస్‌వర్డ్‌తో ఫోన్లను అన్‌లాక్ చేస్తున్న ముఠా సభ్యులు.. వాటి ఐఎంఈఐ నంబర్‌ను క్లోనింగ్ ద్వారా మార్చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో భారత్ సహా ఇతర దేశాల్లో అమ్మేస్తున్నారు. క్లోనింగ్ సాధ్యం కాకుంటే.. రష్యా, చైనా, తదితర దేశాల్లో



విక్రయిస్తున్నారు. ఐఎంఈఐ నంబర్ మారితే మన దేశంలో ఉన్నా ట్రాక్ చేయడం సాధ్యం కాదు. మారకపోయినా ఫోన్ విదేశాల్లో ఉంటే మన పోలీసులు గుర్తించలేరు. ఈ కారణంగానే చోరీకి గురైన, పోగొట్టుకున్న ఐఫోన్లు ట్రాక్ కావట్లేదని పోలీసులు చెప్తున్నారు.

రిటర్న్ మాల్ ముసుగులో విదేశాలకు..

గ్రేటర్ నగరంతోపాటు ఉత్తరాదిలోని వివిధ మెట్రో సిటీలకు రష్యా, చైనాల నుంచి వివిధ రకాల వస్తువులు దిగుమతి అవుతూ ఉంటాయి. అందులో క్వాలిటీలోపంతో ఉన్నవి ఆయా దేశాలకు రిటర్న్ పంపుతూ ఉంటారు. అలాంటి వ్యాపారులతో ఒప్పందాలు చేసుకుంటున్న దళారులు.. వస్తువుల రిటర్న్ పేరిట చోరీ ఐఫోన్లను ఆయా దేశాలకు తరలించేస్తున్నారు. లేకుంటే పార్శిల్స్ రూపంలో దుబాయ్ మీదుగా తరలిస్తున్నారు. నిజానికి ఐఫోన్లు చాలా సెక్యూర్ అని, తస్కరణకు గురైనా వాటి ఆచూకీ కనిపెట్టవచ్చని భావిస్తుంటారు. కానీ అంతర్జాతీయ ముఠాలు హ్యాకర్ల సాయంతో వాటిని అన్‌లాక్ చేస్తున్నాయి.

చోరీకి గురైతే బ్రాడ్‌కాస్ట్ మెసేజ్ వద్దు

ఐఫోన్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. ఫోన్ పోగొట్టుకుంటే ఐక్లౌడ్‌లో బ్రాడ్‌కాస్ట్ మెసేజ్ పెట్టినా ఇబ్బంది ఉండకపోవచ్చు. చోరీకి గురైతే మాత్రం మెసేజ్ పెట్టొద్దు. అలా చేస్తే నేరగాళ్లు హ్యాకర్ల సాయంతో మీ వ్యక్తిగత వివరాలు సంగ్రహించడానికి అవకాశం ఉంటుంది. ఈ తరహా బాధితులు ఇటీవలి కాలంలో పెరుగుతున్నారు. మీ ఫోన్ లొకేషన్ తెలుసుకోండి అంటూ హ్యాకర్లు పంపే లింకు ఒక్కసారే ఓపెన్ అవుతుంది. రెండోసారి ప్రయత్నిస్తే 'డిసెప్టివ్ వెబ్‌సైట్ వార్నింగ్' అంటూ డిస్‌ప్లే అవుతుంది.

\- సైబర్ క్రైమ్ అధికారులు





GOల్ఫ్ ఆడేద్దాం

- నగర జీవనశైలిలో భాగమైన క్రీడ.. లగ్జరీ వసతుల జాబితాలో చోటు
- ఆట వచ్చినా స్టేటస్ సింబలే.. ఒత్తిడి, మానసిక, శారీరక వికాసానికి పరిష్కారం
- శివారు ప్రాంతాల్లో గోల్ఫ్ కోర్స్ ప్రాపర్టీల అభివృద్ధి
- వీటితో భూముల విలువ రెట్టింపు

- వివరాలు 13లో

అనసూయ ఇక అనుకతీర్ సూర్య



సివిల్ సర్వీసుల చరిత్రలో తొలిసారి ఐఆర్ఎస్ అధికారిణి పేరు, జెండర్ మార్పు

నగరంలో సీఈఎస్టీఏటీ విభాగంలో సీనియర్ జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్న అనుకతీర్ సూర్య

ఇండియన్ సివిల్ సర్వీసుల చరిత్రలో తొలిసారి కీలక పరిణామం చోటు చేసుకుంది. ఓ సివిల్ సర్వీస్ (సీనియర్ ఐఆర్ఎస్) అధికారిణి తన పేరుతో పాటు జెండర్‌ను మార్చుకునేందుకు కేంద్ర ఆర్థిక శాఖ అనుమతిచ్చింది. కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అన్ని రికార్డుల్లో సదరు అధికారిణి పేరు, జెండర్ ఇతర వివరాలు మారిపోనున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా కస్టమ్స్ ఎక్సైజ్ అండ్ సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (సీఈఎస్టీఏటీ) విభాగంలో 35 ఏళ్ల అనసూయ సీనియర్ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే తన పేరును అనసూయకు బదులు ఎం.అనుకతీర్ సూర్యగా, తన జెండర్‌ను (స్త్రీ నుంచి పురుషుడిగా) మార్చాలని కేంద్రానికి అభ్యర్థించారు. అందుకు కేంద్రం సానుకూలంగా స్పందించింది. అనసూయ పేరును ఎం.అనుకతీర్ సూర్యగా మార్చడంతో పాటు జెండర్ మార్చేందుకు అంగీకరిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. అనుకతీర్ సూర్య 2013 బ్యాచ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారిణి. డిసెంబర్‌లో చెన్నైలో అసిస్టెంట్ కమిషనర్‌గా కెరీర్‌ను ప్రారంభించారు. 2018లో డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. గతేడాది హైదరాబాద్‌కు ట్రాన్స్ ఫర్ అయ్యారు. అతను చెన్నైలోని మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో బ్యాచిలర్ డిగ్రీని, 2023లో భోపాల్‌లోని నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్సిటీ నుంచి సైబర్ లా అండ్ సైబర్ ఫోరెన్సిక్‌లో పీజీ డిప్లొమా పూర్తి చేశారు.

గతంలో ఒడిశాలో..

సుప్రీంకోర్టు 2014, ఏప్రిల్‌లో నల్సా (నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ) కేసులో థర్డ్ జెండర్‌ను గుర్తిస్తూ.. ఒక వ్యక్తి సెక్స్ రీఅసైన్‌మెంట్ సర్జరీ చేయించుకున్నా, చేయించుకోపోయినా లింగ గుర్తింపు అనేది వ్యక్తిగత ఎంపిక అని తీర్పునిచ్చింది. ఒడిశాకు చెందిన కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ కూడా 2015లో తన జెండర్ మార్చుకోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఐశ్వర్య రితుపర్ణ ప్రధాన్‌గా (పురుషుడి నుంచి స్త్రీగా) జెండర్‌ను మార్చుకున్నారు.

- సాక్షి, సెంట్రల్ డెస్క్



మెట్రో రెండోదశ ప్రాజెక్టుపై జాతీయ రహదారుల సంస్థ, హెచ్ఏఎంఎల్ రెండురోజుల సంయుక్త పరిశీలన..

పటాన్‌చెరు రూట్‌లో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్

గంగారం వద్ద 1.2 కిలోమీటర్ల వరకు.. జాతీయ రహదారుల సంస్థకు ప్రతిపాదించిన 'మెట్రో'

సాక్షి, హైదరాబాద్

→ మెట్రో రెండోదశ ప్రాజెక్టులో భాగంగా మియాపూర్-పటాన్‌చెరు కారిడార్‌లో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ రానుంది. ఈ మేరకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) ప్రతిపాదించింది. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు సుమారు 13 కిలోమీటర్ల మెట్రో కారిడార్ నిర్మాణంలో బీహెచ్ఈఎల్ జంక్షన్ మినహా చాలావరకు రోడ్డు మధ్యలోనే (సెంట్రల్ మీడియన్) మెట్రో వయాడక్ట్(ట్రాక్) నిర్మించనున్నారు. ఈ మార్గంలో మదీనాగూడ ప్రాంతంలోని గంగారం వద్ద 1.2 కిలోమీటర్ల వరకు ఫ్లై ఓవర్ నిర్మించనున్నట్టు జాతీయ రహదారుల సంస్థ ప్రతిపాదించింది. అయితే ఇక్కడ మెట్రో వయాడక్ట్‌తో కూడిన డబుల్ డెక్కర్ ఫ్లైవర్ నిర్మించాలని హెచ్ఏఎంఎల్ భావిస్తోంది. హైదరాబాద్ మెట్రోరైల్, నేషనల్ హైవేస్ అథారిటీ కలిసి సంయుక్తంగా డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మిస్తే బాగుంటుందని మెట్రోరైల్ అధికారులు భావిస్తున్నారు. దీనిపై ప్రణాళికలు సిద్ధం చేసి నేషనల్ హైవేస్‌కు అందజేయనున్నారు. మెట్రో రెండోదశలో వివిధ రూట్‌లలో నిర్మించనున్న కారిడార్‌లపై జాతీయరహదారుల సంస్థ అధికారులు, మెట్రో రైల్ అధికారులు రెండురోజులు సంయుక్త తనిఖీలు నిర్వహించారు.మియాపూర్-పటాన్‌చెరు తోపాటు, ఎల్‌బీనగర్-హయత్‌నగర్, మైలార్‌దేవ్‌పల్లి-ఆరాంఘర్-హైకోర్టు రూట్‌లను పరిశీలించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ మెట్రో భవ న్‌లో రెండు సంస్థలకు చెందిన అధికారు లు, మెట్రో రెండోదశ కన్సల్టెన్సీ సిస్ట్రాకు చెందిన ప్రతినిధులతో హెఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి సమావేశమయ్యారు. వారితో ప్రతిపాదిత మెట్రో కారిడార్లపై సమీక్షించారు.

కింద రోడ్డు.. పైన మెట్రో

→ గంగారం వద్ద ప్రస్తుతం ఉన్న 1.2 కిలోమీటర్ల రోడ్డుమార్గంలో రెండువైపులా భూమిలోపల అండర్‌గ్రౌండ్, ఓవర్‌హెడ్ నిర్మాణాలు ఉన్నాయి. అక్కడ ఓ మతపరమైన కట్టడం కూడా ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకొని నేషనల్ హైవేస్ అధికారులు ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు కింద రోడ్డు, దానిపైన మెట్రో రైలు పరుగులు తీసేవిధంగా వయడక్ట్(ట్రాక్) ఉండేవిధంగా డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మించాలని రెండు సంస్థలు కలిసి ప్రతిపాదించాయి.

→ బీహెచ్ఈఎల్ జంక్షన్ వద్ద ఫ్లైఓవర్‌కు ఎడమవైపున ఆర్టీసీ బస్టాప్ వద్ద మెట్రోస్టేషన్ నిర్మిస్తారు. దీంతో మెట్రో ప్రయాణికులు సిటీ బస్సుల్లోకి మారేందుకు ఈజీగా అవకాశం ఉంటుంది.

→ నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ మీదుగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు నిర్మించనున్న మెట్రో కారిడార్‌లో భాగంగా మైలార్‌దేవ్‌పల్లి నుంచి కొత్తగా నిర్మించనున్న హైకోర్టు వరకు 5 కిలోమీటర్ల మేర కారిడార్‌ను పొడిగించనున్న సంగతి తెలిసిందే. ఈ రూట్‌లో పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవేకు ఎడమవైపున

మైలార్‌దేవ్‌పల్లి రూట్‌లో మార్పులు

ఆరాంఘర్ నుంచి మెట్రో అలైన్‌మెంట్ మొదట ప్రతిపాదించారు. ప్రస్తుతం దానిని ఆరాంఘర్ వైపు కాకుండా పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవేకు కుడివైపున ఉన్న అగ్రికల్చర్ వర్సిటీ వైపు మార్చాలని నిర్ణయించారు. పీవీఎన్ఆర్ హైవేకు, అగ్రికల్చర్ వర్సిటీ ఫ్లైఓవర్‌కు మధ్య నుంచి మెట్రో అలైన్‌మెంట్ వెళుతుంది.

ఫేజ్1, ఫేజ్2 ప్రతిపాదిత కారిడార్లు..



ఎల్‌బీనగర్-హయత్‌నగర్ రూట్‌లో స్టేషన్ల మార్పు

→ మెట్రో రెండోదశలో భాగంగా ఎల్‌బీనగర్ మెట్రోస్టేషన్ నుంచి హయత్‌నగర్ మధ్య 7 కిలోమీటర్ల వరకు నిర్మించనున్న మెట్రో కారిడార్‌లో కూడా స్వల్ప మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఈ మేరకు నేషనల్ హైవేస్, మెట్రోరైల్ అధికారుల సంయుక్త తనిఖీల్లో ప్రతిపాదించారు. ఈ కారిడార్‌లో రెండు జీహెచ్ఎంసీ ఫ్లైఓవర్‌లు ఉన్నాయి. ఎల్‌బీనగర్ నుంచి చింతల్‌కుంట వరకు సెంట్రల్ మీడియన్‌లోనే మెట్రో అలైన్‌మెంట్ ప్రతిపాదించారు. చింతల్‌కుంట నుంచి హయత్‌నగర్ వరకు మాత్రం రోడ్డు మధ్యలో కాకుండా ఎడమవైపు ఉన్న సర్వీస్ రోడ్డుకు మెట్రో అలైన్‌మెంట్ మార్చారు. ఈ మార్గంలో నేషనల్ హైవేస్



కొత్తగా నాలుగు ఫ్లైవర్ల నిర్మాణం చేపట్టిన దృష్ట్యా ఈ మేరకు అలైన్‌మెంట్‌లో మార్పులు చేసినట్టు అధికారులు తెలిపారు.

→ ఈ రూట్‌లో నిర్మించనున్న 6 మెట్రో స్టేషన్లను నేషనల్ హైవేకు రెండువైపులా సర్దుబాటు చేయాలని నిర్ణయించారు. ఈ మార్గంలో ప్రయాణికుల సీమ్‌లెస్ జర్నీకి అనుగుణంగా ఈ మార్పులు ఉంటాయని హైచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. రెండురోజుల పాటు కొనసాగిన ఈ సంయుక్త అధ్య యనంలో నేషనల్ హైవేస్ ఇన్‌చార్జ్ ఐ.గణపతిరెడ్డి, హెచ్ఏఎంఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ పి.ధర్మారెడ్డి, ఉన్నతాధికారులు బి.ఆనంద్‌మోహన్, వై.సాయపరెడ్డి, బీఎస్ రాజేశ్వర్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లవర్.. ఫేవర్



పూలదండ స్థానాన్ని భర్తీ చేస్తున్న బొకే కల్చర్

ఇంపోర్టెడ్ పూలకు పెరుగుతున్న డిమాండ్

శుభకార్యాల్లోనూ విరివిగా వినియోగం

థాయ్‌లాండ్, ఊటీ, బెంగళూర్, పుణేల నుంచి దిగుమతి


13లో



ప్రేమ ఖైదీ @ మండీ

నగరంలో పెద్దఎత్తున రెస్టారెంట్లు

- వివరాలు 13లో



సాక్షి హైదరాబాద్

గురువారం । 11 । జూలై । 2024



చెరువులపై శాటిలైట్ సర్వే!

ఆక్రమణల చెర నుంచి చెరువులు, కుంటలకు ఇక విముక్తి లభించనుంది. దీనిపై జిల్లా అధికారయంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. సీరియస్ యాక్షన్ ప్లాన్‌కు సిద్ధమైంది. -10లో



ప్రభం'జనం'!

హైదరాబాద్ మహా నగర జనాభా కాలంతో పాటు పెరుగుతోంది. ప్రస్తుతం కోటి మార్కును దాటింది. మరో ఆరేడేళ్లలో 1.30 కోట్లకు చేరుకుంటుందని అంచనా. -12లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.0/25.0

నగరంలో రానున్న 24 గంటల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది. గరిష్ఠంగా 32 డిగ్రీలు, కనిష్ఠంగా 25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చు.









ఎల్లమ్మ రథోత్సవం.. పోటెత్తిన భక్తజనం

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాల్లో చివరి ఘట్టమైన రథోత్సవం అశేష భక్తజనం మధ్య అత్యంత వైభవోపేతంగా జరిగింది. బుధవారం సాయంత్రం అమ్మవారి రథానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేసి, గుమ్మడి కాయతో దిష్టి తీసి ఊరేగింపును ప్రారంభించారు. అమ్మవారిని బల్కంపేట పురవీధుల్లో ఊరేగించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు రథాన్ని లాగి ఎల్లమ్మను దర్శించుకున్నారు. కోలాటం, సంప్రదాయ నృత్యాలు, పోతరాజులు, శివసత్తుల విన్యాసాలు అలరించాయి. దేవాలయ కార్యనిర్వహణ అధికారి అంజనీదేవి, చైర్మన్ సాయిబాబాగౌడ్ పాల్గొన్నారు. – అమీర్‌పేట



First Ever Factory Outlet
— Less Expense More Saving —
MUKUNDA JEWELLERS
DIAMONDS • GOLD • SILVER
Grand Opening
SOMAJIGUDA
TODAY
Flat 20% off on V.A.
OFFER VALID FROM
JULY 11TH - 21ST
ACROSS ALL 4 STORES
V.A. 2-12% NO MAKING CHARGES
Get 70% Exchange value on Silver Jewellery
Get 65% Exchange value on All Stones
Kukatpally +91 9133 866 449 +91 9912 866 449
Khammam +91 9703 710 916 +91 9703 770 916
Kothapet +91 7095 050 607 +91 7285 969 798
Somajiguda +91 7337 238 787 +91 8374 887 653

సాఫీగా సాగిపో..

గ్రేటర్‌లో ట్రాఫిక్ రద్దీ క్రమబద్ధీకరణకు సమగ్ర ప్రణాళిక

- 2,500 మంది అదనపు సిబ్బంది నియామకానికి ప్రతిపాదన
- రాత్రి వేళల్లోనూ ట్రాఫిక్ పోలీసుల విధులు
- ప్రజా రవాణా వినియోగించేలా అవగాహన సైతం..





ప్రజా రవాణాపై అవగాహన..

ట్రాఫిక్ విధులతో పాటు ప్రజా రవాణా వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. వ్యక్తిగత కార్ల వినియోగాన్ని తగ్గించి, సాధ్యమైనంత వరకు ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించేలా నగరవాసులలో అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కువ మంది ప్రజలు మెట్రో, బస్సులలో ప్రయాణిస్తే రోడ్లపై వాహనాల రద్దీ తగ్గడంతో పాటు వాతావరణ కాలుష్యం కూడా తగ్గుతుందని వివరిస్తున్నారు.

సాక్షి, సిటీ బ్యూరో: గ్రేటర్‌లో రహదారులపై ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించేందుకు పోలీసులు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేశారు. నగరంలోని ట్రాఫిక్ పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం తదనుగుణంగా ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. అదనపు ట్రాఫిక్ సిబ్బందిని నియమించడంతో పాటు ప్రజా రవాణాను వినియోగించేలా అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఇప్పటికే హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ట్రై కమిషనరేట్లలో అదనంగా 2,500 మంది ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. 24 గంటల పాటు రోడ్లపైనే ఉంటూ వాహనాలు, ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించడమే ఈ అదనపు సిబ్బంది విధి.

వానలకు ప్రత్యేక ఏర్పాట్లు..

వర్షాకాలంలో రహదారులపై నీరు నిల్వకుండా, వాహనాలు బ్రేక్ డౌన్ అయినా తక్షణమే స్పందించేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. ట్రావెల్ బస్సులు, భారీ వాహనాలు నగర రోడ్లపై కేటాయించిన సమయాల్లోనే వచ్చేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలలో ప్రధాన అంశాలు పరిష్కరించినట్లేనని, దీంతో రోడ్లపై వాహనాల కదలికలు సాఫీగా, వేగంగా జరుగుతాయి.

కెమెరాలతో గుర్తించి చలాన్లు..

రాంగ్ సైడ్ డ్రైవింగ్‌లపై గ్రేటర్ ట్రాఫిక్ విభాగం కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఎక్కువగా రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ఆటోమెటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటితో ఆయా ఉల్లంఘనదారులను గుర్తించి, ఈ– చలాన్లను విధిస్తున్నారు. ఫ్రీ లెఫ్ట్ బ్లాక్‌లు, వాహనాల బ్రేక్ డౌన్‌లే నగరంలో ట్రాఫిక్ సమస్యలకు ప్రధాన కారణమని గుర్తించిన పోలీసులు.. ఆయా అంశాలపై తక్షణమే స్పందించేందుకు ఈ అదనపు ట్రాఫిక్ పోలీసులు రోజంతా రోడ్లపైనే ఉండేలా ఆదేశాలు జారీ చేశారు.

'పీర్జాదిగూడ పీఠంపై తప్పుడు ప్రచారం చేయొద్దు'

ఉప్పల్: పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం అంటూ బుధవారం సోషల్ మీడియాలో సమాచారం హల్ చల్ చేసింది. దీనిపై పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి ఘాటుగా స్పందించారు. అసత్య ప్రచారాలను నమ్మవద్దని హితవు పలికారు. పీర్జాదిగూడలో అవిశ్వాస తీర్మానానికి సైతం అవకాశం లేదన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన 12 మంది కార్పొరేటర్లు తమ వైపే ఉన్నారన్నారు. ఇక్కడి డిప్యూటీ మేయర్ గోవా పర్యటనకు వెళితే క్యాంప్ రాజకీయాలు చేస్తున్నారంటూ దుష్ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ వెంకట్‌రెడ్డి దుయ్యబట్టారు.

5న స్టాండింగ్ కమిటీ స్థానానికి ఎన్నిక

ఈ నెల 12 నుంచి నామినేషన్ల స్వీకరణ

సాక్షి, సిటీబ్యూరో: బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా ఉన్న షాహీన్ బేగం (ఎర్రగడ్డ కార్పొరేటర్) మరణంతో ఖాళీ అయిన స్థానాన్ని భర్తీ చేసేందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 12 నుంచి 22 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ప్రభుత్వ సెలవు దినాలైన 13, 14,17, 21 తేదీల్లో మినహా మిగతా రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అర్హత పొందిన నామినేషన్ల వివరాలు 23న వెలువరిస్తారు. ఉపసంహరణ గడువు 26. ఆగస్టు 5న (పోటీ జరిగే పక్షంలో) పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు ఫలితం వెల్లడిస్తారు. జీహెచ్ఎంసీలో ప్రస్తుతం కార్పొరేటర్లుగా ఉన్న 146 మంది పోలింగ్‌లో పాల్గొనేందుకు అర్హులు. జీహెచ్ఎంసీ పాలకమండలి సభ్యులు 150 మందికిగాను ఇద్దరు ఎమ్మెల్యేలుగా ఎన్నికవడంతో వారి స్థానాలు ఖాళీ అయ్యాయి. మరో ఇద్దరు మరణించారు. దీంతో 146 మంది పోటీ చేసేందుకు, పోలింగ్‌లో పాల్గొనేందుకు అర్హులు. ఎంఐఎంకు చెందిన షాహీన్ బేగం మరణంతో ఈ ఎన్నిక జరగనుండటంతో అదే పార్టీ నుంచి అభ్యర్థి ఎన్నిక ఏకగ్రీవమయ్యేందుకు అవకాశాలున్నాయని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

సుధీర్‌బాబు పునరాగమనం



రాచకొండ సీపీగా నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

- ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎలక్షన్ కోడ్‌తో బదిలీ
- సీఏఆర్ సహా సిటీలోని రెండు జోన్లకు కొత్త డీసీపీలు

బాధ్యతల స్వీకరణ

బుధవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ సీపీ కార్యాలయంలో సుధీర్ బాబు బాధ్యతలు చేపట్టారు.

సాక్షి, సిటీబ్యూరో: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన కోడ్ ఎఫెక్ట్‌తో ఈ ఏడాది ఫిబ్రవరిలో బదిలీ అయిన రాచకొండ పోలీసు కమిషనర్ జి.సుధీర్‌బాబు తిరిగి అదే స్థానానికి వచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పట్లో ఆయనను మల్టీ జోన్–2 ఐజీగా బదిలీ చేసిన ప్రభుత్వం అక్కడ పని చేస్తున్న తరుణ్ జోషిని రాచకొండ సీపీగా తీసుకువచ్చింది. తాజా బదిలీల్లో తరుణ్ జోషి ఏసీబీ డైరెక్టర్‌గా వెళ్లారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కీలక స్థానాల్లో పని చేస్తున్న ఉన్నతాధికారుల బదిలీలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఏడాది జనవరిలో మార్గదర్శకాల జారీ చేసింది. వీటి ప్రకారం ఈ ఏడాది జూన్ 30ని గడువుగా తీసుకుని.. ఆ తేదీ నుంచి వెనక్కు నాలుగేళ్ల కాలంలో వరుసగా మూడేళ్లు ఓ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తే బదిలీ తప్పనిసరి.

- సుధీర్‌బాబు 2018 ఏప్రిల్ నుంచి 2023 జనవరి వరకు రాచకొండ కమిషనరేట్‌లో సంయుక్త, అదనపు సీపీగా విధులు నిర్వర్తించారు. డీఐజీ హోదాలో సంయుక్త సీపీగా అక్కడ రిపోర్ట్ చేసిన ఆయన ఐజీగా పదోన్నతి పొందిన తర్వాత కూడా కొనసాగుతూ అదనపు సీపీగా పని చేశారు. ఆపై హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం అదనపు సీపీగా బదిలీపై వచ్చారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత గతేడా ది డిసెంబర్ 13న రాచకొండ పోలీసు కమిషనర్‌గా వెళ్లారు. ఈసీ మార్గదర్శకాల ప్రకారం 2020 జూలై 1 నుంచి ఒకే కమిషనరేట్‌లో మూడేళ్లు పని చేసిన జాబితాలో సుధీర్ బాబు ఉన్నారు. దీంతో ఆయన్ను బదిలీ చేసిన ప్రభుత్వం తరుణ్ జోషిని నియమించింది. తాజా బదిలీల్లో సుధీర్ బాబును మళ్లీ రాచకొండ సీపీగా నియమించింది.
- గతంలో రాచకొండ సంయుక్త సీపీగా పని చేసిన అనుభవం ఉన్న సుధీర్‌బాబు హైదరాబాద్, సైబరాబాద్‌ల్లో కీలక పోస్టింగ్‌లతో పాటు వరంగల్ సీపీగానూ పని చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 17 మంది ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా నగరానికి సంబంధించిన కొన్ని స్థానాల్లోనూ మార్పుచేర్పులు జరిగాయి. వనపర్తి ఎస్పీగా పని చేస్తున్న రక్షిత కె.మూర్తి డీసీపీ సీఏఆర్ హెడ్–క్వార్టర్స్ డీసీపీగా వచ్చారు. దీంతో నగరంలో పని చేస్తున్న మహిళా ఉన్నతాధికారుల సంఖ్య ఆరుకు చేరింది. గతంలో సౌత్ వెస్ట్ డీసీపీగా పని చేసి, ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న బి.బాలస్వామి ఈస్ట్ జోన్‌గా రాగా.. రాచకొండ టాస్క్ ఫోర్స్ డీసీపీ జి.చంద్ర మోహన్ సౌత్ వెస్ట్ జోన్ డీసీపీగా వచ్చారు.

పురుగుల మందు తాగి.. సెల్ఫీ వీడియో తీసుకుని..

హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యా యత్నం

- ప్రాణాపాయ స్థితిలో అగ్రికల్చర్ విద్యార్థి
- స్నేహితుల మధ్య వివాదం కారణంగా మనస్తాపం
- గుండ్లపోచంపల్లి మైసమ్మగూడలో ఘటన



మేడ్చల్ రూరల్: పురుగుల మందు తాగడంతో పాటు హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన అగ్రికల్చర్ విద్యార్థి ఘటన గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలో చోటుచేసుకుంది. పేట్ బషీరాబాద్ పోలీసులు, స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లాకు చెందిన విద్యార్థి హరినాథ్ మైసమ్మగూడ మల్లారెడ్డి యూనివర్సిటీలోని అగ్రికల్చర్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. స్థానికంగా ఉన్న ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. మూడు రోజులుగా కళాశాలలో తోటి విద్యార్థుల మధ్య గొడవల కారణంగా మనస్తాపం చెందిన హరినాథ్ బుధవారం హాస్టల్ గదిలో పురుగుల మందు తాగి సెల్ఫీ వీడియో రికార్డు చేసుకున్నాడు. అనంతరం తాను ఉంటున్న హాస్టల్ భవనం పైఅంతస్తుకు వెళ్లి పక్కనే ఉన్న సాయి బాలాజీ హాస్టల్ భవనంపైకి ఎక్కి కిందకు దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. భవనంపై నుంచి దూకుతున్న క్రమంలో విద్యుత్ తీగలపై పడి.. అనంతరం కిందపడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. హరినాథ్‌ను చికిత్స నిమిత్తం 108లో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు.

సారీ మామా..

ఆత్మహత్య యత్నానికి ముందు హరినాథ్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. అరే మామా.. (ఫ్రెండ్స్‌నుద్దేశించి) సారీ మామా తట్టుకోలేకపోతున్నాను. ఓ ఇద్దరు విద్యార్థుల పేర్లు ప్రస్తావించి వారిని వదిలిపెట్టవద్దని కోరాడు. మామా.. మా అమ్మ తట్టుకోలేదు. త్వరగా వచ్చేయ్ మామా... ప్లీజ్ మామా.. ఏడుపొస్తుంది మామా.. అంటూ సెల్ఫీ వీడియో రికార్డు చేశాడు. ఆ వీడియో మిత్రులకు పంపినట్లు సమాచారం. గత మూడు రోజులుగా విద్యార్థుల మధ్య వాగ్వాదం కారణంగా సున్నితమైన మనస్తత్వం కలిగిన హరినాథ్ మనస్తాపానికి గురై ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు సమాచారం. పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హరినాథ్ తన వీడియోలో తెలిపిన విద్యార్థుల పేర్లు, కారణాలపై ఆరా తీసున్నారు.



VAIBHAV ASHADAM OFFERS!
VA తరుగు లేదు
తయారీ ఛార్జీలు లేవు
24 Kt బంగారం ధర చెల్లించి, పొందండి 916 హాల్‌మార్క్‌డ్ సాధారణ బంగారు ఆభరణములు
Shop online @ www.vaibhavjewellers.com
VAIBHAV JEWELLERS
Relationships, By Design
MANOJ VAIBHAV GEMS 'N' JEWELLERS LIMITED

లెక్కలు సరే.. కుక్కల నియంత్రణేదీ?



పిల్లలు చనిపోతున్నా చర్యలు తీసుకోవడంలో నిరక్ష్యం

- బల్దియా అధికారుల తీరును తప్పుబట్టిన హైకోర్టు
- నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశం
- తదుపరి విచారణ ఈ నెల 18కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: వీధి కుక్కల నియంత్రణకు ఏం చేశారన్న గణాంకాలు కాదు. భవిష్యత్‌లో చిన్నారులపై దాడులు, మరణాలకు అడ్డుకట్ట వేసేందుకు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని హైకోర్టు నిలదీసింది. ఓ పక్క చిన్నపిల్లలు చనిపోతుంటే స్టెరిలైజేషన్ చేశామని లెక్కలు చెబుతున్నారంటూ జీహెచ్ఎంసీ అధికారుల తీరును తప్పుబట్టింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో స్టెరిలైజేషన్ సరే గానీ మురికివాడల పరిస్థితి ఏంటని ప్రశ్నించింది. విషాదకర ఘటనలు మురికివాడల్లోనే చోటు చేసుకుంటున్నాయని గుర్తు చేసింది. ఇలాంటి ఘటనలపై పరిహారం అందజేసి చేతులు దులుపుకోకుండా, మానవీయ కోణంలో స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సి ఉందని స్పష్టం చేసింది. దీనిపై నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ.. విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

వార్తా కథనాలే సుమోటోగా..

జూన్ 28న పటాన్‌చెరు ఇస్నాపూర్‌లో వీధి కుక్కల దాడిలో 8 ఏళ్ల బాలుడు విశాల్ మృతి చెందాడు. బిహార్‌కు చెందిన వీరి కుటుంబం పొట్టకూటి కోసం రాష్ట్రానికి వచ్చింది. కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన బాలుడిపై కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ దారుణంపై వార్తా పత్రికల్లో వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. గతంలో ఇదే అంశంపై పెండింగ్‌లో పిటిషన్లకు దీన్ని జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం, నిబంధనలు రూపొందించడం కాదు. వాటిని కఠినంగా అమలు చేసే వ్యవస్థ ఉండాలని వ్యాఖ్యానించింది. పిల్లలు చనిపోతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని తేల్చిచెప్పింది. ఏ ఒక్కరినీ వదిలే పరిస్థితి ఉండకూడదని చెప్పింది. కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

చెరువులపై శాటిలైట్ సర్వే!


మంత్రాల చెరువు

- హద్దులు, ఎఫ్‌టీఎల్ నిర్ధారణ
- ఆక్రమణల తొలగింపునకు రెండు టాస్క్‌ఫోర్స్ బృందాలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఆక్రమణల చెర నుంచి చెరువులు, కుంటలకు ఇక విముక్తి లభించనుంది. దీనిపై జిల్లా అధికారయంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. సీరియస్ యాక్షన్ ప్లాన్‌కు సిద్ధమైంది. శాటిలైట్ ద్వారా జిల్లాలోని జలవనరులపై సర్వే చేపట్టి చెరువుల విస్తీర్ణం, ఫుల్ ట్యాంక్ లెవెల్(ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్లను నిర్ధారించనుంది. చెరువులు, కుంటల పరిస్థితిపై రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ శశాంక రెవెన్యూ, నీటి పారుదలశాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. చెరువులు, కుంటల్లోని అక్రమణల తొలగింపు, హద్దుల గుర్తింపు కోసం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఏసీపీ స్థాయి అధికారి పర్యవేక్షణలో రెండు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ బృందాలు ఒక్కోరోజు ఒక్కో చెరువును పరిశీలించనుంది. ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లోని చెరువులు, కుంటలను ఒక జోన్‌గా, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, షాద్‌నగర్, చేవెళ్లలోని జలవనరులను మరో జోన్‌గా విభజించారు. ప్రజల ఫిర్యాదుల ఆధారంగా చెరువులను భౌతిక తనిఖీ నిర్వహించి, అన్ని రకాల అక్రమ నిర్మాణాలను అరికట్టడానికి అవసరమైన చర్యలను చేపట్టనున్నారు.

ఆనవాళ్లు కోల్పోయి..

జిల్లాలో మొత్తం 2,132 చెరువులు, కుంటలు ఉండగా, వీటి పరిధిలో 70,067 ఎకరాల ఆయకట్టు ఉంది. మెజార్టీ చెరువులు ఔటర్ రింగ్ రోడ్డుకు అటు, ఇటుగా విస్తరించి ఉండటం, ఇక్కడ భూముల ధరలకు రెక్కలు రావడంతో కబ్జాదారుల కళ్లు వీటిపై పడ్డాయి. ఆక్రమణదారులు అడిగిందే తడవుగా ఇరిగేషన్ అధికారులు ఎన్‌ఓసీలు, హెచ్‌ఎండీఏ అధికారులు ఎల్పీ నంబర్లు జారీ చేస్తుండటంతో అనేక చెరువులు ఆనవాళ్లు కోల్పోయాయి. మీర్‌పేటలోని 59.30 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన మంత్రాల చెరువు 33 ఎకరాలకు కుంచించుకుపోయింది. 35 ఎకరాల తాళ్లచెరువు కనుమరుగైంది. జిల్లెలగూడలో 30 ఎకరాల సంజచెరువు 12 ఎకరాలకే పరిమితమైంది. 70 ఎకరాల పెద్ద చెరువులో 42 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. బాలాపూర్‌లోని 39 ఎకరాల గుర్రంచెరువులో 24 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. 37.34 ఎకరాల బురాన్‌ఖాన్ చెరువు(వెంకటాపూర్)లో ఏడు ఎకరాలే మిగిలాయి. 267 ఎకరాల జల్‌పల్లి చెరువులో వంద ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలకు సరిహద్దు గ్రామంలో 6.23 ఎకరాల్లో విస్తరించిన హత్తిగూడ కుంట ఆనవాళ్లు లేకుండా పోయింది. కాటేదాన్‌లోని 19.15 ఎకరాల మామిడికుంట ఆక్రమణకు గురైంది. ఇంకా చాలా చెరువులు, కుంటలు ఆక్రమణదారుల చెరలో ఉన్నాయి.

'రియల్' వేధింపులు.. రైతు అదృశ్యం
ఆగిన తండ్రి గుండె

దుండిగల్: రియల్ ఎస్టేట్ వ్యాపారుల వేధింపులకు తాళలేక ఓ రైతు అదృశ్యమయ్యాడు. బెంగపెట్టుకున్న అతడి తండ్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. బౌరంపేటకు చెందిన వంపుగూడెం కృష్ణారెడ్డి(72), సముద్రమ్మ భార్యాభర్తలు. వీరికి మాధవరెడ్డి, జైపాల్‌రెడ్డి సంతానం. ఈ కుటుంబానికి డి.పోచంపల్లిలోని సర్వే నెంబరు 188లో 1.13 ఎకరాల స్థలం ఉంది. దీనిని మాధవరెడ్డి సాగు చేస్తున్నాడు. వీరి స్థలం పక్కనే త్రిపుర ల్యాండ్ మార్క్ సంస్థ ఇతర రైతుల నుంచి స్థలాలను కొనుగోలు చేసి వెంచర్‌ను నిర్మిస్తోంది.మాధవరెడ్డితోపాటు మరో రైతు సురేందర్‌రెడ్డికి చెందిన భూములను సైతం తమకు విక్రయించాలని వెంచర్ నిర్వాహకులు పట్టుబట్టడంతో వారు అంగీకరించలేదు. ఈ క్రమంలో మే నెలలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. రైతులు, సంస్థ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పరస్పర కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో ఈ నెల 8వ తేదీన రాత్రి మాధవరెడ్డి దుండిగల్ సీఐ శంకరయ్య పేరిట లెటర్ రాసి పెట్టి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఇంటి నుంచి కుమారుడు వెళ్లిపోవడంతో ఆవేదన చెందిన కృష్ణారెడ్డి బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు.

బౌరంపేటలో విషాదం..


మాధవరెడ్డి(ఫైల్)


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు


మృతుడు కృష్ణారెడ్డి

లెటర్‌లో ఏముందంటే..

'త్రిపుర ల్యాండ్‌మార్క్ ఎండీ పసుపులేటి సుధాకర్, కార్పొరేటర్ మేకల వెంకటేశం, వంపుగూడెం సభ్యులను తీసుకువచ్చి నన్ను మానసికంగా వేధిస్తున్నారు. ఈ రోజు అందరు నన్ను అట్టి భూమి గురించి మళ్లీ పిలిపించుకుని బూతులు తిట్టారు. నేను మనస్తాపానికి గురై వెళ్లిపోతున్నాను. సార్.. నా పిల్లల్ని కాపాడండి.. పిల్లలు, అమ్మా నాన్న, భార్య నన్ను క్షమించండి'అంటూ సీఐ శంకరయ్యకు లేఖ రాశాడు.

జైలుకు పంపారు..

దాడి చేయడమే కాకుండా తమపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసులు నమోదు చేసి 14 రోజులు జైలుకు పంపారని, వారికి మాత్రం పోలీసులు స్టేషన్‌లోనే బెయిల్ ఇచ్చి పంపించేశారని బాధిత కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ ఎండీ పసుపులేటి సుధాకర్, కార్పొరేటర్ మేకల వెంకటేశంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై దుండిగల్ సీఐ శంకరయ్యను 'సాక్షి'వివరణ కోరగా రైతులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 5, త్రిపుర ల్యాండ్ మార్క్‌సంస్థ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 3 కేసులు నమోదు చేశామని, ఇద్దరు రైతులతోపాటు సంస్థకు చెందిన నలుగురిని రిమాండ్‌కు తరలించామన్నారు. త్రిపుర ల్యాండ్ మార్క్‌సంస్థ ఎండీ సుధాకర్ పరారీలో ఉన్నారని పేర్కొన్నారు.

బల్కాపూర్ నాలా చుట్టూ ప్రహరీ: కలెక్టర్



సాక్షి, సిటీబ్యూరో: బల్కాపూర్ నాలా, గ్రేవ్‌యార్డ్ ఆక్రమణకు గురికాకుండా నాలా చుట్టూ గోడ నిర్మించాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం షేక్‌పేట్‌లోని సక్కుబాయి సొసైటీ వద్ద గల నాలాను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ అధికారులు నాలా వెంట ప్లాంటేషన్, గ్రీనరీతో సుందరీకరణను చేపట్టాలని సూచించారు. రెవెన్యూ ద్వారా అప్పగించిన 1,700 చదరపు గజాల విస్తీర్ణంలో గల గ్రేవ్‌యార్డ్ ప్రహరీ నిర్మించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎస్‌ఈ, తహసీల్దార్ అనితారెడ్డి, జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సంపత్, ఏఈ కిషోర్ వర్మ పాల్గొన్నారు.

రైల్‌రోకో కేసు విచారణ

- హాజరైన టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం
- హైకోర్టు స్టే కారణంగా హాజరుకాని మాజీ సీఎం కేసీఆర్

సిటీ కోర్టులు: రైల్‌రోకో కేసు విచారణలో భాగంగా నాంపల్లి కోర్టుకు తెలంగాణ జన సమితి(టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.కోదండరాం హాజరయ్యారు. 2011లో తెలంగాణ ఉద్యమం సమయంలో మాజీ సీఎం, కేసీఆర్, ప్రొ.కోదండరాంచేపట్టిన రైల్‌రోకో కార్యక్రమంలో వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ నాంపల్లి కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్)లో కొనసాగుతోంది. అయితే ఈ కేసు విచారణ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోగా, ప్రొ. కోదండరాంకు ఎలాంటి స్టే లేకపోవడంతో రూ.10 వేల పూచీకత్తు పెట్టాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ కేసు ట్రయల్‌కు వస్తున్న నేపథ్యంలో బుధవారం ఆయన కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన తరపు న్యాయవాది జక్కుల లక్ష్మణ్ న్యాయస్థానానికి పూచీకత్తు అందజేశారు. కేసీఆర్, కోదండరాం తరపున న్యాయవాది జక్కుల లక్ష్మణ్ వాదనలు వినిపిస్తున్నారు. అనంతరం ఈ కేసును తదుపరి విచారణ కోసం ధర్మాసనం అక్టోబర్ 23వ తేదీకి వాయిదా వేసింది.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

గోల్కొండ: రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతి చెందిన సంఘటన హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దోమలగూడకు చెందిన శ్రావణి(21) ప్రైవేటు ఉద్యోగి. మంగళవారం రాత్రి స్నేహితుడితో కలిసి స్కూటీపై గుడిమల్కాపూర్ వచ్చిన ఆమె దోమలగూడకు తిరిగి వెళుతుండగా ఆసీఫ్‌నగర్ పెట్రోల్‌బంక్ సమీపంలో ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద సంపులు



సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. వానాకాలంలో నీరు నిలిచే ప్రాంతాల్లో (వాటర్ లాగింగ్) సంపులను నిర్మించేందుకు సిద్ధమైంది. ముందుగా ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్ల పరిధిలో రూ.20 కోట్లతో 11 ప్రాంతాల్లో 10 లక్షల లీటర్ల సామర్థ్యంతో సంపులు నిర్మించేందుకు సిద్ధమైంది. వీటికి ఇప్పటికే టెండర్లు ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దానకిశోర్ క్షేత్ర స్థాయిలో అనువైన స్థలాల కోసం పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఖైరతాబాద్ జంక్షన్, రాజ్ భవన్ రోడ్డులోని లేక్ వ్యూ గెస్ట్ హౌజ్, సోమాజిగూడ ఆర్టీఏ ఆఫీసు ప్రాంతాలను సందర్శించారు. లేక్ వ్యూ గెస్ట్ హౌజ్, కేసీపీ జంక్షన్లలో సంపులు నిర్మించాలని నిర్ణయించారు. కాగా వర్షం కురిసే సమయంలో వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో నీరు ఆగుతుంది. ఫలితంగా ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ సమస్యను అధిగమించడానికి ఆయా ప్రాంతాల్లో సంపులు నిర్మిస్తారు. ఇందులో ఆ వర్షపు నీటిని సేకరిస్తారు. అనంతరం ఆ నీటిని సమీపంలోని నాలాల్లోకి పంపింగ్ చేస్తారు.

సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు

వర్షాకాలం సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ అధికారులకు సూచించారు. బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వైద్య ఆరోగ్య, శానిటేషన్, ఎంటమాలజీ, మలేరియా విభాగాల అధికారులతో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలితో కలిసి సమీక్ష నిర్వహించారు. నగరంలో విస్తరిస్తున్న డెంగ్యూ వ్యాధిని నియంత్రించేందుకు క్షేత్రస్థాయిలో విస్తత చర్యలు చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిరంతరం కొనసాగాలని, డెంగీ కేసులు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దష్టి కేంద్రీకరించి తక్షణమే కట్టడి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో సీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మజారాణి, ఎంటమాలాజీ చీఫ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్‌నంటూ నమ్మించి వివాహం


మహిళ వద్ద భారీగా నగదు కాజేసిన ఘనుడు

నిజాంపేట్: ఐఏఎస్ అధికారినని నమ్మించి ఓ మహిళను వివాహం చేసుకోవడమే కాకుండా భారీ మొత్తంలో నగదును తీసుకుని మోసం చేసిన వ్యక్తిని బాచుపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నిజాంపేట్ శ్రీనిత్య రెసిడెన్సీకి చెందిన నల్లమోతు సందీప్‌కుమార్(34) సివిల్స్ ఎగ్జామ్‌లో టాపర్‌గా నిలిచి కర్ణాటక కేడర్ ఐఏఎస్ అధికారిగా పోస్టింగ్ వచ్చినట్లు ఇరుగుపొరుగును నమ్మించాడు. అదే విధంగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి ఎండీ రేడియాలజీ పూర్తి చేసినట్లు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించాడు. ఇది నిజమని నమ్మిన కర్నూలు జిల్లాకు చెందిన అరిమిల్లి శ్రావణి అతన్ని వివాహం చేసుకుంది. పెళ్లైన తరువాత సైతం తీరు మార్చుకోని సందీప్‌కుమార్ తన బ్యాంక్ అకౌంట్‌లో రూ.40 కోట్లు ఉన్నాయని, ఇన్‌కమ్ టాక్స్ చెల్లించకపోవడంతో ఫ్రీజ్ అయ్యాయని, రూ.2 కోట్లు కడితే విడుదలవుతాయని భార్యను నమ్మించాడు. ఇది నిజమని నమ్మిన శ్రావణి తన బంధువులు, స్నేహితుల వద్ద రూ.2 కోట్లు అప్పుగా తీసుకుని ఆడపడుచు లక్ష్మీసాహితి, అత్తమామలు మాలతి, విజయ్ కుమార్‌ల బ్యాంక్ అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేయించింది. అంతే కాకుండా శ్రావణి నగలను సైతం సందీప్ కుదువ పెట్టి జల్సాలు చేశాడు. నకిలీ గుర్తింపుతో మోసం చేశారని గ్రహించిన బాధితురాలు భర్త, అత్తమామలు, ఆడపడుచులపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సందీప్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ ఉపేందర్, ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బందిలను అభినందిస్తూ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు రివార్డులను ప్రకటించారు.

గుడికి వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

- బైక్‌పై వస్తున్న దంపతులను ఢీకొన్న ట్రక్కు
- అక్కడికక్కడే భర్త మృతి



రాజిరెడ్డి


రాజిరెడ్డి మృతదేహం

కుషాయిగూడ: దేవుడి దర్శనం కోసం గుడికి వెళ్లి ఇంటికి తిరిగి వెళ్తున్న ఓ విశ్రాంత ఉద్యోగి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా భార్య గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సంఘటన బుధవారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మల్లాపూర్, అశోక్‌నగర్‌కు చెందిన బుషిరెడ్డి రాజిరెడ్డి(60) హెచ్‌సీఎల్ విశ్రాంత ఉద్యోగి. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో తన భార్య నిర్మలతో కలిసి బైక్‌పై చర్లపల్లి ఈసీనగర్‌లోని గణపతి ఆలయానికి వెళ్లాడు. దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా ఎదురుగా వేగంగా దూసుకు వచ్చిన అశోక్ లేల్యాండ్ వాహన డ్రైవర్ ముందు వెళ్తున్న ఎక్స్‌యూవీ వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఎక్స్‌యూవీని, అశోక్ లేలాండ్ ట్రక్, అదే సమయంలో వస్తున్న అంబులెన్స్ ఒకదానికొకటి ఢీకొన్నాయి. అశోక్ లేలాండ్ వాహనం, అంబులెన్స్ అదుపు తప్పి రాజిరెడ్డి దంపతుల ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాయి. తలతోపాటుగా ఇతర శరీర భాగాలకు తీవ్రగాయాలై రాజిరెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా నిర్మల తీవ్ర గాయాలపాలైంది. విషయం తెలిసిన పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని నిర్మలను ఆసుపత్రికి, రాజిరెడ్డి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. రాజిరెడ్డ కుమారుడు శశిధర్ రెడ్డి ఫిర్యాదు మేరకు అశోక్ లేల్యాండ్ డ్రైవర్ చోడెన్ తమాంగ్‌తోపాటుగా అంబులెన్స్ డ్రైవర్ కె.ప్రసాద్‌లపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

ఫిర్యాదులు... ట్విస్టులు

- మరోసారి రాజ్‌తరుణ్‌పై లావణ్య ఫిర్యాదు
- పెళ్లి చేసుకున్నారు.. అబార్షన్ కూడా చేయించారని ఆరోపణ
- దీంతో సినీహీరోపై కేసులు నమోదు


హీరో రాజ్‌తరుణ్

మణికొండ/బంజారాహిల్స్: ఆరోపణలు, ప్రత్యారోపణలు, పరస్పర కేసుల తరుణంలో సినీహీరో రాజ్‌తరుణ్ వ్యవహారం సినిమా స్టైల్‌లో అనేక మలుపులు తిరుగుతోంది. పోలీసులు ఇరువర్గాలను పిలిచి నిజానిజాలు నిగ్గుతేల్చే పనిలో నిమగ్నమయ్యారు. రాజ్‌తరుణతో 11 ఏళ్ల లివింగ్ రిలేషన్‌లో ఉన్నానని, ఇప్పుడు మరో హీరోయిన్ మాల్వీ మల్హోత్రా మోజులో పడి తన వద్దకు రావటంలేదని, మాల్వీ మల్హోత్రా సోదరుడు మయాంక్ తనను చంపుతానని బెదిరించాడని ఇదివరకే ఫిర్యాదు చేసిన లావణ్య మంగళవారంరాత్రి నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో మరో ఫిర్యాదు చేసింది. ముందుగా చేసిన ఫిర్యాదుకు ఆధారాలను చూపాలని పోలీసులు ఆమెకు నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. దాంతో ఆమె తన న్యాయవాదితో కలిసి ఆధారాలను, 175 ఫొటోలు, స్క్రీన్‌చాట్‌లు, వీడియోలు, కాల్ రికార్డ్‌లు అందజేసినట్టు తెలుస్తోంది. రాజ్‌తరుణ్‌తో తనక 10 ఏళ్ల క్రితమే గచ్చిబౌలిలోని ఎల్లమ్మ గుడిలో వివాహమైందని, తనకు గర్భం రావటంతో ఓ ఆస్పత్రిలో అబార్షన్ కూడా చేయించారని తెలిపింది. రాజ్‌తరుణ్‌కు గతంలోనూ మరికొంత మంది మహిళలతో ఎఫైర్‌లు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొంది. తాను అన్విక పేరుతో పాస్‌పోర్టు పొందానని, తామిద్దరం కలిసి ఇదివరకు విదేశాలకు కూడా వెళ్లామని తెలిపింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు, ఆధారాలను పరిశీలించి రాజ్‌తరుణ్‌పై కేసులు నమోదు చేసినట్టు నార్సింగి పోలీసులు తెలిపారు. త్వరలోనే రాజ్‌తరుణ్‌ను విచారించి అసలు నిజాలను వెలుగులోకి తెస్తామని పేర్కొన్నారు.

లావణ్యపై మాల్వీ మల్హోత్రా ఫిర్యాదు

లావణ్య అనవసరంగా వివాదంలోకి లాగి తన పరువుకు భంగం కలిగిస్తోందని, తన సోదరుడికి ఇష్టారాజ్యంగా మెసేజ్‌లు పెట్టి బెదిరిస్తోందని హీరోయిన్ మాల్వీ మల్హోత్రా రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనది హిమాచల్‌ప్రదేశ్ అని, తల్లిదండ్రులు అక్కడే ఉంటారని, తాను మాత్రం ముంబైలో ఉంటానని, 'తిరగబడరా స్వామీ'సినిమాలో నటించానని, ఈ సినిమా నిమిత్తమే హైదరాబాద్‌కు వచ్చి స్నేహితురాలి ఇంట్లో ఉంటున్నానని వెల్లడించారు. ఫిర్యాదుపై పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

పాతబస్తీలో మాకు రక్షణ కల్పించాలి

సీఎండీ ముషారఫ్‌కు విద్యుత్ ఉద్యోగుల వినతి

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీలో విధులు నిర్వహించే విద్యుత్ ఇంజనీర్లకు కనీస రక్షణ లేకుండా పోయిందని, తనిఖీలు, బిల్లుల జారీకి వెళ్లిన సమయంలో కొంతమంది స్థానిక వినియోగదారులు సిబ్బందిపై దాడులకు పాల్పడుతున్నారని తెలంగాణ పవర్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు జేఏసీ ప్రతినిధుల బృందం బుధవారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీని కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ, సంస్థ నష్టాలకు కారణమవుతున్న వారిని గుర్తించేందుకు వెళ్లిన సిబ్బందిపై దాడులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేయించాలని, తనిఖీ సిబ్బందికి పోలీసు భద్రత కల్పించాలని కోరారు. ఈ మేరకు ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

24 గంటల్లో దొంగ పట్టివేత

రిటైర్డ్ ఐఏఎస్ ఇంట్లో చోరీ కేసును ఛేదించిన పోలీసులు

రాజేంద్రనగర్: రిటైర్డ్ ఐఏఎస్ అధికారి హరిబాబు నివాసంలో జరిగిన చోరీ కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. నిందితుడిని పట్టుకొని కోటి రూపాయల ఆభరణాలను రికవరీ చేశారు. రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి హరిబాబు తన కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. పనినిమిత్తం కుటుంబసభ్యులతో కలిసి ఆయన విజయవాడకు వెళ్లారు. మంగళవారం తిరిగి వచ్చేసరికి ఇంట్లో కోటి రూపాయల విలువ చేసే ఆభరణాలు చోరీకి గురయ్యాయి. దీంతో నార్సింగి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. హరిబాబు నివాసం వెనుక ప్రాంతంలోని బస్తీలో నివసించే ప్రవీణ్ స్థానికంగా చిల్లర దొంగతనాలకు పాల్పడేవాడు. పోలీసులు దొంగతనం విషయమై స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా నిందితుడు ఆ ప్రాంతంలో సంచరించిన దృశ్యాలు కనిపించాయి. దీంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం విషయం అంగీకరించాడు. అధికారి నివాసంలో బీరువా తాళాలన్నీ ఇంట్లోనే ఉండటంతో ఆభరణాలను సులువుగా చోరీ చేశానని ప్రవీణ్ చెప్పాడు. ఈ కేసులో ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని డీసీపీ అభినందించి నగదు బహుమతులు అందజేశారు.

గంజాయి కేసులో ఐదుగురి రిమాండ్

అత్తాపూర్: గంజాయిని విక్రయించేందుకు సిద్ధమైన ఐదుగురు యువకులను అరెస్ట్ చేసి అత్తాపూర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్ఓటీ పోలీసులు, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట రామిరెడ్డి, ఎస్ఐ నిమ్మల వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రానికి చెందిన ముగ్గురు యువకులు, జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులు జీవనోపాధి నిమిత్తం నగరానికి వచ్చి ఓ బిర్యాని హోటల్‌లో పనిచేస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలన్న దురుద్దేశంతో ఇతర ప్రాంతాల్లో రెండు కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. అత్తాపూర్ ముష్కిమహల్ పాడుబడిన పురాతన బంగ్లాను ఎంచుకుని చిన్న, చిన్న ప్యాకెట్లుగా చేసి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో విక్రయించేందుకు సిద్ధమైయ్యారు. విషయం తెలుసుకున్న అత్తాపూర్, రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు ముష్కిమహల్‌లో సోదాలు జరిపారు. తప్పించుకునే ప్రయత్నం చేయగా అప్పటికే పోలీసులు చుట్టుముట్టారు. రెండు కిలోల గంజాయితో పాటు 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

ప్రేమించకుంటే చంపుతానని యువతికి బెదిరింపులు

వెంగళరావునగర్: ప్రేమించకపోతే చంపుతానంటూ యువతిని బెదిరింపులకు గురి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఓ ప్రాంతంలో నివసించే యువతికి రెండేళ్ల కిందట రహమత్‌నగర్‌కు చెందిన అజయ్ అనే యువకుడు ఆమె సోదరి ద్వారా పరిచయమయ్యాడు. ఈ క్రమంలో అజయ్ ప్రేమిస్తున్నానని చెప్పడంతో ఆ యువతి నిరాకరించింది. దీంతో స్నేహితుడిలా ఉంటానని నమ్మించడంతో ఆమె తన ఫోన్ నెంబర్ కూడా ఇచ్చింది. ఆ విధంగా కొంతకాలం స్నేహం నటిస్తూ వచ్చాడు. ఈ క్రమంలోనే ఆమెకు సంబంధించిన ఫొటోలు కూడా సేకరించాడు. ఈ నెల 6న అజయ్ ఆమెకు ఫోన్ చేసి తనను ప్రేమించాలని మళ్లీ అడిగాడు. ఆ యువతి అతని మాటలను తిరస్కరిస్తూ స్నేహితుడిలా ఉండాలని, లేకపోతే మాట్లాడవద్దని గట్టిగా చెప్పింది. దానికి ఆగ్రహించిన అజయ్ తనను ప్రేమించకపోతే చంపుతానని బెదిరించసాగాడు. ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి అందరికీ పంపుతానని హెచ్చరించాడు. దీంతో ఆందోళనకు ఆ యువతి బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ షాద్‌నగర్ @ కేశంపేట టౌన్‌లో DTCP లేఔట్‌లో ఫుల్ డెవలప్‌మెంట్‌తో 0% ఇంట్రెస్ట్‌తో 40 EMI ద్వారా ఓపెన్ ప్లాట్స్ కలవు. ప్రైడ్ కంపెనీ ఆఫర్, హై విజిబుల్ కొరకు సంప్ర: 9949695027 [HA-342]

■ గజం 2500/- రూ. కే విజయవాడ హైవే నార్కట్‌పల్లి దగ్గర ఏర్పడిన ప్రకృతి ఫామ్‌ల్యాండ్ వెంచర్‌లో స్విమ్మింగ్‌పూల్, ఫామ్ హౌస్, ఎర్రచందనం మరియు పండ్ల మొక్కలతో 1210 గజాల (10 గుంటలు) ప్లాట్స్ కలవు. సంప్ర: 96666 95886 [G-3158]

■ శ్రీశైలం హైవే RRR దగ్గరలో DTCP+ ఫామ్ ల్యాండ్ ప్లాట్లు కలవు ఉంది. గజం 7000 రూపాయలు గల ప్లాట్లు కేవలం 5000+3500 రూపాయలకు మాత్రమే గజం ఇవ్వబడును. ఫోన్: 9177619718 [HA-13699]

TO-LET

■ సౌత్ సూచిత్ర మెయిన్ రోడ్ 3rd ఫ్లోర్ 1500 Sft, 2 nd ఫ్లోర్ 700 Sft ... లిఫ్ట్, కార్ పార్కింగ్ ... ఫోన్: 8712398000, 7799222384 [HA-1241111]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, ... ఫోన్: 9100329739 [H-800419]

BUSINESS OFFER

■ ఫ్రూట్ జ్యూస్ రన్నింగ్ బిజినెస్ పెట్టుబడి కొరకు మంచి నిజాయితీ గల ఇన్వెస్ట్‌మెంట్ పార్టనర్ కావలెను. సంప్ర: 9603232008 [H-778828]

■ అద్భుత అవకాశం: ... సంప్ర: 8347549336 [H-796243]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Deep Prakash D/o Sh. Ram Kishore R/o H.No.15-2-167, NFC NAGAR, Ghatkesar, Medchal District, Telangana - 501301, have changed my name to Akansha for all purposes [H-796126]

■ I, Chittipolu Vijaya W/o Chittipolu Srinivas R/o 1-20-192, Gokul Nagar, Venkatapuram, Cyberabad - Medchal, Telangana - 500015, have changed my name from Musham Vijayalaxmi to "CHITTIPOLU VIJAYA" For all records [H-778893]

■ I, BOOSAGALLA MAHESH KUMAR, S/o Mr. BOOSAGALLA NARSING RAO, R/o H.No. 15-17/45/10, Vigneshwara Colony, Balaji Nagar, Jawahar Nagar, Hyd-500087, T.G, Changed My Name As BHUSAGALLA NARESH KUMAR [H-778832]

■ I, Prabhakara Rao Akula, R/o H.No. 5-74, Hetuvada Nilayam, Ranga Nagar, Chintal, Quthbullapur (M), Medchal - Malkajgiri Dist., Telangana -500054, have changed my minor daughter name from AKSHAYA SRI AKULA to AADHYA SRI AKULA for future all purposes [HA-13300]

■ I, Sajid Ahmed Aziz Saheb (In Passport. No.G8546052) S/o. Aziz Saheb R/o 1-6-475, Flat-202, Zamisthanpur, Musheerabad, Hyderabad - 20, Telangana, have changed my name as Sajid Ahmed for all records purpose [HA-97882]

■ I, Davender Singh S/o Rajbir R/o F. No. 1302, 3rd floor Delight Square Aprts, Suchitra - Medchal - 500067, T.S., changed my name as Davenderr Singh Chauhaan S/o Rajbir [WB-14624]

■ I, Sarfaraz Husain Sayyed, R/o 601, Reliance Jubilee, Koh-e-Sar Colony, Shaikpet, Hyderabad - 500008., have changed my minor daughter's name from Maryam to Maryam Sarfaraz Sayyed [UA-44883]

OLD AGE HOME

■ త్రినేత్ర హోమ్‌కేర్. వృద్ధులను, పేషెంట్స్‌ను, వంటి పిల్లలను, వంట/ఇంటి పని 24 గం॥లు చూసుకోవడానికి మీ ఇంటి వద్దకే కేర్ టేకర్స్‌ను పంపబడును. హైదరాబాద్. Ph: 7396857799, 7396753377 [H-796254]

■ వృద్ధులు, Rtd ఎంప్లాయీస్ విలాసవంత మైన గదులు, లిఫ్ట్, 24/7 మెడికల్ సర్వీస్. మేడిపల్లి, ఉప్పల్ మరియు ECIL-కీసర రోడ్ చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. ఫోన్: 7981467036, 9391039990, 8074327715 [H-778817]

TOURS & TRAVELS

■ సాయిటూర్స్: జూలై -22 రామేశ్వరం, కన్యాకుమారి: ఆగస్టు-6 కర్ణాటక టూర్ ఆగస్టు-24 కాశీ-9 నిద్రలు Sep -16 గుజరాత్ టూర్ ద్వారక, సోమనాథ్ మహారాష్ట్ర టూర్ OCT-3, అష్టగణపతులు షిరిడీ.Ph: 9848664831 [H-796094]

Wanted

■ ప్రముఖ విద్యాసంస్థకు మెన్ ప్రిన్సిపాల్ కావలెను. Age below 40 years, Salary upto: 40000/- పనిచేయు స్థలం: అమీర్‌పేట, హైదరాబాద్. Please Contact: 92487 33323 [G-5528]

■ మర్చంట్ నేవీలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు. విభాగం: ఇంజిన్, డెక్, కుక్. వయసు : 18-28. అర్హత:10వ తరగతి ఉత్తీర్ణత & అంతకంటే ఎక్కువ. Sailorswave Ship Management Pvt. Ltd. Hyderabad (Telangana), Palakkad (Kerala) Ph: 7893682065. [H-778933]

■ స్టార్ హోటల్స్/MNC కంపెనీ స్టాఫ్, హెల్పర్స్, సెక్యూరిటీ గార్డ్స్, సూ॥వైజర్స్, B.Sc (కెమిస్ట్రీ), ITI, సర్వీస్ బాయ్స్. M/F జీ॥ 18000-25000/- రూం+మీల్స్. Ph: 8466882075/9703006077 [H-801645]

■ TS & AP అన్ని జిల్లా & మండలాల్లో రిసెప్షన్, టెలికాలర్స్, ఆన్‌లైన్ న్యూస్ రీడర్స్, రిపోర్టర్లు, యాంకర్స్, ఆర్టిస్టులు, వీడియో ఎడిటింగ్ - (ఫ్రీ ట్రైనింగ్) ఆ-బాయ్, డ్రైవర్లు, సూ॥వైజర్స్, ఆయాలు, కుక్స్, హెల్పర్స్, Age: 18-72 జీ॥ 15-18K ఫ్రీ హాస్టల్. ఫోన్: 9505288777 [H-796605]

■ For The Most Successful & Globally Recognized EMS Co, Employment: ON ROLL Experienced: 1. Repair Technicians / Engineers – Bangalore, 2. PCB Debug and Rework Tech / Engineer- Bangalore, 3. Failure Analyses and Rework Tech / Engineer – Bangalore, 4. Desktop & Laptop System Administrator (A+ N+) Field visit mandatory - Chennai & Bangalore info@shabari.co.in [QA-431]

■ Require Female Telecallers & Receptionist, Good Looking, Fluency in English, Telugu & Hindi @ Gayathri "99" Developers, Madhapur. Ph:8886666913 [HA-3739]

FACULTY TEACHERS

■ Pragathi Vidyalaya School Kushaiguda, Near ECIL Req: Teachers For Maths, Social, Hindi, English, Computer. Ph: 7799136085 / 9849096125 [H-189686]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

జోన్ సెంటర్స్			
దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజిగిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-3-1291, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

సైఫాబాద్ సైన్స్ కళాశాలలో 'దోస్త్' అడ్మిషన్లు


కొనసాగుతున్న దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియ

బంజారాహిల్స్: సైఫాబాద్ సైన్స్ కళాశాలలో దోస్త్ 2024-25 మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. మెరిట్ ఆధారంగా అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 8న ప్రారంభమైన ఈ అడ్మిషన్ల తంతు 12 వరకు కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా తీసుకున్న ప్రొవిజనల్ అలాట్‌మెంట్ కాపీ, సెల్ఫ్ రిపోర్టింగ్, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సమర్పించాలని కోరారు. ఒకేసారి మూడు ఫేజ్‌లు కలిపి దోస్త్ 2024-25 అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందని, ఆయా తేదీల్లోనే విద్యార్థులు అడ్మిషన్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో లైఫ్ సైన్స్, డేటా సైన్స్‌లకు మంచి డిమాండ్ రావడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు.

మగువల మదిదోచే 'సిల్క్ ఎక్స్‌పో'


చీరలను తిలకిస్తున్న మహిళలు

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో జగ్‌దీశ్వర్ హస్తకళా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో-2024 మహిళలను అమితంగా ఆకట్టుకుంటోంది. సిల్క్, కాటన్ వస్త్రాలు మగువల హృదయాలను దోచుకుంటున్నాయి. ఈ వస్త్ర ప్రదర్శనలో దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 70 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకుడు జయేష్‌గుప్తా తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 14వ తేదీ వరకు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం


ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

రహమత్‌నగర్: కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మికులు హక్కుల గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు స్వామి ఆరోపించారు. కార్మికులు కోర్కెల దినాన్ని పాటించాలని దేశ వ్యాప్త ధర్నాలో భాగంగా బుధవారం ఎస్పీఆర్‌హిల్స్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయాలని కుట్ర పన్నుతున్నదనస్థారోపించారు. దీనిని దేశ ప్రజలందరూ ఖండించాలని కోరారు. కేంద్రం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా మేకప్ స్టూడియో కాన్వకేషన్ డే


కాన్వకేషన్ డేలో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని తమన్నా మేకప్ స్టూడియోలో 43వ బ్యాచ్ స్నాతకోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ప్రఖ్యాత మేకప్ ఆర్టిస్ట్ తమన్నా రాజ్ నిపుణుల మార్గదర్శకత్వంలో గ్రాడ్యుయేట్లు ప్రొఫెషనల్ మేకప్ ఆర్టిస్ట్రీలో నైపుణ్యాలు మెరుగుపర్చుకున్నారని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుత మేకప్ రంగంలో సాంకేతికత ఆధారంగా వచ్చిన పలు మార్పులను విద్యార్థులకు అర్థవంతంగా నేర్పించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

కార్యాలయ సిబ్బందిపై దాడి

వెంగళరావునగర్: అకారణంగా కార్యాలయంలోకి జొరబడి సిబ్బందిపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఎల్లారెడ్డిగూడలని వాసవీ గ్రాండ్‌లో కలెక్షన్ ఆఫీస్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు వచ్చారు. సురేష్ అనే వ్యక్తిని గురించి వాకబు చేశారు. సిబ్బంది సమాధానం చెప్పేలోగా ఆఫీస్‌లోని ఫర్నిచర్, కంప్యూటర్లు పగలకొట్టారు. దాంతో శ్రీధర్, రాడి అనే ఇరువురు సిబ్బంది ఆపడానికి ప్రయత్నించగా వారిపై దాడి చేశారు. అదేసమయంలో అక్కడు వచ్చిన మరో ఎంప్లాయి మధుసూదన్‌రెడ్డి వచ్చి వారిని అడుగుతుండగా అతనిపై కూడా దాడి చేశారు. దాంతో వారు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

PUBLIC NOTICE

This is to inform to the general public that my son E.Ruthwik is not staying with our family since long time and we do not have any communication with him and we are not maintaining any relation with him. Recently we came to know that, he was involved in illegal & unlawful fund raising and relationships. His legal or illegal and lawful or unlawful activities are neither related to nor responsible by the family members and he is the sole responsible for his own acts. So, please be aware of the above person.

By. E. Sreenivas Rao
F.No.401, Golden Peacock residency, Leela Nagar, Ameerpet, Hyderabad -16.

Sd/- E. Suresh Kumar
Advocate
16-10-27/150, Yashoda Hospital lane, Malakpet, Hyderabad - 500036.
Telangana State.
P.No. 9849036868

భక్తుల దాహార్తిని తీర్చిన జలమండలి

సనత్‌నగర్: మూడ్రోజుల పాటు జరిగిన బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవంలో లక్షలాది మంది భక్తుల దాహార్తిని తీర్చడంలో జలమండలి కీలక పాత్ర పోషించింది. దేవాలయానికి వచ్చే రహదారులతో పాటు గుడి పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక వాటర్ క్యాంప్‌లను ఏర్పాటు చేసి భక్తుల దప్పికను తీర్చారు. దాదాపుగా 70,000 వాటర్ బాటిళ్లను భక్తులు అందించారు.

దోమలపై నియంత్రణకు..
సమష్టిగా పని చేయాల్సిందే...

- విష జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- దోమల నియంత్రణలో ఎంటమాలజీతో పాటు అన్ని విభాగాలు
- డ్రై డే కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలి
- నేటి నుంచి పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు
- సమీక్షా సమావేశంలో ఖైరతాబాద్ జెడ్‌సీ అనురాగ్ జయంతి


మాట్లాడుతున్న ఖైరతాబాద్ జెడ్‌సీ అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: రాష్ట్రంలో నమోదవుతున్న డెంగీ కేసుల్లో జీహెచ్‌ఎంసీ నుంచే 40 శాతం మేర ఉన్నాయని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి అన్నారు. దోమల ద్వారా సంక్రమిస్తున్న విష జ్వరాలను అడ్డుకునేందుకు జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాలు భాగస్వామ్యం కావాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఆయన జోనల్ కార్యాలయంలో ఎంటమాలజీ, ఇంజినీరింగ్, డీఎంహెచ్‌వో, డీపీవోతో పాటు పలు విభాగాల అధికారులతో సమావేశం అయ్యారు.

- ఈ సందర్భంగా జెడ్‌సీ మాట్లాడుతూ నగరంలో ఇప్పటి వరకు 400 వరకు డెంగీ కేసులు నమోదయ్యాయని సమీప రోజుల్లో వీటి సంఖ్య మరింత పెరగకుండా ఉండేలా తగు ప్రణాళికలు రూపొందించామని ఆ విధంగా అధికారులు పని చేయాలని సూచించారు.
- కార్యక్రమంలో సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్, ఎంటమాలజి అధికారిణి రజినితో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి 50 నివాసాలకు ఓ అధికారి...

జోన్ పరిధిలోని ప్రతి 50 నివాసాలకు ఓ అధికారిని లేదా ఓ ప్రతినిధిని నియమించి ఆ నివాసాల వద్ద దోమలపై అవగాహన కల్పించడంతో పాటు దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

- గురువారం నుంచి మూడు రోజుల పాటు పాఠశాలల్లో దోమల నియంత్రణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఇంటింటి సర్వే చేయాలన్నారు.
- మలేరియా విభాగం అధికారులు ఎప్పటికప్పుడు జ్వర సర్వే చేసి ఆ నివేదికలను అధికారులకు అందజేస్తుంటారని దాని ప్రకారం ఎక్కడైతే ఎక్కువ జ్వరాలు వ్యాపిస్తున్నాయో ఆయా ప్రాంతాల్లో జ్వరపీడితులు పెరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.
- యూసీడీ విభాగంతో పాటు అర్బన్ మలేరియా, డీఎంహెచ్‌వో, ఇంజినీరింగ్ ఇలా అన్ని విభాగాల అధికారులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

నీరు నిల్వకుండా ఉండేలా...

చాలా వరకు నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లోనే దోమలు వృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని నీరు నిల్వకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బస్తీ, కాలనీవాసులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి వారం డ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలని వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు.

- పూల కుండీల్లో, డ్రమ్ముల్లో ఎప్పటికప్పుడు నీరు మారుస్తుండటంతో పాటు నిల్వ ఉండకుండా చూసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు.
- ప్రతి ఇంట్లో ఉండే వాటర్ ట్యాంకుల్లో గంబూజియా ఫిష్‌లను వదలడంతో పాటు దోమలు వృద్ధి చెందకుండా ఉండేలా మందులు పిచికారి చేయించాలని సూచించారు.
- ఇంజినీరింగ్ విభాగం అధికారులు వర్షాలు వచ్చినప్పుడు వాటర్ స్టాగినేషన్స్ లేకుండా చూసుకోవాలని సూచించారు.

జూబ్లీహిల్స్ సర్కిల్‌లో 45 నోటిఫైడ్ స్లమ్స్...

జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలో 45 గుర్తించిన మురికివాడలు ఉన్నాయని ఈ ప్రాంతాల్లో ఎక్కువగా విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని ఆయా ప్రాంతాల్లో మహిళా సమాఖ్యలు, రిసోర్స్ పర్సన్లు ఇంటింటి సర్వే చేసి ఎప్పటికప్పుడు నివేదికలను అధికారులు అందజేయాలని తెలిపారు.

- ఎక్కడైనా జ్వరాలు ఎక్కువగా వస్తున్నట్లు తెలిస్తే వెంటనే ఎంటమాలజీ అధికారులకు సమాచారం ఇచ్చి వెంటనే ఆయా ప్రాంతాల్లో దోమలు పెరగకుండా స్ప్రే చేయడంతో పాటు ఫాగింగ్ చేయించాలని సూచించారు. స్థానికంగా ఉండే మహిళా సమాఖ్యలను ఇంటంటి సర్వేలో వినియోగిస్తే మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు.

ఆపరేషన్ ముస్కాన్ నామమాత్రం


వెస్ట్‌జోన్ ఆపరేషన్ ముస్కాన్ బృందం

బంజారాహిల్స్: బడి ఈడు పిల్లలు బయట ఉండరాదని, బడిలోనే ఉండాలని, తల్లిదండ్రుల సంరక్షణలో ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతి సంవత్సరం జులై 1 నుంచి 31వ తేదీ వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. బాల కార్మికుల గుర్తింపునకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు సిబ్బంది ప్రతిరోజూ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ బాల కార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రుల చెంతకు చేరుస్తారు. ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా ఇది పెద్దగా ఉపయోగం లేకుండాపోతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతేడాది వరకు రెండు పోలీస్‌స్టేషన్లు కలిపి ఒక ముస్కాన్ బృందాన్ని ఏర్పాటు చేసేవారు.

- ఈ సారి వెస్ట్‌జోన్ పరిధిలోని మాసబ్‌ట్యాంక్, బంజారాహిల్స్, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, మధురానగర్, బోరబండ, ఎస్ఆర్‌నగర్, పంజగుట్ట పోలీస్‌స్టేషన్లు అన్నింటికీ కలిపి ఒకే బృందాన్ని ఏర్పాటుచేశారు. తూతూమంత్రంగా ఈ బృందాలు పనిచేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. బాలలతో పని చేయించేందుకు అవకాశం ఉన్న స్థావరాలను వీరు గుర్తించి బాలలకు వెట్టి నుంచి విముక్తి కలిగించాల్సి ఉంటుంది. వారిని తల్లిదండ్రుల చెంతకు చేర్చి కౌన్సెలింగ్ కూడా నిర్వహించాలి. బాధితుల్లో ఎవరైనా అనాథ పిల్లలు ఉంటే బాలల సంరక్షణ గృహాల్లో చేర్పించాలి. ఇందుకు కావలసిన ప్రక్రియను పోలీసు శాఖనే పూర్తి చేయిస్తుంది. ఎవరైనా బాల కార్మికులతో పనిచేయిస్తున్నట్లు గుర్తిస్తే డయల్ 100 లేదా చైల్డ్‌లైన్ నెంబర్ 1098కు ఫోన్ చేయాలని, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉండగా ఈ విషయంలో ఏమాత్రం స్పందన లేకుండాపోయింది. రాష్ట్రవ్యాప్తంగా అధికారుల బృందంతో ఆపరేషన్ ముస్కాన్ పేరిట ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తుండగా దీని పట్ల పెద్దగా అవగాహన కూడా కల్పించడం లేదు. నామ్‌కే వాస్తేగా ఈ కార్యక్రమాన్ని ముందుకుతోస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటివరకు జరిపిన తనిఖీల్లో పెద్దగా ప్రయోజనం కూడా చేకూరింది లేదు.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు...

తప్పిపోయిన 6 నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి వారిని తిరిగి తల్లిదండ్రులకు అప్పగించాలని సుప్రీం కోర్టు 2016లో రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా ఏటా జులై నెలలో ఆపరేషన్ ముస్కాన్, జనవరి మాసంలో ఆపరేషన్ స్మైల్ పేరిట ఏడాదిలో రెండు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బాల కార్మికుల గుర్తింపునకు పోలీసు శాఖ బాల రక్షణ కమిటీ, కార్మిక శాఖ చైల్డ్‌లైన్ కమిటీ, బాలల పరిరక్షణ విభాగం తదితర స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి. బడి ఈడు పిల్లలను బడుల్లో చేర్పించి పిల్లలను గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించాలని ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం.

జూబ్లీహిల్స్ నర్సరీ స్థలంలో వివాదం


నర్సరీ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-36లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ పక్కన జూబ్లీహిల్స్ సొసైటీకి చెందిన 6,000 గజాల స్థలంలో గత 20 సంవత్సరాలుగా నర్సరీ పేరుతో నర్సరీ నడుపుతున్నానని, అయితే గత రెండు మూడు రోజుల నుంచి సొసైటీ యాజమాన్యం తమ నర్సరీ మీద దాడికి యత్నించి దురాక్రమణకు పాల్పడుతుందని, తమకు రక్షణ కల్పించాల్సిందిగా బాధితుడు పిళ్లా సత్యనారాయణ నగర పోలీసు కమిషనర్, వెస్ట్ జోన్ డీసీపీకి ఫిర్యాదు చేశారు. 20 సంవత్సరాల క్రితం సొసైటీ ఈ స్థలాన్ని కేవీ రెడ్డికి బీఓటీ ప్రాతిపదికన స్వాధీనం చేయగా, కేవీ రెడ్డి అనుమతితో తాను నర్సరీ నడుపుతున్నానన్నారు. ఈ విషయం అప్పటి సొసైటీ యాజమాన్యానికి కూడా తెలుసునని, మంతెన రియల్టీ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేశారని, వారు కూడా నర్సరీ నిర్వహించుకునేందుకు అనుమతి ఇచ్చారన్నారు. అంతేకాకుండా సహకార శాఖ అధికారి కూడా ఇక్కడ నర్సరీ నిర్వహించుకోవడానికి ధ్రువీకరించడం జరిగిందన్నారు. అయితే సొసైటీ మాత్రం నర్సరీలోకి ప్రవేశించి నిర్మాణాలు చేపడుతున్నారని, వారి నుంచి రక్షణ కల్పించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

డయాబెటిస్ రివర్సల్ ప్రోగ్రామ్ ప్రారంభం


డయాబెటిస్ రివర్సల్ ప్రోగ్రామ్‌ను ఆవిష్కరించిన ప్రతినిధులు

బంజారాహిల్స్: గ్లోబల్ టెలీ క్లినిక్స్ (జీటీసీ) ఆధ్వర్యంలో దేశంలోనే మొట్టమొదటి డయాబెటిస్ రివర్సల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. నానో హెల్త్‌కు చెందిన అస్యూరెన్స్-డిసీజ్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫారం భాగస్వామ్యంతో అమెరికన్ కాలేజ్ ఆఫ లైఫ్‌స్టైల్ మెడిసిన్ నుంచి బోర్డ్ సర్టిఫైడ్ నిపుణులు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు గ్లోబల్ టెలీ క్లినిక్ సీఈఓ డాక్టర్ మూర్తి గోకుల తెలిపారు. బంజారాహిల్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... నానో హెల్త్ సహకారంతో సాక్ష్యం-ఆధారిత ఔషధం, అత్యాధునిక సాంకేతికతల మేళవింపుతో శారీరిక, మానసిక, సామాజిక శ్రేయస్సును పెంపొందించడమే జీటీసీ లక్ష్యంగా చెప్పారు. ఆ దిశగా డయాబెటిస్ రివర్సల్ ప్రోగ్రామ్‌ను చేపట్టినట్లు వివరించారు.

వివేక్ వెంకటస్వామికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలి


మాట్లాడుతున్న చెన్నయ్య

పంజగుట్ట: బడుగు, బలహీన వర్గాలకు నిత్యం అందుబాటులో ఉండే చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి మంత్రివర్గ విస్తరణలో చోటు కల్పించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య ప్రభుత్వాన్ని కోరారు వివేక్ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్నారని, రాష్ట్ర ఏర్పాటులో కీలకభూమిక పోషించారని ఆయన గుర్తుచేశారు. బుధవారం మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ వర్కింగ్ చైర్మన్‌లు గోపోజు రమేష్, మన్నె శ్రీధర్ రావు, 15 దళిత సంఘాలతో కలిసి చెన్నయ్య మాట్లాడుతూ... గత ఎన్నికల్లో మాల సామాజిక వర్గం కాంగ్రెస్‌కు సంపూర్ణంగా మద్దతు ఇచ్చి అధికారంలోకి రావడానికి కీలకభూమిక పోషించిందని గుర్తుచేశారు. వెంకటస్వామి, వివేక్ కుటుంబం మొదటినుంచి కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్నారని, వివేక్‌కు మంత్రిపదవి ఇస్తే దళితులే కాకుండా, బీసీలు కూడా ఎంతో హర్షం వ్యక్తం చేస్తారని తెలిపారు. అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినయ్ కుమార్, పంజగుట్ట విగ్రహ కమిటీ అధ్యక్షుడు భానుప్రకాష్, మాల మహానాడు గ్రేటర్ అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గోకుల్ కళ్యాణ్, కుమార్, ఎల్ల స్వామి, గణేష్, బొట్టు అనిల్, శ్రీరామ్, గిరి, జగన్ పాల్గొన్నారు.

పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి: ఆర్.కృష్ణయ్య


అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

హిమాయత్‌నగర్: పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనాభా గణనలో బీసీ కుల గణన చేపట్టాలన్నారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జకృష్ణ ఆధ్వర్యంలో బీసీ మేధో మదన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ అధ్యక్షత వహించగా వివిధ యూనివర్సిటీల నుంచి పలువురు ప్రొఫెసర్లు, 28 బీసీ సంఘాలు, 36 కుల సంఘాలు, 48 ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. సదస్సులో కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, బీసీ సంఘాల నేతలు గొరిగె మల్లేష్, ఎర్ర సత్యం, గుజ్జ సత్యం,వేముల రామకృష్ణ, మహిళ నాయకురాలు మట్ట జయంతి గౌడ్‌లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి బీసీ నాయకులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 43, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 45, పందిరి బీర 38, క్యాబేజీ 33, క్యారెట్ 35, దొండ 35, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 80, గోకరకాయ 45, కీర 25, దోసకాయ 28, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 32.

ఎస్పీఆర్‌హిల్స్‌కు బస్సు నడపండి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సీఎన్ రెడ్డి వినతి

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఎస్పీ ఆర్ హిల్స్ ప్రాంతం నుంచి వేలాదిగా ప్రజలు వివిధ పనుల నిమిత్తం నగరంలోని వివిధ ప్రాంతాలను రాకపోకలు కొనసాగిస్తుంటారని వినతి పత్రంలో వివరించారు. తాను చేసిన వినతి పై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సీఎన్ రెడ్డి తెలిపారు.

తాంత్రిక పూజల పేరుతో విశ్రాంత అధికారికి టోకరా

బంజారాహిల్స్: మీ ఇంటికి దిష్టి దోషం ఉంది.. దానిని తొలగించాలంటే తాంత్రిక పూజ చేయాలంటూ విశ్రాంత అధికారి కుటుంబాన్ని నమ్మించి రూ. లక్షతో ఉడాయించిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-41లో నివసించే విశ్రాంత వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎస్ సుబ్బారెడ్డి ఇంటికి ఉదయం 8 గంటల ప్రాంతంలో భారీగా నగలు ధరించి పట్టుచీర కట్టుకుని సంప్రదాయ పద్ధతిలో ఓ మహిళ వచ్చి ఆయన భార్య వరలక్ష్మీతో కొద్దిసేపు మాట్లాడింది. ఇంట్లో కొన్ని దుష్టశక్తులు తిరుగుతున్నాయని, వాటిని దూరం చేయాలంటే ఓ ప్రత్యేకమైన పూజ చేయాల్సి ఉంటుందని నమ్మించింది. ఈ పూజ చేసే ప్రదేశంలో లక్ష రూపాయలు ఓ వస్త్రంలో చుట్టి కట్టాలని చెప్పగా ఆ మేరకు నగదు మూటను దేవుడు వద్ద ఉంచారు. కొద్దిసేపటికి చూడగా లక్ష ఉంచిన మూట కనిపించలేదు. ఇదే విషయాన్ని భర్తకు తెలియజేసింది. తన భార్యను ఓ మహిళ పక్కదారి పట్టించి లక్షతో ఉడాయించిందంటూ బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య


షబానా (ఫైల్)

ఫిలింనగర్: అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఓ వివాహిత ఫ్యాన్‌కు ఉరి సుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలివీ... జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని స్వామి వివేకానందనగర్ బస్తీలో నివాసం ఉండే షబానా(36) అపోలో ఆస్పత్రిలో హౌసీకీపింగ్ విభాగంలో పని చేసేది. కొద్ది రోజులుగా ఆమె మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త మహబూబ్ బాసా ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థుల నుంచి 2023-24వ సంవత్సరానికి గాను ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కాచిగూడ మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్‌మీడియట్‌లో 80 శాతానికి పైగా మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థినీవిద్యార్థులు దరఖాస్తులు దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ లోగా కాచిగూడలోని ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు సెల్: 94916 27404.

లైంగికదాడి కేసులో నిందితుడి అరెస్ట్

ఫిలింనగర్: లైంగికదాడి, దోపిడీకి పాల్పడ్డ నిందితుడిని 36 గంటల్లోనే ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఫిలింనగర్ పోలీసుల సమాచారం మేరకు... జులై 7వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో సికింద్రాబాద్ వెళ్లేందుకు ప్రశాసన్ నగర్ బస్టాప్ వద్ద ఓ మహిళ ఒంటరిగా బస్సు కోసం వేచి ఉంది. ఓ వ్యక్తి ఆ మహిళను గమనించి సికింద్రాబాద్‌లో డ్రాప్ చేస్తానని నమ్మించి బైక్‌పై నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగికదాడి చేసి మొబైల్ ఫోన్‌తో పాటు ఆమె వద్ద ఉన్న రూ. 1000ని దోచుకొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఫిలినగర్ జ్ఞాని జైల్ సింగ్ నగర్‌కు చెందిన కిషోర్(22) అనే నిందితుడిని 36 గంటల్లో అరెస్టు చేసి, అతని వద్ద నుంచి మొబైల్ ఫోన్, నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.





సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

సాక్షి గురువారం, 11, జూలై, 2024

ప్రమాణ స్వీకారం



శోభారాణిని అభినందిస్తున్న మంత్రి సీతక్క, రాజగోపాల్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: రాష్ట్ర ప్రభుత్వ మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బొంద్రు శోభారాణి వెంగళరావునగర్‌లోని స్టేట్‌హోంలో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. మహిళలకు సముచిత న్యాయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అందిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళాభివృద్ధికి వారి అభ్యున్నతికి మరింత తోడ్పాటు అందిస్తామని మంత్రి సీతక్క అన్నారు. మంత్రివర్గంతో పాటు నామినేటెడ్ పోస్టుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని శోభారాణి అన్నారు. పలువురు రాజకీయ నేతలు, శిశుసంక్షేమ, మహిళాభివృద్ధి సంక్షేమశాఖ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ప్రజారోగ్య పరిరక్షణ అందరి బాధ్యత



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 45 వేల మంది ఆర్ఎంపీ, పీఎంపీ, సీపీ, ఈపీలకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వడంతో పాటు గుర్తింపు కార్డులను జారీ చేయాలని కోరారు. గ్రామీణ వైద్యులకు చట్టబద్ధంగా తగిన రక్షణ కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, వివిధ సంఘాల రాష్ట్ర నాయకులు చొప్పరి శంకర్‌ముదిరాజ్, బాలబ్రహ్మచారి, డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, జె.రమేష్, రవిశంకర్, హుస్సేన్, హరిబాబు పాల్గొన్నారు.

అందరినీ కలిసే ప్రయత్నం చేస్తా..

- కృతజ్ఞత సభలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



కూకట్‌పల్లిలో మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ఎస్‌కేఎస్ఆర్ గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన కృతజ్ఞత సభకు మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీగా నియోజకవర్గ పరిధి చాలా పెద్దదైనా అందరినీ కలిసే ప్రయత్నం చేస్తానన్నారు. తనపై ఏ నమ్మకంతో ఓటు వేశారో.. ఆ నమ్మకాన్ని వమ్ము కానివ్వనన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో చైతన్యవంతమైన ప్రజలు ఉంటారని, ప్రజాస్వామ్యానికి దెబ్బ తగులుతుందంటే సరైన నిర్ణయం తీసుకుంటారన్నారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. ఎవరు ఎటువంటి వినతి పత్రాలు అందజేసే పనిలేకుండా అందరి పనులు చేసి పెడతానన్నారు. ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేసినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఒక్క హామీ అమలు చేయలేన్నారు. పేదలకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వే ఫ్రంట్‌లైన్ రన్నింగ్ సిబ్బంది సేవలు భేష్

- సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ గోపాల్



సాక్షి, సిటీబ్యూరో: రైళ్లు నడిపే లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లు, ట్రైన్ మేనేజర్లు తదితర ఫ్రంట్‌లైన్ రన్నింగ్ సిబ్బంది సంక్షేమానికి దక్షిణమధ్య రైల్వే అధిక ప్రాధాన్యమిస్తోందని సికింద్రాబాద్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్(ఇన్‌ఫ్రా) ఎం.గోపాల్ తెలిపారు. రన్నింగ్ సిబ్బంది కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రన్నింగ్ రూమ్ లాబీ సేవలను ఆయన మంగళవారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. రైళ్ల సమయపాలన, సురక్షితంగా రైళ్లు నడపడంలో రన్నింగ్ సిబ్బంది సేవలు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. లోకో పైలట్‌లకు అనుకూలమైన, మానసిక ప్రశాంత వాతావరణాన్ని కల్పించే విధంగా రన్నింగ్ రూమ్‌లను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సికింద్రాబాద్ రన్నింగ్ రూమ్‌లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే 60 మంది సిబ్బందికి సౌకర్యవంతమైన వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సిబ్బందికి ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన అల్పాహారం, రాత్రి, పగలు భోజన సదుపాయాలను నామమాత్రపు ధరలకే అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. లాంజ్‌లు, రీడింగ్ రూమ్, ధ్యానం, యోగా కోసం ప్రత్యేకమైన గది ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రన్నింగ్ రూమ్‌లో అన్ని అంతస్తులకు లిఫ్ట్, లాండ్రీ సౌకర్యాలు, షూ షైనింగ్ మెషిన్, క్లీన్ వాష్‌రూమ్‌లు, సోలార్ వాటర్ హీటర్లు, మెకనైజ్డ్ వాష్డ్ లినెన్, మంచాలు, దుప్పట్లు, డైనింగ్ హాల్ తదితర సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. సమావేశంలో సీపీఆర్వో ఎ.శ్రీధర్, వెంకటేష్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా..

హిమాయత్‌నగర్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని, హైదరాబాద్‌ను యాచక రహిత నగరంగా మార్చేందుకు కృషి చేయాలని ఉమెన్ సెఫ్టీ వింగ్ డీసీపీ కవిత దార సంబంధిత అధికారులకు సూచించారు. హైదరాబాద్ జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ ఎక్స్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడంపై బుధవారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో డీసీపీ కవిత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, జిల్లా సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ జి.శైలజ, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్లు శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రప్రసాద్ పాల్గొని సలహాలు, సూచనలు అందజేశారు. వీధి బాలల రహిత హైదరాబాద్ నగర లక్ష్యాన్ని సాధించడంతో పాటు తప్పిపోయిన పిల్లలు, వారి కుటుంబ సభ్యుల ముఖాల్లో చిరునవ్వులు నింపేందుకు అధికారులందరూ నెల రోజుల ఆపరేషన్ నిర్వహించడానికి బృందంగా పని చేయాలని డీసీపీ కవిత కోరారు. డీసీపీఓ ఎం.శ్రీనివాస్, సీడబ్ల్యూసీ సభ్యుడు టి.ప్రమోద్, చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ మాధవి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎందరికో బతుకునిస్తున్న భాగ్యనగరం | నియోరిచ్ వర్గాలతో మారుతున్న రూపురేఖలు | అభివృద్ధితో పాటు పెరుగుతున్న అసమానతలు | కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరం.. | సామాన్యులకు స్వప్నంగానే భూమి | సమకూరని మౌలిక సదుపాయాలు

ప్రభం‘జనం’!

ఏటేటా పెరుగుతున్న సిటీ జనం

నేడు ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా..

హైదరాబాద్, సికింద్రాబాద్ ట్విన్ సిటీస్‌గా ఉన్నప్పుడు పది లక్షల జనాభాతో ‘పట్నం’గా పేరున్న హైదరాబాద్ కాలంతో పాటు పెరుగుతోంది. పాత బస్తీ, న్యూసిటీలతో పాటు హైటెక్‌సిటీ వచ్చి చేరింది. అంతటితో ఆగలేదు హైదరాబాద్ అర్బన్ అగ్లామరేషన్‌గా విస్తరిస్తూ పోతోంది. చార్మినార్ నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా నాటి నిజాం నవాబు మహ్మద్ కులీకుతుబ్‌షా ‘నదిలో చేపలు పెరిగినట్లుగా ఈ నగరాన్ని కూడా ప్రజలతో నింపు దేవుడా’ అంటూ కోరిన కోరిక నిజమైనట్లుగా నగరం జనంతో నిండిపోతూనే ఉంది. ప్రస్తుతం కోటిని దాటింది. మరో ఆరేడేళ్లలో జనాభా 1.30 కోట్లకు చేరుకోగలదని అంచనా.

- సాక్షి, సిటీబ్యూరో

ఒకప్పుడు ఉన్న ఊళ్లో పనుల్లేకో, బతికేందుకు చిన్నా చితకా పనులకో, దినసరి కార్మికులుగానో, ఫ్యాక్టరీల్లో పనిచేసేందుకో ఇతర ప్రాంతాల నుంచి ఎక్కువగా వచ్చేవారు. గతంలో అలా ‘మాస్’ మాత్రమే నగరదారి పట్టేది. ఐటీ రంగం విస్తరణతో ‘క్లాస్’ కూడా హైదరాబాద్ ‘బాట’ పట్టింది. వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి ఏటేటా వచ్చే వారు పెరుగుతున్నారు. పలు ఐటీ కంపెనీలు, పరిశోధన సంస్థలు, స్టార్టప్‌లు, ఫార్మారంగం తదితరమైనవి ఆయా రంగాల్లోని నిపుణులు హైదరాబాద్‌కు వచ్చేలా, ఇక్కడే ఉండేలా చేస్తున్నాయి.



వైవిధ్యంలో ఏకత్వం

అన్ని భాషలు, మతాలు, సంస్కృతుల వారిని తమలో కలుపుకోగల హైదరాబాదీ మనస్తత్వంతో పాటు మిగతా నగరాలతో పోలిస్తే జీవన వ్యయం తక్కువ. అనుకూలమైన వాతావరణం, వివిధ ప్రాంతాల నుంచి రవాణా కనెక్టివిటీ తదితరమైన వాటితో నగరం అన్ని వర్గాల వారినీ ఆకర్షిస్తోంది. నగర వారసత్వం, కాస్మోపాలిటన్ కల్చర్ వంటివి సైతం ఎందరో హైదరాబాద్‌ను వదిలిపోకుండా చేస్తున్నాయి. చాయ్‌బన్నుతో రూ.30లతో పూట గడిపే వారి నుంచి రూ.కోట్లకు పడగలెత్తిన వారు ఇక్కడ కనిపిస్తారు. కష్టపడితే చాలు ఏదో ఒక పని దొరికే పరిస్థితి ఉండటం కూడా ఎక్కువ మందిని ఇక్కడకు రప్పిస్తోంది.

వేగంగా అభివృద్ధి చెందే అన్ని నగరాల మాదిరే హైదరాబాద్‌లోనూ సమస్యలు నెలకొంటున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా గృహవసతి, తాగు

సమస్యలు.. సవాళ్లు

నీరు, విద్యుత్, ప్రజారవాణా వసతుల్లేక వాటి కొరత పెరుగుతోంది. విద్య, వైద్యం, కాలుష్యం, గాలి నాణ్యత, పరిశుభ్రత, ఘనవ్యర్థాల నిర్వహణ, పర్యావరణం, తదితర అంశాల్లో జనాభా పెరుగుదల ప్రభావం కనిపిస్తోంది. ఈ సవాళ్లను ఎదుర్కోవడం ప్రభుత్వాల పని. ముందుచూపు లేకుంటే సమస్యలు తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉంది. ట్రాఫిక్‌జామ్‌లు, వరద సమస్యలు, లంగ్‌స్పేస్ కొరత, ఆహారకల్తీ, పబ్లిక్ టాయ్‌లెట్లు కూడా చాలినన్ని లేకపోవడం వంటివి ఇప్పటికే చూస్తూనే ఉన్నాం.

నగర జీడీపీలో దాదాపు 14 శాతం ఐటీ రంగం నుంచే..

- 90వ దశకం నుంచి నగర ఆర్థిక విధానాల్లో వైవిధ్యం కనబడుతోంది. ఐటీతో పాటు, బయోటెక్, ఫార్మా రంగాలు విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి.

బీమా, రియల్‌ఎస్టేట్, రవాణా, హోటల్, హాస్పిటల్స్, టూరిజం తదితర రంగాలు ఎందరికో ఉపాధినిస్తూ ఇతోధికంగా వృద్ధి చెందుతున్నాయి. వివిధ రంగాల్లో రిటైల్ వ్యాపారాలు, ఎందరికో జీవనమార్గం చూపిస్తున్నాయి. టీ, కాఫీ షాపులు సైతం స్మార్ట్‌గా వెలుస్తున్నాయి.

రూ.10 కొత్తిమీర కొన్నా డిజిటల్ చెల్లింపులు జరుగుతున్నాయి.

- మరోవైపు, నైపుణ్యం లేకున్నా, పాక్షిక నైపుణ్యమున్నా నిర్మాణరంగంతో పాటు ఇతరత్రా రంగాల్లో పనిచేసేందుకు బీహార్, చత్తీస్‌గఢ్, అసోంలతో సహా వివిధ రాష్ట్రాల నుంచి కార్మికులు నగరానికి వలస వస్తున్నారు.

2021 నుంచి పెరుగుదల ఇలా..		
సంవత్సరం	జనాభా	పెరుగుదల రేటు(శాతం)
2021	1,02,69,000	2.65
2022	1,05,34,000	2.58
2023	1,08,01000	2.53
2024	1,10,69,000	2.48

మారుతున్న పోకడలు

మాస్, క్లాస్ అని తేడా లేకుండా పెరుగుతున్న జనాభాతో నగరం నలుచెరగులా విస్తరిస్తోంది. దాంతో నిలువనీడనే కాదు కాలు మోపేందుకు కాసింత చోటు కూడా కరువవుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులే కాకుండా ఉన్నట్టుండి సంపన్నులైన వారు, ఇతరత్రా వృత్తివ్యాపారాల్లోని వారు సైతం వెంచర్లవైపు పరుగులు పెడుతున్నారు. భూమి సామాన్యులకు స్వప్నంగా మిగులుతోంది. భూముల ధరలు బంగారాన్ని మించి పోవడంతో అమాంతంగా ఆగర్భ శ్రీమంతులవుతున్న వారు పెరుగుతున్నారు. హోదా చాటుకోవడానికి అలవడుతున్న విలాసాలతో వ్యసనాలు అంటుకుంటున్నాయి. క్లబ్బులు, పబ్బులే కాకుండా రేవ్ పార్టీలు, వివిధ దేశాల్లోని వికృతపోకడలు నగరంలోనూ కనిపిస్తున్నాయి.

జనాభా పెరిగిందిలా..	
ఏ సంవత్సరం	ఎంత జనాభా
1950	10 లక్షలు
1975	20 లక్షలు
1990	40 లక్షలు
2000	54 లక్షలు
2010	80 లక్షలు
2016	92 లక్షలు
2024	1.08 కోట్లు
2030	1.27 కోట్లు (అంచనా)

వ్యూహాత్మక ప్రణాళిక కావాలి..

పెరుగుతున్న జనాభా ఓవైపు అభివృద్ధికి ఉపకరిస్తున్నప్పటికీ, మరోవైపు జీవన ప్రమాణాలకు సవాల్‌గా మారింది. ఇందుకు వ్యూహాత్మక పట్టణ ప్రణాళికతోపాటు స్థిరమైన అభివృద్ధి కీలకమని పట్టణ వ్యవహారాల నిపుణులు చెబుతున్నారు.

సంపన్నుల జాబితాలోనూ..

జనాభాతో పాటు సంపన్న సిటీల జాబితాలోనూ హైదరాబాద్ ఉంటోంది. సంపన్న నగరాల జాబితాలో 97 నగరాలుండగా, అందులో గ్రేటర్ హైదరాబాద్ 65వ స్థానంలో ఉంది. నగరంలో 11,100 మంది మిలియనీర్లు(8.2కోట్లకు పైగా ఆస్తులు కలిగిన వారున్నట్లు ‘హెన్లే అండ్ పార్ట్‌నర్స్’ అధ్యయనంలో వెల్లడైంది. 2012–22 మధ్య దశాబ్దకాలంలో మిలియనీర్లు 78 శాతం పెరిగారు. రిచెస్ట్ జాబితాలో మన దేశంలోని ముంబై 21వ స్థానంలో, ఢిల్లీ 36, బెంగళూర్ 60, కోల్‌కత్తా 63వస్థానాల్లో ఉన్నాయి.

నగరం దాటి జనాభా శివార్లలో విస్తరిస్తుండటంతో ఆ పరిధి వరకూ లెక్కలు తీస్తున్నారు.

హెచ్ఎండీఏ పరిధిలో..

- 1951 నుంచి 1961 వరకు ఏటా 1నుంచి 2 శాతం లోపు పెరుగుదలతో ఉన్న జనాభా
- 1962 నుంచి 1980 వరకు 3 శాతానికి పైగా పెరిగింది.
- 1981లో 4.22 శాతం పెరిగింది.
- 1982 నుంచి 1990 వరకు ఏటా 5 శాతానికి పైగా పెరిగింది.
- 1991లో 4.6 శాతం పెరిగింది.
- 1992 నుంచి 2022 వరకు ఏటా 2 నుంచి 3 శాతంలోపు పెరిగింది.
- ఐక్యరాజ్యసమితి అంచనా మేరకు ఈ జనాభా 1,10,69,000గా ఉంది.

1.05 కోట్లకు జనాభా

ఐక్యరాజ్యసమితి జనాభా విభాగం గత సంవత్సరం వెలువరించిన గణాంకాల మేరకు.. హైదరాబాద్ జనాభా 1.05 కోట్లకు చేరింది. దేశంలోని జనాభాలో 6వ స్థానంలో ఉండగా, ప్రపంచంలో 34వ స్థానంలో ఉన్నట్లు పేర్కొంది.

బల్కంపేట ఎల్లమ్మ తల్లికి బంగారు బోనం



బంగారు బోనంతో జోగిని నిషాక్రాంతి, గాజుల అంజయ్య తదితరులు

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని భాగ్యనగర్ శ్రీమహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో భక్తులు బుధవారం బల్కంపేట ఎల్లమ్మ తల్లి అమ్మవారికి బంగారు పాత్రలోని నైవేద్యంతో పాటు పట్టువస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించారు. కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని అమ్మవారి ఆలయాలతో పాటు విజయవాడలోని కనకదుర్గ అమ్మవార్లకు బంగారు బోనం సమర్పిస్తున్నారు. మొదటి బోనం ఈ నెల 7న గోల్కొండ జగదాంబ అమ్మవారికి, రెండో బంగారు బోనం బుధవారం బల్కంపేట ఎల్లమ్మ తల్లికి సమర్పించారు. పోతురాజుల నృత్యాలు, కళాకారుల ప్రదర్శనలతో అమ్మవారికి బంగారు బోనాన్ని తీసుకెళ్లి సమర్పించారు. ఉదయం పాతబస్తీ మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వైభవంగా బల్కంపేటకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ అధ్యక్షుడు గాజుల అంజయ్య, మధుసూదన్ యాదవ్, అనంతోజ్ హన్స్‌రాజ్, బుల్లెట్ శ్రీధర్, కేఎస్.ఆనంద్‌రావు, కాట రమేష్, గాజుల ప్రవీణ్, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టూరిజం ప్లాజాలో భారత్ గౌరవ్ రైలు కస్టమర్ కేర్



సనత్‌నగర్: బేగంపేట టూరిజం ప్లాజాలో ఏర్పాటు చేసిన భారత్ గౌరవ్ రైలు కస్టమర్ కేర్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. సౌత్ స్టార్ లైన్‌తో కలిసి భారత్ గౌరవ్ రైల్ టూర్ టైమ్స్ ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను సౌత్‌హెడ్ రమేష్ అయ్యంగార్, యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ కిషన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే భారత్ గౌరవ్ రైళ్ల ప్రయోజనాలు తెలంగాణ పర్యాటకులకు సైతం అందేలా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో టెంపుల్ సర్క్యూట్‌ను నిర్వహించడానికి తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, టెంపుల్ టూరిజంతో కలిసి భారత్ గౌరవ్ రైల్ టూర్ టైమ్స్ పనిచేయనున్నట్లు చెప్పారు. ఆగస్టు 7న నాగపంచమి స్పెషల్ శ్రీలంక రామాయణ యాత్ర, నిష్కలంక్ మహదేవ్ టెంపుల్, పంచద్వారక, పంచ జ్యోతిర్లింగ, చార్‌ధామ్ యాత్ర, మహాలయ పక్ష మోక్ష స్థలయాత్ర, వియత్నాం, కంబోడియా, దీపావళి స్పాన్ స్పెషల్, రాయల్ రాజస్థాన్ టూర్ షెడ్యూల్‌గా తెలిపారు. 1ఏసీ, 2ఏసీ, 3ఏసీ, స్లీపర్ క్లాస్‌తో సహా అనేక రకాల కోచ్ ఎంపికలు వంటి అనేక ప్రయోజనాలను ప్రయాణికులు పొందవచ్చన్నారు.

నీట్ పరీక్ష రద్దు చేయాలి

గన్‌ఫౌండ్రీ: దేశవ్యాప్తంగా నీట్ పరీక్షను రద్దుచేసి తిరిగి నీట్ పరీక్షను నిర్వహించే అధికారం రాష్ట్రాలకే ఇవ్వాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు అన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నీట్ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద నవీన్, తీగల శ్యామ్, కె.ఝాన్సీ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పీడీఎస్‌యూ ప్రతినిధులు

విద్యుత్ అధికారులకు షోకాజ్ నోటీసులు

సాక్షి, సిటీబ్యూరో: మాసబ్‌ట్యాంక్ సమీపంలోని చాచానెహ్రూ పార్క్ వద్ద ఉన్న 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక సమస్య కారణంగా మంగళవారం సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీన్ని సరిచేయడానికి సిబ్బంది గంటల కొద్దీ సమయాన్ని తీసుకున్నారని పలువురు కాలనీవాసులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ స్పందిస్తూ విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్‌రెడ్డిని ఆదేశించారు. విచారణ జరిపిన ఎస్ఈ, సరఫరాలో అంతరాయం విషయం అధికారులకు తెలియజేయనందుకు, విధుల్లో అలసత్వం ప్రదర్శించినందుకు వివరణ ఇవ్వాల్సిందిగా మాసాబ్‌ట్యాంక్ అసిస్టెంట్ ఇంజినీర్ నాగచైతన్య, మెహిదీపట్నం అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ మల్లయ్యకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ప్రజావాణిలో వచ్చిన సమస్యలను పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్(రెవెన్యూ) వెంకటాచారి

సాక్షి, సిటీబ్యూరో: సీఎం ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) వెంకటాచారి తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి బుధవారం గూగుల్ మీట్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మండలాల వారీగా సీఎం ప్రజావాణి దరఖాస్తులను సమీక్షించారు. సుమారు 207 సీఎం ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, అధికంగా ఖైరతాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో 61 దరఖాస్తులు, షేక్‌పేట్‌లో 29, మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో 22, సికింద్రాబాద్ ఆర్డీవో కార్యాలయంలో 39 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. బహదూర్‌పురా, హిమాయత్‌నగర్, సికింద్రాబాద్, తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయాల్లో సీఎం ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందని ఆయన తెలిపారు. సమావేశంలో ఆర్డీఓలు, మహిపాల్, దశరథ్‌సింగ్, ఈ–డీఎం రజిత, ప్రదీప్‌కుమార్ తహసీల్దార్లు నాయబ్ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

గాంధీలో డ్రైనేజీ ప్రక్షాళన పనులు షురూ



నూతన డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న గాంధీ సూపరింటెండెంట్ రాజారావు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో డ్రైనేజీ పైప్‌లైన్ ప్రక్షాళన పనులను ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు బుధవారం ప్రారంభించారు. సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం ఆస్పత్రి భవనం నిర్మించిన సమయంలో డ్రైనేజీ సిస్టమ్‌ను ఆస్పత్రి సెల్లార్ నుంచి బయటకు వెళ్లేలా ఏర్పాటు చేశారు. పైప్‌లైన్లు శిథిలావస్థకు చేరడం, ఎలుకలు, పందికొక్కులు మట్టిని తవ్వేయడంతో డ్రైనేజీ సిస్టం అస్తవ్యస్తంగా తయారై, సెల్లార్ మొత్తం మురుగునీటితో నిండిపోయింది. రెండేళ్ల క్రితం నూతన డ్రైనేజీ సిస్టం ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించి, టెండర్లను ఆహ్వానించారు. బిల్లులు మంజూరు కావడంలేదనే సాకుతో కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో టెండరు దశలోనే నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గాంధీ ఆస్పత్రిని సందర్శించిన సమయంలో డ్రైనేజీ లీకులను గుర్తించి ఆరా తీశారు. ప్రతిపాదిత వ్యయాన్ని రూ.15 కోట్లకు పెంచి మరోమారు టెండర్లకు ఆహ్వానించడంతో అడుగు ముందుకు పడింది. ఈక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ బుధవారం భూమిపూజ నిర్వహించి నూతన డ్రైనేజీ సిస్టం నిర్మాణ పనులను ప్రారంభించారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు శ్రీహరి, వినయ్‌శేఖర్, ఆర్ఎంఓ–1 జయకృష్ణ, టీజీఎంఎస్ఐడీసీ ఈఈ చలపతిరావు, డీఈ అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

డెంగీపై పోరాడదాం..



సాక్షి, సిటీబ్యూరో: డెంగీ నియంత్రణలో అందరూ భాగస్వాములు కావాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. కమిషనర్ ఆమ్రపాలితో కలిసి వైద్య ఆరోగ్యశాఖ, ఎంటమాలజీ, శానిటేషన్ విభాగాల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దోమలతో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా తదితర వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సహాయ వైద్యాధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ వ్యాధుల నియంత్రణపై అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు భరోసా కల్పించాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్స్‌లో దోమల నివారణకు స్ప్రే చేయాలని, సీజన్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా ‘జాయిన్ ది ఫైట్ అగెనెస్ట్ డెంగీ’ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అందరం కలుద్దాం.. కేన్సర్‌ను జయిద్దాం



గచ్చిబౌలి: అందరం కలుద్దాం, కేన్సర్‌ను జయిద్దామని సైబరాబాద్ సీపీ అవినాష్‌మహంతి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో రేస్ తేదీ, థీమ్, రిజిస్ట్రేషన్ల ప్రారంభోత్సవాలను జాయింట్ సీపీ(ట్రాఫిక్) డి జోయెల్ డేవిస్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. అందరం కలిసి అవగాహన కల్పిస్తే ప్రాణాలు కాపాడొచ్చన్నారు. కేన్సర్ లేని సమాజమే లక్ష్యమని గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి స్పష్టం చేశారు. రేస్ కేటగిరిల్లో 2కె నడక, 5కె నడక, 10కె నడక, పరుగు వంటివి అక్టోబర్ 6న రన్ జరుగుతుందని, ఫిజికల్, వర్చువల్ మోడ్‌ల ద్వారా 130 దేశాల నుంచి లక్ష మందికి పైగా పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కేన్సర్ అవగాహన రన్ అన్నారు. ఎస్‌సీఎస్‌సీ సెక్రెటరీ జనరల్ రమేష్‌ఖాజా, హైసియా అధ్యక్షుడు ప్రశాంత్‌నందేళ్ల, రేస్ డైరెక్టర్ కృపాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్‌ । గురువారం ।
11 । జూలై । 2024



గోల్కొండ కోట వద్ద హెచ్‌జీసీ గోల్ఫ్‌ కోర్స్‌



మ్యాక్‌ ప్రాజెక్ట్‌లో గోల్ఫ్‌ ఆడుతున్న క్రీడాకారులు



అందమైన సూత్ర

బంజారాహిల్స్‌: ఆధునిక, సంప్రదాయ మేళవింపుతో కూడిన 'సూత్ర లైఫ్‌స్టైల్‌' ఎగ్జిబిషన్‌ తాజ్‌కృష్ణాలో ప్రారంభమైంది. బుధవారం మిస్‌ గ్రాండ్‌ ఇండియా ప్రాచీ నాగ్‌పాల్‌ ముఖ్య అతిథిగా హాజరై ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల్లోని ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన వస్త్ర, వజ్రాభరణ ఉత్పత్తులను ఒకే వేదికమీద ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. మూడు రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్‌ కొనసాగుతుందని 70 స్టాల్స్‌లో 25 వేలకుపైగా ఉత్పత్తులు ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మోడల్స్‌ ఇక్కడ లభించే ఉత్పత్తులను ధరించి సందడి చేశారు.

రోడ్డెక్కిన బుల్లి జీపు!



సాక్షి, సిటీబ్యూరో: బ్యాటరీతో నడిచే బుల్లి జీపు రోడెక్కింది. రయ్‌ రయ్‌ మంటూ ఇతర వాహనాలతో పోటీగా పరుగులు పెడుతూ చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. మెహదీపట్నం నుంచి లక్డీకాపూల్‌ మీదుగా రోడ్డు మీద బుధవారం సాయంత్రం వేళలో వెళుతుండగా 'సాక్షి' కంట పడింది. రోడ్డు మీద వడివడిగా పరుగులు పెడుతున్న ఈ జీపను పలువురు వాహనదారులు ఫొటోలు, వీడియోలు తీస్తూ సంబరపడిపోయారు. వాటిని ఇన్‌స్టాగామ్‌, ఎక్స్‌ వంటి పలు సామాజిక మాధ్యమాలలో పోస్ట్‌ చేశారు. అయితే నంబరు ప్లేట్‌ లేకుండా, సీట్‌ బెల్ట్‌ పెట్టుకోకుండా రోడ్డుపై పరుగులు పెడుతున్న ఈ బుల్లి జీపుపై ట్రాఫిక్‌ పోలీసులు ఎలా స్పందిస్తారో!?



గోల్ఫ్‌ ఆడేద్దాం

నగర జీవనశైలిలో భాగమైన క్రీడ

- లగ్జరీ వసతుల జాబితాలో చోటు
- ఆట వచ్చినా స్టేటస్‌ సింబలే
- ఒత్తిడి, మానసిక, శారీరక వికాసానికి పరిష్కారం
- శివారు ప్రాంతాల్లో గోల్ఫ్‌ కోర్స్‌ ప్రాపర్టీల అభివృద్ధి
- వీటితో భూముల విలువ రెట్టింపు

ఒకప్పుడు సంపన్న వర్గాలకు మాత్రమే పరిమితమైన గోల్ఫ్‌.. క్రమంగా కామన్‌ మ్యాన్‌కు చేరువవుతోంది. నగరంలో ఏకంగా గోల్ఫ్‌ కోర్స్‌లు, క్లబ్‌లు ఏర్పాటవుతున్నాయి. ఇదొక ఆటగా కాకుండా జీవనశైలిగా మారిపోతోంది. గోల్ఫ్‌ కోర్స్‌ ప్రాపర్టీ ఉన్నా.. ఆడటం వచ్చినా స్టేటస్‌ సింబల్‌గా భావిస్తుండటంతో దశాబ్ద కాలంగా హైదరాబాద్‌లో గోల్ఫ్‌ ప్రాపర్టీలకు డిమాండ్‌ పెరుగుతోంది. దీంతో నగర శివారులో గోల్ఫ్‌ కోర్స్‌ థీమ్‌ ఆధారిత విల్లాలు, టౌన్‌షిప్‌లు, కమ్యూనిటీలు వెలుస్తున్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో

- గోల్ఫ్‌ శిక్షణతో ప్రశాంతత, నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. ఒత్తిడి తగ్గి మనసు, శరీరం సమన్వయంతో పనిచేస్తాయి.
- గోల్ఫ్‌ ఆటకు సగటున 4–5 గంటల సమయం పడుతుంది. ఇది చాలా శ్రమతో కూడుకున్నది. దీంతో మానసిక, శారీరక వికాసానికి దోహదపడుతుంది.

ప్రయోజనాలివీ..

- వాటర్‌ ఫ్రంట్‌ సెట్టింగ్‌లు, అద్భుతమైన వ్యూ, విలాసవంతమైన వసతులు, పచ్చటి వాతావరణం వంటి రకరకాల కారణాలతో గోల్ఫ్‌ కోర్స్‌ ప్రాపర్టీల విలువ త్వరితగతిన పెరుగుతుంది. పునఃవిక్రయం సులువుగా ఉంటుంది.
- ఈ ప్రాపర్టీల్లో భూమి విలువ పెరుగుదల ఎక్కువగా ఉంటుంది.
- ఒకే రకమైన ఆలోచనా ధోరణులు, భావాలు, ఆసక్తులు ఉన్న వ్యక్తులు ఒకే చోట ఉండటంతో కమ్యూనిటీ బంధాలు బలపడతాయి.

బ్రిటిష్‌ కాలంలో గోల్ఫ్‌ క్లబ్‌లకు బయట 'కుక్కలు, భారతీయులకు అనుమతి లేదు' అని రాసి ఉండేదట. మన దేశంలో గోల్ఫ్‌ రిచ్‌ గేమ్‌గా మారడానికి ఇదే కారణం. అప్పట్లో ఆంగ్లేయులు భారతీయులకు క్రీడలు నేర్పించేవారు కాదు. గోల్ఫ్‌ శిక్షణ కోసం ఏకంగా ఇంగ్లండ్‌కు వెళ్లాల్సిన పరిస్థితి. అయితే కాలక్రమేణా మన దేశంలో గోల్ఫ్‌ క్లబ్‌లు, సంఘాలు ఏర్పడటంతో అనతికాలంలో ప్రజాదరణ పొందింది. బ్యూరోక్రాట్స్‌, సీ–లెవల్‌ ఎగ్జిక్యూటివ్‌లు, యువ వ్యాపారస్తులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ఉన్నత స్థాయి ఉద్యోగులు గోల్ఫ్‌ కోర్స్‌ ప్రాపర్టీల్లో నివాసం ఉండేందుకు, పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

ఉన్నత, ఎగువ మధ్య తరగతి..

సాధారణంగా గోల్ఫ్‌ కోర్టులకు ఎక్కువ స్థలం కావాలి. నగరాల్లో భూమి కొరత, ఖరీదు కారణంగా డెవలపర్లు గోల్ఫ్‌ ప్రాపర్టీలను లాభదాయకమైన రియల్‌ ఎస్టేట్‌ ఫార్మాట్లుగా అభివృద్ధి చేస్తుంటారు. 18 హోల్స్‌ గోల్ఫ్‌ కోర్స్‌ ప్రాపర్టీని అభివృద్ధి చేయాలంటే కనిష్టంగా 100–120 ఎకరాల భూమి కావాలి. ఇందులో డ్రైవింగ్‌, ఆధునిక క్లబ్‌ హౌస్‌, రిసార్ట్స్‌ కూడా ఉంటాయి. సాధారణ లే–అవుట్‌లో గజం ధర రూ.10 వేలుగా ఉంటే.. గోల్ఫ్‌ ప్రాపర్టీల్లో రూ.20–25 వేలు ఉంటుంది. కాబట్టి డెవలపర్‌కు, యజమానికీ లాభదాయకంగా ఉంటుంది. పైగా ప్లాట్లు తక్కువగా ఉంటాయి కాబట్టి విక్రయం సులువవుతుంది.

శివారులో గోల్ఫ్‌ ప్రాపర్టీలు..

మెట్రో నగరాల్లోని స్థిరాస్తి రంగంలో గోల్ఫ్‌ ప్రాపర్టీ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విభాగం. ఎక్కువగా విల్లాలు, టౌన్‌షిప్‌లు, వాణిజ్య సముదాయాల్లో గోల్ఫ్‌ కోర్స్‌ ప్రాపర్టీలకు ఆదరణ ఉంటుంది. ప్రస్తుతం నగరం మ్యాక్‌, డ్రీమ్‌ వ్యాలీ, గిరిధారి, వర్టెక్స్‌, అపర్ణ వంటి పలు నిర్మాణ సంస్థలు వికారాబాద్‌, మోమిన్‌పేట్‌, తూప్రాన్‌, మన్నెగూడ, చేవెళ్ల, తుక్కుగూడ, శామీర్‌పేట వంటి ప్రాంతాల్లో గోల్ఫ్‌ కోర్స్‌ ప్రాపర్టీలను అభివృద్ధి చేస్తున్నాయి. వీకెండ్‌లో కుటుంబంతో కలిసి ఆహ్లాదకరంగా గడిపేందుకు ఇక్కడే క్లబ్‌హౌస్‌, రిసార్ట్‌, హోటల్‌, వసతులు ఉంటాయి.



డ్రీమ్‌ వ్యాలీలో గోల్ఫ్‌ కోర్స్‌



తల్లిదండ్రులు ప్రోత్సహించాలి

గోల్ఫ్‌తో రోజంతా ఉత్తేజంగా ఉంటుంది. టెన్నిస్‌, బ్యాడ్మింటన్‌ లాగే గోల్ఫ్‌ కూడా అంతర్జాతీయ ఆట. ఇటీవలే ఒలింపిక్స్‌లో కూడా దీన్ని పెట్టారు. విద్యార్థులు గోల్ఫ్‌ నేర్చుకునేందుకు తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలి.

– కె.లక్ష్మారెడ్డి, గోల్ఫ్‌ ప్లేయర్‌, మాజీ ఎమ్మెల్యే



కోర్స్‌ పేరే ల్యాండ్‌ మార్క్‌

గోల్ఫ్‌ కోర్స్‌ ప్రాపర్టీలు వచ్చాక ప్రాంతం రూపురేఖలే మారిపోతాయి. ఆ కోర్స్‌ పేరే ల్యాండ్‌మార్క్‌గా మారుతుంది. పైగా ఆయా ప్రాపర్టీల్లోని క్లబ్‌హౌస్‌, రిసార్ట్‌ల నిర్వహణతో స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

– కె.సంతోష్‌రెడ్డి, సీఎండీ, డ్రీమ్‌ వ్యాలీ గ్రూప్‌



తొలి, ఏకైక పీపీపీ గోల్ఫ్‌ క్లబ్‌ ఇక్కడే..

తెలంగాణలో 1992లో హైదరాబాద్‌ గోల్ఫ్‌ క్లబ్‌ (హెచ్‌జీపీ) ఏర్పాటైంది. పబ్లిక్‌ ప్రైవేట్‌ పార్ట్‌నర్‌షిప్‌ విధానంలో ఏర్పాటైన తొలి, ఏకైక క్లబ్‌ ఇదే. గోల్ఫ్‌ను ప్రోత్సహించేందుకు పర్యాటక శాఖ, హెచ్‌జీపీ గోల్కొండ వద్ద వంద ఎకరాల్లో 18 హోల్స్‌ గోల్ఫ్‌ కోర్స్‌ను ఏర్పాటు చేశాయి. ప్రస్తుతం 70 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. వార్షిక రుసుము రూ.10 వేలు. ప్రస్తుతం హెచ్‌జీపీలో 2,500 మంది సభ్యులున్నారని హెచ్‌జీపీ కెప్టెన్‌ టీ అజయ్‌ కుమార్‌ రెడ్డి తెలిపారు.



ఫ్లవర్‌.. ఫేవర్‌



పూలదండ స్థానాన్ని భర్తీ చేస్తున్న బొకే కల్చర్‌

- ఇంపోర్టెడ్‌ పూలకు పెరుగుతున్న డిమాండ్‌
- శుభకార్యాల్లోనూ విరివిగా వినియోగం
- థాయ్‌లాండ్‌, ఊటీ, బెంగళూరు, పూణేల నుంచి దిగుమతి

ముసి ముసి నవ్వులలోన..
కురిసిన పువ్వుల వాన..
ఏ నోము నోచినా..
ఏ పూజ చేసినా..
తెలిసి ఫలితమొసగే వాడు.. ఈ పాట వినడానికి ఎంత అందంగా ఉంటుందో.. పువ్వును చూస్తే.. మనసు అంత ప్రశాంతతను ఆనందాన్ని కలిగిస్తుంది. అందుకే ఎవరినన్నా కలిసేందుకు వెళ్లేటప్పుడు వారి ఆనందంగా ఉండాలని కోరుతూ గౌరవ సూచికంగా పుష్పగుచ్ఛాలు తీసుకెళతారు.. ఇప్పుడిది ట్రెండ్‌గా మారింది.. ఒకప్పటి దండల స్థానాన్ని, బొకేలు భర్తీ చేస్తున్నాయి.. దీనికోసం దేశీయ పూలనే కాకుండా, దేశ విదేశాల నుంచి వివిధ రకాల పూలను దిగుమతి చేసుకుంటున్నారు. ఆ కథేంటో తెలుసుకుందాం..

– సాక్షి, సిటీ బ్యూరో



లక్షతో బర్త్‌డే డెకరేషన్‌

మా పాప మొదటి బర్త్‌డే సందర్భంగా బంధువులు, స్నేహితులతో కలసి చిన్నగా ఫంక్షన్‌ పెట్టుకున్నాం. ఫొటో షూట్‌లో బ్యాక్‌గ్రౌండ్‌ ఫ్లవర్‌ డెకరేషన్‌ చేద్దాం అన్నారు. సరే అన్నాను. డెకరేటర్‌ను సంప్రదిస్తే మాకు నచ్చిన మోడల్‌కు రూ.1.20 లక్షలు చెల్లించాను.

– మనోజ్‌, మణికొండ

సాధారణంగా పువ్వులు అనగానే బంతి, చామంతి, గులాబీ, లిల్లీ, కనకాంబరాలు, మల్లి, సన్నజాజి వంటి రకాలు ఎక్కువగా వాడుకలో ఉన్నాయి. ఫ్లవర్‌ డెకరేషన్‌, బొకేల్లో వినియోగించేందుకు మాత్రం హైబ్రిడ్‌ గులాబీ, చామంతి, సన్‌ఫ్లవర్‌, మొదలైన రకాలకు తోడు ప్రొటీయా, పింక్షన్‌, సింబిడియం, పియోని, చేయి, బటర్‌ఫ్లైగిట్‌, టాన్జేరియస్‌, తులిప్స్‌, డెల్ఫినియం, జిప్సోఫిలా, ఆసరిన, డ్రెసిన, జొనడా, ఓరెంటీ లిల్లి, సూడాటియం, క్రైశాంతిమం మొదలైన రకాల పువ్వులు దిగుమతి చేసుకుంటున్నారు. అదే సమయంలో ఇండోర్‌ ప్లాంట్లకు సైతం డిమాండ్‌ పెరిగింది. పిండోడియం అనే ఫ్లవర్‌ ఒక్కొక్కటీ కనీసం రూ.800 నుంచి రూ.3 వేల వరకూ ఉంటుంది. ఈ పూలతో బొకే తయారు చేస్తే దాని ధర ఎంత ఉంటుందో చెప్పనక్కర్లేదు.



అభిరుచికి అనుగుణంగా...

దశాబ్దకాలంగా ఫ్లవర్‌ బిజినెస్‌ చేస్తున్నాను. ప్రస్తుత ఫంక్షన్లకు ఫ్లవర్‌ డెకరేషన్‌ చేయించడం, ప్రతి చిన్న సందర్భంలోనూ బొకేలు ఇచ్చిపుచ్చుకోవడం ట్రెండ్‌గా మారింది. దీంతో పాటే ఇండోర్‌ మొక్కలకు సైతం మంచి డిమాండ్‌ ఉంది. వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా బొకే, బాక్స్‌, బంచ్‌, ఇతర మోడల్స్‌ సరఫరా చేస్తున్నాం.

– సూర్య, వీజే పెటల్స్‌, రోడ్‌ నెం–1, బంజారాహిల్స్‌

డెకరేషన్‌ రూ.లక్షల్లో..

గృహ ప్రవేశం నుంచి వివాహాది శుభకార్యాలు, సత్యన్నారాయణ వ్రతం, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాల వరకూ సందర్భం ఏదైనా స్వాగత తోరణాలు, పూల అలంకరణలు తప్పనిసరి అయ్యింది. ఫ్లవర్‌ డెకరేషన్‌ స్టేటస్‌గా సింబల్‌గా భావిస్తున్నారు. దీంతో లక్షలు వెచ్చించి ఫ్లవర్‌ డెకరేటర్స్‌కు కాంట్రాక్టులు అప్పగిస్తున్నారు. ఆన్‌లైన్‌లో కొత్తకొత్త మోడల్స్‌ ఎంపిక చేస్తున్నారు. ఆర్థికంగా ఉన్నవారు మరో అడుగు ముందుకేసి ఇంపోర్టెడ్‌ ఐటమ్స్‌ డిమాండ్‌ చేస్తున్నారు. ఖర్చు ఎంతైనా వెనుకడుగు వేయట్లేదు. స్థోమతను బట్టి ఒక్కో ఫంక్షన్‌కు డెకరేషన్‌ కోసం సుమారుగా రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకూ వెచ్చిస్తున్నారు.



బొకేలకు డిమాండ్‌..

భాగ్యనగరంలో గతంలో పూల బొకే కావాలంటే ఫలానా దగ్గర మాత్రమే ఉంటాయని ల్యాండ్‌ మార్క్‌ ఉండేది. ఇప్పుడు బొకేలు, ఫ్లవర్‌ బాక్స్‌లు, ఇతర ఫ్లవర్‌ ఐటమ్స్‌కు మార్కెట్‌లో డిమాండ్‌ పెరిగింది. దీంతో ప్రధాన కూడళ్ల నుంచి ఎక్కడ చూసినా దుకాణాల్లో రకరకాల అలంకరణలతో విరివిగా బొకేలు లభిస్తున్నాయి. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకూ ఎవరిని కలవాలన్నా బొకే తప్పనిసరైంది. దీంతో సుమారు ఒక్కో బొకేకి రూ.350 నుంచి రూ.10 వేల వరకూ వెచ్చిస్తున్నారు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో బొకేలో వినియోగించే పువ్వుల రకాలను బట్టి ధర నిర్ణయిస్తున్నారు.

థాయ్‌లాండ్‌ నుంచి..

నగరంలో ఫ్లవర్‌ డెకరేషన్‌కు అవసరమైన ముడి సరుకు, ఫ్లవర్స్‌, ఇతరత్రా అన్నీ థాయ్‌లాండ్‌, బెంగళూరు, ఊటీ, పూణే, కోల్‌కతా తదితర నగరాలపై ఆధారపడుతున్నారు. దీంతో అక్కడి వ్యాపారులతో సత్సంబంధాలు కలిగి ఉంటున్నారు. ఎప్పటికప్పుడు కొత్త మోడల్స్‌, ఫ్లవర్స్‌, ఇతర అంశాలను తెలుసుకుని అప్‌డేట్‌ అవుతున్నారు. మార్కెట్‌ను బలోపేతం చేసుకుంటూ, ఫ్రెష్‌ ఐటమ్స్‌, మంచి ధరకు తెచ్చుకుంటున్నారు. స్థానికంగా మెహిదీపట్నం, ఇతర మార్కెట్‌లో పువ్వులు దొరుకుతున్నప్పటికీ వాటిని ఆధ్యాత్మికం, గృహ అవసరాలకు, దండల తయారీలో వినియోగిస్తున్నారు.



ఫొటో– పెయింటింగ్‌ల సమ్మేళనం..

మాదాపూర్‌లోని చిత్రమయి ఆర్ట్‌ గ్యాలరీ వేదికగా ఏర్పాటు చేసిన రెండు విభిన్న కళా ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ రెండు ఆర్ట్‌ ఎగ్జిబిషన్లు ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగనున్నాయి. అవేంటంటే..

ప్రాజెక్ట్‌ 24 అవర్స్‌..

సామాజిక మార్పు కోసం భారత్‌తో పాటు ఇరాన్‌, జపాన్‌, మెక్సికో, యూఎస్‌ఏ, యూకే వంటి దేశాలకు చెందిన ప్రముఖ ఆర్టిస్టులు తీసిన 125 ఫొటోగ్రాఫ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. 24 అవర్స్‌ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రదర్శిస్తున్న ఈ ఫొటోలు వివిధ ప్రాంతాలకు సంబంధించిన విశిష్ట అంశాలను, సాంస్కృతిక వైవిధ్యాలను ప్రదర్శిస్తున్నాయి.

వంద పెయింటింగ్స్‌తో..



ఎచ్చింగ్‌ అండ్‌ లిథోగ్రాప్స్‌ ప్రింట్స్‌ పేరుతో కళాత్మకత నింపుకున్న 100 పెయింటింగ్స్‌తో ప్రముఖ ఆర్టిస్టు డి.అనంతయ్య ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. డీప్‌ అండ్‌ డార్క్‌తో ఈ కళాకృతులు ఔత్సాహిక కళాకారులకు స్కెచ్‌ పాఠాలను చెబుతున్నట్టే ఉన్నాయి. వీటిని వీక్షించడానికి నగరవాసలు అత్యంత ఆసక్తి కనబర్చుతున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

క్లోజ్‌ ఫ్రెండ్స్‌ ఎవరిని కదిలించినా వారు చెప్పేదొకటే.. మేం చిన్నప్పుడు ఒకే కంచంలో తిన్నాం..రా అని.. అలాంటి ఫ్రెండ్స్‌ అందరికీ ఒకే కంచంలో తినే అనుభూతిని కల్పించే మండీ ట్రెండ్‌ కొనసాగుతోంది. నలుగురైదుగురు ఫ్రెండ్స్‌ అంతా కలిసి ఓ భారీ కంచంలో నచ్చిన ఫుడ్‌ తింటూ సరదా ముచ్చట్లు చెప్పుకుంటున్నారు. నగరంలో ఎప్పటి నుంచో మండీ రెస్టారెంట్లు ఉన్నప్పటికీ ప్రస్తుతం వీటికి కొత్త తరహా థీమ్స్‌ జతచేస్తున్నారు.. దీంతో ఆహార ప్రియులు వాటిని వెతుక్కుంటూ వెళ్తున్నారు. సాధారణ రెస్టారెంట్లతో పోలిస్తే ఈ మండీలలో దొరికే ఫుడ్‌ కాస్త వెరైటీ.. మణికొండలో బాహుబలి ప్లేట్‌ పేరుతో ఒకేసారి 25 మంది కూర్చొని తినే కాన్సెప్ట్‌ ఆ మధ్య ఫేమస్‌ అయ్యింది. దీంతో మరికొన్ని థీమ్స్‌ నగరవాసులను ఆకర్షిస్తున్నాయి.. – బంజారాహిల్స్‌



- రకరకాల థీమ్‌ల వైపు నగరవాసుల చూపు
- ఆకర్షిస్తున్న జైల్‌, గర్ల్‌ ఫ్రెండ్స్‌ మండీలు



గర్ల్‌ ఫ్రెండ్‌ మండీ

ప్రేమ ఖైదీ @ మండీ

నగరంలో పెద్దఎత్తున రెస్టారెంట్లు

మండీ కల్చర్‌ వాస్తవానికి సౌదీ దేశాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అయితే చాలా ఏళ్ల నుంచే నగరంలో ఈ తరహా రెస్టారెంట్లు కొనసాగుతున్నాయి. వీటిలో దొరికే ఫుడ్‌ బయటి రెస్టారెంట్లతో పోలిస్తే కాస్త భిన్నంగా ఉంటుంది. సౌదీ దేశాల్లోని మండీ రెస్టారెంట్ల మాదిరే ఇక్కడ బిర్యానీలో ఎక్కువగా డ్రై ఫ్రూట్స్‌ వాడతారు. తక్కువ స్పైసీతో వంటకాలు చేయడం మండీ రెస్టారెంట్ల ప్రత్యేకత. సహజ మసాల దినుసులు, కారం తక్కువగా వినియోగించి చికెన్‌, మటన్‌, ఫిష్‌ తదితర వంటకాలను విభిన్నంగా తయారు చేస్తారు. అయితే ఈ మధ్య కాలంలో తెలుగువారు పెత్త ఎత్తున మండీలకు వస్తుండటంతో వారి అభిరుచికి అనుగుణంగా వంటకాలను వడ్డిస్తున్నారు.

ప్రత్యేక థీమ్‌లతో..

సాధారణ మండీలకు వెళ్లి బోర్‌ కొట్టిన నగరవాసుల కోసం వ్యాపారులు ఈ మధ్య జైల్‌, గర్ల్‌ ఫ్రెండ్స్‌, ఫ్యామిలీ మండీ పేరుతో ఏర్పాటైన కొత్త థీమ్‌లు క్రేజ్‌ సొంతం చేసుకుంటున్నారు. ముఖ్యంగా జైలు వాతావరణాన్ని తలపించేలా రూపొందించిన జైలు మండీలో రిమాండ్‌లో ఉన్న ఖైదీల మాదిరిగా లోపల కూర్చొని తింటూ నగరవాసులు సెల్ఫీలు దిగుతూ మురిసిపోతున్నారు. ఈ జైలు మండీలో ఫుడ్‌ను తీసుకొచ్చే వారంతా ఖైదీల దుస్తులతో..ఉంటారు. ఇక కౌంటర్‌లో ఉండే వ్యక్తి జైలర్‌గా, ఫుడ్‌లో ఏదైనా సమస్య వస్తే తీర్చేందుకు ఓ వ్యక్తి లాయర్‌ గెటప్‌లో దర్శనమిస్తారు. ఇక గర్ల్‌ ఫ్రెండ్‌ మండీలో కుటుంబ సభ్యులు, ప్రేమికులు కూర్చొని తినే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నగరంలో సుమారు 150కి పైగా మండీ రెస్టారెంట్లు నడుస్తున్నాయి.

ఫ్యామిలీలు ఎక్కువగా వస్తున్నారు

జైలు మండీలో భోజనం చేసేందుకు ఎక్కువగా ఫ్యామిలీలు వస్తున్నాయి. జైలు థీమ్‌లో ఫొటోలు దిగుతూ సరికొత్త అనుభూతిని పొందుతున్నారు. జైలులో ఎలాంటి వాతావరణం ఉంటుందో అదే తరహాలో ఉంటుంది. జైలు బ్యారెక్‌లో రుచికరమైన భోజనం చేసి వెళ్తున్నామనే తృప్తి వారికి కలిగిస్తున్నాం.

– ప్రవీణ్‌, జైలు మండీ మేనేజర్‌





జైలు మండీ



‘తల్లికి వందనం’ ఒక్కరికి మాత్రమే!

మార్గదర్శకాలు జారీ చేసిన ఏపీ ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ‘తల్లికి వందనం, స్టూడెంట్ కిట్’పథకాల అమలుకు ప్రభుత్వం ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. అన్ని ప్రభుత్వ పథకాలకు ఆధార్ తప్పనిసరి అయిన క్రమంలో ఈ పథకాలకు కూడా ఆ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ బుధవారం జీవో నం.29 జారీ చేశారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, 75 శాతం హాజరు ఉన్న ఒకటి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థుల తల్లులకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఇదిలా ఉండగా, కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ అమలు చేస్తామని మేనిఫెస్టో సాక్షిగా చంద్రబాబు సహా కూటమి నేతలు ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ, బుధవారం జారీ చేసిన జీవోలో ఈ పథకం కింద ఒక్కో తల్లికి రూ.15 వేల చొప్పున ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు బడికి వెళుతున్నారన్నది కాకుండా ఒక్క తల్లికి మాత్రమే రూ.15 వేలు ఇవ్వనున్నట్టు తాజాగా ప్రకటించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో ద.మ.రైల్వే జీఎం భేటీ

సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దిల్ కుషా గెస్ట్‌హౌస్‌లో ఆయనతో భేటీ అయిన జీఎం.. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.

ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధం

మంత్రి సీతక్కతో భేటీ అనంతరం ఎన్జీవోల ప్రకటన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వంతో మహిళలు, చిన్నపిల్లల సంరక్షణ, సాధికారత, తదితర అంశాలపై కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పలు స్వచ్ఛంద సంస్థలు ప్రకటించాయి. మహిళలు, చిన్నారుల సంరక్షణ సంబంధిత రంగాల్లో పనిచేస్తూ సామాజిక ఉద్యమాల్లో, సేవా కార్యక్రమాల్లో అనుభవమున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు.. పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖమంత్రి ధనసరి అనసూయ సీతక్కతో భేటీ అనంతరం ప్రకటించారు. బుధవారం సచివాలయంలో మంత్రితో తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధి కాలిఫోర్నియాకి చెందిన మంజుల కృష్ణన్, అంకురం ఎన్జీవో ప్రతినిధులు ఎం.సుమిత్ర, విజయ సమావేశమై ఆయా అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విమెన్ ప్రొటెక్షన్, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళల సంక్షేమానికి ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు. గ్రామీణ మహిళల నైపుణ్యాన్ని పెంచి వారికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సీతక్క కోరారు. దీనిపై ఈ సంస్థల ప్రతినిధులు సానుకూలంగా స్పందించడంతో పాటు రాష్ట్ర మహిళల ఆర్థిక స్వావలంబన కోసం తమ వంతు సహకారం అందిస్తామని వారు తెలిపారు.

విపరీతంగా పెరిగిన కేటీఆర్ ఆస్తులు

కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: విచ్చలవిడిగా దోచుకున్న సంపాదనతో అక్రమంగా ఆస్తులను కూడగట్టిన కేటీఆర్ అడ్డంగా దొరికిపోయారని కాంగ్రెస్ నేత కె.కె.మహేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2009 నుంచి 2023 వరకు కేటీఆర్ ఆస్తులు విపరీతంగా పెరిగాయని, అందుకు కేటీఆర్ ఎన్నికల అఫిడవిట్లే సాక్ష్యమని అన్నారు. ఆ అఫిడవిట్లను చూస్తే కేటీఆర్ ఎంత అవినీతిపరుడో ప్రజలకు అర్థమవుతుందని ధ్వజమెత్తారు. రెండో విడత అధికారంలోకి వచ్చిన తరువాత 2018 నుంచి 2023 వరకు అయితే కేటీఆర్ అక్రమ సంపాదనకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని, విచ్చలవిడిగా దోచుకొని ఆస్తులను కూడబెట్టారని మహేందర్‌రెడ్డి ఆరోపించారు. కేటీఆర్ నిజంగా అవినీతిపరుడు కాకుంటే ఇన్ని వేల కోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని అన్నారు. హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్ వేస్తే, హైకోర్టు కేటీఆర్‌కు నాలుగు వారాల నోటీస్ ఇచ్చిందని తెలిపారు. దీనిపై కేటీఆర్ తప్పక తెలంగాణ ప్రజలకు, హైకోర్టుకు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. 2018 అఫిడవిట్లో కేటీఆర్ తన కొడుకు హిమాన్షును డిపెండెంట్‌గా చూపారని, హిమాన్షు మేజర్ అయిన వారంలోపే తెలంగాణ పబ్లికేషన్స్‌కు చెందిన రూ.98 లక్షల విలువచేసే 36 ఎకరాల భూమిని బదిలీ చేశారని తెలిపారు. నిన్న మొన్ననే మేజర్ అయిన తన కొడుకు పేరిట 36 ఎకరాల భూమి ఎలా వచ్చిందో.. ఎలా తన కొడుకు సంపాదించగలిగాడో తెలంగాణ యువకులకు, తెలంగాణ సమాజానికి చెప్పాల్సిన బాధ్యత కేటీఆర్‌పై ఉన్నదని మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

రాగానే మింగేశారు.. ఇసుక బకాసురులు

ఆంధ్రప్రదేశ్‌లో 70కిపైగా స్టాక్ యార్డుల్లో 40 లక్షల టన్నులు మాయం

- వర్షాకాలంలో కొరత లేకుండా 80 లక్షల టన్నులు నిల్వ చేసిన గత ప్రభుత్వం
- 5 వారాల్లోనే సగానికిపైగా విక్రయించేసిన పచ్చ ముఠాలు
- ట్రక్కులు, ట్రాక్టర్లలో నింపి భారీగా వసూళ్లు
- సామాన్యుల పేర్లతో బయట ప్రాంతాలకు తరలింపు
- కొత్త పథకం రాకముందే తాత్కాలికంలోనే భారీ లూటీ



కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామంలో ఇసుక స్టాక్ పాయింట్‌ను ఖాళీ చేస్తున్న టీడీపీ నేతలు

సాక్షి, అమరావతి, సాక్షి, నెట్‌వర్క్: టీడీపీ సర్కారు ఉచిత ఇసుక పథకం ఉచిత విక్రయ పథకంగా మారింది! ఉచిత విక్రయ పథకం ఏమిటని ఆశ్చర్యపోకండి. ఉచితం అంటే టీడీపీ పెద్దల దృష్టిలో అమ్మకమే. రాష్ట్రవ్యాప్తంగా స్టాక్ యార్డుల వద్ద బోర్డు పెట్టి మరీ టన్నుల చొప్పున బహిరంగంగా విక్రయిస్తున్నా సరే అది ఉచితంగా ఇవ్వడమే! సీనరేజి ఫీజు, తవ్వకం, లోడింగ్, ఇతర పన్నులతో పాటు రవాణా ఛార్జీలు కూడా వినియోగదారుల నుంచి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. విశాఖ జిల్లా అగనంపూడి స్టాక్ పాయింట్ వద్ద టన్ను ఇసుక రూ.1,398 అని బోర్డు పెట్టి మరీ విక్రయిస్తున్నారు. ప్రతి స్టాక్ యార్డు వద్ద ధరల బోర్డులు ఏర్పాటు చేసి ఆ రేట్ల ప్రకారమే అమ్ముతున్నారు. డబ్బులు చెల్లించి కొన్నా సరే ఇసుకను ఉచితంగా ఇస్తున్నారనే వినియోగదారులు చెప్పాలి. లేదంటే సీఎం చంద్రబాబుకు కోపం వస్తుంది. ‘ఉచితం అంటే మీ ఇంటికి నేనే తీసుకొచ్చి ఫ్రీగా ఇవ్వాలా?’అని ఎదురుదాడి చేస్తారు. డబ్బులిచ్చి కొంటున్నాం కదాని ఎవరైనా వినియోగదారుడు ఫ్రీ కాదని చెబితే టీడీపీ శ్రేణులు సోషల్ మీడియాలో ఉతికి ఆరేస్తాయి! స్టాక్ పాయింట్ల వద్ద ఎవరైనా ఫ్రీ కాదని చెప్పే సాహసం చేస్తే చితకబాదినా దిక్కుండదు. ఎందుకంటే అది టీడీపీ సర్కారు వారి ఉచిత విక్రయ పథకం కాబట్టి! ప్రతి చోటా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలు, సానుభూతిపరులపై విచ్చలవిడిగా దాడులు చేస్తూనే వారిపై తమకు ఎటువంటి కక్ష లేదని చెబుతున్నట్టే ఇది కూడా మరి!!

పక్క రాష్ట్రానికి కూడా..

ఉచిత విక్రయ పథకంలో టీడీపీ దోపిడీ యథేచ్ఛగా సాగిపోతోంది. స్థానిక టీడీపీ నేతలు స్టాక్ యార్డుల వద్ద మోహరించి కొందరి పేర్లు రాయించి ఇసుకను ట్రక్కుల్లో తరలించుకుపోతున్నారు. విజయనగరం జిల్లా కొత్తవలస స్టాక్ యార్డు వద్ద బుధవారం టీడీపీ నేతలమంటూ 20 లారీల్లో ఇసుకను తరలించారు. అక్కడున్న సిబ్బందిని బెదిరింపులకు గురిచేశారు. తెలంగాణ సరిహద్దులోని ఎన్టీఆర్ జిల్లా అనుమంచిపల్లి స్టాక్ యార్డుల్లో నాలుగు రోజులుగా కొందరు యథేచ్ఛగా ఇసుకను పక్క రాష్ట్రానికి తరలించేస్తున్నారు. తమ ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తోందంటూ టీడీపీ నేతలు స్టాక్ యార్డుల వద్ద ప్రదర్శనలు, సమావేశాలు పెట్టి హంగామా చేస్తున్నారు. ఆ తర్వాత ట్రాక్టర్లు, లారీలు తెచ్చి ఇసుకను బలవంతంగా లోడింగ్ చేయించుకుని వెళ్లిపోతున్నారు.

70 స్టాక్ యార్డుల్లో 40 లక్షల టన్నులు మాయం

అధికారంలోకి వచ్చిన 43 రోజుల్లోనే టీడీపీ నేతలు దాదాపు 40 లక్షల టన్నుల ఇసుకను మింగేశారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెల్లడైన వెంటనే ఎక్కడికక్కడ టీడీపీ నేతలు ఇసుక నిల్వలపై పడ్డారు. స్టాక్ యార్డుల వద్దకెళ్లి ఇసుక కాంట్రాక్టు సంస్థల సిబ్బందిని బెదిరించి తరిమేశారు. ఇసుక కాంట్రాక్టు సంస్థలైన జేసీకేసీ, ప్రతిమ ఇన్‌ఫ్రా ప్రతినిధులకు వెళ్లగొట్టి అప్పటికప్పుడు స్టాక్ యార్డులను స్వాధీనం చేసుకున్నారు. వర్షాకాలంలో ఇసుక కొరత రాకుండా చూసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 170 స్టాక్ యార్డుల్లో 80 లక్షల టన్నుల మేర ఇసుకను నిల్వ చేసింది. నాలుగేళ్లుగా ప్రతి సంవత్సరం ఇలా వర్షాకాలంలో ఇసుకను నిల్వ చేసి ప్రజలకు ఇబ్బందులు రాకుండా చేసింది.

టీడీపీ నేతలు ఆ నిల్వలపై పడి ఇసుకను తరలించేశారు. 40 రోజుల తర్వాత తాపీగా ఉచిత ఇసుక పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించిన మైనింగ్ అధికారులు స్టాక్ యార్డుల వద్ద నిల్వలు మాయమైనట్లు గుర్తించి ముక్కున వేలేసుకున్నారు. ఇప్పుడు వారి లెక్కల ప్రకారం సుమారు 98 స్టాక్ యార్డుల్లో 43 లక్షల టన్నుల ఇసుక మాత్రమే నిల్వ ఉంది. అంటే 70కిపైగా ఇసుక యార్డుల్లో ఇసుక నిల్వలను తరలించి టీడీపీ నేతలు సొమ్ము చేసుకున్నారు.

70 స్టాక్ యార్డులు ఖాళీ




తూర్పు గోదావరి జిల్లా చిడిపి స్టాక్ యార్డుల్లో ఎన్నికలకు ముందు 1.81 లక్షల టన్నుల ఇసుక నిల్వ చేయగా ఇప్పుడు మైనింగ్ అధికారుల లెక్క ప్రకారం 35 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉంది. 1.46 లక్షల టన్నుల ఇసుక మాయమైపోయింది. నిడదవోలు నియోజకవర్గంలోని పందలపర్రు, ఊసులుమర్రు, పెండ్యాల స్టాక్ యార్డుల్లోనూ లక్షన్నర టన్నుల ఇసుకను పచ్చ ముఠాలు మింగేశాయి. రాజమహేంద్రవరం రూరల్ లాలా చెరువు యార్డులో 1.40 లక్షల టన్నుల ఇసుకను మాయం చేసి నామమాత్రంగా 7,500 టన్నుల ఇసుకను అమ్మకానికి పెట్టారు. నెల్లూరు జిల్లా పల్లిపాడు స్టాక్ యార్డులో 2.20 లక్షల టన్నుల ఇసుకకుగానూ 1.25 లక్షల టన్నులు మాత్రమే మిగిలింది. కొన్నిచోట్ల అసలు ఇసుక నిల్వలే లేకుండా చేసేశారు. కృష్ణా జిల్లా అప్పారావుపేట, లంకపల్లి, తోట్లవల్లూరు స్టాక్ పాయింట్లను పూర్తిగా ఎత్తివేశారు. ఎన్నికలకు ముందు అక్కడ లక్ష టన్నులకు పైగా ఇసుక ఉండగా మొత్తం కరిగించేశారు. ఇలా సుమారు 70 స్టాక్ యార్డుల్లో ఇసుక రేణువు లేకుండాపోయింది. కృష్ణా జిల్లాలో ఇసుక రీచ్‌లు ఉన్నా స్టాక్‌యార్డుల్లో మాత్రం ఇసుక లేకుండాపోయింది. దీంతో స్థానికులు సుదూరం ప్రాంతాలకు వెళ్లి ఇసుకను కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఏపీ వైద్య శాఖలో నియామకాలకు బ్రేక్!

- కొత్త వైద్య కళాశాలల్లో 380 పోస్టుల భర్తీకి ఆమోదం లేదు
- మూడు వేలకు పైగా పారా మెడికల్, ఇతర పోస్టుల భర్తీ లేనట్టే



సాక్షి, అమరావతి: అధికారంలోకి వస్తే యువతకు 20 లక్షల ఉద్యోగాలిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన టీడీపీ కూటమి.. అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలో తొక్కుతోంది. కొత్త ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేయకపోగా గత ప్రభుత్వం చేపట్టిన నియామకాల ప్రక్రియన నిలిపివేస్తోంది. ప్రభుత్వాస్పత్రుల్లో మానవ వనరుల కొరత లేకుండా జీరో వేకెన్సీ (ఎప్పటి ఖాళీలను అప్పుడే భర్తీ) పాలసీని గత వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం ప్రవేశపెట్టింది. ఖాళీ పోస్టులను భర్తీ చేస్తూనే, రోగుల అవసరాలకు అనుగుణంగా కొత్త పోస్టులు మంజూరు చేస్తూ వచ్చింది. ఐదేళ్లలో ఒక్క వైద్య శాఖలోనే ఏకంగా 54 వేల పోస్టుల భర్తీని చేపట్టింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్య శాఖ లో జీరో వేకెన్సీ పాలసీకి తిలోదకాలు ఇవ్వనుందని తెలుస్తోంది. ఈ క్రమంలోనే వైద్య శాఖలో ప్రస్తుతం జరుగుతున్న నియామకాల ప్రక్రియను నిలిపివే యాలని ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. దీంతో కొత్త వైద్య కళాశాలల్లో అవసరాల కోసం వివిధ రకాల 380 పోస్టులను డీఎంఈ పరిధిలో గతంలో మంజూరు చేయగా.. ఈ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. అలాగే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు ఏపీ వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలలతో పాటు, ఇతర ఆస్పత్రుల్లో ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ వంటి పారామెడికల్‌తో పాటు ఇతర పోస్టుల భర్తీకి జిల్లా స్థాయిల్లో నోటిఫికేషన్‌లు జారీ చేశారు. ఉమ్మ డి 13 జిల్లాల్లో ఒక్కో జిల్లాకు 200 నుంచి 250 పోస్టుల చొప్పున మూడు వేలకుపైగా పోస్టుల భర్తీ చేపట్టాల్సి ఉంది. దరఖాస్తులను సైతం స్వీకరించి, వాటి పరిశీలన, మెరిట్ జాబితాలను సిద్ధం చేశారు. అభ్యర్థులను ఎంపిక చేసి, పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చే లోగా సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో తాత్కాలికంగా నియామక ప్రక్రియ పూ ర్తయింది. ఇప్పుడు ఆ నియామకాలను ప్రభుత్వం నిలిపివేసి నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లుతోంది.

‘విశాఖ స్టీల్’ అమ్మేద్దాం!

- ఎన్నికల ముందు అమ్మకాన్ని అడ్డుకుంటామంటూ టీడీపీ ప్రగల్భాలు
- అధికారంలోకి వచ్చాక అమ్మకానికి మద్దతుగా వ్యాఖ్యలు
- ఇప్పటికే ఆస్తుల విక్రయానికి టెండర్లను ఆహ్వానించిన ఆర్ఐఎన్ఎల్
- అధికారంలో ఉన్నప్పుడు ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): ‘విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు’గా సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారంపై మరోసారి నీలినీడలు కమ్ముకుంటున్నాయి. గత ఐదేళ్ల పాటు ప్రైవేట్ పరం కాకుండా అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ పోరాటం వృథా అవుతోంది. రాష్ట్ర ప్రజలతో భావోద్వేగ సంబంధం ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారంపై అధికార టీడీపీ మరోసారి యూటర్న్ తీసుకుంది. ఎన్నికల ముందు తాము ప్రైవేటీకరణకు వ్యతిరేకమన్న ఆ పార్టీ ఇప్పుడు ప్రైవేటీకరణ అనివార్యమంటూ ఆంగ్ల మీడియాకు లీకులు ఇస్తుండటం ఇందుకు నిదర్శనం. తొలుత ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్.. విశాఖ ఉక్కు విక్రయానికి టీడీపీ అనుకూలమని.. ఈ మేరకు ఆ పార్టీ ఉన్నతస్థాయి వర్గాలు పేర్కొన్నాయంటూ కథనాన్ని ప్రచురించింది. తాజాగా మరో ఆంగ్ల పత్రిక డెక్కన్ క్రానికల్ సైతం ఇదే తరహాలో మరో కథనాన్ని అచ్చేసింది. మూడు రోజుల క్రితం విశాఖలో స్థానిక టీడీపీ ఎంపీ శ్రీ భరత్ మాట్లాడుతూ తాము గత ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి ఉంటే విశాఖ ఉక్కును కాపాడేవాళ్లమని.. ఇప్పుడు కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీలతో కలిసి కూటమి ప్రభుత్వంగా ఉండటంతో చాలా ఇబ్బందులున్నాయని అసలు విషయాన్ని చెప్పేశారు. కాగా, రూ.2,859 కోట్ల నష్టాల సాకుతో కేంద్రం స్టీల్‌ప్లాంట్‌లో 100 శాతం పెట్టుబడులు ఉపసంహరించడానికి, దాన్ని ప్రైవేటుపరం చేసేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రైవేటీకరణ చేస్తే తమకెలాంటి ఇబ్బంది లేదని చంద్రబాబు చెప్పినట్లు తెలుస్తోంది. ‘ప్రైవేట్ చేతికిస్తే పెట్టుబడులు పెరుగుతాయి కదా’అని వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇప్పటికే వివిధ నగరాల్లో ఆస్తుల విక్రయానికి రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) టెండర్లను కూడా ఆహ్వానించడం గమనార్హం.

పవన్ మౌనమేల?

ఎన్నికల ముందు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాట్లాడిన జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు కూటమి నేతలు ప్రైవేటీకరణకు మద్దతుగా బహిరంగంగా ప్రకటనలు జారీ చేస్తున్నా మౌనంగా ఉండటంపై విశాఖ ఉక్కు కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

భూముల తాకట్టు మతిలేని చర్య



- పరిశ్రమలకు ఇచ్చే భూములు కుదువ పెడుతున్న రేవంత్ సర్కార్
- మధ్యవర్తిగా ఒక మర్చంట్ బ్యాంకర్.. రూ.100 కోట్ల కమీషన్
- ‘సాక్షి’వార్త కథనాన్ని ట్యాగ్ చేస్తూ కేటీఆర్ ట్వీట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక రంగాన్ని సరిగ్గా నడపడం చేతకాని రేవంత్ ప్రభుత్వం.. నిధుల సమీకరణకు ప్రమాదకరమైన మార్గాన్ని ఎంచుకున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ పరిశ్రమల శాఖకు చెందిన రూ. 20 వేల కోట్ల విలువైన 400 ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలకు తనఖాపెట్టి రూ.10 వేల కోట్లు సమీకరించాలని భావిస్తున్నట్టు సమాచారం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కేటీఆర్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా ‘సాక్షి’దినపత్రికలో ‘పరిశ్రమల భూములు తాకట్టు’శీర్షికతో ఈనెల 6వ తేదీన ప్రచురితమైన వార్తా కథనం క్లిప్పింగ్‌ను ట్యాగ్ చేశారు. ప్రభుత్వం భూముల తనఖాకు మధ్యవర్తిగా ఒక మర్చంట్ బ్యాంకర్‌ను పెట్టి రు.100 కోట్ల కమీషన్ ఇచ్చేందుకు సిద్ధమైందని, ఈ మేరకు మీడియాలో కథనాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి మతిలేని చర్య వల్ల తెలంగాణ ప్రగతి శాశ్వతంగా కుంటుపడి, కొత్తగా పెట్టుబడులు, పరిశ్రమలు రాక, ఉద్యోగాలు లేక, మన బిడ్డలకు కొలువులు రాకుండా పోయే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లోనే ఎక్కువగా ఐటీ పరిశ్రమలు వస్తున్నాయని, అలాంటి చోట 400 ఎకరాలు ప్రైవేట్ సంస్థలకు తనఖా పెట్టడం అనాలోచిత చర్య అని ఆందోళన వ్యక్తం చేశారు. అసలే గత ఏడు నెలలుగా రాష్ట్ర పారిశ్రామికరంగం స్తబ్దుగా ఉందని, కొత్తగా పెట్టుబడులు రాక, ఉన్న కంపెనీలు కూడా సరైన ప్రోత్సాహం లేక పక్కచూపులు చూస్తున్నాయని పేర్కొన్నారు. ‘ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం పరిశ్రమలకు ఇచ్చే భూములు తాకట్టు పెడితే.. కంపెనీలకు ఏమిస్తారు? కొత్తగా మన యువతకు ఉద్యోగాలు ఎట్లా వస్తాయి?’అని ప్రశ్నించారు.


బల్లిపడిన టిఫిన్లు... చిట్టెలుకలు తిరిగే చట్నీలు

- కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు

సాక్షి, హైదరాబాద్: ఆనాటి కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ హాస్టళ్లలో పురుగుల అన్నం, నీళ్ల చారు అందిస్తే .. ఈనాటి కాంగ్రెస్ పాలనలో బల్లిపడిన టిఫిన్లు, చిట్టెలుకలు తిరిగే చట్నీలు ఇస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ఎద్దేవా చేశారు. ‘మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి అన్నారు. మొత్తానికి కాంగ్రెసోళ్లు వచ్చి పెద్ద మార్పే తెచ్చారు’అని ‘ఎక్స్’వేదికగా ధ్వజమెత్తారు. మొన్న భువనగిరి సాంఘిక సంక్షేమ పాఠశాలలో.. కలుషిత ఆహారం తిన్న విద్యార్థి జీవితం విషాదాంతం అయితే, నిన్న కోమటిపల్లి హాస్టల్లో ఉప్మాలో బల్లి పడి 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ హాస్టల్లో చట్నీలో చిట్టెలుక దర్శనంతో విద్యార్థులు బెంబేలెత్తారన్నారు. ఈ విషాహారం తింటే.. విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరని, అల్లారుముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులకు భరోసా ఎక్కడ అని ప్రశ్నించారు. అస్తవ్యస్తంగా మారిన ప్రభుత్వ వ్యవస్థ వల్లే విద్యార్థులకు ఈ అవస్థ, అస్వస్థత అని కేటీఆర్ విమర్శించారు.

రాష్ట్ర ఖజానాకు ‘కిక్కు’

- గత ఏడాదితో పోలిస్తే ఈ సారి తొలి రెండు నెలల్లో రూ.2,500 కోట్ల అధిక రాబడి
- అప్పులు గత ఏడాది కంటే రూ.2 వేల కోట్లు తక్కువే
- స్థిరమైన ఆదాయంతో ఆర్థిక శాఖకు కొంత మేర ఉపశమనం



సాక్షి, హైదరాబాద్: గత ఏడాదితో పోలిస్తే రాష్ట్ర ప్రభుత్వ రాబడులు మెరుగయ్యాయని ఆర్థిక గణాంకాలు చెబుతున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఏప్రిల్, మే నెలల ఆదాయ, వ్యయాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కాగ్‌కు సమర్పించిన వివరాల ప్రకారం గత ఏడాదితో పోలిస్తే తొలి రెండు నెలల్లో అప్పులు తగ్గగా, సొంత పన్ను రాబడులు పెరిగాయని అర్థమవుతోంది. వస్తుసేవల పన్ను (జీఎస్టీ), రిజిస్ట్రేషన్ల ఆదాయం, అమ్మకపు పన్ను, ఎక్సైజ్ ఆదాయం.. ఇలా ప్రతి పన్ను ఆదాయంలోనూ గత ఏడాది తొలి రెండు నెలలతో పోలిస్తే వృద్ధి కనిపించింది. మొత్తంమీద గత రెండు నెలల్లో ప్రభుత్వానికి రూ. 23,147.64 కోట్లు సమకూరాయి. అదే గత ఏడాది తొలి రెండు నెలల్లో 22,427.81 కోట్లు లభించాయి. అయితే, పన్ను రాబడుల విషయానికి వస్తే గత ఏడాది ఏప్రిల్, మే నెలల్లో రూ.20,097.73 కోట్లు రాగా, ఈ ఏడాది తొలి రెండు నెలల్లో 22,419.13 కోట్లు వచ్చాయి. అంటే, గత ఏడాది కంటే పన్ను రాబడులు రూ.2,500 కోట్ల వరకు పెరిగాయన్న మాట. ఇక, అప్పులు కూడా గత ఏడాదితో పోలిస్తే రూ.2 వేల కోట్ల మేర తగ్గినా మొత్తం మీద రూ.వెయ్యి కోట్లకు పైగా రాబడులు సమకూరడం, ఆదాయం స్థిరంగా కొనసాగుతుండటంతో ఆర్థిక శాఖ కొంత మేర ఊపిరి పీల్చుకుంటోంది.

గత రెండేళ్లలో ఏప్రిల్, మే నెలల్లో ప్రభుత్వ రాబడి గణాంకాలివి.. (రూ.కోట్లలో)

ఆదాయ వనరు	2023-24		2024-25	
	ఏప్రిల్-	మే	ఏప్రిల్-	మే
పన్ను రాబడులు	9,698.65	10,399.08	11,464.17	10,954.96
పన్నేతర రాబడులు	357.64	533.83	354.71	373.80
గ్రాంట్ ఇన్‌ఎయిడ్	----	1,438.61	----	----
అప్పులు	5,026.29	4,240.12	2,246.62	5,133.65

వీఆర్వోలను మళ్లీ రెవెన్యూ శాఖలోకి తీసుకోండి

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మణ్‌లకు వీఆర్వో జేఏసీ వినతి



జీవన్‌రెడ్డి, లక్ష్మణ్‌లకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న వీఆర్వో జేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో)ను మళ్లీ రెవెన్యూ శాఖలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ వీఆర్వోల జేఏసీ కోరింది. ఈ మేరకు జేఏసీ ప్రతినిధి బృందం బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేసింది. గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థకు మూల స్తంభాలుగా ఉన్న తమను అశాస్త్రీయంగా ఇతర శాఖల్లోకి పంపి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా గత ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరించిందని ఆవేదన చెందారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఉద్యోగులు, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి నుంచి భూముల పరిరక్షణలో నిమగ్నమై, దాడులకు గురై, ప్రభుత్వ సంక్షేమమే ధ్యేయంగా, నియమ నిబద్ధతతో కీలక భూమిక పోషించిన తమను తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తంచేశారు. రాత్రికి రాత్రే లాటరీ పద్ధతిలో ఉత్తర్వులు జారీ చేసి 24 గంటల్లో ఇతర శాఖల్లోకి బదిలీ చేశారని, ఖాళీలు లేని శాఖలకు పంపి అవమానించారని పేర్కొన్నారు. జీవన్ రెడ్డి, లక్ష్మణ్‌లను కలిసిన వారిలో జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీశ్, సెక్రటరీ జనరల్ హరాలే సుధాకర్‌రావు, అదనపు సెక్రటరీ జనరల్ పల్లెపాటి నరేశ్, వైస్ చైర్మన్లు చింతల మురళి, ప్రతిభ, నేతలు తిరుపతి, యాదగిరి, శేఖర్ తదితరులున్నారు. తమ వినతి పట్ల జీవన్‌రెడ్డి, లక్ష్మణ్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రాష్ట్రంలో ఉన్న 10,909 గ్రామాలకు రెవెన్యూ ఉద్యోగులను నియమించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చినట్లు జేఏసీ ప్రతినిధులు వెల్లడించారు.

నేడు రాష్ట్రానికి కురియన్ కమిటీ

- గెలిచిన ఎంపీలు, ఓడిన అభ్యర్థులతో సమావేశం
- రేపు ఇన్‌చార్జులు, ఎమ్మెల్యేలతో భేటీ
- శనివారం క్షేత్రస్థాయికి..

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతల పనితీరును అంచనా వేసేందుకు హైకమాండ్ నియమించిన ముగ్గురు సభ్యుల కమిటీ బుధవారం హైదరాబాద్‌కు చేరుకుంది. రాజ్యసభ మాజీ డిప్యూటీ చైర్మన్ కురియన్, రకీబుల్ హుస్సేన్, పర్గత్‌సింగ్‌లతో కూడిన ఈ బృందం గురువారం ఉదయం 10 గంటలకు గాంధీభవన్‌కు రానుంది. ముందుగా ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులతో భేటీ కానుంది. అనంతరం గెలిచిన ఎంపీలతో కమిటీ సమావేశమవుతుందని, శుక్రవారం లోక్‌సభ ఇన్‌చార్జులు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహిస్తుందని సమాచారం. ఈ భేటీల్లో వచ్చిన సమాచారాన్ని బట్టి శనివారం క్షేత్రస్థాయికి వెళ్లి పార్టీ నేతలతో మాట్లాడుతుందని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.



రాష్ట్రానికి వచ్చిన కురియన్ బృందానికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నేతలు హర్కర, నిరంజన్

అది ఫేక్ నోటిఫికేషన్: ఆర్టీసీ ఎండీ సజ్జనార్

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ప్రకటనను నమ్మొద్దని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పష్టంచేశారు. ఆర్టీసీలో 3,035 పోస్టుల భర్తీకి ఇటీవల ప్రభుత్వం అనుమతించిన విషయం తెలిసిందే. ఆ భర్తీ ప్రక్రియను టీజీపీఎస్సీ, పోలీస్, మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్‌మెంట్ బోర్డులు సంయుక్తంగా చేపట్టనున్నాయి. ఇప్పటివరకు ఆయా సంస్థలు షెడ్యూల్‌ను ప్రకటించలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఓ ఫేక్ నోటిఫికేషన్ వైరల్‌గా మారింది. ఈ పోస్టుల భర్తీకి ఆర్టీసీ చర్యలు చేపట్టిందని పేర్కొంటూ ఓ బోగస్ నోటిఫికేషన్‌ను సోషల్ మీడియాలో కొందరు వైరల్ చేశారు. అందులో ఉన్న లింకును క్లిక్ చేసి ఆసక్తి ఉన్న అభ్యర్థులు వివరాలను నమోదు చేయాలని అందులో పేర్కొన్నారు. అయితే ఇది ఫేక్ నోటిఫికేషన్ అని, అభ్యర్థులెవరూ మోసపోవద్దని సజ్జనార్ తెలిపారు.

అభివృద్ధి జరిగితే బీజేపీకి సీట్లెందుకు తగ్గాయి?

చంద్రబాబు, నితీశ్ సంస్కరణలకు మద్దతిస్తారు: బీవీ రాఘవులు



సీపీఎం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): భారత్‌లో అభివృద్ధిని చూసి ప్రపంచం ఆశ్చర్యపోతోందని రష్యా పర్యటనలో ప్రధాని మోదీ ప్రకటించారని, అంత అభివృద్ధి జరిగితే ఇటీవల పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి సీట్లెందుకు తగ్గాయని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి 400 సీట్లు వస్తాయని ఆశించారని అయితే టీడీపీ, జేడీయూ మద్దతుతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దుస్థితి వారికి వచ్చిందని ఎద్దేవా చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఎం తెలంగాణ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ, టీడీపీ, జేడీయూ మద్దతుతో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు మరింత ముమ్మరం చేసే ప్రమాదం ఉందని, టీడీపీ, జేడీయూ నేతలు చంద్రబాబు, నితీశ్ కుమార్‌లు కూడా ఈ సంస్కరణలకు మద్దతు ఇస్తారని ఆయన అన్నారు. కార్పొరేట్లకు అనుకూల విధానాలు పేదలపై భారంగా మారే అవకాశం ఉందన్నారు. కేరళలో బీజేపీకి ఒక స్థానం రావడం కూడా ప్రమాదకరమేనని, మతోన్మాద ప్రమాదం ఇంకా పొంచి ఉందన్నారు. బీజేపీ మతోన్మాదం మీద రాష్ట్ర ప్రభుత్వం పోరాటం చేయాలని, ఆ బాధ్యతను సీఎం రేవంత్‌రెడ్డి తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య, ఐద్వా కార్యదర్శి మల్లు లక్ష్మి, రాష్ట్ర నాయకులు డీజీ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 11-7-2024

యంగ్



పట్టణ సవాళ్ల పరిష్కారం

'మానిఫెస్టింగ్ మ్యాన్‌హోల్స్' పేరుతో పట్టణ వరదలు, సవాళ్లను పరిష్కరించడం లక్ష్యంగా ప్రాజెక్ట్‌ను ఆవిష్కరించాను. భారతీయ నగరాల్లో మౌలిక సదుపాయాల భద్రతను కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశం.
– నారాయణం భవ్య



టెక్.. టూర్

'ఇంటెలినెక్సా' అనే నా ప్రాజెక్ట్ ఎకో–టూరిజంను ఏఆర్, వీఆర్, ఏఐల ద్వారా మార్చేందుకు వీలుగా ఫీచర్లను అందిస్తోంది. వైల్డ్ లైఫ్ ట్రిల్స్, వీఆర్ అడ్వెంచర్స్, ఎకో కెరీర్ గైడ్స్, ఎకో డైరీస్ ద్వారా మన ప్రాంతాల పట్ల సమాజానికి అవగాహన కల్పించడం, గ్లోబల్ ఫోరమ్‌లపై ప్రభావం చూపడమే లక్ష్యంగా దీనిని ఆవిష్కరించాను.
– మనల్ మునీర్



లక్ష్యానికి మార్గం

'అప్నా ఇంటర్వ్యూ క్రాకర్' అనే నా ప్రాజెక్ట్ మార్కెట్ ట్రెండ్‌లు, పోర్ట్‌ఫోలియో క్రియేషన్, ఎటిఎస్ రెజ్యూమ్ టెంప్లేట్‌లు, ఓపెన్ సోర్స్ కంట్రిబ్యూషన్‌లను అందించే ఒక వేదిక. దీని ద్వారా ఎంతోమంది తమ లక్ష్యాలు చేరుకోవడానికి మార్గం సుగమం అవుతుంది.
– మీత్ కుమార్ షా

ఐక్యరాజ్యసమితికి తెలుగు యువ ప్రతిభ

ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో రాబోయే డిసెంబర్‌లో జరిగే 8వ వార్షిక 1ఎమ్1బి (1మిలియన్ ఫర్ 1బిలియన్) యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనడానికి తెలంగాణలోని వివిధ కాలేజీలకు చెందిన ఐదుగురు యువ ఆవిష్కర్తలు ఎంపికయ్యారు. వీరిలో నలుగురు అమ్మాయిలు- నారాయణం భవ్య, పెమ్మసాని లిఖిత చౌదరి, సత్యవతి కోలపల్లి, మనల్ మునీర్ కాగా మరొకరు మీత్‌కుమార్ షా ఉన్నారు. వీరి ఆవిష్కరణలకు '1ఎమ్1బి గ్రీన్‌స్కిల్స్ అకాడమీ' వేదికయ్యింది. ఐదు నెలలపాటు సాగిన ఈ ప్రక్రియలో 200 మంది పాల్గొనగా ఐదుగురు తెలుగు విద్యార్థులు ఎంపికై యువ ప్రతిభకు ప్రేరణగా నిలిచారు.



విద్యార్థులకు ప్రాక్టికల్ స్కిల్స్

'టెక్.వెసాలియస్' అనే నా ప్రాజెక్ట్ లక్ష్యం అనాటమీ విద్యలో ఎఆర్/విఆర్ సాంకేతికత ద్వారా విప్లవాత్మక మార్పులు తీసుకురావడం. విద్యార్థులందరికీ అందుబాటులో ఉండేలా, వారిలో ప్రాక్టికల్ స్కిల్స్ పెంపొందించడమే ఈ ఆవిష్కరణ లక్ష్యం.
– పెమ్మసాని లిఖిత చౌదరి



వాస్తవ అనుభూతి

నారు పోషణలో ఏఐ సాధనాలు, మెటా స్పార్క్ స్టూడియోని ఉపయోగించుకొని వాస్తవ అనుభూతిని ఎలా పొందవచ్చో నా ప్రాజెక్ట్ పరిచయం చేస్తుంది. అంతేకాదు కెమెరా ట్రాకింగ్ ద్వారా వినియోగదారులకు వారి మొక్కలను సేంద్రీయంగా, వేగంగా ఎలా పెంచాలనే దానిపై లింక్‌లు, మార్గదర్శకాలను అందిస్తుంది. మొక్కల పెంపకంపై రూపొందించిన ప్రాజెక్ట్ ఇది.
– సత్యవతి కోలపల్లి

హెల్దీ డైట్ నట్టీ బైట్స్



– డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్



కావలసినవి: ఓట్స్ – కప్పు; కర్జూరాలు – 20 (నానబెట్టి గింజలు తొలగించాలి) ; వాల్‌నట్స్ – అర కప్పు (రోస్ట్ చేయాలి); బాదం– అర కప్పు (రోస్ట్ చేయాలి) ; కోకో పౌడర్ – పావు కప్పు.

తయారీ: ● ఓట్స్, వాల్‌నట్స్, బాదం, కోకో పౌడర్, కర్జూరాలను మిక్సీలో బ్లెండ్ చేయాలి. కర్జూరాలను నానబెట్టిన నీటినే వేసుకుంటూ మెత్తగా గ్రైండ్ చేయాలి ● ఈ మిశ్రమాన్ని పెద్ద నిమ్మకాయంత తీసుకుని అర చేతిలో వేసి గోళీలాగ చేసుకోవాలి. ఇలా మొత్తాన్ని చేసుకున్న తర్వాత సిలికాన్ ట్రే తీసుకుని ఒక్కో గోళీని ఒక్కో అరలో పెట్టి వత్తాలి. ఈ ట్రేని 20 నిమిషాల పాటు ఫ్రిజ్‌లో పెడితే నట్టీ బైట్స్ రెడీ. మిశ్రమం బాగా గట్టిపడి చేత్తో పట్టుకుని తినడానికి అనువుగా ఉంటుంది.

పోషకాలు: ప్రొటీన్ – 3.7 గ్రాములు, కార్బోహైడ్రేట్‌లు– 11.2 గ్రాములు, కొవ్వులు – 2 గ్రాములు, కేలరీలు– 70–80. ఇందులో ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్‌లు, ఫైబర్, ప్రొటీన్‌లు సమృద్ధిగా ఉంటాయి. వీటిని తింటే కండరాల శక్తి పెరుగుతుంది.

చర్చ



ఉద్యోగినులకు నెలసరి సెలవు ఇవ్వాలనే డిమాండ్ ఇటీవల ఎక్కువైంది. సుప్రీంకోర్టు ఈ విషయంలో ఏ నిర్ణయమూ చెప్పలేదు. రాష్ట్ర ప్రభుత్వాలతో, ఉపాధి సంస్థలతో చర్చించి కేంద్రం తీసుకోవాల్సిన పాలసీ నిర్ణయం అని తెలిపింది. నెలసరి సెలవును తప్పనిసరి చేస్తే సంస్థలు స్త్రీలను ఉద్యోగాల్లోకి తీసుకోకపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. మరి మహిళలు ఏమంటున్నారు?

ఉద్యోగినులకు నెలసరి సెలవు?

సుజన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. ఉదయం నుంచి పొత్తి కడుపులో నొప్పి. కూర్చోవడానికి వీలుకానంతగా నడుం నొప్పి. ప్రతి నెలా ఉండే సమస్యే ఇది. ఈ నెల మరీ ఎక్కువగా బాధిస్తోంది. ప్రాజెక్ట్ పూర్తయ్యేంత వరకు సెలవు పెట్టడానికి వీలు లేదని ఆఫీసులో ముందే హెచ్చరించిన విషయాన్ని గుర్తు తెచ్చుకుని బాధను పంటి బిగువున భరిస్తూనే ఆఫీసుకు బయల్దేరింది.

* * *

మేరీ ప్రైమరీ స్కూల్ టీచర్. పిల్లలతో కలిసిపోతూ రోజంతా యాక్టివ్‌గా ఉండాలి. నెలసరి సమయం దగ్గర పడుతుందంటేనే లోలోపల భయపడుతూ ఉంటుంది. తీవ్రమైన నొప్పితో పాటు, అధిక రక్తస్రావం సమస్యతో ప్రతీసారీ ఇబ్బందే.

* * *

కరుణ బట్టల షోరూమ్‌లో పనిచేస్తోంది. రోజంతా షాప్‌లో నిల్చొనే ఉండాలి. సేల్ సీజన్ కావడంతో సెలవులు పెట్టడానికి వీల్లేదని మేనేజర్ ముందే చెప్పారు. సెలవు అడిగితే ఉద్యోగం పోతుందేమో అని భయం. కానీ, నెలసరి సమయంలో విశ్రాంతి లేకుండా పని చేయడం అంటే మరింత అలసట కమ్ముకొచ్చేస్తుంది.

నెలసరివేళ ఇబ్బందిపడే ఉద్యోగినులకు రుతుస్రావ సెలవులపై మోడల్ పాలసీని రూపొందించాలని ఈ నెల 9న కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు సూచించింది. ఈ విషయంలో అందరికీ ఆమోదయోగ్యమైన విధానానికి రూపకల్పన చేయాలని కూడా ఆదేశించింది. నెలసరి సెలవులు తీసుకుంటే ఉద్యోగినుల ఉపాధిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముందా? అసౌకర్యం వేళ సెలవు దొరుకుతుందని భావిస్తే ఎక్కువ మంది ఉద్యోగాలు చేయడానికి మొగ్గు చూపుతారా? నెలసరి అవసరం గురించి మహిళలు స్పందన.
- నిర్మలా రెడ్డి

ఉపయోగకరమైనదే!



మహిళ ఇంటిని, ఆఫీస్ పనినీ బ్యాలెన్స్ చేసుకుంటూ తనని తాను నిరూపించుకుంటోంది. అయితే, పీరియడ్ సమయంలో అందరికీ అన్ని వేళలా ఆరోగ్యం సహకరించకపోవచ్చు. ఎవరికైతే అధిక రక్తస్రావం, పొత్తికడుపులో నొప్పి, మైగ్రెయిన్, వాంతులు... వంటి సమస్యలు ఉంటాయో వారికి విశ్రాంతి అవసరం అవుతుంది. భరించలేనంత నొప్పి ఉన్నప్పుడు ఎలాగూ పని మీద దృష్టి పెట్టలేరు. సమస్య ఉన్నవారికి సెలవు ఇవ్వడం మంచిదే. ఎందుకంటే నెలసరి నొప్పి భరించలేక ఉద్యోగాలు మానేసినవారూ ఉన్నారు. కొందరు ఉద్యోగినులు హెల్త్ చెకప్‌కి లీవ్ దొరకడం లేదని చెబుతుంటారు. అలాంటి వారికి ఈ లీవ్ అవకాశం ఉపయోగపడుతుంది.
– డాక్టర్ శిరీషారెడ్డి, గైనకాలజిస్ట్

అవసరం ఉన్నవారికే!



దాదాపు తొంభై శాతం మందిలో ఒకేలాంటి సమస్య ఉండదు. కాబట్టి అందరికీ సెలవు అవసరం లేదు. నెలసరి సమయంలోనూ సమస్యలేమీ లేకపోతే సెలవు ఎందుకు తీసుకోవాలి? పైగా పని పట్ల ఇష్టం ఉన్న నాకు లీవ్ తీసుకొని ఇంటి వద్ద ఉండటం బోర్ అనిపిస్తుంది. అందుకే సమస్య ఉన్నవారు, మెడికేషన్‌లో ఉన్నవారు డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌తో లీవ్ తీసుకోవచ్చు. స్కూల్ టైమ్‌లో నెలసరి వస్తే ఇంటికి వెళ్లే వీలు ఉండదు. స్కూల్‌లోనే కొంత సమయం విశ్రాంతి తీసుకుంటాం. సమస్య తీవ్రతను బట్టి అవసరం ఉన్నవారు లీవ్ తీసుకుంటే సరిపోతుంది.
– మృణాళిని, టీచర్

విశ్రాంతి అవసరమే!



మహిళలు కూర్చుని చేసే ఉద్యోగాల్లో సాధారణంగా నడుం నొప్పి ఉంటుంది. నెలసరి సమయంలో ఆ తీవ్రత ఇంకాస్త పెరుగుతుంది. కానీ, మాకు కేటాయించిన పనిని మరొకరికి అప్పగించలేం. సెలవు పెడితే పనిభారం పెరుగుతుందని భయం. అదీ సమస్యే. పీరియడ్ లీవ్ తప్పనిసరి చేస్తే వర్క్‌లోడ్ పెరగడం, ప్రమోషన్స్‌పై ప్రభావం చూపడం జరగవచ్చు. మా ఆఫీసులో వాష్‌రూమ్‌లలో ప్యాడ్స్, విశ్రాంతి తీసుకోవడానికి ప్లేస్ ఉంటుంది. సమస్య ఉన్నప్పుడు ఈ తరహా అవకాశాలు ఉపయోగించుకొని, పనులను యథావిధిగా చేస్తుంటాం. పీరియడ్ లీవ్ అనేది అందరికీ అవసరం కాదు. సమస్య ఉన్నవారు యాజమాన్యం అనుమతితో సెలవు తీసుకోవచ్చు.
– ఎస్.కె.బాజి, సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

యోగం

గాఢనిద్రకు బిటిలాసనం

స్మార్ట్ ఫోన్, టీవీల వాడకం పెరిగిన తర్వాత రాత్రిళ్లు నిద్ర పట్టక పోవడమనే సమస్య మరింత పెరిగింది. రక్తప్రసరణ మెరుగ్గా ఉండి, ఒత్తిడి లేకుండా, నిద్ర మెరుగవడానికి గో–మార్జాల ఆసనం ఉపయోగపడుతుంది.

దీనిని బిటిల ఆసనం అని కూడా అంటారు. బిటిల అంటే ఆవు, మార్జాలం అంటే పిల్లి అని అర్థం. నాలుగు కాళ్లపై నిలబడి ఆవు ఎలా ఉంటుందో ఈ ఆసనంలో మన శరీర భంగిమ అలా ఉంటుంది. ఈ ఆసనంలో వెన్నును బాగా సాగదీస్తాం. ● చేతులు, మోకాళ్లను నేలపై ఉంచడం ద్వారా ఈ ఆసనాన్ని మొదలుపెట్టవచ్చు ● దీర్ఘంగా శ్వాస పీల్చుకొని వదులుతూ రిలాక్స్ అవ్వాలి. వెన్నును సీలింగ్ వైపు గుండ్రంగా పైకి లేపి, తర్వాత నాభి స్థానం నుంచి వెన్నును వెనకవైపు సాగదీస్తున్నట్టు చేయాలి. మెడను రిలాక్స్‌గా ఉంచుతూ, గడ్డాన్ని ఛాతీవైపుగా లాగాలి. ఈ భంగిమలో పిల్లిలా మేనును సాగదీయాలి ● మెడపైన ఎలాంటి ఒత్తిడి లేకుండా జాగ్రత్త పడుతూ తలను సీలింగ్‌వైపు చూసేలా పైకి ఎత్తాలి. మెడను పైకి ఎత్తి పైకప్పు వైపు చూడాలి. ఇది ఆవు భంగిమ



● శ్వాసను ప్రతి కదలికకు అనుసంధానిస్తూ పైకి, కిందకు ఈ భంగిమను 8–10 సార్లు రిపీట్ చేస్తుండాలి. (మెడ సంబంధిత సమస్య ఉన్నవారు నిపుణుల పర్యవేక్షణలో ఈ యోగ సాధన చేయాలి.)

ప్రయోజనాలు: ● ఆవు – పిల్లి ఆసనం వల్ల ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. ● ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. నిద్రపట్టడానికి, నిద్రను మెరుగు పరచడానికీ ఈ ఆసనం సాయపడుతుంది. ఈ భంగిమలో వెనక కండరాలు, పొత్తికడుపు, భుజాలు, మణికట్టు, తుంటి బలపడతాయి. రక్తప్రసరణ మెరుగవుతుంది. ● ఈ ఆసనం రోజూ సాధన చేయడం ద్వారా పొట్ట కొవ్వు తగ్గుతుంది. ● ఖాళీ కడుపుతో రోజుకు 8–10 సార్లు ఈ ఆసనాన్ని సాధన చేసి, సరైన ఫలితాలను పొందవచ్చు.



– జి. అనూషా కార్తీక్
యోగా ట్రైనర్

డిజిటల్ సృష్టి



'కల్కి' సినిమాలో 'కాంప్లెక్స్' ఉన్నట్టే ఏ.ఐకి కూడా ఒక ప్రపంచం ఉంది. అందులో ఏ.ఐ ద్వారా తయారైన అందగత్తెలు ఉన్నారు. సరే. అన్ని దేశాల ఏ.ఐ. అందగత్తెలకు పోటీ పెడితే? పెట్టారు. మొరాకో ఏ.ఐ. అందగత్తె కెంజా లైలీ 'మిస్ ఏ.ఐ'గా కిరీటం సాధించి చరిత్ర సృష్టించింది. ఇదొక నిజంలాంటి కల్పన. అందమైన డిజిటల్ సృష్టి.

భారత్ నుంచి శతావరి



ఏఐ అందాల పోటీలో మన దేశానికి చెందిన జరా శతావరి 'టాప్–10' ఫైనల్ లిస్ట్‌కు ఎంపికై 'ఎవరీ శతావరి?' అని చాలామంది ఆరా తీసేలా చేసింది. శతావరి ఫొటోలు సోషల్ మీడియాలో అందంగా సందడి చేశాయి. ఒక మొబైల్ కంపెనీ యాడ్ ఏజెన్సీకి కో–ఫౌండర్ అయిన రాహుల్ చౌదరి 'శతావరి' సృష్టికర్త. హార్మోన్ సమస్యల నుంచి కుంగుబాటు వరకు ఎన్నో అంశాలపై మహిళలకు అవగాహన కలిగిస్తోంది శతావరి. ఈ 'డిజిటల్ దివా' తన వెబ్‌సైట్‌లో హెల్త్ నుంచి లేటెస్ట్ ఫ్యాషన్ ట్రెండ్స్ వరకు ఎన్నో అంశాలపై రచనలు చేస్తుంది. స్ట్రాటెజిక్ ప్లానింగ్, కంటెంట్ డెవలప్‌మెంట్, డేటా ఎనాలసిస్... మొదలైన ఏరియాలలో అద్భుత నైపుణ్యాన్ని ప్రదర్శిస్తోంది.

ఏఐ కాంప్లెక్స్‌లో అందాల పోటీలు



సోషల్ సబ్‌స్క్రిప్షన్ ప్లాట్‌ఫామ్ 'ఫ్యాన్ వ్యూ' నిర్వహించిన 'మిస్ ఏఐ' అందాల పోటీలో రియలిజమ్, టెక్, సోషల్ క్లౌట్ అనే మూడు ముఖ్యమైన విభాగాలు ఉన్నాయి. ఈ మూడు విభాగాల్లో మిగిలిన వారితో పోల్చితే కెంజా లైలీ 'బెస్ట్' అనిపించుకుంది. న్యాయనిర్ణేతలలో ఇద్దరు ఏఐ–జనరేటెడ్ ఇన్‌ఫ్లూయెన్సర్‌లు కూడా ఉన్నారు.

'యాక్టివిస్ట్ అండ్ ఇన్‌ఫ్లూయెన్సర్'గా గుర్తింపు తెచ్చుకున్న ఏ.ఐ. యువతి కెంజా లైలీకి ఇన్‌స్టాగ్రామ్‌లో రెండు లక్షల వరకు ఫాలోవర్‌లు ఉన్నారు. కెంజా ఏడు భాషల్లో మాట్లాడగలదు. ఫ్యాషన్, ఆహారం, అందం, ట్రావెల్... మొదలైన వాటికి సంబంధించి కంటెంట్ జనరేట్ చేస్తుంది. 'ఫినిక్స్ ఏఐ' సీయివో మెరియమ్ బెసా ఈ యువతి సృష్టికర్త. 'మిస్ ఏ.ఐ' కిరీటం సాధించాక కెంజా లైలీ మాట్లాడుతూ–


'కృత్రిమ మేధ సృష్టికర్తల తరఫున ప్రాతినిధ్యం వహించే, కృత్రిమ మేధస్సులోని సానుకూల కోణాన్ని ఆవిష్కరించే మంచి అవకాశం నాకు వచ్చింది. ఏఐ టెక్నాలజీ అభివృద్ధిలో మరింత క్రియాశీలంగా వ్యవహరించడానికి ఈ విజయం నాకు ఉపయోగపడుతుంది. మొరాకో, మధ్యప్రాచ్యంలో మహిళా సాధికారతకు దోహదం చేయడం నా లక్ష్యం. కృత్రిమ మేధస్సుపై ఎన్నో అనుమానాలు, అపోహలు ఉన్నాయి. ఈ భయాలను తొలగించడంపై దృష్టి పెడతాను. కృత్రిమ మేధ అనేది ఒక సాధనం మాత్రమే కాదు... ఇంతకు ముందు ఎవరూ సృష్టించలేని అవకాశాలను సృష్టించగల పరివర్తన శక్తి. విద్యారంగంలో ఏఐ వల్ల జరిగిన మంచి పనులు చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఏఐ అనేది మానవ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచేదే తప్ప దాన్ని భర్తీ చేయలేదు. మనుషులు, కృత్రిమ మేధ మధ్య సహకారాన్ని పెంపొందించడం నా ప్రాధాన్యతలలో ముఖ్యమైనది' అంటుంది కెంజా.

ఈ పోటీలో రన్నర్స్–అప్‌గా ఫ్రాన్స్‌కు చెందిన లలీన, పోర్చుగల్‌కు చెందిన ఓలివ సి నిలిచారు.

హెల్త్ ఫ్యాక్ట్స్

గుండెపోటుకు తేనెతో చెక్!

గుండెపోటును నివారించుకునేందుకు ఒక తియ్యటి దారి ఉంది. అదేమంటే రకరకాల తీపి పదార్థాల్లో తీపినిచ్చే పదార్థాలు రకరకాలుగా ఉంటాయి. ఉదాహరణకు పిండి పదార్థాలైన బియ్యం, గోధుమలలో మాల్టోజ్, పండ్లలో ఫ్రక్టోజ్, చెరుకులో సుక్రోజ్, గ్లూకోజ్ ఇలా. అలాగే తేనెలో తీపినిచ్చే మరికొన్ని పదార్థాలతో పాటు 'ట్రిహాలోజ్' కూడా ఉంటుంది. ఇదే స్వీటెనర్ కొన్ని పుట్టగొడుగులు, ఈస్ట్, సోయాబీన్స్‌లో కూడా ఉంటుంది. తేనెలోని ట్రిహాలోజ్‌ను ఇంజెక్ట్ చేసిన ఎలుకల రక్తనాళాల్లో 'ప్లాక్' చేరక పోగా గతంలో చేరిన ప్లాక్‌లో దాదాపు 30 శాతం తగ్గుదల కనిపించింది. ఈ ప్లాక్ వల్లనే రక్తనాళాల్లో క్లాట్స్ ఏర్పడి అది గుండెపోటుకు దారితీస్తుందన్న విషయం తెలిసిందే. రక్తనాళాల్లోని ప్లాక్‌ను శుభ్రం చేసే పని చేసే ఇమ్యూన్ కణాల పుట్టుకకు టీఎఫ్ఈబీ అనే ఒక రకమైన ప్రోటీన్ ఉత్పాదనకు ట్రిహాలోజ్ తోడ్పడుతుంది. అలా గుండెపోటును నివారించ వచ్చని వాషింగ్టన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన శాస్త్రవేత్తలు భావిస్తూ ఆ మేరకు పరిశోధనలు చేస్తున్నారు.



జుట్టు పొడిబారకుండా..!

రకరకాల అంశాలు జుట్టు పొడిబారడానికి కారణమవుతాయి. ఉదాహరణకు... ఆహారపు అలవాట్లు, జీవనశైలి, జుట్టు కోసం వాడే వివిధ రకాల హెయిర్ ప్రోడక్ట్స్ వంటివి. రోజువారీ డైట్‌లో ప్రోటీన్లు, ఐరన్ మోతాదులు తగ్గినా, వాతావరణంలో తేమ తగ్గినా జుట్టు పొడిబారడంతో పాటు చిట్లుతుంది. జుట్టు పొడిబారుతున్నవారు ప్రోటీన్, ఐరన్ పుష్కలంగా దొరికే పదార్థాలను తీసుకోవడం, వ్యాయామం చెయ్యడం వంటి మార్పుల ద్వారా జుట్టు ఆరోగ్యకరంగా మారుతుంది. ఫలితం లేకుంటే డర్మటాలజిస్టును కలిసి, వారి సూచనల మేరకు మెడికేటెడ్ షాంపూలు, కండిషనర్లు వాడాల్సి ఉంటుంది.



క్లుప్తంగా...

ప్రైవేటు బీసీ బిల్లుకు ఒవైసీ హామీ

ఆర్.కృష్ణయ్య వెల్లడి



కాచిగూడ (హైదరాబాద్): మజ్లిస్ పార్టీ తరఫున పార్లమెంట్‌లో ప్రైవేటు బీసీ బిల్లు పెడతామని ఆ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ హామీ ఇచ్చారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ బిల్లు కోసం ఇతర పార్టీలను కూడగట్టాలని ఒవైసీ సూచించినట్లు ఆయన తెలిపారు. ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ నేతృత్వంలో బీసీ నేతలతో కూడిన ప్రతినిధి బృందం గురువారం ఒవైసీని కలిసి పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని కోరుతూ వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం బీసీ వ్యతిరేకత అవలంబిస్తోందని, ఏ రంగంలో కూడా జనాభా ప్రకారం బీసీలకు వాటా ఇవ్వడం లేదన్నారు. రాజకీయాల్లో బీసీల ప్రాతినిధ్యం 14 శాతం దాటలేదని కేంద్ర ప్రభుత్వం ఇటీవల సేకరించిన గణాంకాల ద్వారా తెలిసిందన్నారు. ఇప్పటికైనా చట్టసభలలో బీసీలకు జనాభా ప్రకారం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విజయవాడ సీపీగా రాజశేఖర్‌బాబు



సాక్షి, అమరావతి: ఏపీలో తొమ్మిది మంది ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఏపీ రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్‌పర్సన్‌గా ఉన్న అంజనా సిన్హాకు ఏపీఎస్పీ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. విజయవాడ పోలీస్ కమిషనర్‌గా ఐజీ రాజశేఖర్ బాబును నియమించింది. ఆయనతోపాటు మరో ఎనిమిది మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

న్యాయవాది రవికుమార్‌పై దాడి హేయం

హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి



మాట్లాడుతున్న హెచ్‌సీఏఏ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఓ కేసులో ముందస్తు బెయిల్ తీర్పు కాపీతో సిద్దిపేట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాది రవికుమార్‌పై ఏఎస్‌ఐ ఉమారెడ్డి దాడి చేయడం హేయమని హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యాడపు రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. నిందితుడిపై దాడిని ప్రశ్నించిన న్యాయవాది ఫోన్‌ను లాక్కోవడమే కాకుండా తీవ్రంగా గాయపరిచారన్నారు. ఆయనపైనే దాడి చేసి తిరిగి తమ విధులను అడ్డుకున్నారంటూ న్యాయవాదిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం గర్హనీయమని పేర్కొన్నారు. న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ గురువారం హైకోర్టు అసోసియేషన్ హాల్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ, డీజీపీ జోక్యం చేసుకుని ఏఎస్‌ఐతో పాటు తప్పుడు ఎఫ్‌ఐఆర్ నమోదులో పాల్గొన్న పోలీసులందరినీ సస్పెండ్ చేయాలన్నారు. అలాగే ఉమారెడ్డిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి, న్యాయవాదిపై ఎఫ్‌ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని డీజీపీని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ దీప్తి, సెక్రటరీలు శాంతిభూషణ్ ఉప్పల, సంజీవ్ జిల్లెల, జాయింట్ సెక్రటరీ నవీన్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల కేసులో నివేదిక అమలు నిలుపుదల

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా మెడికల్ కాలేజీలో పీజీ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు సంబంధించి ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ (ఐసీసీ) ఇచ్చిన నివేదికల అమలును నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఫిర్యాదు ప్రతులను, నివేదికను ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి ఎందుకు ఇవ్వలేదని ఐసీసీ చైర్మన్, డీఎంఈ, ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలని వారికి నోటీసులు జారీ చేయడంతో పాటు వేధింపులకు గురైన విద్యార్థినిని ప్రతివాదిగా చేర్చాలని ఆదేశించింది. ఓ పీజీ విద్యార్థినిపై లైంగిక వేధింపుల వ్యవహారంలో ఐసీసీ ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ ఆమె సహచరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. ఫిర్యాదు కాపీని, సాక్షుల వాంగ్మూలాలను పిటిషనర్లకు ఇవ్వలేదని వారి తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్ పూసర్ల, న్యాయవాది శ్రేయాదేవికి వాదనలు వినిపించారు. ఐసీసీ విచారణ సరిగా సాగలేదని, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. గత మేలో ఇచ్చిన రెండు నివేదికలను నిలుపుదల చేస్తున్నట్లు స్పష్టం చేశారు. మళ్లీ ఆదేశాలు ఇచ్చేవరకు ఈ ఉత్తర్వులు కొనసాగుతాయని చెప్పారు. విచారణ ఈ నెల 30కి వాయిదా వేశారు.

ఒక్కరికే వందనం.. అందరికీ ఎగనామం!

'తల్లికి వందనం'పథకంపై కూటమి ప్రభుత్వం యూటర్న్

- ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికీ ఇస్తామని ఎన్నికల్లో హామీ
- స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు చొప్పున జమ చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటన
- జీవో నంబర్ 29లో ఒక్క తల్లికి మాత్రమే 'తల్లికి వందనం'అని స్పష్టీకరణ
- కోటి మంది పిల్లలను నిలువునా మోసం చేస్తున్న సీఎం చంద్రబాబు
- అధికారంలోకి వచ్చి నెల రోజులైనా విద్యా రంగంపై స్పష్టత ఇవ్వని వైనం
- రాష్ట్ర ప్రభుత్వం వద్ద 82,29,858 మంది విద్యార్థుల డేటా
- అయినా లబ్ధిదారుల ఎంపిక పేరుతో తాత్సారం చేస్తున్న సర్కారు
- ఇన్నాళ్లకు కేవలం గైడ్‌లైన్స్ మాత్రమే జారీ.. అందులోనూ ప్లేటు ఫిరాయింపు

'నేను హామీ ఇస్తున్నాను.. తల్లికి వందనం కింద సంవత్సరానికి ప్రతి ఒక్క బిడ్డకూ (విద్యార్థిని, విద్యార్థులు) 15 వేల రూపాయలు ఇచ్చే బాధ్యత నాదీ... ఒక్కరికే అనే నిబంధన లేదు.. ఇద్దరుంటే ఇద్దరికీ ఇస్తా.. ముగ్గురుంటే ముగ్గురికీ ఇస్తా.. నలుగురుంటే నలుగురికీ ఇస్తా.. మీ ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పన ఇస్తా. ఈ లెక్కన నలుగురుంటే రూ.60 వేలు ఇస్తా'అని ఎన్నికలకు ముందు చంద్రబాబు ఊరూరా లక్షలాది మంది ప్రజల సమక్షంలో బహిరంగంగా మాట ఇచ్చారు. బాబుతో పాటు టీడీపీ నేతలంతా ఇంటింటా ఇవే మాటలు చెప్పారు. ఇలా మాయ మాటలు చెప్పి.. ఓట్లు వేయించుకుని గద్దెనెక్కాక నిస్సిగ్గుగా ప్లేటు మార్చారు. మరీ ఇంత దుర్మార్గమా.. అని ఎవరైనా చంద్రబాబును ప్రశ్నిస్తే అదే మరి రాజకీయం అంటే అని చెప్పడానికి ఏమాత్రం సిగ్గుపడరు. ఒక్కసారి ఆయన గారి చరిత్ర తిరగేస్తే ఇంకా ఇలాంటి మోసాలు మునుముందు చాలానే కనిపిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.


ఎన్నికల ప్రచారంలో..

తల్లికి వందనం కింద ఏడాదికి ప్రతి ఒక్క బిడ్డకూ 15 వేల రూపాయలు ఇచ్చే బాధ్యత నాదీ... ఒక్కరికే అనే నిబంధన లేదు.. ఇద్దరుంటే ఇద్దరికీ ఇస్తా.. ముగ్గురుంటే ముగ్గురికీ ఇస్తా.. నలుగురుంటే నలుగురికీ ఇస్తా.. మీ ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పన ఇస్తా. ఈ లెక్కన నలుగురుంటే రూ.60 వేలు ఇస్తా.

మేనిఫెస్టోలో..



అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో



Scheme	Description
TALLIKI VANDANAM	As a part of Government Assured Flagship Programs, the Government under "TALLIKI VANDANAM" scheme is providing financial assistance of Rs.15,000/- per annum to each mother or recognized guardian who is below poverty line household and sending their children to schools/colleges i.e., from Classes I to XII.

సాక్షి, అమరావతి: మాట మార్చడంలో డబుల్ పీహెచ్‌డీ చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి తన నైజాన్ని చూపించారు. 'తల్లికి వందనం'పేరిట ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తామన్న అంశంపై మాట తప్పారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి.. ఒక్కరుంటే రూ.15 వేలు, ఇద్దరుంటే రూ.30 వేలు, ముగ్గురుంటే రూ.45 వేలు, నలుగురుంటే రూ.60 వేలు ఇస్తామని లక్షలాది మంది ప్రజల సమక్షంలో బహిరంగా ఇచ్చిన మాటను గాలికి వదిలేశారు. ఇప్పుడు ఈ పథకాన్ని చదువుకునే పిల్లల్లో ఒక ఇంట్లో ఒక్కరికే అమలు చేస్తామని ప్రకటించారు. ఆధార్ అనుసంధానం పేరుతో అనేక కొర్రీలు వేసి లబ్ధిదారులను తగ్గించే పనిలో ఉన్నారు. అందుకే ఏటా జూన్ నెలలో పాఠశాలలు తెరిచిన వెంటనే ఇవ్వాల్సిన పథకంపై కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు గడుస్తున్నా ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదు. బుధవారం జీవో నం.29 విడుదల చేసి.. పిల్లలతో సంబంధం లేకుండా ఒక్క తల్లికి మాత్రమే రూ.15 వేలు ఇస్తామని ప్రకటించారు. అంటే గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన 42.62 లక్షల మంది లబ్ధిదారుల కంటే తక్కువ మందికే ఇవ్వాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. 'ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ 'తల్లికి వందనం'అమలు చేస్తాం. ఆ మొత్తం నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తాం. ఇంకా పిల్లలను కనండి పథకాలు అందుకోండి'అంటూ ఎన్నికల్లో చంద్రబాబు ప్రకటిస్తే.. ఇప్పుడు నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న నిమ్మల రామానాయుడు ఆ పథకం గురించి తనదైన శైలిలో 'నీకు 15 వేలు.. నీకు 15 వేలు.. నీకు 15 వేలు.. నీకు 15 వేలు..'అంటూ చిన్న పిల్లలను చూపిస్తూ ప్రచారం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. ఇన్ని ఆధారాలు ఉన్నా ఇప్పుడు 'వందనం ఒక్కరికే'అనడంపై తల్లులు మండి పడుతున్నారు.

కోటి మంది పిల్లల్లో భారీగా కోత

రైతులకు రుణమాఫీ చేస్తామని టీడీపీ 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చింది. తీరా అధికారంలోకి రాగానే అనేక కొర్రీలు వేసి లబ్ధి పొందే రైతులను తగ్గించడంతో పాటు రుణ మాఫీని సైతం భారీగా కుదించేశారు. ఇప్పుడు తల్లికి వందనం పైనా ఇలాగే ముందుకెళ్లాలని కూటమి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంత మంది ఉంటే అందరికీ తలో రూ.15 వేలు చొప్పున ఇస్తూ తల్లికి వందనం పథకం అమలు చేస్తామని చేసిన ప్రకటనకు విరుద్ధంగా ముందుకెళుతోంది. అందుకు అనుగుణంగానే జీవో నం.29లో జారీ చేసింది. పిల్లలు అందరికీ ఇస్తామన్న పథకాన్ని 'తల్లికి మాత్రమే రూ.15000'అని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అంటే రాష్ట్రంలో దాదాపు కోటి మందికి పైగా పిల్లలున్నారు. ఇందులోనూ లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు కసరత్తు చేస్తోంది. అందుకే ఆధార్‌తో లింక్ అయ్యి ఉన్న అన్ని ఆస్తుల వివరాలను తీసుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విధించిన నిబంధనలను కాకుండా మరింత కఠినంగా నిబంధనలు రూపొందిస్తోంది. గత ప్రభుత్వంలో ప్రతి బిడ్డా చదువుకునేందుకు బడికి వెళ్లడమే లక్ష్యంగా జగనన్న అమ్మఒడి పథకాన్ని అమలు చేసింది. అన్ని మేనేజ్‌మెంట్ల స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో చదివే పిల్లలను ప్రోత్సహించేందుకు వారి తల్లులకు ఏటా రూ.15 వేలు జమ చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ఒకటి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, కాలేజీల్లో చదివే పిల్లలకు మాత్రమే అమలు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

మూడుసార్లు మాట మార్చిన కూటమి

చదువుతో సంబంధం లేకుండా ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం అమలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో ఎన్‌డీఏ కూటమి నాయకులు బహిరంగంగా ప్రజలకు మాట ఇచ్చారు. 'స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఆర్థిక సాయం'అంటూ ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్‌లో హామీ ఇచ్చారు. ఇప్పుడు తాజాగా ఇచ్చిన ఆదేశాల్లో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదివే పిల్లలున్న తల్లికి మాత్రమే ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పారు. అంటే ఒకే అంశంపై మూడుసార్లు మాట మార్చారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలతో పాటు, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు, కాలేజీలు, ప్రయివేట్ ఎయిడెడ్, ప్రయివేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్, జూనియర్ కాలేజీల్లో చదివే పిల్లలు గల తల్లులకు అమ్మఒడి పథకాన్ని అమలు చేసింది. కానీ ఇప్పుడు ఇచ్చిన ఆదేశాల్లో ఎక్కడా స్కూళ్లు, కాలేజీల ప్రస్తావన చేయలేదు.

నూరు శాతం పిల్లల డేటా ఉన్నా కాలయాపన

2023–24 విద్యా సంవత్సరంలో ఒకటి నుంచి ఇంటర్ వరకు మొత్తం 82,29,858 మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో చదువుతున్నారు. కొత్తగా చేరిన విద్యార్థుల సంఖ్య కూడా దీనికి జత చేయాలి. ఈ వివరాలు ప్రభుత్వం వద్ద నూరు శాతం ఉన్నాయి. కానీ ఎన్‌డీఏ కూటమి విద్యార్థుల సంఖ్యను సర్వే చేసి తేల్చాలని నిర్ణయించింది. తద్వారా ఈ విద్యా సంవత్సరంలో పథకం అమలు చేయకుండా దాటవేయడానికి మార్గాలు అన్వేషిస్తున్నట్టు తెలుస్తోంది.

ఆ ప్రభుత్వమే ఉండి ఉంటే..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కొనసాగుతూ ఉండింటే ఈ పాటికే అమ్మ ఒడి, రైతు భరోసా, విద్యా దీవెన, వసతి దీవెన, మత్స్యకార భరోసా పథకాలు అమలై ఉండేవి. గత ఐదేళ్లలో ఈ పథకాలన్నీ చెప్పిన రోజు చెప్పినట్లు అర్హత గల లబ్ధిదారులందరికీ అందాయి. అర్హత ఉండీ కూడా ఏ కారణం వల్లనైనా లబ్ధి పొందని వారికి మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించి మరీ మేలు చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి నిజంగా పిల్లలపై ప్రేమ ఉంటే జూన్ నెలలోనే తల్లికి వందనం (అమ్మ ఒడి) పథకాన్ని అమలు చేసి ఉండేది. ఈ పథకం లబ్ధిదారుల జాబితాలో ఎలా కోత పెట్టాలా.. అని నెల రోజులకు పైగా ఆలోచించి ఇప్పుడు తీరిగ్గా గైడ్‌లైన్స్ మాత్రమే జారీ చేసింది. పిల్లలందరికీ అని చెప్పి ఇప్పుడు ఒక్కరికే అంటూ ప్లేటు ఫిరాయించింది. అది కూడా ఎప్పుడిస్తారో చెప్పక పోవడం గమనార్హం.

ఉరేసుకొని బాలిక ఆత్మహత్య

- కన్నతండ్రే చంపాడని బంధువుల అనుమానం..



శైలజ (ఫైల్)

చిల్పూరు: కూతురు ఆత్మహత్య చేసుకోగా, కన్నతండ్రే చంపాడని బంధువులు ఆందోళనకు దిగారు. చిల్పూరు మండలం పల్లగుట్ట జీపీ పరిధిలోని మారేపల్లిగూడేనికి చెందిన సందెళ దివ్యను ఉనికిచర్లకు చెందిన శివ వివాహం చేసుకున్నాడు. వీరికి కూతురు శైలజ(16) ఉంది. కొన్నేళ్ల క్రితం దివ్య మృతి చెందగా, శివ వర్ధన్నపేట మండలం ల్యాబర్తికి చెందిన రేణుకను రెండోపెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రేణుకకు ఇద్దరు కూతుళ్లు. శైలజ చిన్నప్పటి నుంచే పల్లగుట్టలోని బంధువుల ఇంట్లో ఉంటోంది. 15 రోజుల క్రితం శైలజకు జ్వరం రాగా, అదే గ్రామంలోని తన బంధువుల ఇంట్లో ఉంచి హైదరాబాద్‌కు వచ్చాడు. శైలజ విషయంలో రెండో భార్యతో 10 రోజుల క్రితం గొడవ జరిగింది. దీంతో ఆమె పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. దీంతో మంగళవారం శివ కూతురిని హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. బుధవారం ఉదయం శివ డ్యూటీకి వెళ్లగా.. ఆ సమయంలో శైలజ 'నాన్న నాపై అనుమానం పెట్టుకున్నావు.. నేను భరించలేను.. నేను కూడా అమ్మ దగ్గరికి వెళుతున్నాను' అంటూ లెటర్ రాసి పెట్టి ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన శివ తలుపుకొట్టగా తీయలేదు. అనుమానంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా, అప్పటికే శైలజ మృతి చెందింది. గురువారం మారేపల్లిగూడెంలోని బంధువులకు విషయం చెప్పగా, దహన సంస్కారాల ఏర్పాట్లు చేసి ఉంచారు. సాయంత్రం మృతదేహాన్ని గ్రామానికి తీసుకురాగానే 'శైలజను నీవే ఉరివేసి చంపావంటూ' అంబులెన్స్‌లో ఉన్న శివను కొట్టే ప్రయత్నం చేశారు. దీంతో తప్పించుకొని చిల్పూరు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు.

మెడికల్ బదిలీల్లో గందరగోళం

స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వని యంత్రాంగం

- నేడే దరఖాస్తుకు చివరి రోజు కావడంతో హడావుడి
- ఎవరు దరఖాస్తు చేసుకోవాలో స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద వైద్యుల ఆందోళన
- పదేళ్లకు పైగా ఒకే చోట పని చేస్తున్న 69 మంది డాక్టర్లు
- ఓ వైద్యాధికారి ఏకంగా 25 ఏళ్లుగా ఒకేచోట ఉద్యోగం



సాక్షి, హైదరాబాద్: వైద్య సిబ్బంది బదిలీల్లో గందరగోళం నెలకొంది. బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారమే గడువు కావడంతో వైద్యులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది హడావుడి పడుతున్నారు. మరోవైపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారే కానీ, స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయలేదని కొందరు ఉద్యోగులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం హైదరాబాద్ కోఠిలోని ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం, డీఎంఈ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యాలయాల వద్ద డాక్టర్లు, వైద్య సిబ్బంది ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం ఇచ్చిన బదిలీల వ్యవహారం అస్తవ్యస్తంగా ఉందనీ.. సీనియార్టీ జాబితాలు తప్పుల తడకగా తయారు చేశారని వారు మండిపడ్డారు. అలాగే నర్సింగ్ ఆఫీసర్లు, ఎంపీహెచ్ఎస్‌లు కూడా తమ బదిలీలపై గందరగోళం నెలకొందని ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ముందు ప్రమోషన్లు ఇస్తారా? లేదా బదిలీలు చేస్తారా? ఏవి ముందు జరుగుతాయని తెలంగాణ బోధన ప్రభుత్వ డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిరణ్ మాదల నిలదీశారు. బదిలీలపై యంత్రాంగం గందరగోళాన్ని సృష్టించిందని ప్రభుత్వ వైద్యుల సంఘం నేతలు డాక్టర్ నరహరి, డాక్టర్ బొంగు రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒకేచోట 25 ఏళ్లుగా పాతుకుపోయి..

ప్రజారోగ్య సంచాలకుల విభాగంలో నాలుగేళ్లు దాటిన 188 మంది డాక్టర్ల జాబితాను ప్రకటించినప్పటికీ వారు దరఖాస్తు చేసుకోవాలా? లేదా? అన్న దానిపై స్పష్టత ఇవ్వలేదని అంటున్నారు. నాలుగేళ్లు దాటిన వారంతా దరఖాస్తు చేసుకోవాలన్న నిబంధన కూడా పెట్టలేదు. పైగా మొత్తం ఉద్యోగుల్లో 40 శాతం మందిని బదిలీ చేస్తామని అన్నారు. కానీ ఇది ఆప్షనా? లేక తప్పనిసరా? అన్న దానిపైనా స్పష్టత లేదు. ఆప్షన్ అయితే లాంగ్ స్టాండింగ్ వారు ఎందుకు దరఖాస్తు చేసుకుంటారు? నగరాలు, పట్టణాల్లో ఉండే వారెందుకు గ్రామాలకు వెళ్తారు? వాళ్లు వెళ్లకుంటే గ్రామాల్లో నుంచి పట్టణాలకు రావాలనుకునే వారికి అవకాశం ఎలా దక్కుతుందనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజారోగ్య విభాగంలో ఉన్న సివిల్ అసిస్టెంట్ సర్జన్లలో నాలుగేళ్లు నిండిన వారి జాబితాను తయారు చేశారు. ఆ ప్రకారం 188 మంది డాక్టర్లు బదిలీకి అర్హత కలిగి ఉన్నారు. విచిత్రమేంటంటే వరంగల్ జిల్లాకు చెందిన ఒక ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏకంగా 25 ఏళ్ల నుంచీ బదిలీ కాకుండా ఒకేచోట పనిచేస్తుండటం గమనార్హం. అదే జిల్లాకు చెందిన ఓ డాక్టర్, రంగారెడ్డి జిల్లాకు చెందిన మరో డాక్టర్ 20 ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తున్నారు. 10 ఏళ్లు.. అంతకుమించి ఒకేచోట పనిచేస్తున్నవారు 69 మంది ఉండటం విస్మయం కలిగిస్తోంది. వీరిని ఇప్పుడైనా కదిలించే పరిస్థితి ఉంటుందా అన్న ప్రశ్న తలెత్తుతోంది.

పైరవీలు షురూ...

మరోవైపు, తమకు ఇష్టమైన చోటకు బదిలీ చేయించుకునేందుకు పలువురు వైద్య సిబ్బంది పైరవీలు మొదలుపెట్టారు. ఈ విషయంలో కొందరు అధికారులు పనిచేసి పెడతామంటూ అడ్వాన్సులు పుచ్చుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలు, పట్టణాలకు బదిలీ కావాలంటే రూ. 5 లక్షలు, తమకు ఇష్టమైన చోటకు కావాలంటే ఆరేడు లక్షలు, ఉన్నచోటనే కదలకుండా ఉండాలంటే అంతకు మించి డిమాండ్ చేస్తున్నారన్న వాదనలున్నాయి. ఇక బోధనాసుపత్రుల డాక్టర్లు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల నుంచి రూ. 10 లక్షలకు పైనే వసూలు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. సూపరింటెండెంట్ కేడర్‌లోనైతే ఇంకా ఎక్కువే డిమాండ్ ఉందని చెబుతున్నారు, కొందరు ప్రజా ప్రతినిధులు కూడా డాక్టర్ల వెనుక ఉండి పైరవీలు చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది.

వివరణ ఇవ్వండి

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం కూల్చివేతపై స్పందించిన హైకోర్టు

- సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కు నోటీసులు
- వారిపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలన్న వైఎస్సార్‌సీపీ



సాక్షి, అమరావతి: కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా తమ పార్టీ కేంద్ర కార్యాలయ భవనం కూల్చివేతకు పాల్పడిన అధికారులపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలంటూ వైఎస్సార్‌సీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. కూల్చివేతలకు బాధ్యులైన సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్‌లకు వివరణ ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 8వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయాన్ని కూల్చివేసేందుకు మున్సిపల్ కమిషనర్ జారీ చేసిన ప్రాథమిక ఉత్తర్వులను సవాల్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విచారణ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. చట్ట ప్రకారం నడుచుకుంటామని కోర్టుకు హామీ ఇచ్చారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. వైఎస్సార్‌సీపీ భవనం కూల్చివేత విషయంలో తదుపరి చర్యలు చేపట్టే ముందు చట్టప్రకారం నడుచుకోవాలని సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్‌లను ఆదేశిస్తూ గత నెల 21న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాలను వైఎస్సార్‌సీపీ తరఫు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి లిఖితపూర్వకంగా సీఆర్‌డీఏ కమిషనర్, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. కానీ కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆ మరుసటి రోజు తెల్లవారుజామున వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయాన్ని కూల్చివేశారు. దీంతో సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, మునిసిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్‌లపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు శేషగిరిరావు పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా.. పిటిషనర్ తరఫు న్యాయవాది నన్నపనేని శ్రీహరి అధికారుల వ్యవహారశైలిని.. కోర్టు ధిక్కారాన్ని న్యాయమూర్తికి వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి ప్రతివాదులుగా ఉన్న అధికారులిద్దరికీ నోటీసులు జారీ చేశారు.

తిరుమల క్యూలో ప్రాంక్ వీడియో

- తమిళనాడుకు చెందిన వివాదాస్పద యూట్యూబర్ నిర్వాకం
- సోషల్ మీడియాలో ఆకతాయిలపై మండిపడ్డ శ్రీవారి భక్తులు



తిరుమలలోని క్యూ కంపార్ట్‌మెంట్‌లో శ్రీవారి భక్తులను ప్రాంక్ చేస్తున్న యూట్యూబర్

తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భద్రతలోని డొల్లతనం, సిబ్బంది నిర్లక్ష్యం బట్టబయలైంది. శ్రీవారి దర్శనానికి వెళ్లే క్యూలైన్లలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకువెళ్లేందుకు అనుమతి లేనప్పటికీ తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి అక్కడి సిబ్బంది కళ్లుగప్పి ఏకంగా మొబైల్‌ఫోన్ తీసుకెళ్లాడు. అంతటితో ఆగకుండా ఏకంగా ఓ ప్రాంక్ వీడియోని చిత్రీకరించడం.. ఆ తర్వాత దానిని తన ఇన్‌స్టాగాం పేజీలో పోస్టు చేయడం తీవ్ర కలకలం సృష్టించింది. వివరాలివీ..

తమిళనాడుకు చెందిన ఓ వివాదాస్పద యూట్యూబర్ టీటీఎఫ్ వాసన్ ఇటీవల తన మిత్రులతో కలిసి మొబైల్‌ఫోన్‌తో దర్శన క్యూలోకి ప్రవేశించాడు. నారాయణగిరి షెడ్లలో వేచి ఉన్న భక్తులతో తాళాలు తీస్తున్నట్లు నటించాడు. వాసన్‌ను చూసిన కంపార్టుమెంటులోని భక్తులు టీటీడీ ఉద్యోగిగా భావించి గేట్లు తీస్తారేమోనన్న భావనతో ఒక్కసారిగా పైకిలేవడంతో టీటీఎఫ్ వాసన్ వెకిలి నవ్వులు నవ్వుతూ పరిగెడుతూ రావడాన్ని తన మిత్రులు ఫోన్‌లో చిత్రీకరించారు. ఈ వీడియోలను టీటీఎఫ్ ఫ్యామిలీ అనే తన ఇన్‌స్టాగాం పేజీలో వాసన్ పోస్టుచేయడంతో తమిళనాడులో ఇది వైరల్ అయింది. దర్శన క్యూల్లో భక్తులపై ప్రాంక్ వీడియోల చిత్రీకరణపై తమిళనాడులో పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆకతాయి చేష్టలు చేసిన వాసన్‌ను అరెస్టుచేయాలని సామాజిక మాధ్యమాల్లో భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

విచారణకు టీటీడీ విజిలెన్స్ ఆదేశాలు..

ఈ ఘటనపై టీటీడీ విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రాంక్ వీడియోలు తీయడం హేయమైన చర్య అని ఒక ప్రకటనలో ఖండించింది. ప్రాంక్ వీడియోలు చిత్రీకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేసింది. సాధారణంగా నారాయణగిరి షెడ్స్ దాటి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోకి ప్రవేశించక ముందే భక్తుల నుండి మొబైల్ ఫోన్లు డిపాజిట్ చేసుకుంటారని టీటీడీ తెలిపింది. కానీ, ఒకరిద్దరు ఆకతాయిల చేష్టలతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని టీటీడీ ఆ ప్రకటనలో పేర్కొంది. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ హెచ్చరించింది.

హీరో రాజ్‌తరుణ్‌పై కేసు నమోదు

- హీరోయిన్ మాల్వీ మల్హోత్రతో పాటు ఆమె సోదరునిపై సైతం కేసు
- పోలీసులకు ఆధారాలు ఇచ్చిన లావణ్య



మాల్వీ మల్హోత్ర, రాజ్‌తరుణ్

మణికొండ (హైదరాబాద్): హీరో రాజ్‌తరుణ్‌పై అతని ప్రియురాలు లావణ్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అతనితో పాటు హీరోయిన్ మాల్వీ మల్హోత్ర, ఆమె సోదరుడు మయాంక్ మల్హోత్రలపై పోలీసులు సెక్షన్ 420, 493, 506ల కింద కేసు నమోదు చేశారు. గత 11 సంవత్సరాలుగా తనతో లివింగ్ రిలేషన్‌లో ఉండటం, పెళ్లి చేసుకుని సమాజానికి తెలియకుండా ఉంచటం, ప్రస్తుతం తనను పట్టించుకోకుండా మరొకరితో కలసి ఉంటున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్న విషయం తెలిసిందే. 2016లో తనకు గర్భం వస్తే రెండు నెలలకే అబార్షన్ చేయించాడని ఆమె ఆరోపించారు. ప్రస్తుతం రాజ్ తరుణ్‌తో కలసి ఉంటున్న హీరోయిన్ మాల్వీ మల్హోత్ర, ఆమె సోదరుడు మయాంక్ మల్హోత్రలు తనను జైలుకు పంపిస్తామని, చంపేసి శవం కూడా దొరకకుండా చేస్తామని బెదిరించారని ఆమె పేర్కొన్నారు. వారు చెప్పినట్టుగానే తనకు ఏమాత్రం సంబంధం లేని డ్రగ్స్ కేసులో తనను ఇరికించి జైలుకు పంపారని ఆమె ఫిర్యాదులో వివరించారు. వాట్సాప్ చాట్‌లు, ఫొటోలు, వీడియోలను తన ఫిర్యాదుకు ఆధారాలుగా పోలీసులకు అందించారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కాగా, హీరోయిన్ మాల్వీ మల్హోత్ర సైతం ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో లావణ్యపై ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. లావణ్య ఫిర్యాదు, ఆమె ఇచ్చిన ఆధారాలను పరిశీలించి ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని నార్సింగి పోలీసులు ఎఫ్ఐఆర్ రూపంలో రాజేంద్రనగర్ కోర్టుకు తెలిపారు.

సర్టిఫికెట్లపై పేరు మార్చి ఇస్తే నష్టమేంటి ?

- ఎస్ఎస్‌సీ, ఇంటర్ బోర్డులు, వర్సిటీలు ఉన్నది అందుకే కదా..
- రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు.. విచారణ వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఎస్ఎస్‌సీ, ఇంటర్ ఎడ్యుకేషన్ బోర్డులు, యూనివర్సిటీలు ఉన్నది విద్యార్థుల సంక్షేమం కోసమే కదా.. పేరు మార్చి సర్టిఫికెట్లు ఇవ్వడానికి ఇబ్బంది ఏమిటో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణలోగా దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణ రెండువారాలు వాయిదా వేసింది. తన పేరు మార్చుకున్నట్టు ప్రభుత్వ గెజిట్ జారీ అయినా..ఎస్ఎస్‌సీ, ఇంటర్ బోర్డులు, ఉస్మానియా యూనివర్సిటీ ఆ మేరకు సర్టిఫికెట్లు మార్చి ఇవ్వడం లేదంటూ రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన వి.మధుసూదన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 1961లో జారీ చేసిన జీవో 1263 సెక్షన్ సీ లోని రూల్ 1, 2, 3 చట్టవిరుద్ధమని, ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. సర్టిఫికెట్లలో పేరు మార్చేందుకు బోర్డులు నిరాకరించడం సరికాదని పిటిషనర్ తరఫు న్యాయవాది కారుకొండ అరవింద్‌రావు వాదించారు. ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఒకసారి పేరు మారుస్తూ గెజిట్ జారీ అయ్యాక.. ఇక సర్టిఫికెట్ మార్పు అవసరం లేదని, గెజిట్‌లోని పేరే చెల్లుబాటు అవుతుందన్నారు. రూల్ 1, 2, 3 అదే చెబుతోందని పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. 'పిటిషనర్ విజ్ఞప్తి న్యాయబద్ధమైనది. ఇలాంటి వారు పరీక్షలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో పేరు మారింది రాస్తారు.. అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్‌లో పాతపేరు అలాగే ఉంటుంది. ఆ కారణంతో వారు పరీక్షకు రాయడానికి అనర్హులుగా మారే ప్రమాదం ఉంది కదా. అప్పుడు ఆ నష్టాన్ని ఎవరు పూడ్చుతారు? విద్యార్థుల సంక్షేమం కోసం పనిచేస్తున్న బోర్డులు, వర్సిటీలు గెజిట్ ప్రకారం పేరు మార్చి సర్టిఫికెట్ ఇస్తే నష్టమేంటి? ఇక్కడ పిటిషనర్ రూల్‌ను కూడా చాలెంజ్ చేస్తున్నారు'అని పేర్కొంది. దీనిపై తమ వివరాలు తెలియజేసేందుకు సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరారు. దీనికి అనుమతించిన ధర్మాసనం విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. తదుపరి విచారణలోగా పిటిషనర్‌కు సర్టిఫికెట్లలో పేరు మార్చి ఇస్తారని భావిస్తున్నామని వ్యాఖ్యానించింది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	427	79,925
నిఫ్టీ ▽	109	24,324

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (గురు రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	18,609	▲	180
డోజోన్స్	39,484	▲	192
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,194	▲	54
డాక్స్	18,407	▲	171
షాంఘై	2,939	▽	20
నికాయ్	41,832	▽	252

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,616	▲	270
బంగారం (99.5 స్వచ్ఛత)	72,325	▲	269
వెండి (కేజీ)	91,793	▽	54

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.10	84.12
£	బ్రిటన్ పౌండ్	105.69	108.26
€	యూరో	89.29	91.65
¥	జపాన్ ఎన్ (100)	51.47	52.60
AUS	ఆస్ట్రేలియా డాలర్	55.42	57.36
S$	సింగపూర్ డాలర్	59.50	64.16
SAR	సౌదీ రియాల్	21.35	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	21.85	23.63
¥	చైనా యువాన్	10.36	12.44

తెలుగు రాష్ట్రాల్లోకి రివర్ ఎలక్ట్రిక్ స్కూటర్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎలక్ట్రిక్ స్కూటర్ల సంస్థ రివర్ తాజాగా తెలుగు రాష్ట్రాల్లోకి విస్తరిస్తోంది. బుధవారం హైదరాబాద్‌లో తొలి స్టోర్‌ను ప్రారంభించగా మార్చి నాటికి వైజాగ్, విజయవాడ, గుంటూరులో కూడా ఏర్పాటు చేయనుంది. ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరునాటికి స్టోర్స్ సంఖ్యను 50కి పెంచుకోనున్నట్లు సంస్థ సీఈవో అరవింద్ మణి తెలిపారు. ప్రస్తుతం ఇండీ పేరిట స్కూటర్లు విక్రయిస్తున్నామని, 2026 నాటికి ఏటా 1,00,000 వాహన విక్రయాల లక్ష్యం సాధించాక రెండో మోడల్‌ను కూడా ప్రవేశపెడతామని ఆయన వివరించారు. యమహా మోటర్ కార్పొరేషన్, టయోటా వెంచర్స్ తదితర దిగ్గజాల నుంచి ఇప్పటివరకు రూ. 550 కోట్లు సమీకరించినట్లు చెప్పారు. ప్రస్తుతం నెలకు సుమారు 500 యూనిట్లుగా ఉన్న అమ్మకాలను వచ్చే మార్చి నాటికి 3,000కి పెంచుకోనున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లో ఇండీ ఎలక్ట్రిక్ స్కూటర్ ఆన్ రోడ్ ధర రూ. 1,45,000గా ఉంటుందని, ఒకసారి చార్జింగ్‌తో 120 కి.మీ. వరకు రేంజి ఉంటుందని మణి చెప్పారు.



టాటా, మహీంద్రా ఎస్‌యూవీ రేట్లు కట్!



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీలో ఉన్న టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా ఎస్‌యూవీల ధరలను తగ్గించాయి. డిమాండ్‌ను పెంచేందుకు ఇరు సంస్థలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. టాటా మోటార్స్ హ్యారియర్‌పై రూ.50,000, సఫారిపై రూ.70,000 తగ్గించింది. అలాగే ఎంపిక చేసిన హ్యారియర్, సఫారి వేరియంట్లపై రూ.1.4 లక్షల వరకు విలువ చేసే అదనపు ప్రయోజనాలు అందించనుంది. నెక్సన్ ఈవీపై రూ.1.3 లక్షల వరకు, పంచ్ ఈవీ రూ.30,000 డిస్కౌంట్‌తో లభిస్తాయి. ఎస్‌యూవీల అమ్మకాల్లో భారత్‌లో టాటా మోటార్స్ ఇటీవలే 20 లక్షల యూనిట్ల మార్కును చేరుకుంది. ఈ నేపథ్యంలో కింగ్ ఆఫ్ ఎస్‌యూవీస్ పేరుతో ప్రమోషనల్ కార్యక్రమానికి కంపెనీ శ్రీకారం చుట్టింది. జూలై 31 వరకు ఆఫర్స్ అమలులో ఉంటాయి. ఇక మహీంద్రా ఎక్స్‌యూవీ 700 ఏఎక్స్7 శ్రేణిపై రూ.2 లక్షల పైచిలుకు డిస్కౌంట్ ప్రకటించింది. మే నెలతో పోలిస్తే ఎక్స్‌యూవీ 700 బుకింగ్స్ జూన్‌లో 23 శాతం దూసుకెళ్లాయని మహీంద్రా తెలిపింది.

ఎల్‌ఐసీ పెట్టుబడులపై లాభాల పంట

గతేడాది 37 శాతం ప్లస్ • రూ. 4.39 లక్షల కోట్లు • స్టాక్ మార్కెట్ల ర్యాలీ ఎఫెక్ట్
కొంతమేర పెట్టుబడుల విక్రయం • అయినప్పటికీ పెరిగిన విలువ

బీమా రంగ పీఎస్‌యూ దిగ్గజం ఎల్ఐసీ ఇండియా గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో పలు దిగ్గజ కంపెనీలలో గల వాటాలను కొంతమేర విక్రయించింది. ఇందుకు స్టాక్ మార్కెట్లు బుల్ వేవ్‌లో పరుగు తీస్తుండటం ప్రభావం చూపింది. అయినప్పటికీ గతేడాది ఎల్ఐసీ పెట్టుబడుల విలువ ఏకంగా 37 శాతంపైగా జంప్‌చేయడం విశేషం! వివరాలు చూద్దాం



స్టాక్ ఎక్స్ఛేంజీలకు దాఖలైన సమాచారం ప్రకారం ఎల్ఐసీ పారిశ్రామిక దిగ్గజం ముకేశ్ అంబానీ గ్రూప్ కంపెనీలలో అత్యధిక పెట్టుబడులను కలిగి ఉంది. ఈ బాటలో టాటా, అదానీ గ్రూప్‌లలోనూ భారీగా ఇన్వెస్ట్ చేసింది. గత వారాంతానికల్లా దిగ్గజ కంపెనీలలో ఎల్ఐసీ పెట్టుబడుల విలువ రూ. 4.39 లక్షల కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022-23)లో నమోదైన విలువతో పోలిస్తే ఇది 37.5 శాతం అధికం. రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్‌లో పెట్టుబడులు 34 శాతం ఎగసి రూ. 1.5 లక్షల కోట్లకు చేరాయి. వీటిలో పెట్టుబడులను గతేడాది 6.37 శాతం నుంచి 6.17 శాతానికి తగ్గించుకుంది. ఇదేకాలంలో టాటా గ్రూప్ కంపెనీలలో వాటా 4.22 శాతం నుంచి 4.05 శాతానికి నీరసించింది. వీటి విలువ రూ. 1.29 లక్షల కోట్లు. ఇక అదానీ గ్రూప్‌లో ఎల్ఐసీ వాటా 4.27 శాతం నుంచి 3.76 శాతానికి దిగివచ్చింది. వీటి విలువ 49 శాతం దూసుకెళ్లి రూ. 64,414 కోట్లను తాకింది.

> ఎన్ఎస్ఈలో బుధవారం ఎల్ఐసీ షేరు 1.5% బలపడి రూ. 1,048 వద్ద ముగిసింది. ఈ ధరలో ఎల్ఐసీ మార్కెట్ విలువ రూ. 6.62 లక్షల కోట్లను అధిగమించింది.

ప్రభుత్వం సైతం

నిజానికి పబ్లిక్ ఇష్యూ ద్వారా ఎల్ఐసీ సైతం స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యింది. రూ. 1,050 సమీపంలో కదులుతోంది. కంపెనీలో కేంద్ర ప్రభుత్వానికి 96.5 శాతం వాటా ఉంది. దీంతో ఎల్ఐసీలో మైనారిటీ వాటా విక్రయం ద్వారా ప్రభుత్వం భారీగా నిధులు సమకూర్చుకునేందుకు వీలుంది. వీటిని మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించుకోవచ్చని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇటీవల దేశీ స్టాక్ మార్కెట్లు రోజుకో సరికొత్త గరిష్టాన్ని అందుకుంటూ జోరు చూపుతున్నాయి. దీనికితోడు ఏడాది కాలంలో పలు ప్రభుత్వ రంగ కంపెనీల షేర్లు వేలంవెర్రిగా లాభాల పరుగు తీస్తున్నాయి. వెరసి ప్రభుత్వం వీటిలో కొంతమేర వాటాల విక్రయాన్ని చేపడితే.. సులభంగా బడ్జెట్ ప్రతిపాదిత డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాలను చేరుకోవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

స్టాక్స్‌లో ఎల్ఐసీ పెట్టుబడులు ఇలా..

బిజినెస్ గ్రూప్	2023-24 వాటా(%)	2022-23 వాటా(%)	విలువ (రూ. కోట్లలో)
ఆర్ఐఎల్	6.19	6.37	1,50,249
టాటా	4.05	4.22	1,29,622
అదానీ	3.76	4.27	64,414
భారతీ	3.72	4.11	39,241
బిర్లా ఏవీ	4.03	4.86	31,943
జేఎస్‌డబ్ల్యూ	5.35	7.31	23,891



టాటా ఎలెక్సీ లాభం రూ. 184 కోట్లు

ముంబై: ఇంజినీరింగ్ సంబంధ ఐటీ సర్వీసుల కంపెనీ టాటా ఎలెక్సీ ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. నికర లాభం ఏప్రిల్–జూన్ క్వార్టర్(క్యూ1)లో 3 శాతం క్షీణించి రూ. 184 కోట్లకు పరిమితమైంది. మొత్తం ఆదాయం మాత్రం 9% పుంజుకుని రూ. 926 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 850 కోట్ల టర్నోవర్ సాధించింది.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు బీఎస్ఈలో 1.5 శాతం లాభపడి రూ. 7,119 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-7-2024	
విశాఖ	575–00
చిత్తూరు	573–00
విజయవాడ	555–00
హైదరాబాద్	530–00
వరంగల్	532–00

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
గేమింగ్ మార్కెట్ హవా | నియామకాలు ఆశావహం

మార్కెట్లో లాభాల స్వీకరణ

- అధిక వేల్యుయేషన్ల ఆందోళన నేపథ్యం
- 80 వేల కిందికి సెన్సెక్స్, నిఫ్టీ 109 పాయింట్లు డౌన్

ముంబై: సరికొత్త రికార్డుల నమోదు తర్వాత ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించడంతో స్టాక్ సూచీలు బుధవారం అరశాతం నష్టపోయాయి. కార్పొరేట్ కంపెనీల జూన్ త్రైమాసిక ఫలితాల ప్రారంభానికి(గురువారం) ముందు అప్రమత్తత, ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపుపై నెలకొన్న అనిశ్చితి పరిస్థితులు ఒత్తిడి పెంచాయి. ఉదయం సెన్సెక్స్ 130 పాయింట్లు లాభంతో జీవితకాల గరిష్టం 80,481 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. నిఫ్టీ 28 పాయింట్లు పెరిగి ఆల్‌టైం హై 24,461 వద్ద మొదలైంది. ఈక్విటీలు జీవితకాల గరిష్టాల వద్ద ట్రేడవుతున్న తరుణంలో అధిక వెల్యుయేషన్ల ఆందోళనలతో ఇన్వెస్టర్లు భారీ లాభాల స్వీకరణకు తెరతీశారు. ఒక దశలో సెన్సెక్స్ 916 పాయింట్లు క్షీణించి 79,436 వద్ద, నిఫ్టీ 291 పాయింట్లు పతనమై 24,142 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. అయితే ఆసియా, యూరప్ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడంతో మిడ్ సెషన్ నుంచి అమ్మకాల తీవ్రత తగ్గింది. చివరికి సెన్సెక్స్ 427 పాయింట్లు నష్టపోయి 80వేల దిగువన 79,925 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 109 పాయింట్లు పడి 24,324 వద్ద నిలిచింది. ప్రపంచ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- డిమాండ్‌ను పెంచేందుకు తమ ఎస్‌యూవీ మోడళ్ల ధరలను తగ్గించడంతో మహీంద్రాఅండ్‌మహీంద్రా కంపెనీ షేరు 7% నష్టపోయి రూ.2,732 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 8 శాతం పతనమై రూ.2,698 వద్ద నిలిచింది. కంపెనీకి చెందిన రూ.24,087 కోట్ల మార్కెట్ విలువ హరించుకుపోయి రూ.3.40 లక్షల కోట్లకు దిగివచ్చింది.



ఎంక్యూర్ లిస్టింగ్ మెరుపులు

ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్ షేరు లిస్టింగ్‌లో మెప్పించింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.1,008)తో పోలిస్తే 31% ప్రీమియంతో రూ.1,325 వద్ద లిస్టయ్యింది. తొలుత 37% పెరిగి రూ.1,384 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 35% లాభంతో రూ.1,359 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.25,696 కోట్లుగా నమోదైంది.

బన్సాల్ వైర్ భేష్



స్టీల్ వైర్ల తయారీ కంపెనీ బన్సాల్ వైర్ ఇండస్ట్రీస్ లిస్టింగ్‌కు ఆదరణ లభించింది. ఇష్యూ ధర (రూ.256)తో పోలిస్తే బీఎస్ఈలో 37.50% ప్రీమియంతో రూ.352 వద్ద లిస్టయ్యింది. మార్కెట్ బలహీన పరిస్థితులకు తట్టుకొని షేరు తొలుత 44% లాభపడి రూ.369 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 37% లాభంతో రూ.350 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.5,484 కోట్లుగా నమోదైంది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

క్లాట్-2025

నేషనల్ లా యూనివర్సిటీల్లో యూజీ, పీజీ డిగ్రీ కోర్సుల్లో (ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం) ప్రవేశాలకు క్లాట్-2025 నోటిఫికేషన్ విడుదలైంది. ఏటా కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్)ను నిర్వహిస్తాయి. ఈ పరీక్షలో మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 24 నేషనల్ లా యూనివర్శిటీలు ఉన్నాయి.

కోర్సుల వివరాలు

» అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ (ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా డిగ్రీ).
» పోస్ట్-గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ (ఏడాది ఎల్ఎల్ఎం డిగ్రీ).
» **అర్హత:** యూజీ కోర్సులకు కనీసం 45 శాతం మార్కులతో 10+2 లేదా తత్సమాన పరీక్ష, పీజీ కోర్సులకు కనీసం 50 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ డిగ్రీ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 15.07.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.10.2024.
» **క్లాట్-2025 పరీక్ష(ఆఫ్‌లైన్) తేది:** 01.12.2024.
» **వెబ్‌సైట్:** https://consortiumofnlus.ac.in

సెయిల్‌లో 249 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్).. దేశవ్యాప్తంగా ఉన్న సెయిల్ స్టీల్ ప్లాంట్లు/యూనిట్లు, గనుల్లో మేనేజ్‌మెంట్ ట్రైనీ (టెక్నికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 249.
» **విభాగాలు:** కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్.
» **అర్హత:** కనీసం 65 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు గేట్-2024 స్కోరు సాధించి ఉండాలి.
» **వయసు:** 25.07.2024 నాటికి 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** రూ.60,000 నుంచి రూ.1,80,000.
» **ఎంపిక విధానం:** గేట్-2024 స్కోర్,గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.07.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.07.2024.
» **వెబ్‌సైట్:** https://www.sail.co.in

ఆర్‌సీఎఫ్ఎల్, ముంబైలో 165 అప్రెంటిస్‌లు

ముంబైలోని రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్ఎల్).. గ్రాడ్యుయేట్/టెక్నీషియన్/ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 165. శిక్షణా కాలవ్యవధి: రెండేళ్లు.
» **అర్హత:** 50 శాతం మార్కులతో పదో తరగతి, 10+2, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఇంగ్లిష్ పరిజ్ఞానం ఉండాలి.
» **స్టైపెండ్:** టెక్నీషియన్ ఒకేషనల్ డిప్లొమా అభ్యర్థులకు రూ.7000, టెక్నీషియన్ డిప్లొమా అభ్యర్థులకు రూ.8000, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.9000.
» **గరిష్ఠ వయోపరిమితి:** 01.07.2024 నాటికి 25 ఏళ్లు ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.07.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.07.2024.
» **వెబ్‌సైట్:** https://www.rcfltd.com

నైపుణ్యాలకు మార్గం.. అప్రెంటీస్‌షిప్!

అప్రెంటీస్ ట్రైనింగ్.. క్షేత్ర స్థాయి నైపుణ్యాలకు మార్గం! అప్రెంటీస్ ట్రైనింగ్ పూర్తి చేసుకుంటే.. ఉద్యోగ సాధనలో ముందు వరుసలో నిలిచే అవకాశం ఉంటుంది! ఎందుకంటే.. సంస్థలు అప్రెంటీస్ శిక్షణ పొందిన వారికి నియామకాల్లో ప్రాధాన్యం ఇస్తున్నాయి. అందుకే ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సులు, ఐటీఐ ట్రేడ్స్, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల వరకూ.. అందరికీ ఇప్పుడు అప్రెంటిస్ శిక్షణ అత్యంత ఆవశ్యకంగా మారింది. ఈ నేపథ్యంలో.. విద్యార్థులకు అందుబాటులో ఉన్న అప్రెంటీస్ ట్రైనింగ్ మార్గాలు, ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు తదితర వివరాలు..



» ఎన్ఏపీఎస్ సహా పలు అప్రెంటీస్‌షిప్ స్కీమ్స్
» టెక్నికల్, ట్రెడిషనల్.. అన్ని విభాగాలకూ అవకాశం
» అప్రెంటీస్ ట్రైనింగ్‌తో క్షేత్ర నైపుణ్యాలు
» స్కిల్స్ ఉంటేనే కొలువులు దక్కుతున్న వైనం

ఉద్యోగ నియామకాల్లో ప్రాక్టికల్ నైపుణ్యాలకు రోజురోజుకూ ప్రాధాన్యం పెరుగుతోంది. స్కిల్స్ లేకుంటే ఉపాధి మార్గాలు మూసుకుపోతున్నాయి. దీంతో అన్ని రకాల కోర్సుల విద్యార్థులకు జాబ్ రెడీ స్కిల్స్ అందించడంపై ప్రభుత్వాలు దృష్టిపెట్టాయి. ఇందుకోసం విద్యార్థులకు అప్రెంటీస్ షిప్ ట్రైనింగ్ అవకాశాలు కల్పించే దిశగా.. డీజీఈటీ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్), ఎన్ఎస్‌డీసీ (నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి.

ఎన్ఏపీఎస్.. వినూత్నం

సంస్థలు స్టయిఫండ్, ఇతర ఆర్థిక వ్యయాలను పరిగణనలోకి తీసుకుని అప్రెంటీస్ ట్రైనీలను నియమించుకునేందుకు వెనుకంజ వేస్తున్నాయి. దీన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. 2016లో నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్(ఎన్ఏపీఎస్)కు రూపకల్పన చేసింది. ఈ స్కీమ్‌లో భాగంగా అప్రెంటీస్ ట్రైనీలను నియమించుకునే సంస్థలకు నిధులు మంజూరు చేస్తోంది. అప్రెంటీస్ ట్రైనీకి శిక్షణ సమయంలో ఇచ్చే స్టయిఫండ్‌లో 25 శాతాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. దీంతోపాటు అప్రెంటీస్ ట్రైనింగ్ ఇచ్చేందుకు సంస్థకు అయ్యే వ్యయంలో 25 శాతాన్ని సర్కారు చెల్లిస్తుంది. ఇలా అప్రెంటిస్ శిక్షణకు వెచ్చించే మొత్తం వ్యయంలో 50 శాతం నిధులు కంపెనీలకు ప్రభుత్వం నుంచి అందుతాయి.

వివిధ రకాలుగా వర్గీకరణ

అప్రెంటీస్ ట్రైనీలను..ట్రేడ్ అప్రెంటీసెస్, గ్రాడ్యుయేట్ అప్రెంటీసెస్, టెక్నీషియన్ అప్రెంటీసెస్, టెక్నీషియన్ (ఒకేషనల్) అప్రెంటీస్, ఇతర ఆప్షనల్ ట్రేడ్ అప్రెంటీసెస్‌గా వర్గీకరించారు. గత ఏడాది నుంచి ఇండస్ట్రీ 4.0 స్కిల్స్‌కు సంబంధించిన విభాగాల్లో సైతం అప్రెంటీస్ ట్రైనీలను నియమించుకునేలా ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది.

సర్టిఫికెట్లు కూడా

ఎన్ఏపీఎస్ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్ పేరుతో పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే సర్టిఫికెట్ కూడా అందిస్తారు. ఈ పరీక్షకు హాజరు కావాలంటే.. సదరు అభ్యర్థులు అప్రెంటీస్ ట్రైనింగ్ సమయంలో కనీసం 80 శాతం హాజరు కలిగుండాలి. అదే విధంగా ఫార్మేటివ్ అసెస్‌మెంట్‌లో ట్రేడ్ ప్రాక్టికల్స్‌లో 60 శాతం, ట్రేడ్ థియరీలో 40 శాతం మార్కులు పొందాలి.

ఆన్‌లైన్‌లోనే అనుసంధానం

నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ ద్వారా.. సంస్థలను, విద్యార్థులను (అప్రెంటీస్) ఆన్‌లైన్‌లోనే అనుసంధానం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులు ఎన్ఏపీఎస్ వెబ్‌సైట్‌లో అప్రెంటీస్ ట్రైనింగ్ అవకాశాలు అందుబాటులో ఉన్న సంస్థల వివరాలు తెలుసుకోవచ్చు. అదే విధంగా సంస్థలు కూడా ఇదే వెబ్‌సైట్ ద్వారా అప్రెంటీస్ ట్రైనింగ్ కోసం ప్రొఫైల్ క్రియేట్ చేసుకున్న విద్యార్థుల సమాచారం పొందొచ్చు.

- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.apprenticeship.gov.in

ఎన్ఏటీఎస్.. మరో మార్గం

అప్రెంటీస్ ట్రైనింగ్ అభ్యర్థులకు అందుబాటులో మరో ప్రధాన మార్గం.. నేషనల్ అప్రెంటీస్ ట్రైనింగ్ స్కీమ్. ఈ స్కీమ్ ప్రకారం -ఆర్ట్స్, హ్యూమానిటీస్, కామర్స్, ఇంజనీరింగ్, డిప్లొమా విద్యార్థులకు అప్రెంటీస్ ట్రైనింగ్ పొందే అవకాశం కల్పిస్తారు. డిప్లొమా ఉత్తీర్ణులకు నెలకు రూ.8 వేలు, ఇతర కోర్సుల వారికి నెలకు రూ.9వేల స్టయిఫండ్‌ను అందిస్తున్నారు. శాశ్వత ఉద్యోగులు 30మంది ఉన్న సంస్థలు ఎన్ఏటీఎస్ విధానంలో అప్రెంటీస్ ట్రైనీలను నియమించుకోవచ్చు. అదే విధంగా.. ప్రతి సంస్థ కనిష్ఠంగా నలుగురిని అప్రెంటీస్ ట్రైనీలుగా నియమించుకోవచ్చు.

- వివరాలకు వెబ్‌సైట్: https://mhrdnats.gov.in

డీజీఈటీ.. అప్రెంటీస్‌షిప్ స్కీమ్

డీజీఈటీ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్) ఆధ్వర్యంలోని అప్రెంటీస్‌షిప్ స్కీమ్ ప్రకారం-ఇంటర్మీడియెట్, ఐటీఐ, ఇంజనీరింగ్ వంటి సాంకేతిక కోర్సులకు సంబంధించి అప్రెంటీస్ ట్రైనింగ్ అవకాశాలను అన్వేషించే వీలుంది. దాదాపు మూడు వందల ట్రేడ్‌లలో ప్రస్తుతం ఈ శిక్షణ సదుపాయం లభిస్తోంది. అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న కోర్సులు, ట్రేడ్‌ల ఆధారంగా శిక్షణ వ్యవధి ఆరు నెలల నుంచి నాలుగేళ్ల వరకు ఉంటోంది. డీజీఈటీ నిబంధనల ప్రకారం-పారిశ్రామిక సంస్థలు తప్పనిసరిగా అప్రెంటీస్ ట్రైనీలను నియమించుకోవాలి. ఈ నిబంధనల మేరకు ఒక సంస్థ మొత్తం ఉద్యోగుల్లో కనిష్ఠంగా మూడు శాతం, గరిష్ఠంగా పది శాతానికి సమానమైన సంఖ్యలో అప్రెంటీస్ ట్రైనీలను నియమించుకోవచ్చు. నిర్దిష్ట వ్యవధిలోని అప్రెంటీస్ ట్రైనింగ్ పూర్తి చేశాక.. అభ్యర్థులకు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఒకేషనల్ ట్రైనింగ్ ట్రేడ్ టెస్ట్ పేరుతో పరీక్ష నిర్వహిస్తుంది. ఈ ట్రేడ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధిస్తే అప్రెంటీస్‌షిప్ సర్టిఫికెట్ చేతికందుతుంది.

- వివరాలకు వెబ్‌సైట్: https://dgt.gov.in/Apprenticeship_Training

విద్యాశాఖ ఆధ్వర్యంలో శిక్షణ

బ్యాచిలర్ స్థాయిలో ఇంజనీరింగ్ తదితర టెక్నికల్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు అప్రెంటీస్ ట్రైనింగ్ కల్పించే దిశగా కేంద్ర విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల కోసం బోర్డ్ ఆఫ్ అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్ పేరుతో ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తోంది. దీనివల్ల ఇంజనీరింగ్ విద్యార్థులకు 130 విభాగాల్లో అప్రెంటీస్ ట్రైనింగ్ చేసే అవకాశం లభిస్తోంది. అభ్యర్థులు కేంద్ర విద్యాశాఖకు చెందిన నేషనల్ అప్రెంటీస్ ట్రైనింగ్ స్కీమ్ వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకుంటే.. వారి అర్హతలకు సరితూగే కంపెనీలకు అనుసంధానం చేసి అవకాశాలు కల్పించే విధంగా ఈ స్కీమ్ రూపకల్పన జరిగింది.

- వివరాలకు వెబ్‌సైట్: www.mhrdnats.gov.in

పీఎంకేవీవై.. మరో మార్గం

వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసుకుని క్షేత్ర స్థాయి నైపుణ్యాలు సొంతం చేసుకోవాలనుకున్న వారికి అందుబాటులోకి ఉన్న మరో అవకావం.. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీవై). నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్ వర్క్ సిఫార్సుల ఆధారంగా ఈ పథకాన్ని రూపొందించారు. ఇందులో షార్ట్ టర్మ్,లాంగ్ టర్మ్ శిక్షణ సదుపాయం అందుబాటులో ఉంది. దీని ప్రకారం-అభ్యర్థులు తమ ప్రాంతంలోని అధీకృత ట్రైనింగ్ సెంటర్‌లోనే శిక్షణ పొందొచ్చు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ఆర్థిక ప్రోత్సాహకం లభిస్తోంది.ఈ స్కీమ్ అన్ని ప్రాంతాలకు చెందిన వారికి చేరాలనే ఉద్దేశంతో ప్రైవేట్ ట్రైనింగ్ సెంటర్లతో ఒప్పందం చేసుకునే విధానం అమలవుతోంది.

- వెబ్‌సైట్: pmkvyofficial.org

మారుతున్న సంస్థల దృక్పథం

అప్రెంటీస్ ట్రైనీలను నియమించుకునే విషయంలో సంస్థల దృక్పథంలో సానుకూల మార్పు కనిపిస్తోంది. కారణం.. సదరు సంస్థలు కార్యకలాపాల నిర్వహణ పరంగా సుశిక్షితులైన సిబ్బంది కొరతను ఎదుర్కోవడమే. దీంతోపాటు అప్రెంటీస్ ట్రైనింగ్ ద్వారా అభ్యర్థులను తమ అవసరాలకు తగిన రీతిలో శిక్షణ ఇవ్వచ్చొని కంపెనీలు భావిస్తున్నాయి. అంతేకాకుండా అప్రెంటీస్ ట్రైనింగ్ సమయంలో మెరుగైన పనితీరు చూపిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తున్నాయి. ఎన్ఏపీఎస్ ద్వారా ఆర్థిక ప్రోత్సాహకం అందిస్తుండటంతో.. అప్రెంటీస్ ట్రైనీలను నియమించుకునేందుకు సంస్థలు ముందుకొస్తున్నాయి.

ట్రేడ్ టెస్ట్ సర్టిఫికెట్స్

అప్రెంటీస్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఎన్‌సీవీటీ, డీజీఈటీలు నిర్వహించే ట్రేడ్ టెస్ట్‌లలో ఉత్తీర్ణత సాధిస్తే.. ఉద్యోగావకాశాలను దక్కించుకోవడంలో మరింత ముందంజలో నిలుస్తారు. ఎంట్రీ లెవల్‌లోనే ఐటీఐ అభ్యర్థులకు రూ.12 వేల నుంచి రూ. 15 వేలు; డిప్లొమా వారికి రూ.15 వేల నుంచి రూ.18 వేల మధ్యలో వేతనం లభిస్తుంది.

అప్రెంటీస్‌షిప్ మార్గాలు.. ముఖ్యాంశాలు

- అప్రెంటీస్ ట్రైనింగ్‌కు ప్రధాన మార్గంగా నిలుస్తున్న నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్.
- ఎంహెచ్‌ఆర్‌డీ ఆధ్వర్యంలోనూ అప్రెంటీస్ ట్రైనింగ్.
- గత ఏడాది నుంచి ఇండస్ట్రీ 4.0 స్కిల్స్‌లోనూ అప్రెంటీస్ ట్రైనింగ్ అవకాశం.
- అప్రెంటీస్ ట్రేడ్ సర్టిఫికెట్స్‌తో జాబ్ మార్కెట్‌లో సత్వర ఉపాధికి మార్గం.
- ట్రెడిషనల్ గ్రాడ్యుయేట్లకు కూడా ఉపయుక్తంగా నిలుస్తున్న అప్రెంటీస్ ట్రైనింగ్.
- ట్రైనింగ్ సమయంలో అభ్యర్థులకు స్టయిఫండ్ పేరుతో ఆర్థిక ప్రోత్సాహకం.

క్లుప్తంగా...

గ్రూప్‌-2, గ్రూప్‌-3 పరీక్షలు వాయిదా వేయలేదు

- టీజీపీఎస్సీ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్‌: గ్రూప్‌–2, గ్రూప్‌–3 పరీక్షలను నిర్దేశించిన తేదీల్లోనే నిర్వహించనున్నట్లు తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ పరీక్ష తేదీలను మార్పు చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం జరుగుతోందని, ఈ ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కమిషన్‌ సూచించింది. పరీక్ష తేదీల్లో మార్పులపై కమిషన్‌ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది.

గ్రూప్‌-1 మెయిన్స్‌కు 473 మంది ఎస్సీ స్టడీ సర్కిల్‌ అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్‌: గ్రూప్‌–1 మెయిన్స్‌ పరీక్షలకు 473 మంది ఎస్సీ స్టడీ సర్కిల్‌ అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరిలో 126 మంది హైదరాబాద్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌కు చెందిన వారేనని ఎస్సీ అభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్‌ తెలిపారు. ఇటీవల యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్‌ ప్రిలిమినరీ పరీక్ష ఫలితాల్లో 25 మంది ఎస్సీ స్టడీ సర్కిల్‌ అభ్యర్థులు మెయిన్స్‌ పరీక్షలకు ఎంపికయ్యారని వెల్లడించారు.

జీవో 317తో నష్టపోయిన టీచర్లను జిల్లాలకు పంపాలి

పీఆర్టీయూ సమావేశంలో తీర్మానాలు

సాక్షి, హైదరాబాద్‌: మోడల్‌ స్కూల్‌ ఉపాధ్యాయులకు ప్రమోషన్‌ బదిలీలు చేపట్టాలని, 317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులందరినీ వెంటనే వారి జిల్లాలకు పంపే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ కోరింది. పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల రెండు రోజుల సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు భట్టాపురం మోహన్‌రెడ్డి, పూల రవీందర్‌, తదితరులు పాల్గొన్నారు .

సమావేశ తీర్మానాలు ఇలా...

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ రద్దు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ వర్తింపచేయాలని, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు ఇవ్వాలని కోరారు. పీఆర్సీలో 2023 నుంచి ఆర్థిక లాభం వచ్చే విధంగా 50 శాతం ఫిట్‌మెంట్‌ వర్తింపజేయాలని, సర్వీస్‌ రూల్స్‌ వెంటనే ఇప్పించాలని వెల్లడించారు. గతంలో సీఎం రేవంత్‌ ఇచ్చిన హామీ మేరకు పీఎస్‌హెచ్‌ఎం సంఖ్యను పదివేలకు పెంచాలని, జీవో ఎంఎస్‌ 11,12 సవరిస్తూ బీఈడీ అర్హత ఉపాధ్యాయులకు పీఎస్‌హెచ్‌ఎంగా పదోన్నతికి అవకాశం కల్పించాలని కోరారు.

వ్యవసాయ వర్సిటీలో ప్రారంభమైన కౌన్సెలింగ్‌

ఏజీ వర్సిటీ: ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ వర్సిటీలో ప్రభుత్వ, ప్రైవేటు వ్యవసాయ, అగ్రి ఇంజినీరింగ్‌ పాలిటెక్నిక్‌లలో ప్రవేశాలకు బుధవారం కౌన్సెలింగ్‌ ప్రారంభమైంది. ఇందులో పాలిసెట్‌–2024లో మంచి ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తూ పత్రాలను అందజేశారు. ముందుగా పాలిసెట్‌–2024లో 455 ర్యాంక్‌ వచ్చిన అరియా జరీనకు జగిత్యాలలోని వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ప్రవేశం ఇచ్చారు. 690 ర్యాంక్‌ సాధించిన లోకేష్‌కు కంపాసగర్‌ వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ప్రవేశం కల్పించారు. ఈ నెల 12 వరకు మొదటి విడత కౌన్సెలింగ్‌ జరుగుతుందని అధికారులు తెలిపారు. రిజిస్ట్రార్‌ రఘురామిరెడ్డి, పాలిటెక్నిక్‌ డైరెక్టర్‌ జమునా రాణి, డాక్టర్‌ శ్రమణ్‌కుమార్‌ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు.

ప్యాకేజీలో తగ్గేదేలే!

2024లో 1,128 మంది | 2023లో 1,410 మంది

క్యాంపస్‌ సెలక్షన్స్‌లో వరంగల్‌ నిట్‌ విద్యార్థుల జోరు

నాలుగేళ్లలో 4,155 మందికి కొలువులు..

ఎన్‌ఐటీ విద్యార్థుల కోసం ఎదురుచూస్తున్న కంపెనీలు



సాక్షి ప్రతినిధి, వరంగల్‌: ఆకర్షణీయ వేతనాలతో కొలువులు సాధిస్తున్న విద్యార్థులకు వరంగల్‌లోని జాతీయ సాంకేతిక విద్యాసంస్థ (ఎన్‌ఐటీ) అడ్డాగా మారింది. నిట్‌ వరంగల్‌లో సీటు వచ్చిందంటే ఉద్యోగంతోనే బయటకి అడుగుపెడుతామన్న భరోసా విద్యార్థుల్లో కనిపిస్తోంది. ఇక్కడి విద్యార్థి అన్ని రంగాల్లో అత్యుత్తమంగా రాణిస్తారనే భావనతో ప్రభుత్వ రంగం సంస్థలు, ప్రైవేట్‌ కంపెనీలు ఎన్‌ఐటీలో క్యాంపస్‌ సెలక్షన్స్‌ నిర్వహించేందుకు, రిక్రూట్‌మెంట్‌ చేసుకునేందుకు ఆసక్తిని కనబరుస్తున్నాయి.

క్యాంపస్‌ సెలక్షన్స్‌లో 'నిట్‌' విద్యార్థుల జోరు

- నిట్‌ వరంగల్‌లోని బీటెక్‌, ఎంటెక్‌, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ విద్యార్థులు క్యాంపస్‌ సెలక్షన్స్‌లో ప్రతీ ఏడాది జోరు కొనసాగిస్తున్నారు.
- ఈ ఏడాది బీటెక్‌లో 82 శాతం, ఎంటెక్‌ 62.3 శాతం, ఎంసీఏ 82.6 శాతం, ఎమ్మెస్సీ 80 శాతం, ఎంబీఏలో 76 శాతం విద్యార్థులు క్యాంపస్‌ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు సాధించారు.
- మొత్తంగా 1,483 మంది ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్లో 1,128 మందికి ఉద్యోగావకాశాలు వచ్చాయి.
- నాలుగేళ్లలో జరిగిన క్యాంపస్‌ సెలక్షన్స్‌ను పరిశీలిస్తే ఏటేటా కొలువులు పొందుతున్న సంఖ్య పెరుగుతోంది.
- 2020–21లో క్యాంపస్‌ సెలక్షన్స్‌ కోసం 186 కంపెనీలు పాల్గొంటే.. 815 మంది విద్యార్థులు ఎంపిక కాగా, అత్యధికంగా రూ.52లక్షల ప్యాకేజీ వచ్చింది.
- 2021–22లో 1,108, 2022–23లో 1,404 మంది విద్యార్థులు ఎంపిక కాగా.. ఈ ఏడాది 1,128 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. అత్యధికంగా రూ.88 లక్షల ప్యాకేజీ లభించింది.

ప్లేస్‌మెంట్స్‌, ప్యాకేజీలలో తగ్గేదేలే..

ప్రస్తుత తరుణంలో ఐటీ రంగం సంక్షోభంలో కూరుకుపోయి ఎక్కువ సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తుండగా సంక్షోభాన్ని తలదన్ని తమ ప్రత్యేకతను చాటుకుని క్యాంపస్‌ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు సాధించారు నిట్‌ విద్యార్థులు. గతేడాది సీఎస్‌ఈ విభాగానికి చెందిన ఆదిత్య సింగ్‌ రూ.88 లక్షల వార్షిక ప్యాకేజీని అత్యధికంగా సాధించగా, ఈ ఏడాది ఈసీఈ విద్యార్థి రవీషా తన సత్తాను చాటి రూ.88 లక్షల వార్షిక ప్యాకేజీ ఆనవాయితీని కొనసాగించాడు. అదే విధంగా 12 మంది రూ.68 లక్షల వార్షిక ప్యాకేజీ, తక్కువలో తక్కువగా రూ.15.6 లక్షల వార్షిక ప్యాకేజీని మిగతా విద్యార్థులు సాధించారు.

గతేడాది 250.. ఇప్పుడు 278..

నిట్‌ క్యాంపస్‌లో క్యాంపస్‌ సెలక్షన్స్‌ నిర్వహించేందుకు గతేడాది 250కి పైగా కంపెనీలు రాగా ఈ ఏడాది 278 ప్రైవేట్‌తో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు క్యాంపస్‌ సెలక్షన్స్‌ నిర్వహించేందుకు ఆసక్తి కనబరిచాయి. ఇక్కడి విద్యార్థులను ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్‌ ఇంజనీరింగ్‌, డేటా అనాలిసిస్‌, డేటా సైన్స్‌, డేటా ఇంజనీరింగ్‌, ప్రొడక్ట్స్‌ అనాలిసిస్‌, ప్రొడక్ట్‌ ఇంజనీరింగ్‌, కన్సల్టెంట్‌, మేనేజ్‌మెంట్‌ వంటి రంగాల్లో ఎంపిక చేశారు.

ఉత్తమ బోధనతోనే..



నిట్‌ వరంగల్‌లోని అధ్యాపకుల అత్యుత్తమ బోధనతోనే క్యాంపస్‌ సెలక్షన్స్‌లో యూఎస్‌కు చెందిన సోర్బ్‌ అనే సాఫ్ట్‌వేర్‌ కంపెనీలో రూ.88 లక్షల వార్షిక ప్యాకేజీని సాధించా. మాది పంజాబ్‌లోని లూథియానా.. మధ్య తరగతి కుటుంబంలో పుట్టి నిట్‌ వరంగల్‌లో సీటు సాధించి, ఉన్నత ఉద్యోగానికి ఎంపిక కావడం ఆనందంగా ఉంది.

- రవిషా, ఈసీఈ, రూ.88 లక్షల ప్యాకేజీ

ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఉద్యోగావకాశాలు కల్పిస్తా..



మాది మహారాష్ట్ర. వరంగల్‌లో నిట్‌లో సీటు వచ్చినప్పుడు ఎంతో భయంగా ఉండేది. ఇక్కడి అధ్యాపకుల ప్రోత్సాహం, విద్యార్థుల సహకారంతో బీటెక్‌లో ఈసీఈ పూర్తి చేసి క్యాంపస్‌ సెలక్షన్స్‌లో హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్‌ కంపెనీలో రూ.64లక్షల వార్షిక ప్యాకేజీ సాధించాను. ఎంబీఏ చేసి ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఓ పరిశ్రమను స్థాపించి నా తోటి వారికి ఉద్యోగావకాశాలు కల్పించడమే నా లక్ష్యం.

- మీత్‌ పోపాట్‌, ఈసీఈ, రూ.64లక్షల ప్యాకేజీ

మెడికల్‌ టెక్నాలజీ పరిశ్రమలకు సంపూర్ణ సహకారం: మంత్రి శ్రీధర్‌బాబు



గ్లోబల్‌ ఐటీ సెంటర్‌ ప్రారంభిస్తున్న ఐటీ శాఖా మంత్రి శ్రీధర్‌బాబు, అమెరికన్‌ కాన్సుల్‌ జనరల్‌ జెన్నిఫర్‌ లార్సన్‌, మెడ్‌ట్రానిక్‌ ఉన్నతాధికారులు

రాయదుర్గం: మెడికల్‌ టెక్నాలజీ పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. నానక్‌రాంగూడలోని బీఎస్‌ఆర్‌టెక్‌ పార్క్‌లో మెడ్‌ట్రానిక్‌ ఇంజనీరింగ్‌ అండ్‌ ఇన్నోవేషన్‌ సెంటర్‌లో గ్లోబల్‌ ఐటీ సెంటర్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎంఈఐసీ విస్తరించిన పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించిన ఘనత తనకు దక్కడం ఆనందంగా ఉందన్నారు. అయిదు నెలల్లో మెడ్‌ట్రానిక్‌ కోసం కొత్త గ్లోబల్‌ ఐటీ సెంటర్‌ను ప్రారంభించామని గుర్తు చేశారు. ఇది తెలంగాణ రాష్ట్ర ప్రగతిశీల విధానాలకు నిదర్శనమని మంత్రి స్పష్టం చేశారు. మెడ్‌ట్రానిక్‌ ఎస్‌వీపీ, సీఐవో రష్మీకుమార్‌ మాట్లాడుతూ ఒక శక్తివంతమైన ఆవిష్కరణ, పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్‌, అమెరికన్‌ కాన్సుల్‌ జనరల్‌ జెన్నిఫర్‌లార్సన్‌, ఎంఈఐసీ సైట్‌ లీడర్‌, మెడ్‌ట్రానిక్‌ వైస్‌ప్రెసిడెంట్‌ దివ్యజోషి పాల్గొన్నారు.



సిరిసిల్ల కలెక్టరేట్‌ ముందు రాజీవ్‌ నగర్‌లోని ఉన్నత పాఠశాలకు సరిపడే ఉపాధ్యాయులను కేటాయించాలని ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు.

టీచర్లను నియమించండి

సిరిసిల్ల కలెక్టరేట్‌ వద్ద తల్లిదండ్రుల ఆందోళన

సిరిసిల్ల ఎడ్యుకేషన్‌: తమ పిల్లలు చదువుతున్న రాజీవ్‌నగర్‌ స్కూల్‌లో ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం రాజన్నసిరిసిల్ల కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేపట్టారు. కలెక్టర్‌, డీఈవోలకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో కలిపి దాదాపు 300 పైగా విద్యార్థులు చదువుతున్నారన్నారు. అయితే వారందరికీ ఐదుగురు ఉపాధ్యాయులే ఉన్నారని తెలిపారు. ఇటీవల బదిలీల్లో టీచర్లు వెళ్లిపోయారని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. డీఈవో రమేశ్‌కుమార్‌ మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతులు పూర్తవగానే.. రాజీవ్‌నగర్‌ స్కూల్‌లో ఉపాధ్యాయులు తక్కువగా ఉంటే సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయుడిగా మారిన ఎమ్మెల్యే!

'ఫ్లో బస్‌'లో ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన



బస్సులోని పరికరాల పనితీరును వివరిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అన్నపురెడ్డిపల్లి: రాజకీయాల్లోకి రాకముందు పీఈటీగా పనిచేసిన అనుభవం.. బోధనపై ఆసక్తి.. ఇప్పుడు ఎమ్మెల్యేగా ఎన్నికైనా విద్యార్థులకు కొత్త అంశాలు తెలియజేయాలనే ఉత్సాహం కలగలిపి.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఉపాధ్యాయుడి అవతారం ఎత్తడానికి కారణమయ్యాయి! విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తి పెంచడంతో పాటు ప్రయోగాలను నేరుగా వివరించేలా హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ 'ఫ్యూచరిస్టిక్‌ ల్యాబ్‌ ఆన్‌ వీల్స్‌'(ఫ్లో బస్‌) పేరిట వాహనాన్ని రూపొందించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఆవిష్కరించిన ఈ బస్సు తొలిసారి అశ్వారావుపేట నియోజకవర్గంలోని అన్నపురెడ్డిపల్లికి బుధవారం వచ్చింది. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల ప్రాంగణంలో 8, 9, 10వ తరగతులు, ఇంటర్‌ విద్యార్థులకు ఎమ్మెల్యే ఆదినారాయణ స్వయంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, అంతరిక్ష ప్రయోగాలు, పరికరాల పనితీరును వివరించారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక సామర్థ్యాలను అందిపుచ్చుకుంటే భవిష్యత్‌లో ఎదగొచ్చని సూచించారు. ఎంపీడీఓ మహాలక్ష్మి, తహసీల్దార్‌ జగదీశ్వర్‌ ప్రసాద్‌, ఎంఈఓ సత్యనారాయణ, ఫ్లో బస్‌ సంస్థ సీఈఓ మధులాష్‌ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రాసిక్యూషన్స్‌ డైరెక్టర్‌ వైజయంతికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్‌

రాష్ట్ర ప్రాసిక్యూషన్స్‌ డైరెక్టర్‌గా జి.వైజయంతి నియామకం, కొనసాగింపును సవాల్‌ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో హైకోర్టు ఆమె వాదనలు వినిపించాలని నోటీసులు జారీ చేసింది. చట్ట ప్రకారం ఆమె నియామకం చెల్లదంటూ న్యాయవాదులు శశికాంత్‌, శ్రీనివాసులు హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. 'పదేళ్లకు తక్కువ కాకుండా ప్రాక్టీస్‌ చేసిన న్యాయవాదులు..హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమ్మతితో డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ లేదా డిప్యూటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ పదవికి అర్హులు. మూడునాలుగేళ్ల ప్రాక్టీస్‌తో అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌గా వైజయంతి నియామకమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించి ప్రాసిక్యూషన్‌కు విరుద్ధంగా ప్రాసిక్యూషన్‌ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 2021, మార్చి 16న ప్రభుత్వం ఇచ్చిన జీవో చట్టవిరుద్ధం. ఆ పోస్టులో కొనసాగడానికి వైజయంతి అనర్హురాలు. ఉన్నత పదవుల్లో ఉన్న వారిని ప్రభావితం చేసి పదవి పొందారు'అని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్‌ బి.విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. వాదనల అనంతరం ప్రతివాదులకు న్యాయమూర్తి నోటీసులు జారీ చేశారు.

8 మంది టీచర్లు.. 10 మంది విద్యార్థులు

విద్యార్థుల్లేని ప్రభుత్వ పాఠశాల

- ప్రైవేటుపై తల్లిదండ్రుల మొగ్గు
- చైతన్యపరిచినా స్పందించని గ్రామస్తులు
- లక్ష్మాపురం పాఠశాల దుస్థితి



లక్ష్మాపురం ఉన్నత పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న విద్యార్థులు

రామన్నపేట: ఆ ఉన్నత పాఠశాలలో అక్షరాలా పది మంది విద్యార్థులు, ఎనిమిదిమంది ఉపాధ్యాయులున్నారు. ప్రైవేట్‌ పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని ఉపాధ్యాయులు ఇంటింటా తిరిగినా ఫలితం లేకుండా పోయింది. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం లక్ష్మాపురం జెడ్పీ పాఠశాల దుస్థితి ఇది. ఈ పాఠశాల 2002–03 విద్యాసంవత్సరంలో అప్‌గ్రేడ్‌ అయింది. ప్రారంభంలో 200 మంది విద్యార్థులు ఉండేవారు. అప్పట్లో సక్సెస్‌ స్కూల్‌గా ఎంపికైంది. రూ.30 లక్షలతో భవనాలను నిర్మించారు. కానీ ప్రైవేటు పాఠశాలలు, మోడల్‌స్కూళ్లు, గురుకుల పాఠశాలల ప్రభావంతో అయిదారు సంవత్సరాల నుంచి విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య పదికి పడిపోయింది. పది మందిలో తొమ్మిది మంది మాత్రమే పాఠశాలకు వస్తుండగా.. ఒక విద్యార్థి పాఠశాల పునః ప్రారంభమయ్యాక బుధవారం మాత్రమే హాజరయ్యాడు. పాఠశాలలో ప్రస్తుతం ఎనిమిది మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వారిలో ఒకరు జీహెచ్‌ఎం కాగా మ్యాథ్స్‌, ఫిజికల్‌ సైన్స్‌, బయోసైన్స్‌, ఆంగ్లం స్కూల్‌ అసిస్టెంట్లు, తెలుగు, హిందీ పండిట్లు, పీఈటీ ఉన్నారు.

నచ్చజెప్పినా గ్రామస్తులు ససేమిరా..

పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఉపాధ్యాయులు చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఈ గ్రామం నుంచి మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలు, వేములకొండ ఉన్నత పాఠశాలకు వెళ్తున్న 36 మంది విద్యార్థులను గుర్తించారు. ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి.. గ్రామపెద్దలతో సమావేశమయ్యారు. ఉపాధి, వ్యవసాయ పనులు చేసే చోటికి వెళ్లి నచ్చజెప్పడానికి ప్రయత్నించినా ఫలితం లేక పోయింది. విద్యార్థుల సంఖ్య మాత్రం పెరగడం లేదు.

చార్జిషీట్‌ నుంచి అమిత్‌షా, కిషన్‌రెడ్డి పేర్లు ఎందుకు తొలగించారు?

పోలీసులను ప్రశ్నించిన నాంపల్లి కోర్టు

తదుపరి విచారణ సెప్టెంబర్‌ 2కు వాయిదా

సిటీ, కోర్టులు: చార్జిషీట్‌లో నుంచి కేంద్రమంత్రులు అమిత్‌షా, కిషన్‌రెడ్డి పేర్లను ఎందుకు తొలగించారని ఈ విషయం పిటిషనర్‌కు తెలుసా లేదా అని నాంపల్లి కోర్టు పోలీసులను ప్రశ్నించింది. పార్లమెంట్‌ ఎన్నికల ప్రచారంలో భాగంగా అక్టోబర్‌ 1న హైదరాబాద్‌లోని శాలిబండ, సుధాటాకీస్‌ వద్ద జరిగిన అమిత్‌షా ఎన్నికల ర్యాలీ సభలో చిన్నపిల్లలను వేదికపైకి పిలిచి వారితో బీజేపీ గుర్తును ప్రదర్శింపజేసి, నినాదాలు ఇప్పించారని అభ్యంతరం తెలుపుతూ టీపీసీసీ సీనియర్‌ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్‌, ఎన్నికల కమిషన్‌ కో ఆర్డినేషన్‌ కమిటీ, ఎన్నికల కమిషన్‌కు అదేరోజు ఫిర్యాదుచేసిన విషయం తెలిసిందే. దీంతో అక్టోబర్‌ 2న మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో అమిత్‌షా, కిషన్‌రెడ్డితో పాటు మరికొంతమంది బీజేపీ నాయకులపైన పోలీసులు ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేశారు. ఎఫ్‌ఐఆర్‌ చేసిన పోలీసులు ఎన్నికల సమయంలో ఉద్దేశపూర్వకంగా కేంద్రమంత్రులు కోడ్‌ ఉల్లంఘించలేదని అమిత్‌షా, కిషన్‌రెడ్డి పేర్లను చార్జిషీట్‌ నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో ఈ కేసుపై వివరణ ఇచ్చేందుకు ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసిన టీపీసీసీ సీనియర్‌ ఉపాధ్యక్షుడికి నాంపల్లి కోర్టు నోటీసులు జారీ చేయడంతో బుధవారం ఆయన కోర్టు ముందు హాజరయ్యారు. వాదనల అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్‌ 2కు వాయిదా వేసింది.

బెంగళూరులో యూట్యూబర్‌ ప్రణీత్‌ అరెస్టు



సాక్షి, హైదరాబాద్‌: తండ్రీకూతుళ్ల సంబంధం గురించి అసభ్యకర సంభాషణ చేసిన యూట్యూబర్‌ ప్రణీత్‌ హనుమంతును బెంగళూరులో తెలంగాణ సైబర్‌ సెక్యూరిటీ బ్యూరో అరెస్టు చేసింది. ఐటీ చట్టం,పోక్సో చట్టం కింద హనుమంతు ప్రధాన నిందితుడుగా ఉన్న విషయం తెలిసిందే. సోషల్‌ మీడియాలో చేసిన వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ఖండనలు, విమర్శలు వచ్చిన నేపథ్యంలో హనుమంతు పరారీలో ఉన్నాడు. నిందితుడిని ట్రాన్సిట్‌ వారెంట్‌ కోసం బెంగళూరులోని స్థానిక మెజిస్ట్రేట్‌ ముందు పోలీసులు హాజరుపరిచారు. మిగిలిన నిందితులను పట్టుకునేందుకు గాలింపు చేపట్టినట్లు సైబర్‌ సెక్యూరిటీ బ్యూరో ఒక ప్రకటనలో తెలిపింది. యూట్యూబ్‌ పాడ్‌కాస్ట్‌లో తండ్రీకూతుళ్ల సంబంధం గురించి చేసిన అశ్లీల సంభాషణ తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ తీవ్ర వ్యాఖ్యల నేపథ్యంలో హనుమంతునుహెదరాబాద్‌కు తీసుకురానున్నారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited